8-7Pg1exHMNWJQE.qxd:8-7Pg1exHMNWJQE.qxd 1/1/02 8:25 AM Page 1

మొజాయిక్ గత వారంలోని పై ట్విస్ట్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital

టిక్‌టాక్‌వల్లే గెలిచా: డొనాల్డ్ ట్రంప్
అయోధ్య ట్రస్టు అధీనంలో 30 కిలోల బంగారు ఆభరణాలు
5లో

Published from Srikakulam ,Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
8-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 158 పేజీలు: 10+4 వెల: 6.50

ఎంట్రప్రెన్యూర్లుగా రైతులు

మంగళవారం జరిగిన 19వ ఎస్ఐపిబి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

పారిశ్రామికీకరణ ఆ దిశగా సాగాలి
వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం
మరిన్ని ఇథనాల్ ప్రాజెక్టులు ఏర్పాటు: సిఎం చంద్రబాబు
19వ ఎస్ఐపిబి సమావేశంలో 11 ప్రాజెక్టులకు ఆమోదం

విజయవాడ, జూలై 7, ప్రభాతవార్తప్రతినిధి: రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చేలా కార్యచరణ ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రైతులు ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు దోహదం చేసేలా పారిశ్రామికీకరణ జరగాలన్నారు. ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించాలాని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా భవిష్యత్‌లో పెరిగే ఇథనాల్ డిమాండ్‌ను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఇథనాల్ బ్లెండింగ్ 40 శాతానికి పెంచితే.మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇథనాల్ తయారీ రంగంలో వచ్చే అన్ని పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. పెట్రోలు, డీజిల్‌లో మిక్స్ చేసేందుకు ఇథనాల్ భారీగా అవసరం కానుందన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి పాలసీ తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై దృష్టిపెట్టాలన్నారు. ఆ దిశలో రైతులను ప్రోత్సహించాలన్నారు. సంపద సృష్టి, సర్క్యులర్ ఎకానమీ అనేది ప్రభుత్వ విధానం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్దేశించారు. సచివాలయంలో మంగళవారం 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 11 ప్రాజెక్టులకు సంబంధించి రూ.9,076.11 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. దీంతో 10,531 ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయి.

100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ఏర్పాటు లక్ష్యం: పర్యాటకరంగంలో అపార అవకాశాలు ఉన్నాయి. తిమ్మమ్మ మర్రిమాను సహా రాష్ట్రవ్యాప్తంగా 100 టూరిస్ట్ స్పాట్‌ల దగ్గర ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. పోలవరం, దిండి, గండికోట, కంబం చెరువు, లంబసింగి లాంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. లంబసింగి, అరకు సమీపంలో రిసార్ట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేస్తోంది. >>2

కాగ్నిజెంట్, విశాఖ ఐటి సెజ్‌కు కేంద్రం ఆమోదం

విజయవాడ, జూలై 7,ప్రభాతవార్తప్రతినిధి: ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ విశాఖపట్నంలో ఐటీ/ఐటీఈఎస్ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులు పొందింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తుది నోటిఫై చేసింది. విశాఖపట్నం రూరల్ మండలం పరిధిలోని ఐటీమధురవాడ2 ప్రాంతంలో 8.98 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ సెజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి కాగ్నిజెంట్ సంస్థకు లెటర్ ఆఫ్ అప్రూవల్ కూడా జారీ అయింది. సెజ్ చట్టం ప్రకారం డెవలప్‌మెంట్ కమిషనర్ నేతృత్వంలో ఒక అప్రూవల్ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కస్టమ్స్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకు ఈ సెజ్‌ను ఇన్‌ల్యాండ్‌కంటైనర్ డిపో >>2

పెట్టుబడుల కేంద్రంగా ఎపి

మంగళవారం సియోల్‌లోని ఎల్‌జీ సైన్స్‌పార్కులో అక్కడి ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్

మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తాక్రేకర్ కేంద్రాన్ని ప్రారంభించండి
ఎఐ, ఐటి, ఎలక్ట్రానిక్స్‌లో వేగంగా పురోగతి
సియోల్‌లో ఎల్జీకెమ్ ప్రెసిడెంట్ యున్‌జు కోహ్, హుందాయ్ ఇడితో మంత్రి లోకేష్ భేటీ

విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:ఏపీలో పెట్టుబడులకు అత్యంత అనుకూల మౌలిక పరిస్థితులున్నాయని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పునరుద్ఘాటించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన స్థల సదుపాయాలు,రవాణ వ్యవస్థ ఉందని వివరించారు. సౌత్ కొరియా పర్యటనలో భాగంగా మంగళవారం ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ ఎల్జీ ఓవర్సీస్ హోల్డింగ్ కంపెనీస్ హెడ్ యున్‌జు కోహ్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ కాకినాడపోర్టు సమీపంలో పాలిస్టైరిన్ తయారీ కేంద్రం/సముదాయాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దక్షిణ కొరియాలోని ఎల్జీ కెమ్ అధునాతన కార్యకలాపాలను నమూనాగా తీసుకుని, మూలపేటలో ప్రపంచ స్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. భారతదేశంలో సమగ్రమైన ఈవీ, బ్యాటరీ పవర్ స్టోరేజి పర్యావరణ వ్యవస్థను సృష్టించేందుకు, సమీకృత క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్, సెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలన్నారు. మూలపేటలో ఎస్ఏఎఫ్ బయోఇథనాల్ ఉత్పత్తిపై దృష్టి సారించి, జీవ ఇంధనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వాల్యూ యాడెడ్ వనరులుగా మార్చేందుకు, ప్లాస్టిక్ రీసైక్లింగ్, పైరోలిసిస్ ప్లాంట్లను ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో భాగస్వామ్యం వహించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్‌జు కోహ్ మాట్లాడుతూ ఎల్జీ పాలిమర్స్ విశాఖపట్నం ప్లాంట్ (గోపాలపట్నం) ద్వారా గతంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ భారతీయ కార్యకలాపాలకు, ఇతర తయారీదారులకు (పాలిస్టైరిన్) కీలకమైన పాలిమర్ భాగాలను సరఫరా చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం శ్రీసిటీలో, యాక్రిలోనిట్రైల్ బ్యూటాడైన్ స్టైరీన్ కాంపౌండ్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన తాజా ప్రతిపాదనలపై సంస్థ >>2

మంగళవారం ఒడ్డుకు వచ్చిన మత్స్యకారులతో పోలీసులు

ఆ 10 మంది మత్స్యకారులు సురక్షితం
మూడు రోజులు అన్వేషించి ఒడ్డుకు చేర్చిన శ్రీకాకుళం పోలీసు బృందం

ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), జూలై 7 ప్రభాతవార్త: గత నెల జూన్ 24వ తేదీన విశాఖపట్నం తీర ప్రాంతానికి చెందిన 10 మంది మత్స్యకారులు చేపల వేట నిమిత్తం బోటులో సముద్రంలోకి వెళ్లారు. వేట నిర్వహిస్తున్న సమయంలో బోటు ఒడిశా సముద్ర సరిహద్దు ప్రాంతానికి చేరుకోగా ఇంజిన్ సాంకేతిక లోపం తలెత్తడంతో పాటు ప్రతికూల వాతావరణం, తుఫాను ప్రభావం కారణంగా సముద్రంలో చిక్కుకుపోయారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా తెలియగానే విశాఖపట్నం రేంజ్ ఐజీ మరియు మెరైన్ విభాగం ఐజీ గోపీనాథ్ జట్టి తక్షణమే స్పందించి శ్రీకాకుళంజిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డికి అవసరమైన ఆదేశాలు జారీచేశారు. చిక్కుకుపోయిన మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నా >>2

గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శనలు
జీరాంజీ కింద కామన్ ఫెసిలిటీ సెంటర్లు: డి.సిఎం పవన్

మంగళవారం విజయవాడలో జరిగిన హస్తకళా ప్రదర్శనలో స్టాల్స్ పరిశీలిస్తున్న డి.సిఎం పవన్

ఇక హస్తకళల పర్యాటకం

విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి: కళాకారుల ప్రతిభ ప్రపంచానికి తెలియాలి. పిల్లలు, వారి తల్లిదండ్రుల కళను వారసత్వంగా కొనసాగించాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. సంప్రదాయం గుర్తుచేసుకోవడానికి కాదు, మరింత ముందుకు సాగాలన్నారు.లోకల్ టు గ్లోబల్ రీతిన మన హస్తకళలు ప్రపంచానికి చేరాలి అన్నారు. మన వస్తువులకు మార్కెటింగ్ పెరగాలి. కళారూపాలకు మూలాధారమైన కర్ర నిల్వ అవసరం. కళాకారులపై కేసులు లేకుండా చేశామన్నారు. మంగళవారం విజయవాడలోని అంబేడ్కర్ కళావేదికలో >>2



ఫ్రాన్స్ అధ్యక్షునికి తప్పిన ప్రమాదం
డమాస్కస్‌లోని హోటల్ వద్ద భారీ పేలుడు, 18 మందికి తీవ్రగాయాలు
2లో

కృష్ణలంక పిఎస్‌లో
నాగరాజు విచారణ
సిట్‌ను అనుమతించిన హైకోర్టు
సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు

విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. నిందితుడు, సస్పెండైన సీఐ నాగరాజును విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారించేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)కు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను న్యాయస్థానం సవరించింది. అలాగే విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియోగ్రఫీ చేసి సంబంధిత కోర్టు ముందు ఉంచాలని పేర్కొంది. సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో సీఐ నాగరాజు కస్టడీపై దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను మార్చాలని కోరుతూ ఏపీ హైకోర్టులో ఇటీవల సిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై నిన్న (సోమవారం) విచారణ జరగగా.. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును మంగళవారానికి రిజర్వ్ చేసింది. ఈ మేరకు నేడు తీర్పు వెలువరించింది. సోమవారం నాడు కేసు విచారణ సందర్భంగా ఇరువర్గాల న్యాయవాదులు పోటాపోటీగా తమ వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కీలక విషయాలను కోర్టు దృష్టికి తెచ్చారు. విజయవాడ కోర్టు విధించిన కొన్ని షరతుల కారణంగా దర్యాప్తునకు ఆటంకం కలుగుతోందని హైకోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. నిందితుడిని ప్రశ్నించేందుకు పరిమితులు ఉండటంతో దర్యాప్తు సక్రమంగా జరిగే అవకాశం లేదని పేర్కొన్నారు.

నాగరాజును విచారించే సమయంలో వీడియో రికార్డింగ్‌కు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని.. అయితే ఆడియో రికార్డింగ్ వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణ వల్ల నిందితుడి హక్కులకు ఎలాంటి భంగం కలగదని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. మరోవైపు నాగరాజు తరఫు న్యాయవాది కూడా హైకోర్టులో తన వాదనలు వినిపించారు. తన క్లయింట్‌కు ప్రాణహాని ఉందని, భద్రతా కారణాల దృష్ట్యా కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో విచారణకు అనుమతి ఇవ్వొద్దని హైకోర్టును కోరారు. అన్ని రకాల సౌకర్యాలు, భద్రత ఉన్న రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనే విచారణ చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు నేడు తీర్పు వెలువరించింది.

మంగళవారం జకార్తాలో ప్రధాని మోడీని అత్యున్నత పురస్కారంతో సత్కరిస్తున్న ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటో

ఇండొనేసియాకు 'బ్రహ్మాస్త్రం'
బ్రమ్హోస్, అస్త్ర క్షిపణుల సరఫరాకు భారత్ అంగీకారం
ఉభయ దేశాల మధ్య 19కీలక ఒప్పందాలపై సంతకాలు
రక్షణరంగంలో మరింత సహకారం
అధ్యక్షుడు సుబియాంటోతో ప్రధాని మోడీ ద్వైపాక్షిక చర్చలు

జకార్తా, జులై 7: భారత్, ఇండోనేషియా తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు చేర్చాయి. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్యం, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తృతం చేసే లక్ష్యంతో ఇరు దేశాలు 19 కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ చారిత్రక పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీకి ఇండోనేషియా తమ దేశ >>2

ప్రధాని మోడీకి ఇండొనేసియా అత్యున్నత పురస్కారం
'బిన్‌టాంగ్ ఆదిపూర్ణ' పురస్కారం అందించిన అధ్యక్షుడు సుబియాంటో

జకార్తా,జులై 7: ప్రధాని మోడీకి అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేసియా ప్రభుత్వం ఆయన్ను అత్యున్నత పురస్కారంతో సత్కరించింది. 'బిన్‌టాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండొనేసియా' అవార్డుతో మోడీని సన్మానించారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ మెడల్‌ను అందజేశారు. ప్రస్తుతం మోదీ ఇండోనేసియా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఎంతో ప్రేమతో ఇండోనేషియాకు తనకు అత్యున్నత పురస్కారాన్ని అందజేసినట్లు పీఎంవో కార్యాలయం తన ట్వీట్‌లో తెలిపింది. ఈ గౌరవం కోట్లాది మంది భారతీయులకు చెందుతుందని మోడీ పేర్కొన్నారు. ఈ సత్కారం ఇండోనేసియా >>2

అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో
38మందికి ఉరి ఖరారు
11మందికి జీవిత ఖైదు
ప్రత్యేక కోర్టు తీర్పు సమర్థించిన హైకోర్టు

అహ్మదాబాద్, జులై 7: అహ్మదాబాద్‌లో 2008నాటి వరుస బాంబుపేలుళ్ల కేసులో 38 మంది దోషులకు విధించిన మరణశిక్ష గుజరాత్ హైకోర్టు సమర్థించింది. మరో 11 మందికి విధించిన జీవిత ఖైదును కూడా యథాతథంగా కొనసాగిస్తూ కీలక తీర్పు వెలువరించింది. ఉగ్రదాడిలో మరణించిన బాధితుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 2022లో ప్రత్యేక ట్రయల్ కోర్టు విధించిన మరణశిక్షలను ఉన్నత హైకోర్టు సమర్థించింది. ఒకే కేసులో ఇంత పెద్దసంఖ్యలో నిందితులకు ఉరిశిక్ష ఖరారు కావడం భారత న్యాయవ్యవస్థ చరిత్రలోనే ఇది మొదటిసారి. ట్రయల్‌కోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన >>2

మంగళవారం సియోల్‌లో ఎల్‌జీ అధికారులు,ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్

పెట్టుబడుల కేంద్రంగా ఏపి

>> ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్ మాట్లాడుతూ... భారత్ లోని చెన్నై, అనంతపురంలో మాడ్యూల్స్, కీలక విభాగాలను తమ సంస్థ తయారు చేస్తుందని తెలిపారు. గురుగ్రామ్ ఆఫ్టర్‌మార్కెట్ విడిభాగాల కేంద్రం ఉంది, చెన్నై లాజిస్టిక్స్ కేంద్రం నుంచి హ్యుందాయ్/కియా సర్వీస్ విడిభాగాలను ఎగుమతి చేస్తుందని చెప్పారు. కొత్తగా హైదరాబాద్ లో ఆర్ అండ్ డీ కేంద్రం, బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఆర్ డీ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతపురంలోని తయారీ కేంద్రం ద్వారా హ్యుందాయ్ సంస్థ కియా ఇండియా కోసం మాడ్యూల్స్, కీలక విడి భాగాలను ఉత్పత్తి చేస్తుందని, ఎయిర్‌బ్యాగ్‌లు, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ వంటి కీలక భాగాలను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

అపాక్ట్ సీఈవో సియాంగ్ డాంగ్ లీతో మంత్రి నారా లోకేష్ భేటీ: సెమీకండక్టర్, ఒసాట్ (అసెంబ్లింగ్, ప్యాకేజింగ్, టెస్టింగ్) రంగంలో పేరెన్నికగన్న అపాక్ట్ కంపెనీ సీఈవో సియాంగ్ డాంగ్ లీ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌లో అపాక్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అపాక్ట్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ఆశిస్తున్నట్లు చెప్పారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు పరిశీలిస్తున్న హానా మైక్రాన్ తో పాటు ఇతర ఒసాట్ సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా అనుసంధానించాలని దిగిని కోరారు. సెమీకండక్టర్ కార్యకలాపాలకు సంబంధించి యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం కోసం ఏపీఎస్ఎస్‌డిసితో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు. భారతదేశంలో అపాక్ట్ కార్యకలాపాల విస్తరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలను అందిస్తుందని స్పష్టం చేశారు. అపాక్ట్ సీఈవో సియాంగ్ డాంగ్ లీ మాట్లాడుతూ హైదరాబాద్ కోసం ఫిబ్రవరి 2024లో ప్రకటించిన ఐఎస్ఎం టెక్నాలజీస్ జాయింట్ వెంచర్‌కు, విశాఖపట్నం కోసం 12 ఆగస్టు 2025న ఇండియా సెమీకండక్టర్ మిషన్ కింద ఆమోదం లభించిందని తెలిపారు. రూ. 468కోట్లతో సంవత్సరానికి 96 మిలియన్ల పరికరాలను తయారుచేసే లక్ష్యంతో ఏర్పాటు కానున్న విశాఖ యూనిట్ నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని చెప్పారు.

ఎపిఎ.ఎస్ఈ వైజాగ్ ఒసాట్ జాయింట్ వెంచర్ ఆంధ్రప్రదేశ్‌కు లభించిన ఒక ప్రతిష్ఠాత్మక సెమీకండక్టర్ విజయమని ఆయన అభివర్ణించారు. ఏపీ ప్రభుత్వం అందించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఈ సందర్భంగా లీ తెలిపారు.

ఇక హస్తకళల పర్యాటకం

>> ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఏర్పాటు చేసిన 'ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం 2026'ను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఈ మహోత్సవంలో రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ హస్త కళాకారులు ఉత్పత్తి చేసిన కళా రూపాలను ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన రామాయణంలోని రావణ సంహార ఘట్టాన్ని తిలకించారు. సతీమణి అన్నా కొణిదెల కోసం ఉప్పాడ జాందానీ చీరలు కొనుగోలు చేశారు. ప్రతి స్టాల్‌ను సందర్శిస్తూ, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ కళాకారులను తనవంతు ప్రోత్సాహం అందించారు. కళాకారులతో మమేకమవుతూ, వారి నైపుణ్యాన్ని అభినందించారు. కళాకారుల సాధకబాధకాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కళాకారుల కోరిక మేరకు క్లస్టర్ల వారీగా గ్రూపు ఫోటోలు దిగారు. మన రాష్ట్రానికే సొంతమైన హస్తకళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. మహోత్సవంలో కాకినాడకు చెందిన తోలుబొమ్మల కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పవన్ కళ్యాణ్ సందర్శించారు. సనాతన ధర్మ ఔన్నత్యాన్ని తెలియజేసే విధంగారూపొందించిన రామాయణం, భారత, భాగవత కళారూపాలను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన రావణ సంహార ఘట్టం అందర్నీ ఆకట్టుకుంది. తరతరాలుగా తోలుబొమ్మలాటను నమ్ముకుని జీవనాధారం సాగిస్తున్న తమ కుటుంబాలు, నేడు అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చే స్థితికి చేరుకున్నట్టు కళాకారులు వివరించారు. తోలుబొమ్మలాట ఔన్నత్యాన్ని చాటేలా రాబోయే గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శన ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హస్తకళాకారుల స్టాల్స్‌ను పరిశీలించారు. కొండపల్లి, ఏటికొప్పాక వంటి బొమ్మలను ఆసక్తిగా చూశారు. హస్తకళాకారుల గ్రామాలను పర్యాటకంగా అనుసంధానించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో చేనేత, హస్తకళల సలహాదారు సుచిత్రా ఎల్లా సూచించిన ప్రతిపాదనను పవన్ అభినందించారు. అనంతరం ఆయన మాట, మంతి కార్యక్రమంలో మాట్లాడుతూ హస్త కళాకారుల కోసం కంటిచూపు పరీక్షలు నిర్వహిస్తాం. భారతదేశ ఉనికికి హస్త కళారూపాలు మూలం. హస్త కళాకారుల కోసం ప్రభుత్వం దన్నుగా నిలబడుతుంది. ప్రతి కళాకారుడికి ఒక కథ, ఒక కష్టం ఉంటుంది. హస్తకళల గ్రామాలను పర్యాటకంగా అనుసంధానం చేయాలి. హస్త కళాకారుల సమస్యలపై కేబినెట్‌లో ప్రస్తావిస్తా జాతి గొప్పతనం నిర్మాణాల్లో కాదు, కళాకారుల పనితనంలో ఉంటుందని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. బొబ్బిలి వీణలు, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృతి చాటుతున్నాయన్నారు. హస్తకళా రూపాలు ప్రపంచానికి చేరాలంటే ఆన్‌లైన్ మార్కెటింగ్ అవసరం అన్నారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల పర్యాటక అభివృద్ధికి చర్యలుతీసుకుంటామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రిస్పష్టం చేశారు. కళాఖండాన్ని రూపొందించిన కళాకారుడికి ఆ గుర్తింపు దక్కే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాకారుల కష్టాన్ని ప్రపంచానికి పరిచయం చేసే విధంగా ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులకి దిశానిర్దేశం చేశారు. విబి జీ రాం జీ పథకం కింద క్లస్టర్లవారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హస్తకళల పరిరక్షణకు అన్నివిధాల చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణకు క్లస్టర్ల వారీగా నిరంతరం వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు.

హస్త కళాకారులు తయారు చేసిన టోపీని ధరించిన డి.సిఎం పవన్

లేపాక్షి ఈ కామర్స్ యాప్ ఆవిష్కరణ: హస్తకళా మహోత్సవం వేదిక నుంచి లేపాక్షి ఈ కామర్స్ యాప్ ను పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్ తో పాటు యాపిల్ యాప్ స్టోర్ లోనూ అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ ద్వారా మన రాష్ట్ర హస్తకళా ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త మార్కెటింగ్ అవకాశాలు దక్కనున్నాయి. దీంతో పాటు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన 100 ఉద్యమ్ వర్క్ షాపులను ప్రారంభించారు. 2 వేల మంది కళాకారులను అధికారిక పారిశ్రామిక వ్యవస్థలోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ వర్క్ షాపులను నిర్వహిస్తున్నారు. అనంతరం సంప్రదాయ హస్తకళల పరిరక్షణ, ప్రచారంలో విశేష కృషి చేసిన పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. సవిత, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ , రాష్ట్ర చేనేత, హస్తకళల విభాగం సలహాదారు సుచిత్ర ఎల్లా, హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ , పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి , అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు , ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జీరాంజీ కింద తొలి విడతగా రూ.2,545.50 కోట్లు విడుదల

విజయవాడ,.జూలై7,ప్రభాతవార్తప్రతినిధి: గ్రామీణ ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం భారీ ఊతం ఇచ్చింది.కూలీల వేతనాల కోసం రూ.1,414.16 కోట్లు కేటాయింపు చేసింది. మెటీరియల్ వ్యయాలకు రూ.942.77 కోట్లు విడుదల చేసింది..గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యం. ఇస్తూ ఈ పథకం అమలు చేస్తూంది..వీబీజీ–గ్రాం ద్వారా గ్రామీణాభివృద్ధికి కొత్త దిశ అని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలియచేసారు.వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో ఏపీ ముందంజలో ఉంటుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆశాభావం వ్యక్తం చేసారు.

ప్రశ్న రావణ్ నెల్లూరు జైలుకు తరలింపు

నెల్లూరు క్రైమ్, జూలై 7, ప్రభాతవార్త : హిందూ దేవుళ్లను అవమానించడంతోపాటు, మావోయిస్టు పార్టీకి అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన కేసులో ప్రశ్న రావణ్‌ను పోలీసుల అరెస్టు చేసి గన్నవరం కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. నేస్తమా ఆదేశాల మేరకు ప్రశ్న నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజులను దూషించిన కేసులోనూ నెల్లూరు దర్గా మిట్ట పోలీస్ స్టేషన్లో ఆయనపై కేసు నమోదయి ఉంది.

ఎంట్రప్రెన్యూర్లుగా రైతులు

>> ఏటికొప్పాక, కొండపల్లి , ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడ, పొందూరు కళారూ పాల్ని కూడా తీర్చిదిద్దాలి. ఇందుకోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. నేచర్, వాటర్, అమ్యూజ్మెంట్ పార్కులను అనుసంధానించాలి. సూర్యలంక మాస్టర్ ప్లాన్ త్వరితగతిన రూపొందించాలి. కుప్పంలో కంగుంది కోట, చిత్తూరు జిల్లాలో ఎలిఫెంట్ సఫారీ వంటివి అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా పర్యాటక రంగం నుంచి జీఎస్‌డీపీకి వాటా పెరిగేలా చూడాలి, అని ముఖ్యమంత్రి చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అవసరమైన హోటల్ గదులు పెద్దఎత్తున వస్తున్నాయని సీఎం అన్నారు. 2024లో 4,390 హోటల్ రూములు ఉంటే ఈ రెండేళ్లలో 9,364 హోటల్ రూముల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. దీంతో రాష్ట్రంలో 13,753 హోటల్ రూములు అందుబాటులోకి వస్తుండగా... దీనికి కృషి చేసిన అధికారులకు సీఎం అభినందనలు తెలిపారు.

సోలార్ సెల్స్ తయారీలో అగ్రగామి కావాలి: రెన్యువబుల్ ఎనర్జీ విస్తృతం కావడంతో సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలను ఆహ్వానించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. సోలార్ సెల్స్‌లో ఏపీ అగ్రగామిగా నిలవాలన్నారు. ఇంకా ఏర్పాటు చేయాల్సిన 38 ఎంస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని నిర్దేశించారు. రైల్వే టెర్మినల్స్‌కు ఎంస్ఎంఈ పార్కులను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లతో యువతకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు గ్రీన్ ఎనర్జీ వినియోగించేలా చూడాలన్నారు. బీపీసీఎల్, ఆమ్కా ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా సంప్రదింపులు జరపాలన్నారు. రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశానికి మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, దుర్గేష్, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రజాప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ రెండేళ్లలో ఇప్పటివరకు 19 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా 339 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటితో రాష్ట్రానికి మొత్తం రూ.11,86,271 కోట్ల విలువైన పెట్టుబడులు వస్తున్నాయి. అలాగే 10,41,821 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి.

ఫ్రాన్స్ అధ్యక్షునికి తప్పిన ప్రమాదం

డమాస్కస్, జులై 7: సిరియా రాజధాని డమాస్కస్‌లో వరుస పేలుళ్లు తీవ్ర కలకలం రేపాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఆ దేశ పర్యటనలో ఉండగా ఆయన బస చేసిన హోటల్ వద్దే ఈ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. అయితే, ఈ ఘటనలో ఆయన క్షేమంగా బయటపడినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్–షరాతో సమావేశమయ్యేందుకు అధ్యక్ష భవనంలోకి మెక్రాన్ వెళ్లిన వెంటనే సమీపంలోని ఫోర్ సీజన్స్ హోటల్ వద్ద పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. సుదీర్ఘ కాలంగా అంతర్యుద్ధంతో నలిగిపోయిన సిరియా.. ఇటీవల అక్కడ పాలకులు మారిన తర్వాత పునర్నిర్మాణంపై దృష్టి సారించింది. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే గతంలో పలు దేశాలు విధించిన అనేక ఆంక్షలు ఎత్తివేయడానికి పాశ్చాత్య దేశాలను ఒప్పించడంలో కీలక పాత్ర వహించిన మెక్రాన్. అల్–షరా అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ఆ దేశంలో కీలక పర్యటన చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతినిధుల బృందంలోతో కలిసి డమాస్కస్‌లోని ఫోర్ సీజన్స్ హోటల్‌లోనే బస చేశారు. మెక్రాన్ పర్యటన కొనసాగుతున్న సమయంలోనే హోటల్‌కు సమీపంలో రెండు పేలుళ్లు సంభవించాయి. చెత్తడబ్బాలో ఒకటి, పార్కింగ్ చేసిన కారులో మరో పేలుడు జరిగినట్లు సిరియా అధికారిక మీడియా తెలిపింది. ఈ ఘటనలో నలుగురు భద్రతా సిబ్బందికి గాయాలైనట్లు సమాచారం. అయితే, డమాస్కస్‌లోని జస్టిస్ ప్యాలెస్ సమీపంలోని ఓ కేఫ్‌లో ఇటీవలే భారీ పేలుడు సంభవించగా, పది మంది ప్రాణాలు కోల్పోయారు.

కాగ్నిజెంట్, విశాఖ ఐటి సెజ్‌కు కేంద్రం ఆమోదం

>> గా కూడా ప్రకటించడం విశేషం. కొన్ని నెలల క్రితం, ఫిబ్రవరిలో, తెలంగాణలోని నానక్‌రామ్ గూడ, ఆదిభట్లలో రెండు ఐటీ సెజ్‌ల ప్రతిపాదనలను కాగ్నిజెంట్ వెనక్కి తీసుకుంది. ఆ తర్వాత ఇప్పుడు విశాఖలో భారీ ప్రాజెక్ట్‌కు అనుమతులు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ ప్రాజెక్ట్ తో సుమారు రూ.1,580 కోట్ల పెట్టుబడి, దాదాపు 8,000 ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. దశలవారీగా పూర్తిస్థాయి క్యాంపస్‌ను అభివృద్ధి చేయనుండగా, విశాఖపట్నం ఐటీ స్వరూపాన్ని ఈ ప్రాజెక్ట్ సమూలంగా మార్చనుందని నిపుణులు భావిస్తున్నారు. విశాఖలో ఈ సెజ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ముఖ్యంగా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌లకు, కొత్తగా చదువులు పూర్తి చేసి ఉద్యోగాల కోసం చూసే ఫ్రెషర్ లకు చాలా ఉపయుక్తంగా ఉంటుంది. స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇతర రాష్ట్రాలకు నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గుతుంది మౌలిక సదుపాయాలు, రవాణా, ఇంటర్నెట్ ఫెసిలిటీ వంటి అంశాలలో మెరుగుదల ఈ ప్రాంతంలో ఐటీ రంగ అభివృద్ధికి దోహదం చేస్తుంది. ఈ ప్రాజెక్టు ఏపీ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. విశాఖ ఐటీ సెక్టార్ వృత్తి చెందడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుంది. ఇది ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి కీలకమవుతుంది. రాబోయే రోజులలో విశాఖలో మరిన్ని ఐటీ సంస్థలు వచ్చే అవకాశం పెరుగుతుంది. ఇది యువతకు ఉపాధి, రాష్ట్రానికి ఆర్థిక ప్రగతిని కలిగిస్తుంది.

వేగంగా అమరావతి నిర్మాణం

సిఆర్‌డిఏ 63వ సమావేశంలో సిఎం చంద్రబాబు

విజయవాడ,జూలై 7,ప్రభాతవార్తప్రతినిధి: అమరావతి నిర్మాణం వేగవంతంగా జరిగే విధంగా సీఆర్డీఏ అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు కీలక కార్యచరణను చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు.ఆ దిశలో అధికారులు స్పందించి పనిచేయాలన్నారు.రాజధానిలో నిర్మాణాలు,ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ జరిగే విధంగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో సీఆర్డీఏ 63వ అథారిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, సీఎస్ సాయిప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధి, రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులు సహా తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. 2024 జూన్ 12 నుంచి రెండో దశ ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇస్తున్న రైతులకు ఎకరానికి వార్షిక యాన్యుటీగా రూ.40 వేల చొప్పున చెల్లించేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. భూములు అప్పగించిన తేదీ నుంచి పదేళ్లపాటు ఈ యాన్యుటీ అమల్లో ఉంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు ఎకరానికి రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంపునకూ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించారు.కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములు ఇచ్చే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని అథారిటీ తీర్మానించింది. 2026 జనవరి 6 లోపు తీసుకున్న వ్యవసాయ రుణాలకు ఈ నిర్ణయం వర్తించేలా అథారిటీ ఆమోదం తెలిపింది. ఇనాం భూములకు సంబంధించి దేవదాయ శాఖకు రూ.159 కోట్లు చెల్లించేందుకూ ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.. అమరావతిలో అభివృద్ధి చేస్తున్న 25 టౌన్‌షిప్‌లలో ప్రతి దాంట్లోనూ తప్పనిసరిగా ఒక అంతర్జాతీయ పాఠశాల ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.ఇందుకు సమావేశం ఆమోదం తెలిపింది.ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా భూములు ఇవ్వని రైతులకు మంగళవారం రాత్రి వరకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాతా భూములు ఇవ్వకపోతే బుధవారం నుంచి భూసేకరణ ప్రక్రియను అమలు చేయాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూమికీ అమలు చేయాలని సమావేశం నిర్ణయం తీసుకుంది.ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సీఆర్డీఏ 63వ అథారిటీ సమావేశం నిర్ణయాలను మీడియాకు వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు (నెల్లూరు), జూలై 7, ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారమే నా ధ్యేయమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మంగళవారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సంక్షేమం, ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే కూటమి లక్ష్యమని పేర్కొన్నారు.

మంగళవారం జకార్తాలో ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటోతో భేటీ అయిన ప్రధాని మోడీ

ఇండొనేసియాకు 'బ్రహ్మోస్త్రం'

>> అత్యున్నత పౌర పురస్కారమైన బింటాంగ్ ఆదిపుర్ణ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియాను ప్రదానం చేసి అరుదైన గౌరవాన్ని అందించింది. జకార్తా పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందాలు కుదిరాయి. రక్షణ రంగంలో సహకారం ఈ ఒప్పందాల్లో ప్రధానంగా నిలిచింది. సముద్ర భద్రత, భద్రతా సహకారంపై ఉన్న అవగాహన ఒప్పందాన్ని ఇరు దేశాలు పొడిగించాయి. దీనికి తోడు, ఇండోనేషియాకు బ్రహ్మోస్, అస్త్రక్షిపణి వ్యవస్థలను అందించేందుకు ఒక రక్షణ కాంట్రాక్టుపై సంతకాలు జరిగాయి. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), ఇండోనేషియాకు చెందిన రిపబ్లికోర్ప్ మధ్య గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణుల సహకారంపైనా ఒక ఒప్పందం కుదిరింది. వాణిజ్య, ఆర్థిక రంగాల్లోనూ వ్యూహాత్మక భాగస్వామ్యానికి బలమైన పునాది పడింది. ఖనిజాలు, ఉక్కు సరఫరా వ్యవస్థలలో సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఇండోనేషియాకు చెందిన పీటీ క్రాకటౌ స్టీల్ మధ్య ఒక వ్యూహాత్మక జాయింట్ వెంచర్ ఏర్పాటు కానుంది. వీటితో పాటు విపత్తు నిర్వహణ, వ్యవసాయం, టెలికమ్యూనికేషన్స్, వైద్య ఉత్పత్తుల నియంత్రణ, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై కూడా పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి. విద్యా, సాంస్కృతిక సంబంధాలను పెంపొందించే దిశగా ఐఐఎం బెంగుళూరు, పీటీ ఇంటెలిజెన్షియా గ్రహతామా మధ్య ఒక ఎంఓయూ కుదిరింది. ఇండోనేషియాలోని చారిత్రక ప్రంబనన్ ఆలయ సముదాయ పరిరక్షణ, పునరుద్ధరణ కోసం ఒక లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను కూడా మార్చుకున్నారు. ఈ పరిణామాలు ఇరు దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేశాయని భారత విదేశాంగశాఖ ప్రకటించింది.

ప్రధాని మోడీకి ఇండొనేసియా అత్యున్నత పురస్కారం

>> ప్రజల భావోద్వేగాలకు చెందుతుందని తెలిపారు. భారత్, ఇండోనేసియా మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు ఇది నిదర్శనమన్నారు. ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసినట్లు మోడీపేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తులను ఇండోనేసియా సర్కారు బింటాంగ్ ఆదిపూర్ణ అవార్డుతో సత్కరి స్తుంది.జకార్తాలోని అధ్యక్ష భవనంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ప్రధాని మోడీకి బింటాంగ్ ఆదిపూర్ణ పురస్కారాన్ని స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రబోవో మాట్లాడుతూ ఇండోపసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని నెలకొల్పే శక్తిగా భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు, ద్వైపాక్షిక సంబంధాలను మార్చడంలో ప్రధాని మోడీ వ్యక్తిగత నాయకత్వానికి ఈ పురస్కారం ఒక గుర్తింపు.మా గణతంత్రంఅందించే అత్యున్నత పురస్కారం ఇది. ఇండోనేషియా,భారత్ మధ్య ఉన్న చారిత్రక నాగరికతాబంధాలు,విడదీయరాని వ్యూహాత్మకవిశ్వాసానికి ఇది నిదర్శనమని ప్రకటించారు.

ఆ 10 మంది మత్స్యకారులు సురక్షితం

>>నాయుడు ఆధ్వర్యంలో కవిటి ఎస్ఐ రవివర్మతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్ల చిరంజీవి, బషీర్ మరియు హోంగార్డు శ్రీనివాస్‌తో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, వెంటనే ఒడిశా సరిహద్దు ప్రాంతానికి పంపించారు. ఆయా పోలీసు బృందం ఒడిశా మెరైన్ పోలీసు, కోస్ట్ గార్డ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారులతో నిరంతరం సంప్రదిస్తూ (కమ్యూనికేషన్) కొనసాగించింది.

మూడు రోజులపాటు నిరంతర శ్రమతో సహాయక చర్యలు నిర్వహించి, బోటును సురక్షితంగా పారాదీప్ సముద్ర తీర ప్రాంతానికి చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం మత్స్యకారులకు అవసరమైన భద్రత, ఆహారం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి, వారి కుటుంబ సభ్యుల వద్దకు క్షేమంగా చేరేలా అన్ని చర్యలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా మత్స్యకారుల ప్రాణాలను కాపాడేందుకు అంకితభావంతో పనిచేసిన జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పర్యవేక్షణలో ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నానాయుడు ఆధ్వర్యంలోని పోలీసు బృందాన్ని విశాఖపట్నం రేంజ్ ఐజీ మరియు మెరైన్ విభాగం ఐజీ గోపీనాథ్ జట్టి అభినందిస్తూ, వారి సేవా స్ఫూర్తిని ప్రశంసించారు.

38మందికి ఉరి ఖరారు

>> అప్పీళ్లను, అలాగే మరణశిక్షల ఖరారు పిటిషన్లను గుజరాత్ హైకోర్టు సమగ్రంగా విశ్లేషించింది. డిజిటల్ ఆధారాలు, ఫోరెన్సిక్ నివేదికలు, నిందితుల కాల్ డేటా రికార్డులను పరిశీలించిన తర్వాత.. దిగువ కోర్టు ఇచ్చిన తీర్పు చట్టబద్ధమైనదని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దోషులకు శిక్షల ఖరారుతో పాటు, ఉగ్రదాడిలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాల పట్ల న్యాయస్థానం మానవీయ కోణంలో స్పందించింది. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక పౌరుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని హైకోర్టు గుజరాత్ ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. అలాగే తీవ్ర గాయాలపాలైన బాధితులకు రూ. 5 లక్షలు మరియు స్వల్ప గాయాలైన వారికి రూ. 1 లక్ష చెల్లించాలని కోర్టు ఆదేశించింది. తీర్పు అనంతరం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ పటేల్ మాట్లాడుతూ, డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించడానికి ముందు మార్చి 2025 నుండి ఈ అప్పీళ్లపై రోజువారీ ప్రాతిపదికన విచారణ జరిగిందని తెలిపారు. "ఈ కేసులో విచారణ మార్చి 2025 నుండి రోజువారీగా జరుగుతూ వచ్చింది. మంగళవారం గుజరాత్ హైకోర్టు డివిజన్ బెంచ్ తన తీర్పును వెలువరించిద్దిఅని పటేల్ పేర్కొన్నారు. పూర్తి స్థాయి తీర్పు ఇంకా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రాలేదని, పూర్తి ఉత్తర్వును పరిశీలించిన తర్వాతే దీనిపై మరింత వ్యాఖ్యానించగలనని ఆయన చెప్పారు. "ప్రస్తుతానికి, పూర్తి తీర్పు అప్‌లోడ్ చేయబడలేదు, కాబట్టి నేను దానిని చదివే అవకాశం పొందలేదు. తీర్పు పూర్తి పాఠాన్ని పరిశీలించిన తర్వాతే నేను దానిపై వివరంగా వ్యాఖ్యానించగలన్ను అని ఆయన అన్నారు. ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసే హక్కు దోషులకు ఉంటుంది.

బాలికపై లైంగిక దాడి.. ఆత్మహత్య

నిందితులపై పోక్సో కేసు నమోదు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూలై7,ప్రభాతవార్త: బాలిక పై లైంగిక దాడి,బాలిక ఆత్మహత్యాయత్నం, మృతి చెందిన సంఘటన తూర్పు గోదావరి జిల్లా లో చోటు చేసుకుంది.దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ప్రకారం కొవ్వూరు మండలం బంగారమ్మపేట గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికపై లైంగిక దాడి జరిగినట్లు ఆరోపణలు వెలుగుచూశాయి. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన బసవాని లక్ష్మణ్‌ను నిందితుడిగా గుర్తించిన పోలీసులు.. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాధితురాలు, నిందితుడు వరుసకు అన్నాచెల్లెలు అవుతారని సమాచారం. ఈ ఘటన అనంతరం బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బాలికను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు పోక్సోతో పాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వారం - వర్జ్యం

08-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
అష్టమి మ.12.37
రేవతి మ.3.55
వర్జ్యం : లేదు
దు. ఉ.11.46–మ.12.38
రాహుకాలం – మ.12.00–1.30

వార్తాఫలం

మేషం: మాటల చాతుర్యంతో శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

వృషభం: దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం తెలుసుకుంటారు. చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

మిథునం: బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. కొత్తకార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఓర్పుతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు.

కర్కాటకం: కాలానుగుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా నడుచుకోవడానికి కొంత ఇబ్బంది పడతారు.

సింహం: ఇంటాబయటా మీ మాటే చెల్లుబాటు కాగలదు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. శుభవార్తలు వింటారు.

కన్య : స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. వాహనాల విషయంలో జాగ్రత్తలు అవసరం. క్రీడారంగం యందు ఆసక్తి చూపుతారు.

తుల : గృహసంబంధమైన విషయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన మీ వారిలో రానివ్వకుండా జాగ్రత్తలు వహించండి.

వృశ్చికం: ఉపయోగపడని వ్యక్తులనుకున్న వారే కార్య విజయాలకు కారణం అవుతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

ధనుస్సు:రాజకీయ రంగాలలోని వారికి కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. చేతి వృత్తి పని వారికి అనుకూలంగా ఉంటుంది.

మకరం: పుకారులను నమ్మకండి. సంతాన విద్యా విషయాలలో కొంత అశాంతికి లోనవుతారు. గృహ యోగం కలదు.

కుంభం:పనులు నిదానంగా పూర్తి చేస్తారు. నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు.

మీనం: ముఖ్యమైన పత్రాలను జత చేయవలసిన వాటిని మర్చి పోయే అవకాశం ఉంది. జాగ్రత్తలు పాటించండి.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

8-7Pg3exHMNWJQEPRKGWJQE.qxdo/p:8-7Pg3exHMNWJQEPRKGWJQE.qxd 1/1/02 8:28 AM Page 1

పంటల బీమా పథకాలు కొనసాగింపు

● అర్హులైన ప్రతి రైతు నమోదు చేసుకోవాలి ● రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

● రుణ రైతులకు ఆప్ట్‌అవుట్ విధానం యథాతథం ● రుణేతర రైతులు కూడా స్వచ్ఛందంగా నమోదు చేసుకోవచ్చు

● అగ్రిస్టాక్ ఫార్మర్ ఐడి, ఇపంట ధ్రువీకరణకు ప్రాధాన్యం ● రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం సబ్సిడీ భారం భరిస్తుంది

విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని రైతులకు పంటల భద్రత కల్పించేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలను 2026-27 సంవత్సరానికి (ఖరీఫ్, రబీ) మరో ఏడాది పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, సహకార శాఖల ద్వారా సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. పంటల బీమా పథకాల ద్వారా ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ఇతర అనుకోని కారణాలతో పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఖరీఫ్-2026 సీజన్‌లో నోటిఫై చేసిన ప్రాంతాల్లో నోటిఫై చేసిన పంటలను సాగు చేస్తున్న యజమాని రైతులు, కౌలు రైతులు, భాగస్వామ్య సాగుదారులు, పంటపై బీమా హక్కు కలిగిన వారు అందరూ పథకంలో నమోదు చేసుకోవచ్చని మంత్రి పిలుపునిచ్చారు.

రైతులు గడువులోపు నమోదు చేసుకోవాలి: పధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఖరీఫ్-2026 సీజన్‌లో వరి మినహా అన్ని నోటిఫైడ్ పంటలకు రుణ కాలం ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు ఉండగా, రుణ, రుణేతర రైతుల నమోదు గడువు జులై 31గా నిర్ణయించబడిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వరి పంటకు రుణ కాలం ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 15 వరకు ఉండగా, నమోదు గడువు ఆగస్టు 15గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

రబీ 2026-27 సీజన్‌లో వరి మినహా అన్ని నోటిఫైడ్ పంటలకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 15 వరకు ఉండగా, నమోదు గడువు డిసెంబర్ 15గా నిర్ణయించారని, వరి పంటకు రుణ కాలం అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఉండగా నమోదు గడువు డిసెంబర్ 31గా నిర్ణయించినట్లు తెలిపారు.

రుణ రైతులకు 'ఆప్ట్ అవుట్' విధానంలో బీమా: సీజనల్ పంట రుణం లేదా కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి మంజూరైన లేదా పునరుద్ధరించిన రైతులు సంబంధిత బ్యాంకు శాఖల ద్వారా ఆటోమేటిక్‌గా పంట బీమా పరిధిలోకి వస్తారని మంత్రి తెలిపారు. బీమా వద్దనుకునే రైతులు మాత్రమే నమోదు గడువుకు కనీసం ఏడు రోజుల ముందుగా రుణం మంజూరు చేసిన బ్యాంకు శాఖకు లిఖితపూర్వకంగా 'ఆప్ట్ అవుట్' ప్రకటన సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. అలాంటి ప్రకటన సమర్పించని రైతులందరూ స్వయంచాలకంగా బీమా పరిధిలోకి వస్తారని స్పష్టం చేశారు. నోటిఫై చేసిన పంటలకు సంబంధించి రుణ రైతులకు బీమా వర్తింపజేయడం తప్పనిసరి అని పేర్కొన్న మంత్రి, బ్యాంకులు రైతు చెల్లించాల్సిన ప్రీమియం వాటాను డెబిట్ చేసి, వాస్తవ సాగు విస్తీర్ణం ఆధారంగా పంటల వారీగా బీమా నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోపు ప్రీమియంతో కూడిన సమగ్ర వివరాలను బీమా సంస్థలకు పంపించడంతో పాటు విది౹శిలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో ప్రీమియం, రైతుల వివరాలను బీమా సంస్థలకు పంపించడంలో బ్యాంకులు లేదా శితిదిళీ విఫలమైతే, బీమా రక్షణ కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఆయా బ్యాంకులదేనని స్పష్టం చేశారు.

రుణేతర రైతులకు స్వచ్ఛంద నమోదు: రుణేతర రైతులు స్వచ్ఛందంగా పథకంలో నమోదు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఇందుకోసం యజమాని రైతులు రికార్డ్ ఆఫ్ రైట్స్ ల్యాండ్ పొజెషన్ సర్టిఫికేట్ లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇతర భూ రికార్డులను సమర్పించాల్సి ఉంటుంది. కౌలు రైతులు, భాగస్వామ్య సాగుదారులు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన ఒప్పంద పత్రాలు లేదా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. అదనంగా బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌బుక్ ప్రతులు, రైతు స్వీయ పంట సాగు ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలతో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి విది౹శిలో నమోదు చేస్తారని, అసంపూర్ణ దరఖాస్తులు లేదా అవసరమైన పత్రాలు లేని దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

ఆగస్టు 1 నుంచి మార్కెట్లోకి

'స్వయం ఏపీ బ్రాండ్'

● 65 ప్రత్యేక ఉత్పత్తులకు సెర్ప్ గుర్తింపు

● గ్రామీణ మహిళా ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ ● ఎస్‌హెచ్‌జీ మహిళా కుటుంబాల్లో వివాహాలకు కల్యాణలక్ష్మి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఆగస్టు 1 నుంచి మార్కెట్లోకి 'స్వయం ఎపి బ్రాండ్' అందుబాటులోకి వస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం విజయవాడలోని సెర్ప్ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ఆయా ప్రాంతాల సంప్రదాయాలను ప్రతిబింబించేలా 65 ప్రత్యేక ఉత్పత్తులను సెర్ప్ గుర్తించిందని, 587 మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారవుతోన్న ఈ ఉత్పత్తులను ఆగస్టు 1నుంచి మార్కెట్లోకి తీసుకు వస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. ఈ ఉత్పత్తుల నిల్వ, ఆర్డర్ల నిర్వహణ, స్పీడ్ సరఫరా కోసం రెండు ఫుల్ ఫిల్‌మెంట్ సెంటర్లను కూడా ప్రారంభిస్తామన్నారు. విజయవాడలో బాపూజీ మ్యూజియం దగ్గర మరియు గొల్లపూడిలోని టీటీడీసీ ప్రాంగణంలో రెండు సిగ్నేచర్ స్టోర్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. ఉత్పత్తులు అన్నీ నాణ్యతా ప్రమాణాల మేరకు ఉండేలా చూస్తున్నామని, ఈ విషయంలో మహిళా సంఘాలకు పూర్తి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ మహిళా ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆదాయం పెంచడంతో పాటు స్వయం ఏపీ బ్రాండ్‌ను మరింతగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే పారిశ్రామిక సంస్థల సమర్థవంత పనితీరుకోసం ప్రతి నెలా సామాజిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళల ద్వారా ఆధునిక యాంత్రిక, లాండ్రీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సెర్ప్ అధికారులకు మంత్రి సూచించారు. ఎస్‌హెచ్‌జీ మహిళలకు వివాహ సంబంధిత అవసరాల కోసం తక్కువ వడ్డీతో, సులభంగా రుణం అందించేందుకు స్త్రీ నిధి "కల్యాణ లక్ష్మి" పథకం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎస్‌హెచ్‌జీ మహిళలందరిని ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకాలలో 100 శాతం నమోదు చేసి జీవిత, ప్రమాద బీమా రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. వెలుగు మార్ట్‌లు పనితీరు నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నష్టాలతో మూతపడిన, సరిగా పనిచేయని మార్ట్‌ల విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సెక్రటరీ సిఇఒ వాకాటి కరుణ, సెర్ప్ డైరెక్టర్లు, మార్కెటింగ్ సిబ్బంది, స్వయం ఎపి బ్రాండ్ కన్సల్టెంట్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుమ్మడి గోపాలకృష్ణకు సిఎం అభినందన

● కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికపై చంద్రబాబు ప్రశంస

విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఇటీవల కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుకు ఎంపికైన ఎపి నాటక అకాడమీ ఛైర్మన్, ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణను ముఖ్య మంత్రి చంద్రబాబు అభినందించారు. సిఎం చంద్రబాబును సచివాలయంలో గోపాలకృష్ణ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రంగస్థలం నటనకు తొలిసారి కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు రావడం సంతోషకరమన్న సిఎం, గుమ్మడి గోపాలకృష్ణకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. గోపాలకృష్ణ వేసే నాటకాలన్నీ బాగుంటాయని, తన ప్రదర్శనలతో తెలుగు నాటక రంగానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని ముఖ్యమంత్రి కొనియాడారు.

చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యంపై వీడని మిస్టరీ

వదంతులు నమ్మవద్దు: డిఎస్పీ తిలక్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 7 ప్రభాతవార్త: కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసులో మిస్టరీ వీడలేదు. ఇంతవరకు ఏవిదమైన ఆచూకి లబించకపోగా సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంతో దర్యాప్తులో పోలీసులకు తలనొప్పిగా మారింది. కాగా ఈ సంఘటన పై పోలీసు దర్యాప్తు కొనసాగుతోందని పెద్దాపురం డిఎస్పి తిలక్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నారి జ్ఞానేశ్వరిని తల్లి వద్దకు చేర్చడమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారన్నారు. చిన్నారి ఆచూకీ తెలిసినవారు పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై ఎటువంటి కేసులు ఉండవని సంచలన ప్రకటన చేశారు. చిన్నారి జ్ఞానేశ్వరి కేసు పై పక్కా సమాచారంతో మీడియాలో వార్తలు ప్రచురించాలని, అసత్య కథనాల వలన కేసు పురోగతిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. కేసులో పురోగతి సాధించేందుకు మీడియా సహకరించాలని కోరారు.

విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు

● ప్రజల ప్రాణాలు, జీవనోపాధి పరిరక్షణే ప్రభుత్వ ప్రాధాన్యత ● వాతావరణ హెచ్చరికల ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టి 'జీరో లాస్' లక్ష్యంగా పనిచేయాలి

● జిల్లా కలెక్టర్లు వ్యక్తిగతంగా సన్నద్ధత, ప్రతిస్పందన చర్యలను పర్యవేక్షించాలి ● రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత

విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు చేపడుతున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. ఈ విషయంలో పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో ప్రభావంపై ఉన్నత స్థాయి అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. విపత్తుల వల్ల ఏ ఒక్క ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిరంతరం పని చేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

రాయలసీమ జిల్లాలపై ఎక్కువగా ఎల్‌నినో ప్రభావం చూపుతుందని అన్నారు. శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్రస్థాయిలో వర్షాల కొరత ఉందని తెలిపారు. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప జిల్లాల్లో ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతిలో వర్షభావ ప్రభావం మధ్యస్థంగా ఉన్నట్లు వెల్లడించారు. కరవు ముప్పు ఉన్న మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాలలో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ వంటి కీలక సేవలకు ఎలాంటి అంతరాయం కలగకూడదని సూచించారు. పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు అత్యవసర స్పందనకు సిద్ధంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లాపై ఎల్ నినో ప్రభావం తీవ్రస్థాయిలో ప్రభావం చూపిందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వరి సాగు గణనీయంగా తగ్గిందని, ఇప్పటి వరకు కేవలం 30 శాతం విస్తీర్ణంలోనే నాట్లు వేశారని అధికారిక గణాంకాలు స్పష్టం చేశాయి. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు పంట నష్ట పోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వరి మాత్రమే పండే ప్రాంతాల్లో రైతులు సాధారణ వరి రకాలు కాకుండా తక్కువ సమయంలో పంట వచ్చే వరి రకాలను సాగు చేయాలని సూచించింది. చెరువులు, బావులు, బోర్ల కింద పంటలు పండించే రైతులు తప్పని సరిగా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని అధికారులు తెలుపుతున్నారు.

సోషల్ మీడియా వేదికగా వ్యవస్థీకృత దుష్ప్రచారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు: సోషల్ మీడియా వేదికగా వ్యవస్థీకృత దుష్ప్రచారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. అశ్లీల పోస్టులు పెట్టడం, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారాలకు ఒడిగట్టే వ్యక్తులు, గ్రూపులపై నెట్‌వర్క్ ఆధారిత దర్యాప్తును ముమ్మరం చేయాలని ఆమె స్పష్టం చేశారు.

ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులతో కలసి శాంతిభద్రతలు, సైబర్ నేరాల కట్టడి, మహిళలకు రక్షణ, అమరావతి ప్రాంతంలో ప్రేరేపిత నిరసనలపై ఎస్‌వోపీ రూపకల్పన, ఇతర నేరాలపై పరిస్థితిని సమగ్రంగా చర్చించారు. అన్ని పోలీసు జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు, ఐజీలతో పోలీసు పనితీరు, ఎదురవుతున్న సవాళ్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అనంతరం అనిత మాట్లాడుతూ... రాష్ట్రంలో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ, చట్టబద్ధమైన విమర్శలకు ఆటంకం ఉండదు. అయితే అడ్డూ అదుపు లేకుండా రెచ్చిపోతే చట్టం తనపని తాను చేస్తుంది. రెండేళ్ల కూటమి పాలనలో ఏపీలో మహిళల భద్రత గణనీయంగా పెరిగింది. చిచ్చు పెట్టి విషం చిమ్మే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంటుంది అని హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సమావేశంలో శాంతి భద్రతల ఏడీజీ మధుసూదన్‌రెడ్డి, సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వేలం కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

● వర్జీనియా పొగాకు కొనుగోలుపై మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష

సచివాలయం, జులై 7 ప్రభాతవార్త: వర్జీనియా పొగాకు కొనుగోళ్ళ ప్రక్రియ, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సామాజిక సంక్షేమ, విద్యుత్, రెవెన్యూ శాఖల మంత్రులతో పాటు టుబాకో బోర్డు చైర్మన్, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆక్షన్ ఫ్లాట్‌ఫారమ్‌ల పరిస్థితి, కొనుగోళ్ళ పురోగతి, రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి సమగ్రంగా చర్చించారు. ఈనెల 9న టుబాకో బోర్డు కేంద్ర సంయుక్త కార్యదర్శి ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న నేపథ్యంలో రైతులు, పొగాకు కొనుగోలు సంస్థల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అధిక రిజెక్షన్ నమోదవుతున్న ఆక్షన్ ఫ్లాట్ ఫార్మ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను గుర్తించి వేంటనే పరిష్కరించాలని సూచించారు. పొగాకు వేలం కేంద్రాలను సంబంధిత సహచర మంత్రులు స్వయంగా సందర్శించి రైతులతో మాట్లాడాలని, కంపెనీల సిండికేట్ వ్యవహారాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఆక్షన్‌లలో పాల్గొన కుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కంపెనీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టుబాకో బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు. రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా, వర్జీనియా పొగాకుకు న్యాయమైన ధరలు లభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ, చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో 10 కిలోల గంజాయి స్వాధీనం

ఒంగోలు(క్రైమ్), జులై 7 ప్రభాతవార్త: పూరి నుంచి తిరుపతి వెళ్తున్న పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో నిర్వహించిన సాధారణ తనిఖీల్లో 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు రైల్వే సీఐ కమలాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక జీఆర్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్, ఒంగోలు జీఆర్పీ, ఆర్పీఎఫ్, ఈగల్ బృందాలు సంయుక్తంగా సాయంత్రం 4.30 గంటల సమయంలో పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో సాధారణ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బ్యాగులను పరిశీలించగా సుమారు 10 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని తదుపరి దర్యాప్తు కోసం ఒంగోలు జీఆర్పీ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. నిందితులు గంజాయిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారు, ఎవరికి సరఫరా చేయాలనే ఉద్దేశంతో తరలిస్తున్నారు, ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. రైల్వే మార్గాల ద్వారా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతోందని, ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీఐ కమలాకర్ తెలిపారు. ప్రయాణికులు అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల అక్రమ రవాణాను సమర్థంగా అరికట్టగలమని ఆయన అన్నారు. నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ శ్రీరామ్, ఏఎస్ఐ భాషా, చంచయ్య, ఈగల్ టీమ్ సభ్యులు లక్ష్మణ్ తదితర అధికారులు పాల్గొన్నారు. అధికారులు సమన్వయంతో నిర్వహించిన తనిఖీల ఫలితంగానే ఈ గంజాయి పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.

శాంతిపురంలో అమెరికన్ విద్యార్థుల సందడి

● ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు పరిశీలన

శాంతిపురం, జులై 7 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం ఎంకెపురం గ్రామంలో అమెరికన్ విద్యార్థులు సందడి చేశారు. అమెరికాలోని ప్రెస్టిషియన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థుల బృందం గ్రామంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించింది. ఈ కార్యక్రమం రైతు సాధికార సంస్థ, ఎపి కమ్యూనిటీ మేనేజ్డ్ నాచురల్ ఫామింగ్ వారి ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికన్ విద్యార్థులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి పంట సాగు విధానాలు అడిగి తెలుసుకున్నారు. పంటల నిర్వహణ, గోఆధారిత వ్యవసాయ ఉత్పత్తులు, జీవామృతం, ఘనజీవామృతం తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతుల అనుభవాలను ఆసక్తిగా తిలకించారు. కుప్పం ప్రాంతంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానం ఎంతో ఆదర్శంగా ఉందని అమెరికన్ విద్యార్థులు పేర్కొన్నారు. రైతులు అనుసరిస్తున్న విధానాలతో పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు చూపిన దూరదృష్టిని అమెరికన్ విద్యార్థులకు వివరించారు. అలాగే స్వర్ణ కుప్పం లక్ష్యాల గురించి తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల ఆదాయం, నేల, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు రామకుప్పం మండలం చెల్దిగానిపల్లి, పెద్దగానూరు గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో డిపిఎం అమృతవల్లి, నోడల్ అధికారి బాజీబాబు, ఎఎంసి డైరెక్టర్లు, ఎఫ్‌ఎంటిలు, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

● రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి



సచివాలయం, జులై 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు అందించే లక్ష్యంతో ఈ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టంచేశారు. పేదలకు పక్కా గృహాలు అందించడానికి ముఖ్య మంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేయడంతోపాటు కేంద్రం నుంచి అధిక నిధులు సాధించి వారి సొంత ఇంటి కల నిజం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సచివాలయంలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2014-19మధ్య మొత్తం 13,04,516ఇళ్లు మంజూరు చేస్తే రూ.10,194కోట్లు ఖర్చుచేసి 8,04,853ఇళ్ల పూర్తిచేసి లబ్ధిదారులకు అందించిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. అందరికీ ఇళ్లు అందించాలన్న ఏకైక లక్ష్యంతో ఆనాడు రూ.10 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చుచేశారని గుర్తుచేశారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, బిసిలు ఇళ్ళ నిర్మాణంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.712.83 కోట్లు అదనపు ఆర్థిక సాయం అందించారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇంటికి రూ.50వేల చొప్పున ఆదివాసీ గిరిజనులకు ఇంటికి రూ.75వేల చొప్పున అందించి వారికి చేయూత నివ్వడం జరిగిందని మంత్రి పార్థసారధి పేర్కొన్నారు.

స్వర్ణ గ్రామం, వార్డుల్లో పనిచేసే 370మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖకు కేటాయించడంతో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం అవుతాయని మంత్రి హర్షం వ్యక్తంచేశారు. సిబ్బంది కేటాయింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62కు పెంచడంతో గృహ నిర్మాణంలో నైపుణ్యం, విశేష అనుభవం ఉన్న దాదాపు 348మంది విధుల్లో కొనసాగే అవకాశం ఉందని వారి పర్యవేక్షణలో ఇళ్ళ నిర్మాణం మరింత వేగవంతం అవుతాయన్నారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని గృహ నిర్మాణ శాఖ చేపడుతుందని మంత్రి పార్థసారధి తెలిపారు. ఇప్పటికే బుట్టాయిగూడెం, తాడువాయి తదితర ప్రాంతాలో వేగంగా గృహ నిర్మాణాలు చేస్తున్నామన్నారు. పునరావసంలో భాగంగా పోలవరం పూర్తయ్యే లోపు నిర్వాసితులు అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పార్థసారధి స్పష్టంచేశారు.

వార్త

చెడు మంత్రి వల్ల రాజు, చెడు సహవాసం వల్ల మంచి అలవాట్లు, చరిత్రహీనత వల్ల సంపదలు నాశనమవుతాయి.

- ఇబ్బన్

దుష్కృత్యానికి చెంపదెబ్బ!

దేశం యావత్తును తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన అహ్మదాబాద్ బాంబు పేలుళ్ల కేసులో కింది కోర్టు తీర్పును గుజరాత్ హైకోర్టు ఖాయం చేసింది. 38 మందికి ఉరిశిక్ష, 11 మందికి జీవితఖైదును ఖాయపరుస్తూ తీర్పు చెప్పింది. సుమారు 70 నిమిషాల వ్యవధిలో అహ్మదాబాద్ నగరాన్ని అతలాకుతలం చేసిన 21వరుస బాంబు పేలుళ్ల దుర్ఘటనలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 46 మంది గాయపడ్డారు. భారతదేశ చరిత్రలో అత్యంత భయానక ఉగ్రదాడిగా నిలిచిపోయింది. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా 'సిమి' మాజీ నాయకుడు సఫ్దర్ నాగోరి, మరికొందరితో ఏర్పాటు చేసిన ఇండియన్ ముజాహిదీన్ ఈ పేలుడు సంఘటనలకు సూత్రధారులు. కాగా శిక్షపడిన నేరస్థులందరూ హైకోర్టులో అప్పీల్ చేసుకుని వాదించుకోవడం విశేషం. 2002 గోద్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు పోలీసు దర్యాప్తులో తేలింది. కొందరు నిందితులు సమర్థించుకున్నారు కూడా. వీరిపై దేశద్రోహం, ఉగ్రవాద కార్యకలాపాలు, పేలుడు పదార్థాల చట్టం, హత్యాకావించడం వంటి నేరారోపణలపై వారందరి మీద అహ్మద్ పోలీసులు 35 ప్రాథమిక సమాచార నివేదికలు దాఖలు చేయగా ఒకే మూస కేసులుగా విచారణ జరిగింది. మొత్తం 78 మంది నిందితులపై విచారణ జరుగగా 49 మందిని దోషులుగా నిర్ధారించింది. తగిన ఆధారాలు లేవన్న కారణంగా 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఒకరు అప్రూవర్‌గామారారు. దాదాపు 13ఏళ్లపాటు విచారణ అనంతరం అహ్మదాబాద్ ప్రత్యేక సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎ.ఆర్.పటేల్ ఫిబ్రవరి 8, 2022న తీర్పు వెలువరించి అదే నెల 18న శిక్షలు ఖరారు చేశారు. 38 మందికి ఉరిశిక్ష, 11 మందికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. ఒక ఉగ్రవాద కేసులో ఇంత పెద్ద సంఖ్యలో ఉరిశిక్షలు విధించడం భారత న్యాయ చరిత్రలోనే అరుదైన విషయం. 7వేలకుపైగా పేజీల తీర్పులో ప్రస్తావించిన ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకొని శిక్షలు విధించారు. ఈ కేసులో నిందితులను సభ్యసమాజంలో తిరుగనివ్వడమంటే మానవ మాంసానికి తహతహలాడే చిరుతను వారిపైకి వదిలి పెట్టినట్లే అవుతుందని కోర్టున్యాయమూర్తి వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగం పట్ల ఏమాత్రం గౌరవభావం లేని నిందితులు ప్రజాస్వామ్యవ్యవస్థను కూల్చివేయాలనే ఉద్దేశంలోనే ఈ దురాగతానికి పాల్పడ్డారని కోర్టు అభిప్రాయానికి వచ్చింది. ఇలాంటి నేరాలను అతిసాధారణ నేరాలుగా ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని కోర్టు అభిప్రాయపడింది. దేశంలో ఉగ్రవాదాన్ని, వాటి ఛాయల్ని తుడిచిపెట్టాలన్న సంకల్పంతో, ఇతరులకు ఇలాంటి కేసుల్లో శిక్షలే భయపెట్టించాలని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. కేవలం నిందితులను శిక్షించడం ద్వారా వారిని సత్ప్రవర్తన వైపు మళ్లించాలన్నది న్యాయవ్యవస్థ ప్రధాన సిద్ధాంతం. కానీ అహ్మదాబాద్ ఘోరకలికి బాధ్యులైనవారు క్షమార్హులు కాదనే సందేశాన్ని ఈ తీర్పు స్పష్టంచేస్తోంది. వందమంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదు, కానీ ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదన్న' న్యాయ సిద్ధాంతం నేపథ్యంలోనే ఈ అంశంపై దోషులను గుర్తించి సిద్ధపడడానికి బాగా సమయం తీసుకోవాల్సి వచ్చింది. సంఘటనకు బాధ్యులుగా భావించి గుర్తించిన నిందితుల్లో 28 మంది నిందితులను కోర్టు నిదానంగా ఒక్కొక్కరి పాత్రను సమీక్షించింది. ఉగ్రవాదం వంటి అత్యంత హీనమైన కేసుల్లో కేవలం సందేహాల కారణంగా శిక్ష విధించరాదని కోర్టు అభిప్రాయపడుతూనే బలమైన సాక్ష్యాధారాలుఉన్నవారినే నిందితులుగా నిర్ధారించింది. సుదీర్ఘకాలం సాగిన దర్యాప్తులో కేసులో ప్రధాన సాక్ష్యాల గుర్తింపు, పేలుడు పదార్థాలు, ఆయుధాల స్వాధీనం వంటి అంశాల్లో దర్యాప్తులో కొన్ని లోపాలున్నాయని ప్రతివాద న్యాయవాదులు ఈ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారు. అయినా నిజమైన నిందితులను గుర్తించడంలో కిందికోర్టు బాగా ప్రయాసపడినట్లే! సాక్ష్యాల సమగ్ర పరిశీలన అనంతరమే నిందితుల పాత్రను నిర్ధారించుకున్న తర్వాతనే వారిపై అభియోగాల ఖరారు, పాత్ర, శిక్షార్హతపై పలు చర్చలు కూడా నడిచాయి. ప్రత్యేక కోర్టులు ఉరిశిక్ష విధిస్తే న్యాయప్రక్రియలో హైకోర్టు శిక్షలు ధృవీకరించాల్సి ఉంటుంది. అదే ఇప్పుడు జరిగింది. దీనికి మరో మజిలీ సుప్రీంకోర్టు. ఏ నిరపరాధి శిక్షించబడకూడదు. ఏ అపరాధీ తప్పించబడకూడదనే న్యాయసూత్రంతో న్యాయప్రక్రియమిళితమై ఉంది. దుస్సంఘటన, దురాగతం ఏ స్థాయిలో ఉన్నా, ఎవరు నిందితులెవరైనా ఏదో ఒకనాడు శిక్షలను అనుభవించాల్సిందే. ఉగ్రవాదంపై రాజీ ఉండబోదన్న సంకల్పానికి ప్రతీకగా గుజరాత్ అహ్మదాబాద్ పేలుళ్ల సంఘటన విచారణ చట్టబద్ధంగా సాగింది. సాక్ష్యాధారాల సేకరణ, నిందితుల హక్కుల పరిరక్షణ కూడా ఈ కేసులో ప్రధానంగా పాటించారు. ఇలాంటి ఉదంతాలు జరగకుండా నిఘా వ్యవస్థ మరింత పటిష్టంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని కూడా ఈ సంఘటన గుర్తు చేస్తోంది. ఆనాటి దుర్ఘటనకు బలైన కుటుంబాలకు హైకోర్టు పరిహారాలను ప్రకటించడం మానవతా దృక్పథంతో కూడినదే. విచారణ కాలంలో 9 మంది న్యాయమూర్తుల ముందు 1163 మంది సాక్షులను విచారించగా చివరకు ప్రత్యేక కోర్టు తీర్పును గుజరాత్ హైకోర్టు ఆ శిక్షలను సమర్థించడం ఆహ్వానించదగినది. ఆనాటి ఘటనలు ఎంతో అమానుష కృత్యంగా భావించి యావత్తుభారతదేశం తల్లడిల్లిపోయింది. జస్టిస్ అల్పేష్ కోగే, జస్టిస్ సమీర్ జె దవే కూడిన అహ్మదాబాద్ డివిజన్ బెంచి స్పెషల్ కోర్టు తీర్పును కూలంకషంగా పరిశీలించింది. దుష్కృత్యాలు ఏ రూపంలో జరిగినా వాటి వెనుక ఉన్న ముష్కరులకు శిక్షలు తప్పవని నేటి తీర్పు తేటతెల్లం చేస్తోంది.

కష్టాల్లో ఉన్నాననీ, తాను హీనుడనీ, ఏమీ సాధించలేననీ, పగలూ రాత్రి అనుకుంటూ ఉండే మనిషి ఎందుకూ కొరగాడు.

వివేకానందుడు

మనిషి గుణాలన్నిటికీ సాహసం మొదలు, సాహసం ఇతర గుణాలకు బాధ్యత వహిస్తుంది.



చర్చిల్

ప్రజావాక్కు

వినియోగదారుల రక్షణ నైతిక బాధ్యత

వాట్సాప్ ప్రతిపాదించిన యూజర్‌నేమ్ ఫీచర్‌పై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ ఒకకీలక అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. వినియోగదారుల సౌలభ్యం ఎంత ముఖ్యమో, వారి భద్రత అంతకంటే ముఖ్యమనే విషయాన్ని ఈ వివాదం గుర్తు చేస్తోంది. ఫోన్ నంబర్‌కు బదులుగా యూజర్‌నేమ్ ఆధారంగా సంభాషించే అవకాశం కల్పించడం గోప్యతకు మేలు చేసినా, అదే సమయంలో నకిలీ గుర్తింపులు, వ్యక్తుల పేర్లను అనుకరించడం, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలకుఅవకాశం కల్పిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో కేంద్రప్రభుత్వం భద్రతాపరమైన అంశాలపై వివరణ కోరుతూ జాగ్రత్త వైఖరిని అవలంబించడం సముచితమే. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న భారతదేశంలో సామాజిక మాధ్యమ వేదికలు కేవలం చట్టపరమైన నిబంధనలను పాటించడం మాత్రమేకాకుండా, వినియోగదారుల రక్షణను తమ నైతిక బాధ్యతగా భావించాలి. పారదర్శకత, జవాబుదారీతనం, గుర్తింపు ధ్రువీకరణ వంటి ప్రమాణాలను పాటించాలి.

- సి.హెచ్.సాయిరుత్విక్, శ్రీకాకుళం

అందరికీ విద్యాశక్తి పథకం

కార్పొరేటివ్ ప్రైవేటు, ప్రభుత్వపాఠశాలలకు చాలా వ్యత్యాసంఉంది. ఉంటుంది, ఉండాలి కూడా. నిజమైన మానవ వికాసం ప్రభుత్వ పాఠశాలల్లోనే జరుగుతుంది. అక్కడ మాత్రమే కరికులర్ ఎగస్ట్రా కరికులర్ యాక్టివిటీస్ విశాలమైన పాఠశాల ప్రాంగణంలో ఆహ్లాదకరమైన గ్రామీణ వాతావరణంలో స్వేచ్ఛను ఆస్వాదించగలిగేలా విద్యా బోధన జరుగుతుంది. ఇక్కడ కోచింగ్ కంటే టీచింగ్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖ మాత్యులు ఈనాటి కాలానికి తగినట్టుగా విద్యార్థిని విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా విద్యాబోధన జరగాలని భావిస్తూ మార్పులను ఆహ్వానిస్తూ ఒత్తిడి లేకుండా సూచిస్తూ ఉన్నారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

సర్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఓటరు ప్రక్షాళన జాబితాను ఓటర్ సవరణలతో పాటు చనిపోయిన వారి ఓట్లు, అనర్హత ఓట్లను తొలగించాలి .ఎన్యూమరేషన్ ఫారం పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదే. ఫారాలు నింపాల్సిన బాధ్యత కూడా వాళ్లదే.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

రచయితలను ఆదుకోవాలి

ఒక అక్షరం వేయి గుండెలను మేలుకొలుపుతుంది. ఒకపాట ఒక నియంతను గద్దె దింపుతుంది. ఒక పుస్తకం సమాజాన్ని జాగృతం చేసి దేశ ప్రగతికి అవసరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బాటలు వేస్తుంది. పుస్తకాన్ని ఎటువంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయం లేకుండా ఎక్కడైనా ఎప్పుడైనా పాఠకుడు చదవబానికి అవకాశంఉంది. సమాజాన్ని సరైన పంథాలో పెట్టడానికి రాబోయే కాలంలో ప్రజలకు ఎదురయ్యే కష్టాలను ఏకరువు పెట్టడానికి రచయిత తన కాలాన్ని కత్తిలా ఉపయోగించి అక్షరయజ్ఞం చేస్తాడు. ప్రతిఫలాన్ని ఆశించకుండా తన విజ్ఞానాన్ని ఆర్థిక స్థోమతను వినియోగించి రచనలు చేసి ముద్రించి గ్రంథాలను విఫణివీధిలోకి తెస్తున్నాడు. కాని ఆపుస్తకాలు కొనేవారు కరవైపోయారు. ఒక్కో పుస్తకాన్ని ఆవిష్కరించాలంటే కనీసం యాభైవేల రూపాయలు ఖర్చు అవుతుంది. అమ్మకాలు లేక వంద రూపాయలకు కనీసం పదిరూపాయల సొమ్ము కూడా తిరిగి రావడం లేదు. ప్రభుత్వాలు రచయిత గ్రంథాల ముద్రణకు ఎంతో కొంత సహాయం చేయాలి.

- జాన్నభట్ల నరసింహప్రసాద్, నాగారం

జీవన ప్రమాణాన్ని పెంచే ఉపాధిహామీ

ఉపాధి హామీ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమేనా ప్రజల జీవన ప్రమాణాలను పెంచే శక్తి ఏమైనా ఉందా అని ఆలోచిస్తే ఇది సంక్షేమంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను కచ్చితంగా పెంచుతుందిఅని చెప్పవచ్చు. ఉపాధి హామీ ద్వారా ఆస్తుల సృష్టితో పాటు రైతులఆస్తుల సృష్టి కూడా కచ్చితంగా చెప్పవచ్చు. ఇలాంటి పథకాలు కేవలం సంక్షేమం అనే మూస ధోరణిలో కాకుండా అత్యవసర సమయాలలో కూడా పని చేస్తుంది అని చెప్పవచ్చు. ముఖ్యంగా లాక్‌డౌన్ ఉదంతం తీసుకుంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉండడానికి ఈ పథకమే ముఖ్య కారణం. అందువల్ల ఉపాధి హామీ కేవలం సంక్షేమం మాత్రమే కాదు జీవన ప్రమాణ రేటును పెంచే స్కీమ్ అని నిశ్చితంగా చెప్పొచ్చు.

- భారత అవినాష్, జనగామ

ఆర్ట్స్ కాలేజీని తరలించవద్దు

మానుకోటలో ప్రస్తుతం నడుస్తున్న రెడ్యాల ఆర్ట్స్ జూనియర్ కాలేజీని అదే ప్రాంతంలో నడపాలి. రెడ్యాల ప్రాంతానికి తరలించవద్దు. గిరిజన పిల్లలు జిల్లాకేంద్రంలో ఉండి చదువుకోవాలి. గ్రామాలకు తరలించడం వలన విద్యార్థులకు టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందికి ఇబ్బందికరంగా ఉంటుంది.

-కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

యుద్ధాలకు దూరం వ్యూహాత్మక సంబంధాలే!

భారత్ వ్యూహాత్మకంగా సమదూరం పాటించటమే కాకుండా చైనా లాంటి దేశాన్ని న్యూట్రల్గా కొన్నాళ్ళయినా చేయగలుగుతే పాకిస్థాన్ కవ్వింపులు, ఉగ్రవాదాల దాడులను తేలిగ్గా అధిగమించ గలదు! పాకిస్థాన్ బెలూచిస్థాన్ తలనొప్పిని ఎదుర్కొంటూనే పాక్ ఆక్రమిత కాశ్మీర్ తిరుగుబాటుతో అతలాకుతలమవుతున్నది! అందుకనే అంతర్జాతీయంగా దృష్టిమరల్చటానికి మన దేశం మీద ఏదైనా పన్నాగం పన్నే అవకాశం వుంది! మొన్నటి ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ప్రధానమంత్రి జాగ్రత్తగా వ్యవహరించి దౌత్యపరంగా మెరుగైన విధానాలతో భారత్‌కు గౌరవస్థానాన్ని, ఇతర దేశాలు మెచ్చుకొనే విధంగా కల్పించ గలగటంలో కృతకృత్యులయ్యారు! అదే విధంగా ఇప్పుడున్న అనిశ్చిత శాంతి పరిస్థితులలో తప్పటడుగులు మన దేశం వేయదనే నమ్మకం క్రమేపీ బలపడుతున్నది!.

రావులపాటి సీతారాంరావు

విదేశాంగ వ్యవహారాలు ఎప్పుడు ఏ మలుపు తిరుగుతాయో చెప్పటం ప్రఖ్యాతిగాంచిన విదేశీవ్యవహారాల పండితులకు, విశ్లేషకులకూ సాధ్యపడదు! దానికి కారణం పరిస్థితులు దేశాల నాయకుల చేతుల్లో వుండవు! ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేని పరిస్థితులల్లో దేశాల నాయకులు ఎప్పటికి ఏది ప్రస్తుతమో, ఏది అవసరమో చేసుకుంటూ పోకతప్పదు! భారతదేశానికి ఇబ్బందికరమైన పరిస్థితే వచ్చిపడింది! (ఫిబ్రవరి 25-26) అంటే అమెరికా, ఇజ్రాయిల్ కలిసి కట్టుగా ఇరాన్ మీద దాడి చేయకమునుపు (కొద్ది రోజుల తేడా ఫిబ్రవరి 28 నాడు దాడులు మొదలయ్యాయి), యాదృచ్ఛికంగా ప్రధాని మోడీ ఇజ్రాయిల్ రాజధాని టెల్ ఎవివ్‌ను సందర్శించారు! దాడుల తర్వాత ప్రధాని ఇజ్రాయిల్ పర్యటన ప్రత్యక్ష ఇబ్బందులు తెచ్చిపెట్టక పోయినా అనూహ్యంగా ఇజ్రాయిల్, ఇరాన్ దేశాల సంఘర్షణలలో ఎటు మొగ్గాలో (విధిలేని పరిస్థితులలో) అన్న నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందా ఆ పరిస్థితి తప్పదా? అని మన విదేశాంగ శాఖ ఆలోచన చేయక తప్పలేదు! అదృష్టవశాత్తు భారత్ ఆ సంఘర్షణలల్లో భాగంగా మారే పరిస్థితి కలగలేదు! ప్రధాని మోడీ మౌనంగా పరిస్థితులను ఆకళింపు చేసుకొని జాగ్రత్తగా వ్యవహరించటం వల్ల ఆ గండం నుంచి ఒక విధంగా భారత్ బయటపడింది! అయితే ప్రస్తుతానికి ఇబ్బందికరమైన నిర్ణయాలు దాటవేయటం జరిగింది కానీ ముందు ముందు మరింత క్లిష్టంగా ఇజ్రాయిల్ ఇరాన్ సంబంధాలు మారితే భారత్ ఏవిధంగా వ్యవహరించాల్నో, ఆలోచన చేయాల్సిన అవసరం మాత్రం వుంది! ఇరాన్ ప్రధాని అయతుల్లా అలీ ఖొమైనీ అంతిమ సంస్కారాల కార్యక్రమానికి హాజరుకాకపోవటం దేశంలో ఎవరికీ ఆశ్చర్యాన్ని అందుకే కలిగించలేదు. భారత్ పంపిన డెలిగేషన్లో విదేశాంగ శాఖ మినిష్టర్ ఆఫ్ స్టేట్ పబిత్రా మార్గరిటా, బీహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అలా హస్నియాన్ (రిటైర్డ్) వుండటం రాజకీయంగా ఇరాన్‌కు నమ్మకం కలిగించటంతో పాటు భారత్ విధానం కూడా చెప్పకనే చెప్పినట్లయింది! ఇరాన్‌తో ఇజ్రాయిల్ సంఘర్షణలు ఈ మధ్య యుద్ధ స్థాయికి రాకమునుపు, ఇండియా ఇజ్రాయిల్ స్నేహ సంబంధాలు బాగానే వుండేవి! ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ దేశాల మధ్య ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ఇజ్రాయిల్ తోనూ ఇరాన్ తోనూ సంబంధాలు చాలా దగ్గరగానూ చాలా దూరంగాను వుండకుండా న్యూట్రల్గా వుండే విధంగా విదేశాంగ విధాన అమలులో చిన్నపాటి మార్పులు చేసుకోక తప్పలేదు! నిజానికి ఇజ్రాయిల్ దేశం మిలటరీ టెక్నాలజీ, ఇంటలిజెన్స్ ఎక్స్పర్టైజ్ ఇండియాకు అందజేసినట్లు, అంతేగాకుండా కౌంటర్ ఇన్‌సర్జెన్సీ, సాంకేతిక నైపుణ్యాన్ని మన దేశ నిపుణులకు తర్ఫీదు లాంటిది ఇచ్చినట్లు మీడియా వార్తలు వున్నాయి! ఈ సంఘర్షణల నేపథ్యంలో అలాంటివి సంబంధాలు బహిర్గతపర్చటం, ఇండియాకు మంచిది కాదు. సమదూరం పాటిస్తున్న వైఖరిని ప్రదర్శించటమే విదేశాంగ విధానంలో అవలంబించాల్సిన పద్ధతి! ఒక విధంగా ఇజ్రాయిల్‌ను కొంచెం దూరంగా పెట్టటం నష్టమైనా తప్పని పరిస్థితి! ఆర్థిక ప్రగతి ఈ యుద్ధాల వల్ల ముఖ్యంగా చమురు దిగుమతుల విషయంలో ఇతర దేశాలలోనే కాదు మన దేశంలో కూడా కుంటుపడిన విషయం అందరికీ తెలిసినదే! మన దేశంతో ఇరాన్‌కు వున్న సంబంధాలు ప్రాచీన నాగరికతకు సంబంధించినవి! ఈ రెండు దేశాలకే ఆ పేరు వుంది. ఈమధ్యకాలంలో దక్షిణ ఆసియా రాజకీయాలలో భారతదేశం ఆచితూచి అడుగు వేస్తుంది

కాబట్టి ఇరాన్‌కు మరింత దగ్గరగా వుండలేక పోయిన వాస్తవాన్ని దాయాల్సిన పనిలేదు! అంతమాత్రాన ఇరాన్‌తో అనేక కారణాల వల్ల అంటీముట్టనట్లుగా వుండాల్సిన అగత్యమూ లేదు! ముఖ్యంగా జలసంధి (హర్ముజ్)లో మన చమురు నౌకల రాకపోకలన్నీ సుహృద్భావ వాతావరణంలో బలపడినవే! అందువల్లే చమురు కొరత సంభవించినా మన దేశం ఆ విషయంలో చాలా తక్కువగానే నష్టపడింది! ఇతర దేశాలతో పోల్చుకోవటం అనవసరం. ఎంతగా పాకిస్థాన్‌మధ్యవర్తిత్వం నెరిపి ఇరాన్ తనకు అత్యంత సన్నిహిత దేశంగా బయటి ప్రపంచానికి తెలియజేసేందుకు ఆదుర్దా పడుతున్నా ఇరాన్, ఇండియా సంబంధాలకు పాకిస్థాన్ అడ్డుతగలలేక పోయింది! ఇండియా స్నేహ సంబంధాలను పాకిస్థాన్ వల్ల ఇరాన్ వొదులుకునే పరిస్థితి లేదు! ఎంతవరకు నిజమో కానీ భారత్‌లో ఇరాన్‌లో వున్న షియా మతస్థుల సంబంధాల నేపథ్యంలో శతృత్వం లేనిమాట నిజం! ప్రతిక్షణం పరిస్థితులు మారేది ప్రపంచ దేశాల మిత్రత్వం వల్లనో శతృత్వం వల్లనో అన్న సత్యం చరిత్ర ప్రతిసారీ జ్ఞాపకం చేస్తూనే వుంటుంది! ఇజ్రాయిల్‌తో అమెరికా సంబంధాలలో తేడాలు వుండకపోవటం వల్లే, ఇరు దేశాల నాయకులు ఇరాన్ దేశాన్ని ఒక పట్టుపట్టాలని చూసారు. సంఘటితంగానే అప్రకటిత యుద్ధం ఘర్షణల రూపంలో మొదలుపెట్టారు! నిజానికి అమెరికా పాలసీ ఈ విషయంలో మారుతుందని ఎవరూ ఊహించలేదు! యుద్ధం మధ్యలో వాషింగ్టను టెల్ ఎవివ్‌కు పొరపొచ్చాలు లెబనాన్ విషయంలో, డోనాల్డ్ ట్రంప్ ఇంటా బయటా యుద్ధం విషయంలో ఎదుర్కొన్న విమర్శల వల్లనో, ఇరాన్ అప్రతిహతంగా ప్రతిఘటించటం వల్లనో ఇప్పుడు సంబంధాలు బెడిసికొట్టాయి! ట్రంప్ ఇరాన్‌ను తేలిగ్గా తీసుకొని, ఇజ్రాయిల్ పి.యం మాటలు నమ్మి అకారణంగా ఇరాన్‌తో వైరాన్ని తెచ్చుకొని, మింగలేని, కక్కలేని పరిస్థితులు ఎదుర్కోవటంతో నెతన్యాహూ (ఇజ్రాయిల్ ప్రైమ్ మినిష్టర్)ను బాహాటంగానే విమర్శించసాగాడు. చివరకు అనేక దేశాల ఆర్థికనష్టాలు హర్ముజ్ జలసంధిపై విధించిన నిబంధనల వల్ల పెరిగిపోయి చమురు, ఇతరఉత్పత్తుల కరవుతో పెక్కుదేశాల్లో యు.యస్.ఏ ఆధిపత్యం బలహీనపడింది! ఇలాంటి పరిస్థితులలో భారత్‌కు వేరే దారిలేదు! కేవలం దౌత్యపరంగా, వ్యూహాలను మార్చుకుంటూ సమన్వయంతో కాలగమనాన్ని వీక్షించటం తప్ప! ఇండియా ఒక విధంగా మెరుగైన స్థితిలో వుండటానికి కారణం అరబ్‌గల్ఫ్ దేశాలకు వెళ్ళినవారు అక్కడ సంపాదించిన డబ్బును మన దేశానికి పంపటం వల్ల సంబంధాలు రోజురోజుకూ ఈ యుద్ధపు నీడలు పడేంతవరకూ చాలా బాగా వుండేవి! ఒక్క సౌదీ అరేబియా మాత్రం పాకిస్థాన్‌తో ఈ మధ్య దగ్గరవుతున్న మాటనిజం! అయినా యునైటెడ్ అరబ్ ఇమరేటస్‌తో మన దేశ సంబంధాలు ఇంకా దృఢంగానే వున్నాయి! ఇప్పుడు భారత్, యూరప్ దేశాలతో పాటు చైనా, జపాన్లతో దగ్గర కాకతప్పదు! చైనాతో ఈమధ్య ఆర్థిక సంబంధాలు పవర్ గ్రిడ్ డీల్స్‌తో పాటు ఎగుమతి దిగుమతులవాణిజ్యం మెరుగుపర్చుకుంటున్నట్లు మీడియాలో వార్తలువస్తున్నాయి. ప్రధాని జపాన్, ఫ్రాన్స్, స్కాండనేవియన్ దేశాలతో సంబంధాలు మరింతగా పెంచుకొనే దిశలో వున్నట్లు వార్తలు వస్తున్నాయి! అమెరికాను మన దేశం అన్నివేళలా నమ్మే పరిస్థితి చాలా తక్కువ. రష్యా, ఉక్రెయిన్ సమస్యతో తీరికలేకుండా వున్నది. పాకిస్థాన్ మాత్రం రష్యా, అమెరికా మాదిరి దగ్గరకు తీసే పరిస్థితి లేదు. రష్యా ఎప్పటికీ భారత్ స్నేహాన్ని వదులుకోదు! ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల్లో ఎవరికి దగ్గర కావాలన్నది భారత్ ఆలోచించే ప్రసక్తే లేదు! భారత్ వ్యూహాత్మకంగా సమదూరం పాటించటమే కాకుండా చైనా లాంటిదేశాన్ని న్యూట్రల్గా కొన్నాళ్ళయినా చేయగలుగుతే పాకిస్థాన్ కవ్వింపులు, ఉగ్రవాదాల దాడులను తేలిగ్గా అధిగమించ గలదు! పాకిస్థాన్ బెలూచిస్థాన్ తలనొప్పిని ఎదుర్కొంటూనే పాక్ ఆక్రమిత కాశ్మీర్ తిరుగుబాటుతో అతలాకుతలమవుతున్నది! అందుకనే అంతర్జాతీయంగా దృష్టిమరల్చటానికి మన దేశం మీద ఏదైనా పన్నాగం పన్నే అవకాశం వుంది! మొన్నటి ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ప్రధానమంత్రి జాగ్రత్తగా వ్యవహరించి దౌత్యపరంగా మెరుగైన విధానాలతో భారత్‌కు గౌరవస్థానాన్ని, ఇతర దేశాలు మెచ్చుకొనే విధంగా కల్పించ గలగటంలో కృతకృత్యులయ్యారు! అదే విధంగా ఇప్పుడున్న అనిశ్చిత శాంతి పరిస్థితులలో తప్పటడుగులు మన దేశం వేయదనే నమ్మకం క్రమేపీ బలపడుతున్నది!. ●

డిజిటల్ మౌలిక వసతుల భద్రతకు జాతీయ కార్యాచరణ

సి.హెచ్.ప్రతాప్

భారత్ వేగంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతోంది. బ్యాంకింగ్, విద్యుత్ పంపిణీ, రైల్వేలు, విమానయానం, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పరిపాలన, డిజిటల్ చెల్లింపులు, ఇ-వాణిజ్యం వంటి రంగాలు సమాచార సాంకేతికతపై అధికంగా ఆధారపడుతున్నాయి. ఈ మార్పు ప్రజలకు సౌలభ్యం, పారదర్శకత, వేగవంతమైన సేవలను అందిస్తున్నప్పటికీ, సైబర్ ముప్పులు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. అందువల్ల డిజిటల్ మౌలిక వసతుల భద్రత ఇప్పుడు కేవలం సాంకేతిక అంశం మాత్రమే కాదు, జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, ప్రజా విశ్వాసంతో ముడిపడిన అత్యంత కీలక అంశంగా మారింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ గ్రిడ్‌లు, విమానాశ్రయాలు, రైల్వే నియంత్రణ వ్యవస్థలు, బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లు, ఆరోగ్య సమాచార వ్యవస్థలపై సైబర్ దాడులు పెరుగుతున్నాయి. ఇలాంటి దాడులు సేవలకు అంతరాయం కలిగించడమే కాకుండా కోట్లాది ప్రజల వ్యక్తిగత సమాచారం, ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ సమాచారాన్ని ప్రమాదంలో పడేస్తాయి. డిజిటల్ సేవలపై ప్రజల విశ్వాసం నిలవాలంటే భద్రతా ప్రమాణాలు కాలానుగుణంగా బలోపేతం కావాలి. దేశంలోని కీలక మౌలిక వసతులకు బహుళస్థాయి సైబర్ రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడం అత్యవసరం. విద్యుత్ పంపిణీ కేంద్రాలు, చమురు, వాయువు నెట్‌వర్క్‌లు, రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థలు, విమానయాన నియంత్రణ కేంద్రాలు, ఆసుపత్రుల డిజిటల్ వేదికలు వంటి వ్యవస్థల్లో క్రమం తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించాలి. సైబర్ ముప్పులను ముందుగానే గుర్తించేందుకు నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు, అత్యవసర స్పందన కేంద్రాలు, భద్రతా ప్రమాణాల నవీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. సాంకేతిక లోపాలను వేగంగా గుర్తించి సరిదిద్దే విధానాలు ప్రతి సంస్థలో తప్పనిసరి కావాలి. ఈ దిశగా క్రమానుగతసైబర్ భద్రతా ఆడిట్‌లు, అత్యవసర పరిస్థితులపై మాక్‌డ్రిల్లులు, ప్రమాద మదింపు కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. కీలక మౌలిక వసతులను నిర్వహించే ప్రతిసంస్థకు స్పష్టమైన సైబర్ అత్యవసర స్పందన ప్రణాళిక ఉండాలి. దాడి జరిగిన సందర్భంలో సేవలు ఎంతవేగంగా పునరుద్ధరించగలమనే సామర్థ్యాన్ని కూడా తరచూ పరీక్షించాలి. డేటా బ్యాకప్ వ్యవస్థలు, ప్రత్యామ్నాయ నియంత్రణ కేంద్రాలు, సురక్షిత క్లౌడ్ మౌలిక వసతులు కూడా ఈ వ్యూహంలో భాగం కావాలి. స్వదేశీ సైబర్ భద్రతా సాంకేతికత అభివృద్ధి కూడా కాలానుగుణ అవసరంగా మారింది. విదేశీ సాఫ్ట్‌వేర్‌పై పూర్తిగా ఆధారపడకుండా స్వదేశీ భద్రతా పరిష్కారాలు, గుప్తీకరణ విధానాలు, భద్రతా పరికరాల అభివృద్ధికి పరిశోధనను ప్రోత్సహించాలి. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, సాంకేతిక సంస్థలు, పరిశ్రమలు కలిసి నూతన భద్రతా పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ద్వారా దేశ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయవచ్చు. ఈదిశగా నైపుణ్యం కలిగిన సైబర్ భద్రతా నిపుణులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, ఉన్నత విద్యాకోర్సులు విస్తరించాల్సిన అవసరం ఉంది. కృత్రిమ మేధస్సు ఆధారిత భద్రతా వ్యవస్థలు సైబర్‌రక్షణలో కొత్త అవకాశాలను తెరుస్తున్నాయి. అసాధారణ కార్యకలాపాలను క్షణాల్లో గుర్తించడం, అనుమానాస్పద లావాదేవీలను విశ్లేషించడం, దాడుల నమూనాలను ముందుగానే అంచనా వేయడం వంటి అంశాల్లో కృత్రిమ మేధస్సు సమర్థవంతంగా ఉపయోగపడుతోంది. అదే సమయంలో సైబర్ నేరగాళ్లుకూడా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నందున భద్రతావ్యవస్థలు నిరంతరం నవీకరించబడుతూ ఉండాలి. డిజిటల్ భద్రత ప్రభుత్వ బాధ్యతతో మాత్రమే పరిమితం కాదు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం, సమాచార మార్పిడి, సంయుక్త భద్రతా విన్యాసాలు, అంతర్జాతీయ సహకారం, బలమైన చట్టపరమైన వ్యవస్థ మరింత బలోపేతం కావాలి. ప్రజల్లో కూడా సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడం అత్యంత ముఖ్యం. బలమైన పాస్‌వర్డ్‌లు వినియోగించడం, అనుమానాస్పద లింకులను నివారించడం, డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండడం వంటి అలవాట్లు వ్యక్తిగత భద్రతకు తొలి రక్షణగా నిలుస్తాయి. సాంకేతిక పురోగతికి సమానంగా భద్రతా ప్రమాణాలను పెంపొందించినప్పుడే డిజిటల్ భారత్ మరింత విశ్వసనీయంగా, సురక్షితంగా, ప్రపంచ స్థాయిలో పోటీపడగల ఆర్థిక శక్తిగా ఎదుగుతుంది. ●

'వెయిటేజి'తో ప్రమాణాలకు 'పరీక్ష'!

తిప్పర్తి శ్రీనివాస్

దేశ విద్యా వ్యవస్థలో ప్రవేశ పరీక్షల చుట్టూ చర్చ కొత్తది కాదు. అయితే ఇటీవల నీట్, జేఈఈ వంటి జాతీయ ప్రవేశ పరీక్షలకు 50 శాతం, ఇంటర్మీడియట్ లేదా బోర్డు పరీక్షల మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలనే ప్రతిపాదన మళ్లీ విద్యా రంగంలో చర్చకు దారి తీసింది. ఇది కేవలం ప్రవేశాల విధానానికి సంబంధించిన అంశంమాత్రమే కాదు. దేశంలో పాఠశాల విద్య భవిష్యత్తు, కోచింగ్ సంస్కృతి, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, సామాజిక న్యాయం, ప్రభుత్వ విద్యావ్యవస్థ వంటి అనేక అంశాలను తాకే కీలకమైన సంస్కరణ. గత పదేళ్లుగా దేశంలో ప్రవేశ పరీక్షలే విద్యార్థుల జీవితాన్ని శాసిస్తున్నాయి. వైద్య విద్య కావాలంటే నీట్, ఇంజినీరింగ్‌లో ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చేరాలంటే జేఈఈ. ఈ రెండు పరీక్షల్లో వచ్చిన ర్యాంకులే విద్యార్థి భవిష్యత్తును నిర్ణయిస్తున్నాయి. ఫలితంగా పాఠశాలలు, కళాశాలల్లో జరిగే బోధన కంటే కోచింగ్ సెంటర్లే ప్రధాన విద్యా కేంద్రాలుగా మారిపోయాయి. 'చదువు' అనే పదానికి అర్థమే మారిపోయింది. పుస్తకాలను అర్థం చేసుకోవడం కాదు, ప్రశ్నలను గుర్తించడం. విజ్ఞానం కాదు, వేగం. అవగాహన కాదు, మార్కులు ఇదే నేటి పరిస్థితి. ఇంటర్మీడియేట్ చదివే విద్యార్థి కళాశాలకు వెళ్లేది హాజరుకోసంమాత్రమే. అసలు చదువు కోచింగ్ కేంద్రాల్లోనే జరుగుతోంది. కొందరు విద్యార్థులు రెండు సంవత్సరాల పాటు కుటుంబానికి దూరంగా హాస్టళ్లలో ఉంటూ రోజుకు 14 నుంచి 16 గంటల వరకు కోచింగ్ తీసుకుంటున్నారు. ఇది విద్యకాదు, యాంత్రిక శిక్షణ. విద్యార్థుల బాల్యం, సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సామాజిక జీవితం అన్నీ ఈ పోటీలో కనుమరుగైపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బోర్డు పరీక్షలకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలనే ప్రతిపాదనలో సహజంగానే ఆకర్షణ కనిపిస్తుంది. ఎందుకంటే అలా చేస్తే విద్యార్థి ఏడాది పొడవునా చదవాల్సి ఉంటుంది. తరగతి గదిలో బోధనకువిలువ పెరుగుతుంది. ఉపాధ్యాయుల పాత్ర బలపడుతుంది. పాఠశాల విద్య మళ్లీ కేంద్ర బిందువుగా మారుతుంది. కేవలం ఒక రోజు నిర్వహించే పరీక్షతోనే భవిష్యత్తు నిర్ణయమవుతుందనే అన్యాయం కొంతవరకు తగ్గుతుంది. ఒక్కరోజు పరీక్షలో అనారోగ్యం, ఒత్తిడి లేదా ఇతర కారణాల వల్ల విద్యార్థి ఆశించిన ఫలితం సాధించకపోవచ్చు. అంత మాత్రాన అతని రెండేళ్ల శ్రమను కొట్టిపారేయడం సమంజసం కాదు. బోర్డు పరీక్షల మార్కులకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల విద్యార్థి నిరంతర అధ్యయనానికి ప్రోత్సాహం లభిస్తుంది. ఇది విద్యా తత్వశాస్త్రం పరంగా కూడా సముచితమైన ఆలోచనే. అయితే ఈ ప్రతిపాదనకు మరో కోణం కూడా ఉంది. దేశంలో ఒకే విధమైన విద్యా ప్రమాణాలు లేవు. ఒక రాష్ట్ర



బోర్డులో 98 శాతం మార్కులు సాధించడం సాధారణమైతే, మరొక బోర్డులో 90శాతం కూడా సాధించడం కష్టమవుతుంది. కొన్ని బోర్డులు మార్కులను ఉదారంగా ఇస్తుంటే, మరి కొన్ని కఠినంగా మూల్యాంకనం చేస్తాయి. ఈ అసమాన పరిస్థితుల్లో బోర్డు మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వడం కొత్త అన్యాయాలకు తావివ్వవచ్చు. అదే విధంగా మార్కుల ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటికే 95 శాతానికి పైగా మార్కులు సాధించే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. వెయిటేజీ పెరిగితే ఈ పోటీ మరింత తీవ్రరూపం దాల్చుతుంది. విద్యాప్రమాణాలు మెరుగుపడకపోయినా మార్కులు మాత్రం పెరిగే పరిస్థితి ఏర్పడే ప్రమాదాన్ని విస్మరించలేం. ఈ సందర్భంగా కోచింగ్ పరిశ్రమ గురించి కూడా మాట్లాడాల్సిందే. నేడు వేల కోట్ల రూపాయల వ్యాపారంగా మారిన కోచింగ్ రంగం దేశవిద్యా విధానాన్నే ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంది. తల్లిదండ్రుల ఆర్థిక స్థోమతే కొన్నిసార్లు విద్యార్థి అవకాశాలను నిర్ణయిస్తోంది. లక్షల రూపాయలు ఖర్చు చేయగలిగిన కుటుంబాలకు మెరుగైన కోచింగ్ లభిస్తే, గ్రామీణ ప్రాంతాల్లోని సాధారణ కుటుంబాల పిల్లలు వెనుకబడుతున్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల స్ఫూర్తికివిరుద్ధం. బోర్డు పరీక్షలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తే ఈ అసమానత కొంతవరకు తగ్గేఅవకాశం ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో చదివే ప్రతిభావంతులైన విద్యార్థులకుకూడా అవకాశం పెరుగుతుంది. కానీ దీనికి ముందు దేశవ్యాప్తంగా బోర్డు పరీక్షల్లో ఒకే ప్రమాణాలను అమలు చేయాలి. లేకపోతే ఒక రాష్ట్ర విద్యార్థికి లభించేప్రయోజనం మరో రాష్ట్రవిద్యార్థికిఅందదు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కూడా ఈ చర్చలో విస్మరించరాదు. ప్రవేశ పరీక్షల ఒత్తిడి కారణంగా ప్రతి సంవత్సరం అనేక మంది విద్యార్థులు తీవ్రమైన ఆందోళన, నిరాశ, మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలి తప్ప, జీవితాన్ని భారంగా మార్చకూడదు. దేశవ్యాప్తంగా ఒకేస్థాయి మూల్యాంకన విధానం, మార్కుల సాధారణీకరణ, పారదర్శక పరీక్షా వ్యవస్థ అమలు చేయడం అత్యవసరం. విద్యా విధానం ఎవరినీ శిక్షించే విధంగా ఉండకూడదు. ప్రతిభను వెలికితీసే విధంగా ఉండాలి. కోచింగ్ కేంద్రాల విజయాన్ని కాదు, పాఠశాల విద్య విజయాన్ని కొలిచే వ్యవస్థను నిర్మించాలి. తరగతి గదిలో బోధించే ఉపాధ్యాయుడికి విలువ లేకుండా, కోచింగ్ సెంటర్‌లో బోధించే అధ్యాపకుడే భవిష్యత్తును నిర్ణయించే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ విద్యా వ్యవస్థ క్రమంగా బలహీనపడుతుంది. నీట్, జేఈఈలకు 50 శాతం వెయిటేజీ ఇవ్వాలా వద్దా అన్నది కంటే, దేశానికి ఎలాంటి విద్యా వ్యవస్థ అవసరమన్నదే అసలు ప్రశ్న. విద్యను మార్కుల పోటీ నుంచి జ్ఞాన సాధన దిశగా మళ్లించగలిగితేనే దేశ భవిష్యత్తు బలపడుతుంది. అదే నిజమైన విద్యా సంస్కరణకు తొలి అడుగు. ●

8-7Pg5.qxd:8-7Pg5.qxd 1/1/02 8:00 AM Page 1

కేరళ నుంచి కాశ్మీర్ దాకా

పలు రాష్ట్రాల్లో వర్ష బీభత్సం

కేరళలో కొండచరియలు విరిగిపడి ఐదుగురు మృతి

జమ్ముకాశ్మీర్‌లోని కిస్తవార్ జిల్లాలో వరదలతో అతలాకుతలం

మూడురోజులుగా మహారాష్ట్రలో జనజీవనం అస్తవ్యస్తం

భారీ వర్షాలకు జమ్ముకాశ్మీర్‌లో కొండచరియలు విరిగిపడిన దృశ్యం

ముంబయి,శ్రీనగర్,వాయనాడ్, జులై 7: దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలతోపాటు దక్షిణాది ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు వరద విలయాన్ని సృష్టిస్తున్నాయి. మహారాష్ట్ర, జమ్ముకాశ్మీర్, కేరళల్లో మూడురోజుల నుంచి కురుస్తున్న ఎడతెగని వర్షాలతో జనజీవనం అతలాకుతలం అయింది. ప్రత్యేకించి మహారాష్ట్ర రాజధాని లోతట్టుప్రాంతాలన్నీ జలమయం అయి ఇతర నగర ప్రాంతంతో సంబంధాలు తెగిపోవడంతో ద్వీపంలా మారింది. ముంబైపుణె, ముంబైఅహ్మదాబాద్, ముంబైకొంకణ్‌రహదారులు పూర్తిగా మూసుకుపోయాయి. రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇక ముంబైపుణె ఎక్స్‌ప్రెస్ వేపై కొండచరియలు విరగపడ్డాయి. దాంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ముంబైపుణె ఎక్స్‌ప్రెస్ వేలో ట్రాఫిక్ అంతరాయాలను తొలగించేందుకు మిస్సింగ్ లింక్ పేరుతో 13.3 కిలోమీటర్ల బైపాస్‌ను రూ.6,695 కోట్లతో నిర్మించారు. ఇందులో రెండు సొరంగాలు (1.6 కి.మీ., 8.9 కి.మీ.) ఉన్నాయి. ఈ సొరంగ మార్గాన్ని 9 వారాల కిందట ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రారంభించారు. సొరంగం సమీపంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. విపత్తు నిర్వహణ సిబ్బంది ఏకంగా 18 గంటల పాటు శ్రమించి ఈ మార్గాన్ని పునరుద్ధరించారు. రుతుపవనాల ప్రభావంతో సోమవారం పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిశాయి. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వానలు, బలమైన ఈదురుగాలులు కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 13 మంది మరణించగా, మరో 10 మంది గాయపడ్డారు. వందకు పైగా ఇళ్లు దెబ్బతినడంతో వందలాది మంది నిరాశ్రయులయ్యారని రాష్ట్ర విపత్తు నిర్వహణ కేంద్రం తెలిపింది. గడిచిన 48 గంటల్లో రాష్ట్రంలోని తీరప్రాంత, పశ్చిమ ప్రాంతాల్లో వర్షాల తీవ్రత అత్యధికంగా ఉంది. పర్యాటక ప్రాంతమైన లోనావాలాలో గత 48 గంటల్లో ఏకంగా 625 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. రాయ్‌గఢ్‌లో 236 మి.మీ., థాణేలో 161 మి.మీ., రత్నగిరిలో 152 మి.మీ., ముంబైలో 100 నుంచి 161 మి.మీ. వరకు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షాల ధాటికి రాష్ట్రంలోని జలాశయాలు వేగంగా నిండిపోతున్నాయి. అంబా, సావిత్రి, కుండలిక, పాతాళగంగ, ఉల్హాస్ సహా పలు నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో బద్లాపూర్, మోహానే, జాంభూల్‌పాడ ప్రాంతాల్లో వరద హెచ్చరికలు జారీ చేశారు. వర్షాల కారణంగా పలుచోట్ల విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. ముంబైలోని మాన్‌ఖుర్ద్ ప్రాంతంలో ఓ భవనం మురికివాడపై కూలిపోవడంతో ఆరుగురు మరణించగా, మరొకరు గాయపడ్డారు. చెట్టు కూలి ఒకరు, నీట మునిగి పాల్ఘర్, సింధుదుర్గ్‌లలో చెరొకరు ప్రాణాలు కోల్పోయారు. సతారాలో కొండచరియలు విరిగిపడటంతో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో మాథెరన్, లోనావాలా, ఖోపోలి వంటి హిల్ స్టేషన్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో రెడ్ అలర్ట్ ప్రకటించారు. సహాయక చర్యల కోసం రెండు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) బృందాలను మోహరించారు. తలేగావ్‌దాభాడే సమీపంలో వరద నీటిలో చిక్కుకున్న 25 మంది ప్రయాణికులతో ఉన్న బస్సును ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రాయ్‌గఢ్ జిల్లాలో ఇంటి పైకప్పుపై చిక్కుకుపోయిన ఆరుగురు కుటుంబ సభ్యులను పడవల సాయంతో రక్షించారు. ముంబైగోవా, ముంబైపుణె ఎక్స్‌ప్రెస్‌వేలపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మహారాష్ట్రలోని ఒక భాగం ఇలా జలవిలయంతో అల్లాడుతుండగా, మరోవైపు విదర్భ ప్రాంతం మాత్రం వర్షాల కోసం ఎదురు చూస్తోంది. వార్ధా, అకోలా, అమరావతి, యవత్ మాల్, చంద్రపూర్ జిల్లాల్లో ఇప్పటివరకు వర్షాలు కురవకపోవడం గమనార్హం. ముంబై మహానగరాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ముఖ్యంగా తూర్పు శివారు ప్రాంతాల్లో గత 48 గంటల్లో ఏకంగా 380 మిల్లీమీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో బృహన్ ముంబైమున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తమై హై అలర్ట్ ప్రకటించింది.

ముంబయి నగరంలో 300మి.మీ.,పశ్చిమ శివార్లలో 345 మి.మీ.వర్షపాతం నమోదైంది. గంటకు 70నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. భారత వాతావరణశాఖ జులై 4నుంచి 6వరకు గతంలో జారీ చేసిన రెడ్ అలర్ట్‌ను మంగళవారం నాటికి ఆరెంజ్ అలర్ట్‌గాసవరించింది. నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. బీఎంసీ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. విపత్తు నిర్వహణ బృందాలు క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తు న్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తొలగించేందుకు హై కెపాసిటీ పంపులను ఏర్పాటు చేశారు.

కేరళలో టన్నెల్‌వద్ద కొండచరియలు పడి ఐదుగురు మృతి : కేరళలోని వయనాడ్ జిల్లాలో దారుణ ప్రమాదం జరిగింది. టన్నెల్ వద్ద కొండ చరియలు విరిగిపడిన ఘటనలో ఐదుగురు మరణించారు. మట్టిదిబ్బల కింద మరికొందరు చిక్కుకున్నారు. ఈ ఘటన కేరళలోని వయనాడ్ జిల్లా, మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద మంగళవారం జరిగింది. స్థానిక మీనాక్షి బ్రిడ్జి వద్ద ఒక టన్నెల్ కోసం తవ్వాలు, నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఆ మట్టిదిబ్బలు, రాళ్ల కింద పలువురు చిక్కుకుపోయారు. వీరిలో ముగ్గురు మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న ఫైర్, రెస్క్యూ బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఘటనపై కేరళ సీఎం వీడీ సతీషన్ కూడా స్పందించారు. వయనాడ్ జిల్లా అధికారులతో మాట్లాడారు. తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించి బాధితుల్ని కాపాడాలని, వ్యవస్థల్ని సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సహాయక చర్యల్ని పర్యవేక్షించాల్సిందిగా మంత్రులు ఏపీ అనిల్ కుమార్, టీ సిద్ధిఖ్‌లను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఇక్కడ టన్నెల్ నిర్మాణ పనుల్ని సోమవారం నుంచే నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో గడిచిన 24 గంటల్లో 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

జమ్ముకాశ్మీర్‌ను కుదిపేస్తున్న భారీ వర్షాలు వరదలు

జమ్మూ కాశ్మీర్‌లోకూడా ఈ భారీ వర్షాలు వరద భీభత్సం సృష్టిస్తున్నాయి. దోడా జిల్లాలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు జనజీవనాన్ని కకావికలంచేసాయి. రోడ్లు జలమయ మయ్యాయి. థాత్రి, గండోహ్, బలేస్సా ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

కొండచరియలు విరిగిపడటం, వరద నీరు ఇళ్లల్లోకి చేరడం వల్ల రోడ్లు ధ్వంసమై సాధారణ జనజీవనం స్తంభించింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించి వాగులు పొంగిపొర్లడంతో బండరాళ్లు, శిథిలాలు కొట్టుకుపోయి అనేక ఇళ్లు, వాహనాలు దెబ్బతిన్నాయి. వరదల కారణంగా థాత్రి వద్ద దోడాకిష్త్వార్ జాతీయ రహదారి కూడా మూసివేశారు. దీంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

టిక్‌టాక్ వల్లే గెలిచా..

అత్యధిక ఫాలోవర్లు ఉన్న వాడిని నేనే: ట్రంప్

వాషింగ్టన్,జులై 7: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తన ఘనవిజయానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్ ఎంతగానో దోహదపడిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనా యాజమాన్యంలోని ఈ యాప్ వల్ల జాతీయ భద్రతకు ముప్పు ఉందంటూ వాషింగ్టన్ రాజకీయ వర్గాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ, ఈ ప్లాట్‌ఫామ్‌లో తనకు ఉన్న ఆదరణే దాని ప్రభావానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో సోమవారం పిల్లల కోసం ట్రంప్ అకౌంట్స్ పథకాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడిన ట్రంప్ టిక్‌టాక్‌లో అత్యధిక ఫాలోవర్లు ఉన్న ఏకైక రాజకీయ నాయకుడిని తానేనని చెప్పుకొచ్చారు. టిక్‌టాక్‌లో నేనే అందరికంటే చాలా ముందున్నాను. నిజం చెప్పాలంటే ఈ యాప్ వల్లే నేను ఎన్నికల్లో ఏకపక్షంగా ఘనవిజయం సాధించానని భావిస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. చైనా యాజమాన్యం కారణంగా ఈ యాప్ వల్ల గూఢచర్య ముప్పు పొంచి ఉందంటూ ఒక టీవీ షోలో చర్చించడాన్ని తాను చూశానని చెప్పారు. పాలసీ మేకర్లు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఆయన అంగీకరించారు. అయితే, ఆ వాదనను తోసిపుచ్చుతూ ఒకవేళ ఈ యాప్ అంతగా ప్రభావితం చేయగలిగితే నేను దేశాన్ని ప్రేమిస్తున్నానని, దేశం కోసం ఎన్నో పనులు చేయబోతున్నానని ఇందులో చెబుతున్నాను కదాఅని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన ఆడియన్స్ ర్యాంకింగ్స్‌లో ప్రముఖ సెలబ్రిటీల కంటే తానే ముందున్నానని ట్రంప్ ఈ సందర్భంగా వెల్లడించారు. తాజా గణాంకాల ప్రకారం ప్రముఖ సింగర్ టేలర్ స్విఫ్ట్ 11వ స్థానంలో ఉంటే, నేనే నంబర్ వన్ స్థానంలో ఉన్నానని చెప్పారు. ఇదే సమయంలో టిక్‌టాక్ వ్యవహారంపై తాను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మాట్లాడినట్లు ట్రంప్ బహిర్గతం చేశారు.

ఇండొనేసియాలో బెంగళూరు ఐఐఎం క్యాంపస్

జకార్తా,జులై 7: ఇండోనేసియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీమంగళవారం వెల్లడించారు. ప్రస్తుతం మోడీఇండోనేసియాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఇండోనేసియా ప్రెసిడెంట్ ప్రబోవో సుబియాంటోతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. మోడీ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య ఏఐ, టెలికమ్యూనికేషన్స్, డిజిటల్ వంటి టెక్నాలజీలో యువతకు సహకారానికి ఈ రోజు ఇండోనేసియా, ఇండియా మధ్య ఒప్పందం కుదిరింది. రెండు దేశాల మధ్య స్టార్టప్‌ల సహకారాన్ని కూడా ప్రారంభించబోతున్నాం. ఇండియాలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థ ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఇండియాలో ప్రారంభించబోతున్నామని అన్నారు. ఐఐఎంలకు సంబంధించి విదేశాల్లో ప్రారంభించబోతున్న రెండో క్యాంపస్ ఇది. గతంలో ఐఐఎం అహ్మదాబాద్ క్యాంపస్‌ను దుబాయ్‌లో ఏర్పాటు చేశారు. ఐఐఎంలతోపాటు ఐఐటీ క్యాంపస్‌లు కూడా కొన్ని విదేశాల్లో ఉన్నాయి. ఐఐటీ మద్రాస్ క్యాంపస్‌లు టాంజానియాలోని జాంజిబర్‌లో ఉండగా, ఐఐటీ ఢిల్లీ క్యాంపస్ అబుదాబిలో 2024లో ప్రారంభమైంది. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ప్రకారం ఐఐఎంలలో ఐఐఎం అహ్మదాబాద్ మొదటి స్థానంలో ఉండగా, ఐఐఎం బెంగళూరు రెండో స్థానంలో ఉంది. క్యాట్ స్కోర్ ఆధారంగా ఐఐఎంలలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. సాధారణంగా క్యాట్ పరీక్ష నవంబర్ చివరి వారంలో జరుగుతుంది. క్యాట్ నోటిఫికేషన్ జూలైలో విడుదలై, ఆగష్టులో ముగుస్తుంది. బ్యాచిలర్ డిగ్రీ పొంది, కనీసం 50 శాతం మార్కులున్న వారు ఐఐఎంలలో ప్రవేశానికి అర్హులు. రిజర్వేషన్ కేటగిరీల వారికి 45 శాతం మార్కులు వస్తే చాలు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఫీజు రూ.1,300 కాగా, ఇతరులకు రూ.2,600.

టిసిఎస్ మతమార్పిడి కేసులో

నిందితురాలు నిదాఖాన్‌కు బెయిల్

నాసిక్,జులై 7: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అనుబంధ బీపీవో యూనిట్‌లో జరిగిన మతమార్పిడి, లైంగిక వేధింపుల కేసులో ప్రధాన నిందితురాలైన నిదాఖాన్‌కు నాసిక్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అరెస్ట్ అయిన దాదాపు రెండు నెలల తర్వాత ఆమెకు ఈ చట్టపరమైన ఊరట లభించింది. నాసిక్ రోడ్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి కె.జి.జోషి ఈ ఉత్తర్వులు జారీ చేశారు. నిదా ఖాన్‌తో పాటు ఈ కేసులో సహ నిందితుడిగా ఉన్న తౌసిఫ్ అత్తార్‌కు కూడా కోర్టు బెయిల్ ఇచ్చింది. అయితే, ఇదే కేసులో ఉన్న మరో కీలక నిందితుడు డానిష్ షేక్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను మాత్రం న్యాయస్థానం తీవ్రంగా తిరస్కరించింది. టీసీఎస్ నాసిక్ బీపీవో యూనిట్‌లో టెలికాలర్‌గా పని చేసిన నిదాఖాన్, ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత దాదాపు 42 రోజుల పాటు పోలీసులకు దొరకకుండా పరారయ్యారు. అనంతరం మే నెలలో ఛత్రపతి శంభాజీనగర్‌లో పోలీసులు ఆమెను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.తాను ప్రస్తుతం గర్భవతిగా ఉన్నానని, జైలులోఇబ్బందులు పడుతున్నానని పేర్కొంటూ వైద్యకారణాల రీత్యా ఆమెబెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. బాధితురాలికి నిదాఖాన్ బురఖా, ఇస్లామిక్ మతపరమైన పుస్తకాలను ఇవ్వడంతోపాటు, ఫోన్‌లో మతపరమైన యాప్స్ ఇన్‌స్టాల్‌చేసి మతమార్పిడికి ప్రేరేపించిందని,వాట్సాప్ గ్రూపులద్వారా ఒత్తిడి తెచ్చిందని పోలీసులుఆరోపించారు. చార్జ్‌షీట్ దాఖలు కావడం,ఆమె గర్భందాల్చిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుని కోర్టుబెయిల్ మంజూరు చేసింది.

ట్రస్టు అధీనంలో 30 కిలోల బంగారు ఆభరణాలు

1518 కిలోల వెండి వస్తువులు: కోశాధికారి గోవింద్‌దేవ్ గిరి వెల్లడి

అయోధ్య,జులై 7: శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఇవాళ కీలక ప్రకటన చేసింది. తమ ట్రస్టు ఆధీనంలో సుమారు 30 కిలోల బంగారు వస్తువులు ఉన్నట్లు తెలిపింది. సుమారు 1518 కేజీల వెండి వస్తువులు ఉన్నట్లు ఆ ట్రస్టు ట్రెజరర్ స్వామి గోవింద దేవ్ గిరి తెలిపారు. అయోధ్య రామాలయంలో విరాళాలను చోరీ చేసిన ఘటనలో 8 మంది అరెస్టు అయిన విషయం తెలిసిందే. ఆ కేసులో ఇంకా దర్యాప్తు జరుగుతున్నది. భక్తులు సమర్పించిన విరాళాలను చోరీ చేసినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఇవాళ స్పందించింది. దేవాలయానికి ఇప్పటి వరకు 2926 విలువైన వస్తువులను కానుకలుగా సమర్పించారని, అవన్నీ సురక్షితంగా ఉన్నాయని, వాటికి సంబంధించిన రికార్డులను కూడా మెయిన్‌టేన్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. బంగారంతో తయారు చేసిన రామచరితమానస్, డైమండ్ నెక్లెస్ కూడా అదృశ్యమైనట్లు వచ్చిన వార్తలను ట్రస్టు కొట్టిపారేసింది. ఆ కానుకలను మీడియా ముందు ప్రదర్శించింది. స్వామివారికి చెందిన వెండి చరణ పాదుకలు, కాకభుషండి కళాకృతి మిస్సైనట్లు సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న వార్తలను ట్రస్టు కొట్టిపారేసింది. ఆ కానుకలను కూడా మీడియా ముందు ట్రస్టు ప్రదర్శించింది. ప్రతి వస్తువు వివరాలను ఇన్వెంటరీలో పొందుపరిచామని, ఆ వస్తువును విరాళం ఇచ్చిన దాత పేరు కూడా తమ వద్ద ఉన్నట్లు గిరి తెలిపారు. వెండి కాకభుషండి వస్తువు ఆలయ ఆధీనంలో ఉన్నట్లు గిరి చెప్పారు. 2024 మార్చి 31వ తేదీ వరకు రామమందిరానికి సుమారు 16.765 కిలోల బంగారు వస్తువులు కానుకలుగా వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇక 2024-25లో 10.445 కిలోల బంగారం, 2025-26లో 5.050 కిలోల బంగారం కానుకల రూపంలో వచ్చిందన్నారు. 2026 మార్చి 31వ తేదీ వరకు ఆలయానికి మొత్తం 32.259 కిలోల బంగారం అందినట్లు గిరి వెల్లడించారు. వెండి వస్తువులను కరిగించిన తర్వాత ఆలయం వద్ద మొత్తం 849 కేజీల రిఫైన్డ్ సిల్వర్ ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇక ఈ ఏడాది మార్చి 31 వరకు మొత్తం 1518 కిలోల వెండి ఆలయం వద్ద ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఏడాది చార్టెడ్ అకౌంట్‌తో ఆ వస్తువులను వెరిఫై చేయిస్తున్నట్లు గిరి తెలిపారు.

ఈ25 ఇథనాల్ పెట్రోల్‌పై అపోహాలు నమ్మొద్దు

ప్రచారంపై స్పష్టత ఇచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ,జులై 7: దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు.

ముడి చమురు దిగుమతులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరి యు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బ తినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమం లోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి.

ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

సియా,చేతన్‌ల రహస్య వివాహం

కేతన్ హత్యకేసులో రోజుకో ట్విస్ట్



పూణె,జులై 7: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పుణె బిజినెస్‌మ్యాన్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో మరో ట్విస్ట్ బయటపడింది. ఈ కేసులో నిందితురాలు సియా, ఆమె ప్రియుడు చేతన్‌ను రహస్యంగా పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. దాంతో ఈ కేసు కొత్త మలుపు తిరిగింది. కేతన్‌తో నిశ్చితార్థం జరిగిన తర్వాతే వీరు వివాహం చేసుకున్నట్లు దర్యాప్తులో తేలిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కేతన్ అగర్వాల్‌తో సియాకు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిశ్చితార్థం జరిగింది. నవంబరులో వివాహం జరిపించేందుకు ఇరు కుటుంబాలు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పెళ్లి ఇష్టంలేని సియా ఇంట్లో వాళ్లకు చెప్పకుండా నాలుగు నెలల కిందటే పుణెలోని స్థానిక రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రియుడు చేతన్‌ను పెళ్లి చేసుకుందట. దీనికి ఇద్దరు స్నేహితులు సాక్షి సంతకాలు చేసినట్లు సమాచారం. కేసు దర్యాప్తులో భాగంగా సియా, చేతన్ ఫోన్లలోని వాట్సప్ సంభాషణలను పరిశీలించడంతో ఈ విషయం బయటపడినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. దాంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక వివాహ చట్టం కింద వీరికి వివాహ ధ్రువీకరణ పత్రం జారీ అయ్యిందా అనేది వెరిఫై చేస్తున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈ పెళ్లి ఫోటోలను సియా తన ప్రైవేట్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిందట. ఆ తర్వాత వాటిని డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. సాంకేతిక బృందాల సాయంతో ఆ ఫోటోలను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జూన్ 18న కేతన్ అగర్వాల్ లోయలోపడి ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

సిఎంను నియంత్రించడమేంటి?

డిఎంకె పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ, జులై 7: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను తాము నియంత్రించాలని కోరడమేంటని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కరూర్ తొక్కిసలాట కేసు నేపథ్యంలో డిఎంకె పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి పర్యటనలు, ప్రసంగాలపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి సుప్రీంకోర్టును వేదికగా మార్చొద్దని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలతో డిఎంకె వెనక్కి తగ్గి తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. కరూర్ తొక్కిసలాట కేసులో సిబిఐ దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో ముఖ్యమంత్రి విజయ్ జులై 10న అక్కడ పర్యటించనున్నారని డిఎంకె కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. మృతుల కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమం దర్యాప్తులో ఉన్న సాక్షులపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాదించింది. అంతేకాదు టివికె నేత ఆదవ్ అర్జున చేసిన వ్యాఖ్యలపైనా అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రసంగాలు, పర్యటనలపై ఆదేశాలు ఇవ్వాలని కోరింది.అయితే ఈవాదనలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. 'ముఖ్యమంత్రి ఏం చేయాలో కూడా సుప్రీంకోర్టే చెప్పాలా? ఆయన ఈ కేసులో నిందితుడు కాదు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కుపైనా ఆంక్షలు కోరుతున్నారా?రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఈ కోర్టు ఎలాఆదేశాలు ఇస్తుంది? అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో డిఎంకె తన పిటిషన్‌ను వెనక్కి తీసు కునేందుకు అనుమతి కోరగా కోర్టు అంగీకరించింది.

సంక్షిప్త వార్తలు

సింధూ జలాల్లో వాటా కోసం గట్టి చర్యలు: పాక్ ఆర్మీ

ఇస్లామాబాద్, జులై 7: సింధూ జలాల ఒప్పందాన్ని (ఐడబ్ల్యుటి) భారత్ పక్కనబెట్టడంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ ఒప్పందం ప్రకారం తమ దేశానికి రావాల్సిన సింధూ జలాల వాటాను పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని 276వ కోర్ కమాండర్ల సమావేశంలో పాక్ తన నిర్ణయాన్ని వెల్లడించింది. ఆ దేశ రక్షణ దళాల అధిపతి అసిమ్ మునీర్ అధ్యక్షతన జరి గిన ఈ సమావేశంలో ప్రభుత్వ ఆదేశాలు, దేశ ప్రజల ఆకాంక్షల మేరకు సింధూ జలాల కోసం పోరాడుతామని సైన్యం తెలిపింది. 2025 ఏప్రిల్ 24 నాటి జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్‌సి) ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం సింధూ జలాలను ఆపే ఎటువంటి ప్రక్రియనైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని తెలిపింది.

సిఎం విజయ్‌కి హైకోర్టు నోటీసులు

చెన్నై, జులై 7: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఎన్నికను సవాల్ చేస్తూ డిఎంకె అభ్యర్థి ఇనిగో ఇరుదయరాజ్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, మంగళవారం విచారణకు వచ్చింది. విజయ్‌తోపాటు మంత్రి ఆదవ్ అర్జున గెలుపుపై వచ్చిన పిటిషన్లను కూడా జస్టిస్ వి.లక్ష్మీ ‌ మ్నారా యణన్ ధర్మాసనం విచారణకు స్వీకరించింది. పిటిషన్లలో ఉన్న కొన్ని సాంకేతిక లోపాలను వారం రోజుల్లోగా సరిదిద్దాలని కోర్టు ఆదేశించింది. ఆ ప్రాసెస్ పూర్తి కాగానే విజయ్‌తో పాటు మంత్రికి మూడువారాల గడువిస్తూ రిజిస్ట్రీ నోటీసులు జారీ చేయనుంది. అయితే, ఈ వ్యవహారంలో హైకోర్టు జడ్జి ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా యేళ్ల తరబడి సాగే ఈ ఎన్నికల పిటిషన్ల విచారణను అత్యంత వేగంగా, కేవలం ఆరు నెలల లోపే పూర్తి చేయాలని

కాక్రోచ్ పార్టీ 'ఎక్స్' ఖాతాను పునరుద్ధరించండి: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, జులై 7: 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) 'ఎక్స్' ఖాతాను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలో తమ ఖాతాను నిలిపివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం విచారిస్తూ జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఈ ఆదేశాలు జారీ చేశారు. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, జూన్ 21న జరిగిన నీట్ రీఎగ్జామ్‌కు ముందు ముందస్తు జాగ్రత్త చర్యగా ఆ ఖాతాను నిలిపివేసినట్లు కోర్టుకు తెలిపారు. ఆ ప్లాట్‌ఫారమ్‌లోని కొన్ని పోస్టులు లక్షలాది మంది అభ్యర్థులు, వారి తల్లిదండ్రులలో గందరగోళం, ఆందోళనను కలిగించే అవకాశం ఉందని ఆయన వాదించారు. పరీక్ష పూర్తయినందున, ఆ 'ఎక్స్' ఖాతాపై ఆంక్షలు తొలగించడానికి ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరం లేదు అని మెహతా పేర్కొన్నారు.

లోక్‌సభ ముందుకు జస్టిస్ యశ్వంత్ వర్మ కేసు నివేదిక

న్యూఢిల్లీ, జులై 7: అవినీతి ఆరోపణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన అలహాబాద్ హైకోర్టు మాజీన్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు కమిటీ రూపొందించిన నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ స్పీకర్ ఓంప్రకాష్ బిర్లా నిర్ణయించారు. అయితే, అప్పటికే రాజీనామా చేసిన న్యాయమూర్తిపై పార్లమెంట్ ఎలాంటి చర్యలు తీసుకోగలదనే అంశంపై ఇప్పుడు సరికొత్త రాజ్యాంగపరమైన చర్చ తెరపైకి వచ్చింది. గతంలో జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో లెక్కల్లో చూపని నగదు కట్టలు దహనమైన వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. దీంతో ఒత్తిడికి గురైన ఆయన, ఏప్రిల్ 9వ తేదీన తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

అవినీతికేసులో చైనా మాజీ అధికారికి మరణశిక్ష

బీజింగ్,జులై 7: చైనాలో భారీ అవినీతి కేసులో మాజీ ఆర్థికాభివృద్ధి అధికారి యాంగ్ యూలిన్‌కు కోర్టు మరణశిక్ష విధించింది. మూడు దశాబ్దాల పాటు అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.2,800 కోట్లు లంచాల రూపంలో స్వీకరించినట్లు కోర్టు తేల్చింది. ఇటీవలి కాలంలో చైనాలో వెలుగుచూసిన అతిపెద్ద అవినీతి కేసుల్లో ఇదొకటిగా నిలిచింది.యాంగ్ యూలిన్ 1993 నుంచి 2023 వరకు పలు ప్రాజెక్టులు, వ్యాపార అనుమతులు, భూముల కేటాయింపులు, వర్కింగ్ క్యాపిటల్‌కు సంబంధించిన అంశాల్లో సాయం చేస్తూ భారీగా లంచాలు తీసుకున్నట్లు చాంగ్‌జౌ ఇంటర్మీడియట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది.

మామిడి రైతును నట్టేట ముంచుతున్న ర్యాంపులు

- కేజీ తోతాపురికి రూ.3 మాత్రమే చెల్లింపు
- ర్యాంపు నిర్వాహకుల జేబుల్లోకి రూ.4.50 కోట్లు

చిత్తూరు, జులై 7 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాలో తోతాపురి మామిడి రైతును ర్యాంపులు నట్టేట ముంచుతున్నాయి. జిల్లాలోని తోతాపురి మామిడి రైతులకు పల్ప్ ఫ్యాక్టరీలు కేజీ మామిడికి రూ.5 కచ్చితంగా చెల్లించాలని, ర్యాంపుల నిర్వాహకులు కేజీ తోతాపురి మామిడికి రైతుకు రూ.4 చెల్లించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే జిల్లాలోని మామిడి రైతులకు ర్యాంపులు కలెక్టర్ నిర్ణయించిన ధరను సైతం చెల్లించకుండా భారీగా కోతలు విధించడంతో మామిడి పంట కోత కోయడానికి అప్పులు చేసిన రైతులు చేతిలో చిల్లిగవ్వ మిగలని పరిస్థితి ఏర్పడింది. ఈ మామిడి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 52 ర్యాంపులు ఏర్పాటు అయ్యాయి. ఈ ర్యాంపుల వద్దకు మామిడి రైతులు తాము పండించిన తోతాపురి మామిడికి తీసుకువస్తే వాటిని ర్యాంపు యాజమానులు కొనుగోలు చేసి ఆపై ర్యాంపుల నుండి తాము ఒప్పందం చేసుకున్న పల్ప్ ఫ్యాక్టరీలకు మామిడిని తరలిస్తుంటాయి. అత్యధిక మామిడి రైతులు సైతం నేరుగా తమ మామిడి పండ్లను పల్ప్ ఫ్యాక్టరీల వద్దకు తీసుకెళ్తే రోజుల తరబడి క్యూలో వుండాల్సి న పరిస్థితి వుంటుందని,

ర్యాంపులకు వెళితే అక్కడ కేజీకి ఒక రూపాయి తక్కువ లభించినా అప్పటికప్పుడు కాయలు అన్‌లోడ్ అవుతాయని భావించి ర్యాంపులకు వెళ్ళి మామిడి కాయలను రైతులు అన్‌లోడ్ చేస్తున్నారు. ఈ పరిస్థితిని అసరాగా చేసుకున్న ర్యాంపు యాజమానులు రైతులను నట్టేట ముంచడం ప్రారంభించారు. తాము కేజీ తోతాపురి మామిడికి రూ.3 కంటే ఎక్కువ చెల్లించడం సాధ్యం కాదని, దీనికంటే ఎక్కువ డబ్బులు కావాలంటే మీరు పల్ప్ ఫ్యాక్టరీలకు తీసుకెళ్లాలని స్పష్టం చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం కేజీకి రూ.4 చెల్లించాలని పేర్కొంటుండటంతో ఆ మేరకు తమ కొనుగోలు చేయాలని మామిడి రైతులు కొంతమంది ర్యాంపు నిర్వాహకులను ప్రాధేయపడినప్పటికి ఫలితం వుండటం లేదు. జిల్లా వ్యాప్తంగా 51 వేల హెక్టార్ల విస్తీర్ణంలో తోతాపురి మామిడి పంట సాగు అయితే ఈ సీజన్‌లో 5 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి ఉత్పత్తి అయ్యింది. జిల్లాలోని మామిడి పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపులు, మండీలు ఇప్పటి వరకు 2.03 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని కొనుగోలు చేశాయి. ఇందులో జిల్లాలోని 31 పల్ప్ ఫ్యాక్టరీలు 1.60 లక్షల మెట్రిక్ టన్నుల మామిడిని రైతుల నుండి కొనుగోలు చేస్తే, మండీలు, ర్యాంపులు కలిసి తోతాపురి రైతుల నుండి 45 వేల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడికి కొనుగోలు చేశాయి. ర్యాంపు నిర్వాహకులు మామిడి రైతుల నుండి 45 వేల మెట్రిక్ టన్నుల మామిడిని కేజీ రూ.3తో కొనుగోలు చేయడంతో ర్యాంపు నిర్వాహకులు ఇప్పటికే అధికారికంగా రూ.4.45 కోట్ల అదనపు ఆదాయం గడించినట్లైంది. ర్యాంపు యాజమానులకు సాధారణ ఆదాయంతో పాటు అదనపు ఆదాయం లభిస్తే ఇప్పటికే ర్యాంపు నిర్వాహకులు సుమారు రూ.15 కోట్ల మేరకు ఆదాయం ఆర్జించినట్లు తెలుస్తోంది. ర్యాంపుల్లో మామిడి రైతులకు జరుగుతున్న అన్యాయంను గుర్తించి జిల్లా అధికార యంత్రాంగం మామిడి రైతుకు న్యాయం చేయడానికి సత్వరం చర్యలు తీసుకోవాల్సి న అవసరం ఎంతైనా వుంది.

15 నుండి సామాజిక శంఖారావం

తిరుపతి, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: దళితుల ఆత్మగౌరవం కోసం, కులవివక్ష లేని సమాజం కోసం ఈనెల 15 నుండి చేపట్టనున్న సామాజిక శంఖారావాన్ని జయప్రదం చేయాలని దళిత సోషల్ ముక్తి మంచ్ జాతీయ నాయకుడు వి.శ్రీనివాసరావు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. ఆగస్టు 15న దళితుల స్వాతంత్రానికి చిహ్నంగా జాతీయ సమైక్యతా దినోత్సవంగా ప్రతి గుడి ముందు జాతీయ జెండా ఎగురవేసే ఆలయ ప్రవేశం చేయాలన్నారు. టిటిడి ఛైర్మన్‌గా, ఇఒగా, ఆలయ పూజారులుగా దళితులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధ్యయన యాత్రలు, ఆందోళనలు, ప్రత్యక్ష కార్యాచరణ రూపాల్లో సామాజిక శంఖారావాన్ని పూరించాలన్నారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జిల్లా సామాజిక శంఖారావం సదస్సు నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేష్ అధ్యక్షత వహించగా, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ సామాజిక శంఖారావం కార్యాచరణను వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఆలయాల ముందు జాతీయ జెండాలను ఎగురవేసి, ఆలయ ప్రవేశం చేసి జాతీయ సమైక్యతను చాటాలన్నారు. వివక్షకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులను, యువతను ఎక్కువగా భాగస్వాములను చేయాలన్నారు. కుల వివక్షత పోరాట సమితి (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి, గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర నాయకుడు వెంకట్రావు, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు, కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, హేమలత, సాయిలక్ష్మి ్మ, టి.సుబ్రమణ్యం, జయచంద్ర, పవిత్ర, బాలకృష్ణ, చెంగయ్య, లక్ష ్మయ్య, హరినాథ్, ఎన్ డి శ్రీను పాల్గొన్నారు.

కొండపర్వ వద్ద రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి

విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం కొండపర్వ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మైలవరం సమీపం నుంచి కొండ పర్వకు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న దంపతులను వేగంగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో చర్లపల్లి శృతి(28) మృతి చెందారు. ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

15 నుంచి ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్

విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఈ నెల 15 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖ ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. కాలేజీల అనుబంధ గుర్తింపును త్వరగా పూర్తిచేసి, కౌన్సెలింగ్ చేపట్టాలని భావిస్తోంది. ఇంజినీరింగ్ కళాశాలలకు కనీస ఫీజును రూ.40,000ల నుంచి రూ.47,000లకు పెంచింది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో కనీస ఫీజును రూ.45,000లకు పెంచింది. ఆ తర్వాత వైసిపి సర్కార్ దీన్ని రూ.35,000లకు తగ్గించింది. తాజాగా రూ.47,000లుగా నిర్ణయించారు. ఎపిలో ప్రస్తుతం 140 ఇంజినీరింగ్ కాలేజీల కనీస ఫీజు రూ.40,000లుగా ఉంది. తాజా పెంపుతో ఆయా విద్యాసంస్థలకు ప్రయోజనం చేకూరనుంది. మిగతా కళాశాలలకు గత సంవత్సరం ఫీజులే అమల్లో ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ ఫీజుల నియంత్రణ, పర్యవేక్షణ కమిటీ (ఎపిఎఫ్ఆర్ఎంసి) కళాశాలల ఆదాయ, వ్యయాలను గణించి రెండు, మూడు నెలల్లో కొత్త ఫీజులను ఖరారు చేస్తుంది. ఈ ఫీజులే 2026-27 విద్యా సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల పాటు అమల్లో ఉంటాయి. మరోవైపు ఇంజినీరింగ్ సీట్ల పెంపుపై సర్కార్ పరిమితి విధించింది. గత సంవత్సరంలో ఉన్న సీట్ల సంఖ్యకే ఈ ఏడాదీ ఆమోదం తెలపనుంది. దీనికి కళాశాల యాజమాన్యాలు సమ్మతించాయి. ఈ ఏడాది 6000లకు పైగా సీట్లు పెంచేందుకు ఎఐసిటిఇ అనుమతించినా, ప్రభుత్వం మాత్రం పరిమితి విధించింది.

పొగాకుకు లభించని గిట్టుబాటు ధర

- అధికారులు వస్తేనే ధరలు పెంచుతారు
- మండిపడుతున్న రైతులు
- కంపెనీల తీరుపై మండిపాటు

ఒంగోలు (కలెక్టరేట్), జులై 7 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి ఆదేశాలు, మంత్రులు, ఎమ్మెల్యేల సూచనలు, జిల్లా కలెక్టర్ హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రకాశం జిల్లాలో పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలం కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించిన సమయంలో మాత్రమే కొనుగోలు కంపెనీలు ధరలు పెంచుతున్నాయని, వారు వెళ్లిన వెంటనే మళ్లీ ధరలు తగ్గిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఏడాది పొడవునా కష్టపడి పండించిన పొగాకుకు సరైన ధర రాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం పలుమార్లు కొనుగోలు కంపెనీలకు హెచ్చరికలు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు వేలం కేంద్రాల్లో ఉన్న సమయంలో మాత్రమే ధరలు పెరగడం, అనంతరం మళ్లీ తగ్గిపోవడం వెనుక అసలు కారణాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ఇది యాదృచ్ఛికమా, లేక రైతులను నష్టపరిచే విధంగా జరుగుతున్న వ్యవహారమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వయంగా ఆదేశాలు ఇచ్చినా కొనుగోలు సంస్థల వైఖరిలో మార్పు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు అమలవుతున్నాయా లేదా అనే అంశంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వేలం కేంద్రాల్లో అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి ధరల విషయంలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతుల నుంచి నాణ్యమైన పొగాకును కొనుగోలు చేసే విషయంలో కూడా పారదర్శక విధానం పాటించాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ధరలు నిర్ణయించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, ఎరువులు, కూలీల వ్యయం, అప్పుల భారంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడం మరింత భారంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని వేలం కేంద్రాల్లో ధరల నిర్ణయ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, కొనుగోలు కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గిట్టుబాటు ధర కల్పించకపోతే పొగాకు సాగుపై రైతులు ఆసక్తి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా కొనుగోలు విధానంలో సంస్కరణలు తీసుకురావాలని వారు కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కనీస గిట్టుబాటు ధరకు హామీ కల్పించాలని కోరారు. జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణతో పాటు ప్రతి వేలం కేంద్రంలో ధరలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించే కొనుగోలు కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతోనే పొగాకు రైతులకు న్యాయం జరిగి వారి కష్టం ఫలిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

తిరుపతిలో వైసిపి నేతలపై కేసు

తిరుపతి, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద వైసిపీ నేతల నిరసనలో భాగంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై ఫిర్యాదు చేసేందుకు వైసిపి నాయకులు యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు, వైసిపి కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. వైసిపి చంద్రగిరి ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహ పలువురిపై మంగళవారం ఎస్వీయూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే నెపంతో తిరుపతి ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన వైసిపినాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సహ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, చంద్రమౌలి రెడ్డి, చెవిరెడ్డి రఘుతో పాటు మరో 30 మందికి పైగా వ్యక్తులపై పోలీస్ విధులకు ఆటంకం కల్గించారన్న అభియోగంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

జయలలితకో నాయం? జగన్‌కో న్యాయమా?

విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: అక్రమాస్తుల కేసులో జగన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేసారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ పై ఉన్న అక్రమాస్తుల కేసుల విచారణ యేళ్ల తరబడి సాగుతుండటంపై ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. గతంలో ఇటువంటి ఆరోపణలు ఎదుర్కొన్న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత కేసులో ఒకలా, ఎపిలో జగన్ కేసులో మరోలా న్యాయం జరుగుతోందా? అని ప్రశ్నించారు. ఈ కేసుల విచారణలో జరుగుతున్న సుదీర్ఘ జాప్యం చూస్తుంటే న్యాయవ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు లొంగుతోందా? అనే అనుమానం సామాన్య ప్రజల్లో కూడా బలంగా కలుగుతోందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న అయోధ్య రామాలయ నిర్మాణ అంశంపై కూడా ఆయన స్పందించారు. అయోధ్యలో జరిగిన రామాలయ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల పేరిట వేలాది కోట్ల రూపాయలు వసూలు చేసి భారీ అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు నిజాలు బయటకు రావాలంటే తక్షణమే కేంద్ర ప్రభుత్వం సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

తిరుమల సమాచారం

ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.11 లక్షలు విరాళం

తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాల్లో ఎస్వీ ప్రాణదానం కూడా కీలకమైంది. ఈ పథకానికి దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. మంగళవారం సాయంత్రం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన ఎస్‌కె ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు టిటిడి ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు ఈ విరాళాల డిడిని టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరికి అందజేశారు.

15 చిత్రాల్లో నటిస్తున్నా..!

తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రస్తుతం 15 చిత్రాల్లో నటిస్తున్నానని, అన్నీ మంచి పాత్రలేనని సీనియర్ నటుడు బాబుమోహన్ తెలిపారు. ఇప్పుడు డ్యాన్స్‌లు వేస్తున్నానని ఆనందంగా చెప్పారు. ఎస్వీ కృష్ణారెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రంలో స్టెప్పులు కూడా వేశానన్నారు. తన చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటానని బాబూమోహన్ పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర స్వామి దయతో 41 సంవత్సరాలుగా నటుడిగా కొనసాగుతున్నానని వెల్లడించారు. బాబూమోహన్ ఆలయంలో అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు. తెలుగు ప్రజలందరికీ శుభాలు కలగాలని, శ్రీవారి ఆశీస్సులుండాలని ఆకాంక్షించారు.

14న టిటిడి పాలక మండలి భేటీ

- పలు కీలక అంశాలపై చర్చించే అవకాశం

తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశం ఈనెల 14వ తేదీ మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకునే దిశగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. రానున్న సెప్టెంబర్ నెలలో శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానుండటం, ఆ తరువాత అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో చేపట్టాల్సి న అభివృద్ధి పనులు, తిరుమలలో ఏర్పాట్లు, మాఢవీదుల్లో విస్తృత సౌకర్యాలు కల్పించే అంశాలపై కూలంకుషంగా చర్చించే అవకాశం ఉంది. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు రెండవది. అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలసి బోర్డు పలు విషయాలపై అజెండా రూపొందించింది. ముఖ్యంగా తిరుమలలో ఎదరవుతున్న 'పార్కింగ్' ఇబ్బందులు ప్రత్యామ్నాయంగా 'మల్టీలెవల్' కార్ పార్కింగ్ సౌకర్యంపై చర్చించనున్నారు. వేంకటేశ్వరస్వామి దర్శనానికి రోజుకు లక్షమంది వరకు భక్తులు, ఐదారువేలకు పైగా యాత్రికుల వాహనాలు, ట్యాక్సీలు ఇలా తిరుమలకు వస్తుండటంతో పార్కింగ్ సమస్య ఎదురవుతోంది. ఇక మినీసచివాలయంగా అలరారుతున్న టిటిడిలో ఉద్యోగాల ఖాళీల భర్తీ విషయంగా కూడా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ఏటేటా పదవీవిరమణ చేస్తున్న శాశ్వత ఉద్యోగుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. గతనెలలో ఏకంగా 130 మంది వరకు అన్ని కేడర్‌లలో ఉద్యోగులు, అధికారులు పదవీవిరమణ చేయడం విశేషం. ఈనెలలో కూడా భారీసంఖ్యలోనే ఉద్యోగులు పదవీవిరమణ ఉందని టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది. కొన్ని కీలకంగా ఉన్న ముఖ్యమైన విభాగాల్లో పోస్టుల నియామకాలకు సంబంధించి చర్చ చేయనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంతో బాటు తిరుపతి స్థానిక ఆలయాల్లోనూ అర్చకుల కొరత వెంటాడుతోంది. దీనిపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఇలానే ఎదుర్కోవాల్సి వస్తే ప్రత్యామ్నాయ చర్యలు, వరుణ యాగాలు, పారాయణాలు చేపట్టాల్సి న విషయంగా కూడా చర్చకు రానుంది.

బ్రహ్మోత్సవాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ బస్సులు

- రిలయన్స్ బృందంతో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి

తిరుమల, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: రిలయన్స్ సంస్థ విరాళంగా అందిస్తున్న విద్యుత్ బస్సులను భక్తులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అన్నారు. రానున్న బ్రహ్మోత్సవాల నాటికి పూర్తిస్థాయిలో తిరుమలలో విద్యుత్ బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం టిటిడి నడుపుతున్న 15 బస్సులతో పాటు అదనంగా మరో పది బస్సుల కోసం మొత్తం 50 బస్సుల సామర్థంతో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి ఒకేసారి 20 బస్సులు ఛార్జింగ్ అయ్యేలా 10 ఛార్జింగ్ పాయింట్లను అందుబాటులో ఉంచాలని రిలయన్స్ బృందాన్ని కోరారు. రిలయన్స్ సంస్థ టిటిడికి 25 విద్యుత్ బస్సులను విరాళంగా ఇస్తుండటంతో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు, పవర్ సప్లయ్, డ్రైవర్ల నిర్వహణ, వివిధ మౌలిక సదుపాయాల ఏర్పాటుపై రిలయన్స్ సంస్థ ప్రతినిధులతో తిరుమలలో పద్మావతి అతిథి గృహంలోని ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,030 చదరపు అడుగుల వైశాల్యం కలిగిన ఒక్కో బస్సులో 50 మంది సురక్షితంగా ప్రయాణించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. బస్సులు త్వరగా ఛార్జింగ్ అయ్యేందుకు వీలుగా 2 మెగా వాట్ల సామర్థం కలిగిన ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. బస్సులను నడిపేందుకు 50 మంది నిపుణులైన డ్రైవర్లను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. బస్సులో అధునాతన ప్రయాణికుల సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి రాబోయే బస్టాప్‌ల వివరాలు భక్తులకు తెలిసేలా చర్యలు చేపట్టాలని చేపట్టాలని చెప్పారు. ఈ సమావేశంలో టిటిడి ఎస్టేట్ అధికారి వేంకటేశ్వర్లు, ఐటీ జిఎం వెంకటేష్ నాయుడు, ఎలక్ట్రికల్ డిఇచంద్ర శేఖర్, రవాణా డిఎం లక్ష్మీ ్మ ప్రసన్న, రిలయన్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ గణేసన్, సీనియర్ జనరల్ మేనేజర్లు రాఘవేంద్ర, వినోద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రశ్న రావణ్ పై ఉపా చట్టం

సిపిఐ ఆధ్వర్యంలో 10న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం

విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టాన్ని మోపటాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నేతలు, మేధావులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొనను న్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తూ ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నదన్నారు. ప్రశ్న రావణ్ పై ఇప్పటికే పలు కేసులు నమోదు చేసిన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రమాదకరమైన దేశద్రోహు లపై ప్రయోగించే ఉపా చట్టం మోపటం దుర్మార్గం గుజ్జుల ఈశ్వరయ్య వ్యాఖ్యానించారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం ఎన్టీఆర్ జిల్లా యువతి మృతి

విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడుకు చెందిన తెలుగు విద్యార్థిని మృతి చెందింది. మూలపాడు గ్రామానికి చెందిన అట్లూరి ప్రసన్న న్యూయార్క్‌లో జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందింది. ఆమె ఇటీవల న్యూయార్క్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తుంది. ప్రసన్న తన స్నేహితులతో కలిసి కారులో సమీపంలోని ఆలయానికి వెళుతోంది. మార్గమధ్యంలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వారి వాహనం ఆగి ఉండగా, వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన మరో కారు బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ప్రసన్నతో పాటు మరో యువతి కూడా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కారులో ఉన్న మూడో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రసన్న ఇటీవలే న్యూయార్క్‌లోని పేస్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో ఆమె ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే విధి వక్రించి ప్రమాదం రూపంలో ఆమెను మృత్యువు కబళించింది. ప్రసన్న మరణవార్త తెలియడంతో ఆమె స్వగ్రామం మూలపాడులో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీర వుతున్నారు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. అయితే సమాచారం ఆలస్యంగా అందింది. మృతదేహం తరలింపుపై ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

తిరుపతిలో కొత్తరకం నేరాలు

- ద్విచక్రవాహనంపై పడిపోతున్నట్లు నటన
- సాయంచేసే వారి సెల్‌ఫోన్‌ల అపహరణ

తిరుపతి, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: స్మార్ట్‌సిటీ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో కొత్తరకం నేరాలకు పాల్పడేలా కొందరు ముఠా తయారయ్యారు. ఇదివరకు ద్విచక్ర వాహనాల్లో వెళ్ళే వారిని వెంబడించడం, వారి మెడల్లోని బంగారు గొలుసులు లాక్కెడం వంటి ఘటనలు జరిగేవి. నగరంలో పలుచోట్ల ఇళ్ళ ముందు ఉండే మహిళలను చిరునామాలు అడగడం, ఆ తరువాత మత్తుమందుచల్లి బంగారు నగలు దోచుకోవడం జరిగేది. ఇప్పుడు సులభంగా సెల్‌ఫోన్‌లను కొట్టేసే ఘటనలకు పాల్పడుతున్నారు. ఈ కొత్త తరహాలో చోరీలకు పాల్పడుతున్న ముఠా తిరుపతి నగరంలోకి దిగింది. రోడ్లపై వెళుతూ ద్విచక్ర వాహనాన్ని అదుపు తప్పినట్లు చేసి సాయం కోరినట్లు నటిస్తూ చేసిన సహాయానికి వచ్చిన వ్యక్తి నుండి జేబుల్లోంచి సెల్‌ఫోన్‌లు అపహరిస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఇటీవల నగరంలోని తూర్పు పోలీస్ స్టేషన్ పరిధిలోని బైరాగిపట్టేడలో ఆదివారం మధ్యాహ్నం పట్ట పగలే రూ.1.50 లక్షలు విలువచేసే ఫోన్ అపహరించుకెళ్ళారు. ఆ ప్రాంతంలోని సిసికెమెరా ఫుటేజ్‌లో రికార్డ్ అయిన దృశ్యాలను పోలీసులు గమనించారు. ఇక సోమవారం సాయంత్రం తిరుపతి-మంగళం రోడ్డులోని బొంతాలమ్మ గుడి వద్ద అదే తరహాలో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనాన్ని కిందపడిపోతున్నట్లు నటిస్తూ సాయంగా వచ్చిన వ్యక్తి జేబులోని రూ.25వేల విలువైన ఫోన్ చోరీ చేసుకెళ్ళారు. మంగళవారం ఉదయం తిరుపతి అన్నారావు సర్కిల్ వద్ద అదే తరహాలో మరో రెండు ఫోన్లు చోరీ చేసుకెళ్ళారు. నగరంలో ఇదో కొత్త తరహాలో చోరీలకు పాల్పడుతూ నేరస్తులు పోలీసులకు సవాల్ చేస్తున్నారు. ఇలా నగరంలో ఎంతమంది గ్యాంగ్‌లు వచ్చారనేది ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి తరహాల నేరాలకు ఇంకా ఎంతమంది గురికావలసి వస్తుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లాలో వేగంగా ఎస్ఐఆర్ ప్రక్రియ

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి పురోగతిని వివరించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, జూలై 7 ప్రభాత వార్త: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను విశాఖపట్నం జిల్లాలో ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. మంగళవారం సాయంత్రం సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జిల్లాలో ఎలక్టోరల్ ఫారమ్‌ల (ఈఎఫ్‌లు) డిజిటైజేషన్ పురోగతి, పెండింగ్ దరఖాస్తులు, రోజువారీ డిజిటైజేషన్, సేకరించలేని (అన్‌కలెక్టబుల్) కేసులపై సమగ్ర వివరాలు అందించారు. జిల్లాలో (తరువాయి 8వ పేజీలో)

ఈ నెల 11న జెఎన్‌టియు-గురజాడ

మొదటి స్నాతకోత్సవం

ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాఖపట్నం, జూలై 7, ప్రభాతవార్త : ఈ నెల 11న జెఎన్‌టియు – గురజాడ మొదటి స్నాతకోత్సవం విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలోని కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతుందని రిజిస్ట్రార్ డి.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్య, ఐ టి, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్, వైస్ ఛాన్సలర్ వి.వి.సుబ్బారావు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

నర్సీపట్నం పోలీస్‌స్టేషన్ అభివృద్ధిపై స్పీకర్

అయ్యన్నపాత్రుడు ప్రత్యేక దృష్టి

సుందరీకరణ, డ్రైనేజీ నిర్మాణాలపై అధికారులకు కీలక ఆదేశాలు

నర్సీపట్నం, జూలై 7 ప్రభాత వార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్, గౌరవనీయులు చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం నర్సీపట్నం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌తో పాటు దాని చుట్టుపక్కల ఉన్న పరిసరాలను ఆయన అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆర్అండ్‌బీ డీఈ విద్యాసాగర్, పంచాయతీరాజ్ డీఈ ఈశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు స్పీకర్ వెంట ఉండి పరిస్థితిని వివరించారు. పోలీస్‌స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాలు అధ్వానంగా ఉండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే స్టేషన్ పరిసరాల సుందరీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు క్రీడా మైదానం, పటిష్టమైన ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు, స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించిన అంచనాలను వెంటనే తయారు చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.

ప్రధానంగా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఉన్న డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించిన అంచనాలను సైతం వీలైనంత త్వరగా పూర్తి చేసి తనకు (తరువాయి 8వ పేజీలో)

కడలి వైపు కోటి ఆశలు..

- గడప వద్ద కన్నీటి కాపలా
- మూడు రోజులుగా గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కోసం ఎదురుచూపులు..
- 'ప్రాణాలతో తిరిగి వస్తారు' అనే ఆశతో కుటుంబాల నిరీక్షణ

విశాఖపట్నం, జూలై 7, ప్రభాతవార్త : విశాఖ తీరంలో సముద్రంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండగా, వారి కుటుంబాల్లో మాత్రం విషాద ఛాయలు అలుముకున్నాయి. మూడు రోజులు గడిచినా తమ ఆత్మీయుల జాడ లేకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో గడుపుతున్నారు.

ఇంటి గడప దాటిన ప్రతి క్షణం... "ఏదైనా శుభవార్త వస్తుందేమో" అన్న ఆశతో గడుస్తోంది. సముద్రం వైపు చూపులు నిలిపి, తమ వారు సురక్షితంగా తిరిగి వస్తారనే నమ్మకంతో భార్యలు, తల్లిదండ్రులు, పిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రతి ఫోన్ కాల్, ప్రతి సమాచారం వారిలో కొత్త ఆశను రేకెత్తిస్తున్నా... గడిచే ప్రతి గంట ఆందోళనను మరింత పెంచుతోంది.

చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తామని చెప్పిన కుటుంబ సభ్యులు మూడు రోజులైనా ఇంటి గడప తొక్కకపోవడంతో బాధిత కుటుంబాల రోదనలు హృదయాలను కలచివేస్తున్నాయి. చిన్నారులు తమ తండ్రుల కోసం ఎదురుచూస్తుండగా, వృద్ధ తల్లిదండ్రులు కన్నీటి కళ్లతో కడలి వైపే చూస్తున్నారు. కుటుంబాల ఆవేదన స్థానికులను సైతం కంటతడి పెట్టిస్తోంది.

మరోవైపు భారత కోస్ట్ గార్డ్, భారత నౌకాదళం, మెరైన్ పోలీసులు, ఇతర శాఖలు సముద్రంలో విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ ఇంకా లభించలేదు. తమ ఆత్మీయులు క్షేమంగా తిరిగి రావాలని బాధిత కుటుంబాలతో పాటు స్థానికులు, మత్స్యకార సంఘాలు ప్రార్థనలు చేస్తున్నారు.

గల్లంతైన మత్స్యకార కుటుంబాలకు

రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం

- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- గాలింపు చర్యలు కొనసాగించాలి: సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, జూలై 7, ప్రభాతవార్త : తీరంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాల ఆవేదన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ, వారు క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. భారత కోస్ట్‌గార్డ్, భారత నౌకాదళం, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, విశాఖపట్నం పోర్టు అథారిటీ తదితర సంస్థలు సమన్వయంతో గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు సహాయక చర్యలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు తక్షణ సహాయంగా ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి అవసరమైన అన్ని సహాయ చర్యలు చేపడుతుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

సముద్రంలో పడవ బోల్తా.. ఆరుగురు మత్స్యకారులు గల్లంతు

హార్బర్ పోలీస్ స్టేషన్‌లో

కేసు నమోదు

ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు చర్యలు

విశాఖపట్నం, జూలై 7, ప్రభాతవార్త : నగరంలోని ఫిషింగ్ హార్బర్ సమీపంలో సముద్రంలో పడవ బోల్తాపడిన ఘటనలో ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. ఘటనపై హార్బర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జూలై 1న ఏడుగురు మత్స్యకారులు ఐఎన్‌డీ ఏపీ వీఎస్ ఎంఎం–83 నంబర్ గల పడవలో చేపల వేటకు వెళ్లారు. మూడు రోజుల తర్వాత జూలై 4న తిరిగి వస్తుండగా సముద్రంలో అలల ఉద్ధృతి కారణంగా పడవ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒక మత్స్యకా రుడు సురక్షితంగా బయటపడగా, ఆరుగురు గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో రగిటి బండయ్య (43), కారి గరగయ్య (24), మేడ చిన్న అమ్మోరు (48), కారి సీతోడు (55), కారి చిన్నయ్య (32), అమర అప్పలరాజు (24) ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల (తరువాయి 8వ పేజీలో)

విశాఖపట్నం పోర్ట్ అథారిటీ బోర్డులో బోర్డు మెంబెర్‌గా

రొంగల రమణబాబు నియామకం

విశాఖపట్నం, జూలై 7, ప్రభాతవార్త : భారత ప్రభుత్వ పోర్టులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ మేరకు, విశాఖపట్నం పోర్ట్ అథారిటీ బోర్డులో ఉద్యోగుల ప్రతినిధి (బోర్డు మెంబెర్)గా నియామకం జరిగినది. ప్రయోజ నాలకు ప్రాతినిధ్యం వహించే సభ్యునిగా రొంగల రమణబాబుని, (వి.హెచ్. అండ్ పి డబ్ల్యు యూనియన్ వైస్ ప్రెసిడెంట్ నియమిం చారు. గత 30 సంవత్సరాలుగా కార్మిక సమస్యలు పరిష్కారం చేయుటకు నిరంతరం పోరాటం చేశారు. మేజర్ పోర్ట్ అథారిటీస్ చట్టం–2021లోని సెక్షన్–3(1), పార్ట్–2 నిబంధనల ప్రకారం ఈ నియామకాలు అమల్లోకి వచ్చాయి. ఉద్యోగుల సంక్షేమం, సంక్షేమ కార్యక్రమాల అమలు, కార్మికుల సమస్యల పరిష్కారం మరియు పోర్టు అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో ఉద్యోగుల అభిప్రాయాలను బోర్డు దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించనున్నారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఈ నియామకాలతో ఉద్యోగుల ప్రాతినిధ్యానికి మరింత బలం చేకూరుతుందని, యాజమాన్యం–ఉద్యోగుల మధ్య సమన్వయం మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి

సరికొత్త రూపు

- నేటివ్ అరకు కాఫీ, మిల్లెట్ ఉత్పత్తుల విక్రయాలకు ప్రోత్సాహం
- సుందరీకరణకు కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు

విశాఖపట్నం, జూలై 7, ప్రభాతవార్త : జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని ఆధునిక సౌకర్యాలతో పాటు ప్రజలకు మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రధాన కార్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించిన ఆయన, సెల్లార్ ఫ్లోర్‌లో నేటివ్ అరకు కాఫీ, స్వయం ఏపీ మిల్లెట్ మిక్స్ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలతో పాటు ఓఎన్‌డీసీ ద్వారా స్వయం సహాయక సంఘాల హస్తకళ ఉత్పత్తుల విక్రయానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అలాగే సమావేశ మందిరాన్ని ఆధునికీకరించడంతో పాటు (తరువాయి 8వ పేజీలో)

శారదా నది గట్ల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని

ముఖ్యమంత్రికి వినతి

ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ఎలమంచిలి, జూలై 7 ప్రభాతవార్త: విజయవాడలోని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి శారదా నది గట్ల బలోపేతానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందర విజయకుమార్ మాట్లాడుతూ, గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలు కారణంగా శారదా నది కట్టు పలుచోట్ల దెబ్బతిన్నాయని, ప్రస్తుతం మరమ్మతులు చేపట్టకపోతే రానున్న వర్షాకాలంలో (తరువాయి 8వ పేజీలో)

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా

అండగా ఉంటుంది

- బాధిత కుటుంబీకులను, కిమ్స్ ఆసుపత్రిలో చిన్నాను పరామర్శించిన మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్
- 72 గంటల గాలింపు చర్యలు పూర్తవ్వగానే నిబంధనల ప్రకారం తక్షణ సహాయం, పునరావాస చర్యలుంటాయని వెల్లడి

విశాఖపట్నం, జూలై 7, ప్రభాతవార్త : సముద్ర ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన కారి చిన్నాను మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ మంగళవారం విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు, చిన్నాతో ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ధైర్యం చెబుతూ పండ్లు అందజేశారు. అనంతరం ఫిషింగ్ హార్బర్‌లోని మెకనైజ్డ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను కలుసుకుని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా రెండు చోట్లా మీడియాతో మాట్లాడిన కమిషనర్ రామశంకర్ నాయక్ ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు తీవ్ర గాలులు, ఎత్తైన అలల కారణంగా సముద్ర ప్రమాదానికి గురవ్వటం విచారకరమన్నారు. పడవ తిరగబడటంతో ఒకరు వెంటనే సముద్రంలో మునిగిపోగా, మిగిలిన వారు రాత్రంతా తిరగబడిన పడవను ఆశ్రయించి ప్రాణాలు నిలబెట్టుకునేందుకు ప్రయత్నించారని చెప్పారు. తర్వాత పడవ పూర్తిగా మునిగిపోవడంతో ఈదుకుంటూ సమీపంలోని వాణిజ్య నౌక వైపు వెళ్లారని, చిన్నా అదృష్టవశాత్తూ నౌక యాంకర్‌ను పట్టుకుని సిబ్బంది సహాయంతో ప్రాణాలతో బయటపడ్డారని వివరించారు. అయితే అతనితో పాటు ఉన్న మిగిలిన నలుగురు సముద్రంలో గల్లంతయ్యారని చిన్నా తెలిపినట్లు కమిషనర్ వెల్లడించారు.

సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం, భారత తీర రక్షక దళం, భారత నౌకాదళం, మెరైన్ పోలీసులు సమన్వయంతో విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు ప్రారంభించినట్లు గుర్తు చేశారు. గత మూడు రోజులుగా సముద్రంలో నిరంతరంగా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని, హెలికాప్టర్లు, నౌకలు, బోట్లు వినియోగించి గాలింపు (తరువాయి 8వ పేజీలో)

ప్రభుత్వ పాఠశాలల్లో

డిజిటల్ విప్లవం

2,500 మంది విద్యార్థులకు 'వేదాంత' ప్రోత్సాహం

విశాఖపట్నం, జూలై 7 ప్రభాత వార్త : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేస్తూ, సాంకేతిక పరిజ్ఞానంలో వారిని ముందుకు నడిపించే లక్ష్యంతో వేదాంత లిమిటెడ్‌కు చెందిన వీజీసీబీ ప్రాజెక్ట్ శిక్ష చేపడుతున్న కార్యక్రమాలు విశేష ఫలితాలను ఇస్తున్నాయి. విద్యార్థుల్లో కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించేందుకు విశాఖ దక్షిణ నియోజకవర్గం పరిధి ప్రాంతంలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక కంప్యూటర్ ఉపాధ్యాయులను కూడా నియమించింది. ఈ కార్యక్రమం ద్వారా 6వ తరగతి (తరువాయి 8వ పేజీలో)

క్షేత్ర స్థాయిలో

సర్ వేగం

- జిల్లాలో శర వేగంగా సాగుతున్న ప్రక్రియ
- గడువు లోగా ఎస్ఐఆర్ పూర్తికి కలెక్టర్ కసరత్తు
- రోజు వారీ ప్రగతి పై పారదర్శకంగా సమీక్షలు
- నిర్లక్ష్యం వహించే సిబ్బంది పై చర్యలు
- లక్ష్యానికి చేరువలో 58.07 శాతం పురోగతి
- 7వ తేదీ ఒక్క రోజే 94 వేల ఈఎఫ్‌ల డిజిటలైజేషన్ నమోదు

విశాఖపట్నం, జులై 7 ప్రభాత వార్త : విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ శర వేగంగా సాగుతోంది.జిల్లాలో గత నెల జూన్ 15 నుండి ప్రారంభమైన సర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ఈ నెల 14 వ తేదీ తో ముగియనుది. ఇంకా కేవలం వారం రోజులు గడువు మాత్రమే ఉండడంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా అధికార యంత్రాంగం అత్యంత ప్రతిష్టత్మాకంగా తీసుని ప్రణాళికాభద్ధంగా , పారదర్శకంగా అడుగులు వేస్తూ గడువు లోగా లక్ష్యాన్ని చేరుకొనే విధంగా కసరత్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా విశాఖ జిల్లా జీవీఎంసీ పరిధిలో ని భీముని పట్నం, గాజువాక, పెందుర్తిలతో పాటు నగరం లోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సోమవారం సాయంత్రం కు సర్ అధికారులు 98.59 శాతం మేరకు 19,94,512 మంది ఓటర్లకు ఎలక్టోరల్ ఫారాలు (ఈఎఫ్ ఎస్)ను ఇంటింటికి వెళ్లి పంపిణి చేయగా, ఓటర్ల నుంచి పూరించినఅనంతరం 58.07 శాతం మేరకు 11,74,700 ఈఎఫ్ఎస్ దరకాస్తు ఫరాలు వెనుకకు రావడంతో వాటిని యుద్ధ ప్రతిపదికన అధికారులు డిజిటలైజెషన్ చేశారు ఇదిలా ఉండగా 7 వ తేదీ మంగళవారం ఒక్క రోజే 94 వేల వరకు ఎన్యూమరేషన్ ఫరాలను సర్ సిబ్బంది డిజిటలైజెషన్ పూర్తి చేసినమోదు లక్ష్యం కు చేరువగా పురోగతి (తరువాయి 8వ పేజీలో)

జిల్లాలో వేగంగా ఎస్ఐఆర్ ప్రక్రియ

(7వ పేజీ తరువాయి)
మొత్తం 20,23,009 మంది ఓటర్లకు సంబంధించి ఇప్పటివరకు 11,74,700 ఈఎఫ్‌లు డిజిటైజేషన్ పూర్తై 58.07 శాతం పురోగతి నమోదైనట్లు తెలిపారు. జూలై 7 ఒక్కరోజే 93,785 ఈఎఫ్‌లు డిజిటైజేషన్ చేయగా, ప్రస్తుతం 8,48,309 ఈఎఫ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, 21,709 ఈఎఫ్‌లు (1.08శాతం) అన్‌కలెక్టబుల్‌గా గుర్తించినట్లు వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ప్రక్రియను సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో మొబలైజేషన్ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, స్పెషల్ ఆఫీసర్లు, ఎలక్షన్ సెల్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

శారదా నది గట్ల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని

ముఖ్యమంత్రికి వినతి

(7వ పేజీ తరువాయి)
మరింత నష్టం జరిగే అవకాశం ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. శారదా నది గట్లనే శాశ్వతంగా బలోపేతం చేయడానికి అవసరమైన నిధులు అత్యవసరంగా మంజూరు చేసి సంబంధిత శాఖల ద్వారా వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశానని అన్నారు. ఈ పనులు పూర్తయితే వరద ముక్కు తగ్గడంతో పాటు శారదా నది పరివాహక ప్రాంతాలలో గ్రామాలు వ్యవసాయ భూములు ప్రజల ఆస్తులు రక్షణ కలుగుతుందని ముఖ్యమంత్రి కి పూర్తి స్థాయిలో వివరించానని అన్నారు. ఎమ్మెల్యే వినతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశిస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే సుందర విజయకుమార్ తెలిపారు.

చోరీ కేసు ఛేదించిన ఆనందపురం పోలీసులు

రూ.1.51 లక్షల విలువైన బంగారు ఆభరణాల రికవరీ.

నిందితుల అరెస్ట్

విశాఖపట్నం, జూలై 8, ప్రభాతవార్త:
ఆనందపురం మండలం బోయపాలెం గ్రామంలో జరిగిన ఇంటి చోరీ కేసును ఆనందపురం క్రైమ్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసి, దొంగిలించిన బంగారు ఆభరణాల్లో అధిక భాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందపురం మండలం బోయపాలెం గ్రామానికి చెందిన సీర మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఈ ఏడాది జూన్ 9న తెల్లవారుజామున 1-30 గంటల నుంచి 3-30 గంటల మధ్య గుర్తుతెలియని దుండగులు ఆమె ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని ఆసరాగా చేసుకుని లోపలికి ప్రవేశించారు. బీరువా పక్కనే ఉన్న తాళం చెవులతో బీరువా తెరిచి, అందులో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, మొబైల్ ఫోన్‌ను అపహరించారు. దొంగలు 3 తులాల పుస్తెల తాడు, తులమున్నర నెక్లెస్, తులం నల్లపూసల గొలుసు, పావుతులం వినాయకుడి ఉంగరం, రూ.10 వేలు నగదు, ఒక మొబైల్ ఫోన్‌ను దొంగిలించారని ఫిర్యాదులో ఆమె పేర్కొంది. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఆనందపురం క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలు, విచారణ ద్వారా నిందితులమీసాల తేజ, రాపేటి బాను ప్రకాష్ గుర్తించి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 16.06 గ్రాముల బంగారు నెక్లెస్, 10.05 గ్రాముల నల్లపూసల దండ, 32.663 గ్రాముల పుస్తెల తాడు స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

భక్తుల రద్దీతో వైభవంగా కనకమహాలక్ష్మి అమ్మవారి

స్వర్ణపుష్పార్చన

విశాఖపట్నం, జులై 7, ప్రభాత వార్త :
శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ప్రతి మంగళవారం నిర్వహించే స్వర్ణపుష్పార్చన మరియు ఖడ్గమాల సేవలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సేవల్లో ఉభయదాతలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు కె. శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. దేవస్థానం అధికారులు మాట్లాడుతూ, ప్రతి మంగళవారం ఈ ప్రత్యేక సేవలు నిర్వహించబడతాయని, పాల్గొనదలచిన భక్తులు 'మనమిత్ర' వాట్సాప్ సేవ ద్వారా 9552300009 నంబర్‌కు సంప్రదించి ఆన్‌లైన్‌లో సేవా టికెట్లు పొందవచ్చని తెలిపారు.

సముద్ర ప్రమాదంలో మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

- భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆధునిక భద్రతా వ్యవస్థలు తప్పనిసరి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

విశాఖపట్నం, జులై 7, ప్రభాత వార్త :
విశాఖ తీరంలో జరిగిన సముద్ర ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షీలానగర్ లోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న కర్రి చిన్నను మంగళవారం పరామర్శించిన అనంతరం మాధవ్ మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన చిన్న కుటుంబానికి చెందిన ఆరుగురు సభ్యులను కోల్పోవడం హృదయ విదారకమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సుమారు 20 గంటలపాటు సముద్రంలో ప్రాణాల కోసం పోరాడినప్పటికీ, తీరానికి కేవలం 10 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నా సకాలంలో సమాచారం అందకపోవడం వల్ల రక్షణ చర్యలు ఆలస్యమవడం అత్యంత బాధాకరమన్నారు. అత్యవసర సమాచార వ్యవస్థలను మరింత సమర్థవంతంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఈ ఘటన స్పష్టం చేసిందని పేర్కొన్నారు.

ఈ ప్రమాదంలో చిన్న తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కుటుంబ సభ్యులను కాపాడాలనే సంకల్పంతో ఈదుకుంటూ వెళ్లి ఓ నౌకను చేరుకుని సహాయం తీసుకురావడానికి చేసిన ప్రయత్నం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఇకపై ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రతి చేపల వేట బోటుకు జీయో-ట్యాగింగ్, శాటిలైట్ ఫోన్‌లు, అత్యవసర సమాచార పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సముద్రంలో ఉన్న బోట్ల కదలికలను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలవాలని, తగిన పరిహారం వెంటనే అందించడంతో పాటు వారి పిల్లల విద్య, కుటుంబ సభ్యుల ఉపాధి భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పీవీఎన్ మాధవ్ విజ్ఞప్తి చేశారు. మత్స్యకారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా దీర్ఘకాలిక కార్యాచరణను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది

(7వ పేజీ తరువాయి)
చేపడుతున్నామని చెప్పారు. గల్లంతైన వారి ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తక్షణమే విశాఖపట్నానికి వచ్చి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు, కోస్ట్ గార్డ్, మత్స్యశాఖ అధికారులు, బోట్ యజమానులు, మత్స్యకార సంఘాలతో సమావేశమై సహాయక చర్యలను సమీక్షిస్తున్నట్లు చెప్పారు. 72 గంటల గాలింపు చర్యలు పూర్తవ్వగానే నిబంధనల ప్రకారం తక్షణ సహాయం, పునరావాస చర్యలుంటాయని వెల్లడించారు.

ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. గాలింపు చర్యలు పూర్తయ్యాక ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు.

ఒవెన్యూ, కార్మిక, మత్స్యశాఖల ద్వారా అందించాల్సిన సహాయాన్ని సమన్వయంతో అందిస్తామని చెప్పారు. ఇది కేవలం తక్షణ ఉపశమనంతో ముగిసే అంశం కాదని, బాధిత కుటుంబాల పునరావాసంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కమిషనర్ పేర్కొన్నారు. ప్రమాదంలో మునిగిపోయిన పడవకు సంబంధించి అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాల ద్వారా ఏ విధంగా సహాయం అందించవచ్చో పరిశీలిస్తున్నామని చెప్పారు. మత్స్యకార సహకార సంఘం ప్రతినిధులతో కూడా చర్చించి, కుటుంబాలకు శాశ్వత జీవనోపాధి కల్పించే చర్యలకు ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సముద్రంలో వేటకు వెళ్లే సమయంలో భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ మత్స్యకారులలకు సూచించారు.

వాతావరణ పరిస్థితులను పరిశీలించకుండా సముద్రంలోకి వెళ్లరాదని, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.బి.ఎస్. వర్ధన్, ఏడీ, ఎఫ్.డి.వో. మురళీ, మత్స్యకార సహకార సంఘం ప్రతినిధులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నాం

సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి

విశాఖపట్నం, జులై 7, ప్రభాత వార్త :
జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు, పెన్షన్, హైపవవర్ కమిటీ, మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటుతో పాటు ఇతర జర్నలిస్టుల సమస్యల్ని వెంటనే పరిష్కరిస్తామని సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారధి హామీయిచ్చారు. జర్నలిస్టుల సమస్యల పై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) ప్రతినిధివర్గం ఈరోజు సచివాలయంలో మంత్రిని కలిసింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి4న విజయవాడలో జరిగిన జర్నలిస్టుల మహాప్రదర్శనలో మంత్రి ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ పరిష్కరించిన హామీల విషయంలో కృతజ్ఞతలు తెలిపింది. మిగతా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటిని వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేసింది. దానిని శ్రద్ధగా చదివి నోట్ చేసుకున్న మంత్రి పార్థసారధి గౌరవ ముఖ్యమంత్రితో చర్చించి అతిత్వరలోనే మీ డిమాండ్లను అమలు చేసేలా కృషి చేస్తానని అన్నారు. మంత్రిని కలిసిన ప్రతినిధివర్గంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షులు కలిమిశ్రీ, ఆంధ్రప్రదేశ్ చిన్న, మధ్యతరహా దినపత్రికలు, పీరియాడికల్స్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు ఖాన్, స్టేట్ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.డి. ఆనంద్ వున్నారు.

జీవో 396పై దస్తావేజు లేఖర్ల ఆందోళన ఉధృతం

వన్‌టౌన్‌లో రెండో రోజు పెన్‌డౌన్..

రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్

విశాఖపట్నం, జులై 7 ప్రభాత వార్త
ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం. 396ను వెంటనే రద్దు చేసి, దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్ల జీవనోపాధిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ విశాఖ వన్‌టౌన్‌లోని సూపర్‌బజార్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు రెండో రోజు కూడా పెన్‌డౌన్ నిరసన చేపట్టారు. విశాఖ అర్బన్ జిల్లా దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో పాల్గొన్న లేఖర్లు, ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ప్రైవేట్ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ సేవలు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగాలని, ప్రజల ఆస్తుల భద్రత, హక్కుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.
దస్తావేజు లేఖరుల వ్యవస్థ దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తోందని, ఈ వ్యవస్థకు సంబంధించిన సంఘాలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. వ్యవస్థలో లోపాలుంటే వాటిని సరిదిద్దాలని, కానీ వేలాది మంది ఉపాధిని దెబ్బతీసే విధంగా ప్రైవేటీకరణ నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.
ప్రతిపాదిత సర్వీస్ ప్రొవైడర్ విధానాన్ని పునఃసమీక్షించి, దస్తావేజు లేఖరుల సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్లు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

నర్సీపట్నం పోలీస్‌స్టేషన్ అభివృద్ధిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక దృష్టి

(7వ పేజీ తరువాయి)
నివేదించాలని అధికారులను ఆయన గట్టిగా ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధిపై తనకున్న చిత్తశుద్ధిని, ప్రజల మౌలిక వసతుల కల్పనపై ఉన్న శ్రద్ధను ఆయన ఈ పర్యటన ద్వారా మరోసారి చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ గఫూర్, రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ ఉమామహేశ్వరరావు తదితర పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

హార్బర్ పోలీస్ స్టేషన్‌లో

కేసు నమోదు

(7వ పేజీ తరువాయి)
ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. భారత కోస్ట్ గార్డ్, భారత నౌకాదళం, మెరైన్ పోలీసులు, పోర్టు అధికారులు సమన్వయంతో గల్లంతైన మత్స్యకారుల కోసం సముద్రంలో విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి

సరికొత్త రూపు

(7వ పేజీ తరువాయి)
ప్రధాన కార్యాలయ ప్రాంగణం, పాత కౌన్సిల్ హాల్ పరిసరాలు, కారిడార్లలో అలంకార మొక్కలు నాటి హరిత వాతావరణంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన కార్యాలయం సుందరీకరణకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి త్వరితగతిన అమలు చేయాలని సూచించారు.

క్షేత్ర స్థాయిలో సర్ వేగం

(7వ పేజీ తరువాయి)
సాధించారు. కాగా సర్ ప్రక్రియ నిర్వహించడం కోసం ఈఏ డాది మే 25 వ తేదీ నాటికి జిల్లాలో ఉన్న మొత్తం 20,23,009 మంది ఓటర్ల కు పంపిణి చేయడం కోసం శతశాతం 20,23,009ఎలక్టరల్ ఏన్యూమరేషన్ ఫారాలను ముద్రించి వాటిని జిల్లాలోని ఏ డు నియోజకవర్గాల పరిధిలో 1980 బీఎల్ఓ లు ఇతర సిబ్బంది ద్వారా ఇంటింటికి పంపిణి చేశారు. ఇదిలాఉండగా సర్ ప్రక్రియ ను నిర్దేశిత గడువు లోగా విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, జేసీ విద్యాధరి, జీవీఎంసీ కమీషనర్ కేతన్ గార్గ్ లు అధిక ప్రాధాన్యత ను ఇస్తూ రోజు వారీగా అందరు అధికారులు తో సమీక్షా సమావేశలు క్రమం తప్ప కుండా నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఎన్ని అధికారిక కార్యక్రమాలు ఉన్నప్పటికీ సర్ ప్రక్రియ సజావుగా కొనసాగించేందుకు నిత్యం క్షేత్ర స్థాయి లో సైతం తరచూ పర్యటిస్తూ అన్ని నియోజక వర్గాల పరిధిలో సర్ విధులు లోఉన్న ఈఆర్ఓ లు, ఏఈఆర్ఓలు, స్పెషల్ ఆఫీసర్లు, బీఎల్ఓలు, ఎలక్షన్ సెల్ సిబ్బందినిఅప్రమత్తం చేస్తూ వారి పని తీరును ఎప్పటికి అప్పుడు పర్యవేక్షిస్తూ సర్ ప్రక్రియ ను ముందుకు తీసుకు వెళ్లారు. ఈ క్రమంలో సర్ విధులు ను సక్రమంగా నిర్వర్తించని వివిధ నియోజకవర్గాలకు చెందిన ఏడుగురు బీఎల్ఓ లను సస్పెండ్ చేసి సర్ ప్రక్రియ ను గాడిలో పెట్టడం విశేషం.

ప్రభుత్వ పాఠశాలల్లో

డిజిటల్ విప్లవం

(7వ పేజీ తరువాయి)
నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న సుమారు 2,500 మంది విద్యార్థులు కంప్యూటర్ విద్యలో శిక్షణ పొందుతూ డిజిటల్ ప్రపంచానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. 2025--26 విద్యా సంవత్సరానికి చెందిన ఈ ప్రాజెక్ట్ లబ్ధిదారులైన విద్యార్థులను అభినందిస్తూ నిర్వహించిన ఉమ్మడి కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా క్వీన్ మేరీ హై స్కూల్, సేక్రెడ్ హార్ట్స్ స్కూల్, ఎంవీడీఎం పాఠశాల, జీవీఎంసీ ప్రకాశరావుపేట పాఠశాల యాజమాన్యాలు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన డిజిటల్ విద్యను అందించడంలో వేదాంత అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నాయి. విద్యార్థుల భవిష్యత్తును సాంకేతికంగా బలోపేతం చేసే ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించాయి. విద్యార్థులను డిజిటల్ యుగానికి సిద్ధం చేయాలనే లక్ష్యంతో వేదాంత చేపడుతున్న 'ప్రాజెక్ట్ శిక్ష' ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వరంగా మారిందని పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.

దళిత క్రైస్తవుల రిజర్వేషన్లపై బీజేపీ స్పష్టమైన వైఖరి

మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను ఖండిస్తున్నాం: రాష్ట్ర మీడియా ప్రతినిధి కేఎన్‌పీ చక్రవర్తి

విశాఖపట్నం, జులై 7 ప్రభాత వార్త
దళిత క్రైస్తవుల రిజర్వేషన్ల అంశంపై భారతీయ జనతా పార్టీ వైఖరి రాజ్యాంగానికి అనుగుణంగానే ఉంటుందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి కేఎన్‌పీ చక్రవర్తి స్పష్టం చేశారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రకారం ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తి మతం మారితే ఎస్సీ హోదా కోల్పోయి ఇతర వర్గాల్లోకి వెళ్తారని, ఇదే అంశాన్ని బీజేపీ కూడా సమర్థిస్తోందన్నారు. రాజ్యాంగంలో ఉన్న నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయాలను పార్టీ సమర్థించదని తెలిపారు.

ఇటీవల కొందరు వ్యక్తులు క్రైస్తవ సమావేశాల పేరుతో బీజేపీ, కూటమి ప్రభుత్వంపై మత, కుల వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక సామరస్యానికి విఘాతం కలిగిస్తాయని, రాజకీయ ప్రయోజనాల కోసం అమాయక ప్రజలను తప్పుదోవ పట్టించడం తగదన్నారు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-25 ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛ కల్పించిందని, అయితే బలవంతపు మత మార్పిడులకు ఎలాంటి అనుమతి లేదని పేర్కొన్నారు. అలాంటి చర్యలకు చట్టపరంగా కఠిన శిక్షలు ఉన్నాయని హెచ్చరించారు.

ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం దానేశ్వరరావు, జిల్లా మీడియా ప్రతినిధి కోటేశ్వరరావుతో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతులపై దేశద్రోహం కేసులు తగవు

ప్రశ్న రావణ్‌పై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలి: ఏఐవైఎఫ్

విశాఖపట్నం, జులై 7 ప్రభాత వార్త
ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై దేశద్రోహం కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా నాయకులు కె. అచ్యుత్, వై. రాంబాబు విమర్శించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

యూట్యూబర్ ప్రశ్న రావణ్ ప్రభుత్వ హామీలు, పాలకుల వ్యాఖ్యలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నందుకే ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేశారని ఆరోపించారు. గతంలో చేసిన వీడియోలను ఎడిట్ చేసి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 152 కింద కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతులను అక్రమ కేసులతో అణచివేయలేరని, ప్రజాస్వామ్యంలో విమర్శించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని, గతంలో కూడా ఇలాంటి కేసులను న్యాయస్థానాలు కొట్టివేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రశ్న రావణ్‌పై నమోదు చేసిన కేసును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు కెల్ల రమణ, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31న కలెక్టరేట్ వద్ద ధర్నాను విజయవంతం చేయాలి..

డుంబ్రిగుడ, జూలై 7 ప్రభాతవార్త

కనీస వేతన సాధనకై ఈనెల 31న కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ 2026 మార్చి 5న ప్రభుత్వం ఇచ్చిన హామీల సర్క్యులర్ జి.ఓలు విడుదల చేయాలని. ఆశ కమ్యూనిటి హెల్త్ వర్కర్స్‌కు కనిస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. పర్మినెంట్ చేయాలి. అన్నిరకాలు సెలవులు ఇవ్వాలని పన్ని భారం. తగ్గించాలని, ఆశ సిహెచ్‌డబ్ల్యుల నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, అదేవిధంగా ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్స్ సాధనకై 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దజరిగే ధర్నాకు ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.సత్యనారాయణ. ఆశావర్కర్లు కన్నమ్మ లలిత, జ్యోతి, లలిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో ఏ ఒక్క అర్హత ఓటరు మినహాయింపు కాకూడదు

జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు, జూలై7, ప్రభాతవార్త

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంతి టి. అధికారులను ఆదేశించారు. మంగళ వారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె ఈ మేరకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గిడ్డి ఈశ్వరి (టీడీపీ), దొన్ను దొర (టీడీపీ), చంటి (వైఎస్సార్‌సీపీ), వి.గంగులయ్య (జనసేన), పాడేరు ఈఆర్వో, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, నోడల్ అధికారి ఆదిత్య వర్మ (ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి), అరకు ఈఆర్వో ఎం.వి.లోకేశ్వరరావు (డీఆర్వో)తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ ప్రత్యేక సవరణలో అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా మినహాయింపుకాకుండా ఎన్యూమరేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూలై 10లోపు ఈ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. ఎన్యూమరేషన్ పనులకు అంతరాయం కలగకుండా ఏపీఈపీడీసీఎల్ ద్వారా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అవసరమైతే 24 గంటలపాటు పనిచేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. రాజకీయ పార్టీలు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరిన కలెక్టర్, పార్టీలు నియమించిన బూత్ లెవల్ అసిస్టెంట్లు (బీఎల్‌ఏలు) బూత్ లెవల్ అధికారులతో (బీఎల్‌వోలు) సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న బీఎల్‌వోలకు బీఎల్‌ఏలు సహకరించాలని కోరారు. ప్రతి మండలంలో నూరుశాతం ఎన్యుమరేషన్ ఫారాలు సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గైర్హాజరైన ఇతర ప్రాంతాలకు మారిన మరణించిన డూప్లికేట్ ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి జాబితా నుంచి పారదర్శకంగా తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను తొలగించి ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించడమే ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి స్పష్టం చేశారు.

ఉద్యమ నాయకులపై పెట్టిన కేసు కొట్టివేత

పాడేరు,జూలై7,ప్రభాతవార్త

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో తరచు విద్యార్థుల మరణాలు సంభవిస్తూ ఉండడంతో, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో హెల్త్ వాలంటీర్లను నియమించాలని, విద్యార్థిని విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని 2023 జనవరి 30వ తేదీ పాడేరు ఐటిడిఏ ఎదుట 42 రోజులపాటు నిరసన దీక్షలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోలేదు. తదుపరి కార్యక్రమాన్ని కొనసాగించాలని 43వ, రోజు గిరిజన ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చినప్పుడు ఉద్యమాన్ని అణచి వేయాలని ప్రభుత్వ అధికారులు పోలీసులతో అక్రమంగా అరెస్టులు చేసి 12 మంది పై కేసు నమోదు చేసింది. ఈ అక్రమ అరెస్టులు కారణంగా కూడ రాధాకృష్ణ, ప్రభుదాస్,పి.లక్కు, సుందర్ రావు, పృధ్వి రాజు, లతా కుమారి, విజయ, అరుణ, నరేష్, బొజ్జయ్య, గంగాభవాని, స్వరూపా కోర్టులకు వాయిదాలు తిరుగుతూ ఉన్నారు. దీంతో పెట్టిన అక్రమ కేసు నాలుగేళ్ల తర్వాత పాడేరు జిల్లా కోర్టులో అన్ని రకాల విచారణ వాదోపవాదాల అనంతరం కేసుకు సంబంధించిన బలమైన ఆధారాలు ఏమి లేవని గుర్తించిన న్యాయస్థానం 12మందిపై పెట్టిన అక్రమ కేసును కొట్టివేస్తూ మంగళవారం న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు. కేసును కొట్టివేయడంతో ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తూ న్యాయమూర్తికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

శుక్రవారం జరగాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు: జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,జూలై7,ప్రభాతవార్త:

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ అసిస్టెంట్లు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలందరూ తమ నివాసాల్లో అందుబాటులో ఉండి, తమ వివరాలను సక్రమంగా అందించాల్సిన అవసరం ఉన్నందున ఈ శుక్రవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ టి.నిశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఎల్‌ఓలు ఇంతకుముందు మీ ఇంటికి వచ్చి ఇచ్చిన ఓటర్ ఎన్యూమరేషన్ ఫారాలు నింపిన తర్వాత తిరిగి తీసుకొని బిఎల్ఓ వారి మొబైల్ యాప్‌లో డిజిటైజేషన్ చేయడానికి ప్రజలంతా వారి వారి ఇంటి వద్ద ఉండి అందరు అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా ప్రజలందరూ బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు.

ఆశా వర్కర్లు ఎన్యుమరేషన్ ఫారాలను వెంటనే సమర్పించాలి: తహశీల్దార్

గూడెంకొత్తవీధి జూలై 7 ప్రభాతవార్త

జీ.కే. వీధి మండల పంచాయతీ కార్యాలయంలో మంగళ వారం ఐదు పంచాయతీలకు చెందిన ఆశా వర్కర్ల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని తహశీల్దార్ హెచ్.అన్నాజీరావు నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ ఫారాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆశా వర్కర్లు తమతో పాటు తమ కుటుంబ సభ్యుల వివరాలతో కూడిన ఫారాలను భర్తీ చేసి, సంబంధిత బూత్ స్థాయి అధికారులకు వెంటనే సమర్పించాలని సూచించారు.అయితే, ఈ సమీక్షలో ఐదు పంచాయతీలకు చెందిన 10 మంది ఆశా వర్కర్లు ఇప్పటివరకు తమ ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించలేదని గుర్తించారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ఎలాంటి ఆలస్యం చేయకుండా తక్షణమే ఆయా ఫారాలను పూర్తి చేసి బీఎల్‌ఓలకు అందజేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐదు పంచాయతీల ఆశా వర్కర్లు, రెవెన్యూ సిబ్బంది, మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను గడువులోగా పూర్తి చేయాలి: డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ

గూడెం కొత్తవీధి జూలై 7 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఏబులం గ్రామంలో మంగళ వారం డిప్యూటీ తాసిల్దార్ దుమంతి సత్యనారాయణ పర్యటించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, 'వెలుగు' సిబ్బందితో కలిసి ఆయన సర్వే రికార్డులను తనిఖీ చేశారు. సర్వేను అత్యంత పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం గ్రామస్తులతో నేరుగా మాట్లాడి పలు వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అశోక్, అంగన్‌వాడీ కార్యకర్త సాగిన భవాని, వెలుగు కార్యకర్త తగ్గి జయ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు అందేలా చూడాలి : వైసీపీ నేత బొబ్బిలి లక్ష్మణ్

గూడెంకొత్తవీధి, జూలై 7, ప్రభాతవార్త

ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు కొంత మంది ఓటర్లకు ఇంకా అందలేదని, ప్రతి ఒక్క ఓటరుకూ ఈ ఫారాలు అందేలా బూత్ స్థాయి అధికారులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు పూర్తి స్థాయిలో సహకరించాలని వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్ కోరారు. గూడెం కొత్తవీధి మండలంలో మొత్తం 56 బూత్‌లు ఉన్నాయని, వీటన్నింటికీ వైసీపీ ఇప్పటికే బీఎల్‌ఏలను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో ఈ బీఎల్‌ఏలు బీఎల్‌ఓలకు మద్దతుగా నిలవాలని సూచించారు.ఒక పంచాయతీ లేదా బూత్‌కు చెందిన ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలు సాంకేతిక కారణాల వల్ల వేరే పంచాయతీ లేదా బూత్‌లలో కలిసిపోవడంతో చాలామంది ఓటర్లకు ఫారాలు అందలేదని ఆయన పేర్కొన్నారు. కావున, బీఎల్‌ఏలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని కోరారు. బీఎల్‌ఓల దగ్గర పంపిణీ కాకుండా మిగిలిపోయిన వేరే పంచాయతీల ఫారాలను సేకరించి, సదరు వ్యక్తులను వ్యక్తిగతంగా కలిసి వివరాలు నమోదు చేయించాలని, ఆ సమాచారాన్ని తిరిగి బీఎల్‌ఓలకు అందించి ఓటర్ల జాబితాలో చేర్పించాలని సూచించారు.వేరే పంచాయతీల పరిధిలోకి ఓటర్ల వివరాలు వెళ్లడం వల్ల స్థానిక బీఎల్‌ఓలు ఫారాలు ఇవ్వలేకపోతున్నారని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా అర్హులైన వ్యక్తులు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి, బీఎల్‌ఓలకు పార్టీ నాయకులు, బూత్ ఏజెంట్లు సమన్వయంతో సహకరించి, మండలంలోని ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు నమోదయ్యేలా కృషి చేయాలని బొబ్బిలి లక్ష్మణ్ పిలుపునిచ్చారు.

గూడెం కొత్తవీధిలో తెదేపా బూత్ కమిటీ సమావేశం

గూడెం కొత్తవీధి, జూలై 7 ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పాడేరు నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం గూడెం కొత్తవీధి మండలంలో పర్యటించిన ఆమె, మండలంలోని 16 పంచాయతీలకు చెందిన 56 బూత్ కమిటీల సభ్యులు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. రానున్న రోజుల్లో పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై నిర్వహించే పోరాటాలు, క్షేత్రస్థాయి కార్యాచరణపై బూత్ కన్వీనర్లు, సభ్యులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిలవాలని సూచించారు. అలాగే బూత్‌ల పరిధిలో ఓటర్ల నమోదుతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఈ పర్యటనతో మండలంలోని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా గూడెం కొత్తవీధి ఎంపీటీసీ పసుపులేటి నాగమణి, మండల అధ్యక్షుడు కొండలరావు ఆధ్వర్యంలో ఆమెకు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నలిని, పిఎసిఎస్ చైర్మన్ నూకరాజు, నాయకులు దేశగిరి గోవిందరావు, కంకిపాటి గిరిప్రసాద్, మామిడి చంటిబాబు,రామారావు, పాండురాజు స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాడేరు పంచాయితీ శ్మశానవాటిక అభివృద్ధికి శ్రీకారం

యుద్ధ ప్రాతిపదికన తుప్పలు దొంకలు తొలగింపు.. జేసిబితో లెవెల్ చేసే పనులు ప్రారంభం.. శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలు సహకారం

పాడేరు,జూలై7, ప్రభాతవార్త

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు మేజర్ పంచాయితీ పరిధిలో ఉన్న శ్మశాన వాటికలో అంతిమ సంస్కరణలు చేసేందుకు సరైన రహదారిలేక తుప్పలు, డొంకలు బలిసిపోయి అసౌకర్యాలతో ఉన్న శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాడేరు పట్టణ ప్రజలు అభ్యర్థన మేరకు కమీషనర్ ఆదేశాలతో పలువురు దాతలు సహకారంతో జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కే.చంద్రశేఖర్రావు పర్యవేక్షణలో శ్మశాన వాటికలో తుప్పలు, డొంకలను జేసిబితో తొలగించి శ్మశాన వాటికకు వెళ్ళేందుకు అనువుగా ఉండేలా జేసిబితో సదును చేసే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వాహణకు నీటి సదుపాయాన్ని అలాగే అంత్యక్రియలకు వచ్చే బంధువుల కూర్చోడానికి సౌకర్యంగా ఉండేలా సిమెంట్ కుర్చీలు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు దాతలు సహకారంతో శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఈ అభివృద్ధి పనులను జిల్లా గ్రామ పంచాయితీ అధికారి కే.చంద్రశేఖరావు, ప్రత్యేక అధికారి రమేష్, కార్యదర్శి రామకృష్ణ, పంచాయితీ మాజీ ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు పర్యవేక్షణలో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా శ్మశాన వాటిక ఆహ్లాదకరంగా ఉండేలా శుభ్రంగా ఉండేలా మొక్కలు నాటి వాటిని పెంచే దిశగా చర్యలు తీసుకోనున్నారు. ఇదిలా ఉండగా పంచాయితీ మాజీ ఉప సర్పంచ్ భూరెడ్డి రామునాయుడు శ్మశాన వాటిక అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చి తనవంతుగా సహాయం అందిస్తూ శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలను సమీకరిస్తుండటంతో పంచాయితీ ప్రజలు మాజీ ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు చొరవను ప్రశంసిస్తున్నారు.

బాలికల గురుకుల కళాశాలలో సైబర్ క్రైమ్, చట్టాలపై అవగాహన సదస్సు

గూడెంకొత్తవీధి, జూలై 7 ప్రభాతవార్త

కళాశాల విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని, సమాజంలో చైతన్యవంతులుగా ఎదగాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) సుధాకర్, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థినులకు మహిళలపై అఘాయిత్యాలు, సైబర్ క్రైమ్ అంశాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్ మాట్లాడుతూ, సాంకేతికత పెరిగిన ప్రస్తుత తరుణంలో ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత ఫోన్ కాల్స్, ఓటీపీలు, మరియు అనుమానాస్పద లింకుల జోలికి అస్సలు వెళ్లవద్దన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేసే మాదక ద్రవ్యాల (డ్రగ్స్) అలవాట్లకు దూరంగా ఉంటూ, కేవలం చదువుపైనే శ్రద్ధ పెట్టాలని కోరారు.అనంతరం ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ, చిన్నారులు, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన వివిధ చట్టాల గురించి విద్యార్థినులకు వివరించారు. ఎటువంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని, అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాక్సైట్ సర్వేపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటన చేయాలి

సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కే.లోకనాథం

పాడేరు,జూలై7,ప్రభాతవార్త:

బాక్సైట్ సర్వేపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కే.లోకనాథం డిమాండ్ చేశారు. పాడేరు సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయంలో సీపీఐ(ఎం) -సిపిఎం పార్టీ అల్లూరి జిల్లా కమిటీ తరపున నిర్వహించిన విలేకరుల సమావేశంలో కే.లోకనాథం మాట్లాడారు. అల్లూరి జిల్లా పాడేరు, చింతపల్లి, గుడెం మండలాలు వంటి ఏజెన్సీ ప్రాంతాలు)లో బాక్సైట్ ఖనిజ సర్వేలు ఆదివాసీలు అడ్డుకున్నారని అన్నారు. ఇది ఆదివాసీ ప్రజల భూములు, అడవులు, సాంప్రదాయిక హక్కులను ప్రభావితం చేస్తుందని ఆయన విమర్శించారు. బాక్సైట్, హైడ్రో ప్రాజెక్టులు ఈ సర్వేలు ఆదివాసీ హక్కులు భూమి హక్కులు దేశీయ/అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకం అని ఆరోపించారు. బాక్సైట్ మైనింగ్ వల్ల అడవులు నాశనం, వ్యవసాయ భూములు కోల్పోవడం, విస్తరణ, పర్యావరణ వినాశనం, సాంప్రదాయిక జీవనం దెబ్బతినడం జరుగుతుందని అన్నారు. గతంలో కూడా బాక్సైట్ మైనింగ్‌పై తీవ్ర ఉద్యమాలు జరిగాయి. ఆదివాసీలు, వామపక్ష పార్టీలు నాయకత్వం వహించాయనీ ఆయన గుర్తు చేశారు.

ఎందుకు ముఖ్యమంత్రి మౌనం

ప్రభుత్వం బాక్సైట్ మైనింగ్ తవ్వాకాలకు అనుకూలంగా ఉందని, సర్వేలు దాచి చేస్తున్నారని అన్నారు. 5వ షెడ్యూల్ ప్రాంతాలు ఆదివాసీల భూములు, వనరులు ప్రభుత్వం/బహిర్గతుల నుంచి రక్షణ కోసం రాజ్యాంగం ఏర్పాటు చేసింది వ్యక్తిగత/సామూహిక భూమి హక్కులు గుర్తించడం. గ్రామ సభల అధికారాలను ప్రభుత్వం దిక్కరించడం అన్యాయం అన్నారు. ఆదివాసీల సమస్యలు (భూమి, అడవి, నీటి, ఉపాధి) పరిష్కరించకుండా ప్రభుత్వాలు మైనింగ్/హైడ్రో ప్రాజెక్టుల ద్వారా "అభివృద్ధి" పేరుతో వనరుల దోపిడీ చేస్తున్నాయని ఆయన అన్నారు. ఆదివాసీ హక్కుల రక్షణ, గ్రామ సభల అధికారాలు, ప్రభుత్వ హామీల అమలు కోసం సిపిఎం యొక్క రాజకీయ ఒత్తిడి తెస్తామని, ఇది దీర్ఘకాలిక బాక్సైట్ వ్యతిరేక ఉద్యమాల భాగంలో పోరాటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.స్థానిక ఆదివాసీ సంఘాలు, వామపక్ష పార్టీలు ఇలాంటి అంశాలపై తరచూ పోరాటం చేస్తుంటాయనీ ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. మరోపక్క 1/70 చట్టాన్ని రద్దు చేయాలని సుప్రీంకోర్టులో గిరిజనేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం మౌనం ఉండడం అనేక అనుమానానికి తావిస్తుందన్నారు. అక్రమ మైనింగ్ తవ్వకాలకు ఆదివాసి చట్టాలు అడ్డుగా ఉన్నాయని నిర్వీర్యం చేయడానికి పాలకుల ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. జీఓ నెం.3 అమలు ఇది ఆదివాసీ హక్కులు, షెడ్యూల్-5 ప్రాంతాల రక్షణకు సంబంధించిందని, ప్రత్యామ్నాయ జిఓ ఇస్తామనీ సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని అయన డిమాండ్ చేసారు. పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పల నరస, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.గంగరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.హైమవతి పాల్గొన్నారు.

జానకిరాంపురంలో శ్రీ కోదండరామస్వామి కల్యాణం

ప్రత్యేక అతిథులుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు

గొలుగొండ జులై 7 ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం జానకి రామరంలో కొలువై ఉన్న శ్రీ కోదండరామస్వామి వారి కల్యాణ మహోత్సవం కనుల పండుగగా సాగింది. ఈ కళ్యాణ వేడుకలు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దంపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్పీకర్ అయ్యన్న దంపతులకు గ్రామ ప్రజలు, పెద్దలు వేద పండితుల మధ్య పూర్ణకుంభంతో ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా గ్రామాల్లో ప్రాముఖ్యత పెరుగుతుందని అన్నారు. ఇటువంటి దైవ కార్యక్రమాలు జరగడం ప్రజలను ఉత్తేజపరచడమే కాకుండా కలిసికట్టుగా పనిచేసేలా ప్రేరేపిస్తుందన్నారు. కోదండరామస్వామి ఆలయంలో స్వామివారికి నిర్వహించిన విశేష పూజల అనంతరం జరిగిన కల్యాణ మహోత్సవంలో ఉత్సవమూర్తులకు కళ్యాణ వేదికపై కళ్యాణం నిర్వహించారు. మండపంలో కళ్యాణంలో 20 జంటలు పాల్గొని కళ్యాణం జరిపించుకున్నారు. శాస్త్రీయంగా ఆధ్యాత్మికంగా ప్రస్తుత కాలంలో జరుగుతున్న అనర్థాలు దైవేచ్ఛమైన అంశాలపై వేద పండితులు కళ్యాణం ఘట్టంతోపాటు వివరించారు. అయ్యన్నపాత్రుడు దంపతులు భక్తిశ్రద్ధలతో పాల్గొని వీక్షించారు. ఈ కళ్యాణ ఘట్టంలో విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లా నుండి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ఈ అద్భుతమైన కల్యాణాన్ని తిలకించేందుకు మహిళలు, పెద్దలు, భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద అను వీక్షించారు. విగ్రహ దాతలు ఈ ప్రత్యేక కళ్యాణం అతిథులుగా విచ్చేసి కళ్యాణం జరిపించుకున్నారు. కళ్యాణ మహోత్సవం అనంతరం విచ్చేసిన భక్తులందరికీ భారీస్థాయిలో అన్నసమారాధన భక్తులకు ప్రసాదాలు అందించారు. శ్రీ కోదండరామ ఆలయ చారిటబుల్ ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మూడు రోజుల ఉత్సవాలు ఎనిమిదో తేదీతో ముగియనున్నాయి. ఎనిమిదో తేదీ ఉదయం స్వామివారికి పంచామృత స్నానం, శ్రీ పుష్పయాగం, అలాగే అదే రోజు సాయంత్రం కూడా శ్రీ పుష్పయాగం నిర్వహించి ఈ వేడుకలను పరిసమాప్తం చేయనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ కళ్యాణం లో సీనియర్ నాయకులు అడిగర్ల నానిబాబు, సుర్ల బాబ్జి, ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు, తహసిల్దార్ వి శ్రీనివాసరావు ఆలయ కమిటీ సభ్యులతో పాటు నిత్య కృషీవలుడు నెల్లిపూడి సూరిబాబు, కుమారి దంపతుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు.

అమ్మవారి భక్తులకు అన్న సమారాధన

భక్తుడు అమ్మవారికి వెండి బిందె బహూకరణ

పాడేరు,జూలై7,ప్రభాతవార్త

గిరిజన ఆరాధ్య దైవం కోరికలు తీర్చే కొంగుబంగారంగా పేరుగాంచిన శ్రీ శ్రీ శ్రీ పాడేరు మోదకొండమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు శాసనసభ్యులు విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని అన్న ప్రసాదశీ భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్,మాజీ జెడ్పిటిసి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి బిందె బహుమతి

పాడేరు ఆరోగ్యదైవం పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారికి గాజువాక వాస్తవ్యులు అమ్మవారిని పెండి చెంబు బహుమతిగా ఆలయ ప్రధాన అర్చకులకు, కమిటీకి అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబునాయుడు మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ వంజశీగి కాంతమ్మ, చల్ల రామకృష్ణ, బోనంగి వెంకటరమణ, కొణతాల సతీష్, కిల్లు చంద్రమోహన్, సూర్య ప్రకాష్, లకే రత్నా బయి, పలాసి రమణమ్మ, కురసా లక్ష్మయ్య, జంపరంగి సత్తిబాబు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ టి.నిశాంతి సూచన

పాడేరు,జూలై7,ప్రభాతవార్త

భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ఎన్యుమరేషన్ ఫార్ముల డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు అల్లూరి జిల్లా కలెక్టర్ టి.నిశాంతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అమరావతి నుంచి అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, కడప, కర్నూలు, ఎన్టీఆర్ తదితర జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్యుమరేషన్ ఫార్ముల డిజిటలైజేషన్ ప్రక్రియను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సిన విధానాలపై ఆయన పలు సూచనలు చేశారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంతి ఆధ్వర్యంలో తహసీల్దార్లు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌వోలు), మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు)తో పాటు ఎన్నికల ప్రక్రియలో భాగమైన సంబంధిత అధికారులకు, సిబ్బందికి భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, వేగవంతమైన సేవలందించేందుకు ఎన్యుమరేషన్ ఫార్ముల డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

గిరిజన ప్రాంత విద్యార్థులకు ప్రత్యేక సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు,జూలై7, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పాండు కరాటే అకాడమీ- ఇంటర్నేషనల్ కోఫుకాన్ కరాటే క్లబ్ ఇండియా ఆధ్వర్యంలో పాడేరు మండలంలోని శ్రీకృష్ణాపురం పాఠశాల, గుత్తులాపుటు పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ నిర్వహించనున్నారు. అల్లూరి కలెక్టర్, జిల్లా జిల్లా మేజిస్ట్రేట్ టి.నిశాంతి, జాయింట్ కలెక్టర్ శ్రీపూజ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, చేతుల మీదుగా సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ బాకూరు పాండురాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంత విద్యార్థుల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించేందుకు ఈ ప్రత్యేక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఎం.దీప్తికతో పాటు విద్యార్థినులు పి.జాహ్నవి, పి.భాగ్యశ్రీ పాల్గొన్నారు.

ఓపెన్ 10వ తరగతి, ఓపెన్ ఇంటర్మీడియట్ తరగతులలో అడ్మిషన్లు ప్రారంభం

పాడేరు, జూలై7,ప్రభాతవార్త:

2026-27 విద్యా సంవత్సరమునకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం, అమరావతి ద్వారా నిర్వహించబడు ఓపెన్ 10వ తరగతి, ఓపెన్ ఇంటర్మీడియట్ తరగతులలో అడ్మిషన్ పొందడానికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం సంచాలకులు నోటిఫికేషన్ విడుదల చేశారు. చదువుకు దూరమైన వారికి, చదువు మధ్యలో మానేసి బడికి, కాలేజీకి దూరమైన వారికి, అదేవిధంగా పాఠశాలల్లో, కాలేజీల్లో చదువుకునే అవకాశం లేని బాలబాలికలకు, వయోజనులకు ఇది సువర్ణావకాశం. అత్యంత సరళమైన విద్యా విధానం. సెలవు దినాల్లో మాత్రమే తరగతులు నిర్వహించబడతాయి. ఇష్టమైన ఏవైనా 05 సబ్జెక్టులతో కోర్సు పూర్తి చేయవచ్చు. ఉచిత పాఠ్య పుస్తకాలు అభ్యాసకుల ఇంటికే పంపించబడును. డిజీ లాకర్ సౌలభ్యం : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారి ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్లు డిజీ లాకర్లో అందుబాటులో ఉంచబడును. ఓపెన్ 10వ తరగతిలో చేరుటకు అర్హతలు : చదవగలిగిన మరియు వ్రాయగలిగిన పరిజ్ఞానం కలిగి ఆగస్టు 31, 2026 నాటికి 14సం.లు నిండిన వారందరూ అర్హులే. గరిష్ట వయోపరిమితి లేదు, ఓపెన్ ఇంటర్మీడియట్లో చేరుటకు అర్హతలు : 10వ తరగతి పాస్ అయి ఆగస్టు 31, 2026 నాటికి 15 సంవత్సరాలు నిండిన వారందరూ అర్హులే. గరిష్ట వయోపరిమితి లేదు, ఇంటర్మీడియట్లో ఉత్తీర్ణత కొరకు ఎస్ఎస్సీ ఉత్తీర్ణత సాధించిన నాటి నుండి 02 సంవత్సరములు అంతరం ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థుల వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్మిషన్లు ఈ నెల 12వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని అడ్మిషన్లు ఆన్ లైన్‌లో సబ్మిట్ 30వ చివరి తేదీ అడ్మిషన్ ఫీజు చెల్లించడానికి ఈ నెల 31వ తేదీ లోగా చెల్లించాలని, రూ.200 లేటు ఫీజుతో అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో చేయడానికి ఆగస్ట 15వ తేదీ చివరి అని అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి పేర్కొన్నారు.

కేఎన్ఆర్ పేటలో 50 లక్షలతో డ్రైన్ నిర్మాణం

84వ ఇన్చార్జి మాదంశెట్టి నీలబాబు

అనకాపల్లి జూలై 7, ప్రభాతవార్త

శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తెలుగుదేశం పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జి పిలా గోవింద సత్య నారాయణ పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ సిఫారసులతో మంజూరు అయిన జీవీఎంసీ 50 లక్షలు నిధులతో కొత్తూరు నరసింహరావుపేటలో కాలువ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని 84వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మాదంశెట్టి నీలబాబు తెలియజేశారు. కాలువ లేకపోవడం వల్ల కొత్తూరు నరసింహారావు పేట ప్రజలు ఇంటిలో వినియోగించే మీరు బయటికి వెళ్లే మార్గం లేక చాలా ఇబ్బందులు పడ్డారని పార్టీ నాయకు లకు తెలియజేసి పరిశీలించి నిధులు మంజూరుకు సిఫార్సులు చేయడంతో ఆ ప్రాంత ప్రజలు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారని, మాజీ కార్పొరేటర్ మాదంశెట్టి చిన్న తల్లి సహకారం అందించారని ఈ సందర్భంగా ప్రజలు తెలియజేశారని నీలబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ చూచికొండ వెంకటరమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతి ప్రధానం

విశాఖపట్నం జూలై 7 ప్రభాతవార్త

అక్కయ్యపాలెం జీవీఎంసీ ప్రైమరీ పాఠశాలలో భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నంశాఖ వారి ఆధ్వర్యంలో బివిపి వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ సూరజ్ ప్రకాష్ జి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు చిత్రలేఖన పోటీలలో విజేతలైన విద్యార్థులకు అతిధుల చేతుల మీదగా బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బివిపి ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎంవివి సత్యనారాయణ ప్రసంగిస్తూ విద్యార్థులు బాగా చదువుకొని అత్యున్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్ మాట్లాడుతూ భారత్ వికాస్ పరిషత్ జాతీయస్థాయిలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను తెలిపారు. 3 4 5వ తరగతులకు సంబంధించిన విద్యార్థులు చిత్రలేఖన పోటీలలో పాల్గొనగా విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేయడం జరిగింది. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పివి గణేష్, బివిపి కార్యవర్గ సభ్యులు సిహెచ్ వి సత్యనారాయణ, వి జవహర్, డి వెంకట్రావు, పి వెంకటేశ్వరరావు, ఎం శ్రీ లక్ష్మీ శైలజ , వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించ రాదు

అనకాపల్లి, జూలై 7, ప్రభాతవార్త

బాలల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించ రాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండపల్లి గాంధీ బాబు, మండల గంగా సూర్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం అనకాపల్లి జిల్లా రెవిన్యూ డివిజనల్ కార్యాలయం సమావేశ మందిరంలో బాలల హక్కుల పరిరక్షణ పై మహిళా, శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం, కార్మిక శాఖ, విద్యా శాఖ, పోలీసు శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు, ట్రాన్స్ పోర్ట్ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, డీఆర్డీఏ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు ఉండపల్లి గాంధీ బాబు, మండల గంగా సూర్యనారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసరావు, బాలల సంక్షేమ సమితి, ఛైర్పర్సన్ ఎమ్.ఆర్.ఎల్.రాధ, జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిని ఎస్.సూర్య లక్ష్మీ, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎమ్.రమేష్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి శాఖ అధికారి పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. బాల కార్మికుల నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం, పోక్సో కేసుల దర్యాప్తు, బాధితుల పునరావాసం, బాలల అక్రమ రవాణా నివారణ, టీనేజ్ ప్రెగ్నెన్సీ, గంజాయి కేసులు, పాఠశాల మానేసిన పిల్లలను తిరిగి విద్యలో చేర్చడం వంటి అంశాలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. పోక్సో కేసుల్లో సమయానికి ఎఫ్ఐఆర్లు, బాధిత పిల్లలకు అందించిన పరిహారం, పునరావాస చర్యలు, జనన ధ్రువీకరణ పత్రాల జారీ, వివిధ శాఖల సమన్వయంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో పిల్లలకు పరిశుభ్రమైన వసతి, సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం, నాణ్యమైన ఆహారం, ఆరోగ్య సేవలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించబోమని, జిల్లా స్థాయిలో గుర్తించిన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికతో పాటు తగిన సిఫారసులు సమర్పిస్తామని తెలిపారు. జిల్లాలో జిల్లా స్థాయి అన్ని శాఖలతో సమీక్ష నిర్వహించి బాలల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బాలుడి సంక్షేమం, భద్రత రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. జిల్లాలో గల స్వచ్ఛంద సంస్థల పరిధిలో గల బాలల సంరక్షణ కేంద్రాల అధికారులతో మధ్యాహ్నం 3గంటలకు సమావేశం అయి పిల్లల బాగోగులు తెలుసుకోవడం జరిగింది. ఈ క్రమంలో కశింకోటలో గల బాలసదనాన్ని, సుందరయ్య పేటలో గల దయ చైల్డ్ కేర్ హోమ్ అనే స్వచ్ఛంద సంస్థను కూడా కమిషన్ సందర్శించారు. సమావేశానంతరం బాల్య వివాహాల చట్టవిరుద్ధం పోస్టర్, దత్తత,24 గంటల ఉచిత నెంబర్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, టీనేజ్ ప్రెగ్నెన్సీ పోస్టర్స్ ఆవిష్కరించారు. మెడికల్ డిపార్ట్మెంట్, విద్యా శాఖ, ఎస్సీ, ఎస్టీ బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు, కార్మిక శాఖ, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఆఫీసర్ జ్యువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్, పంచాయతీ రాజ్ శాఖ, సచివాలయ శాఖ, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ పై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సమీక్షా సమావేశం

సైబర్ నేరాల బాధితులకు హోల్డ్ మనీ వాపస్ చేయుటకు ప్రత్యేక ప్రాధాన్యత

అనకాపల్లి, జూలై 7 ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతూ ఈనెల 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్లో ఇరు పార్టీల వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే విధంగా ఉన్నతాధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్లో ఉన్న రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు అలాగే సైబర్ నేరాల కేసుల పురోగతిని ఆయన పరిశీలించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గత లోక్ అదాలత్ ఫలితాల కంటే ఈసారి మెరుగైన ప్రదర్శన కనబరచాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో కేసుల పరిష్కార సంఖ్యను కనీసం 10 శాతం పెంచేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అన్ని స్టేషన్ల అధికారులు తమ పరిధిలోని అర్హత కలిగిన కేసులను గుర్తించి, ఇరు పక్షాల వారికి తగిన కౌన్సెలింగ్ నిర్వహించి, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయ అధికారుల సమన్వయంతో కేసుల త్వరితగతిన పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు నష్టపోయిన సొమ్మును పోలీస్ శాఖ వెంటనే స్పందించి వివిధ బ్యాంకు ఖాతాలలో ఫ్రీజ్/హోల్డ్ చేయించడం జరిగింది. సదరు హోల్డ్ చేయబడిన సొమ్మును చట్టపరమైన ప్రక్రియ ద్వారా బాధితులకు త్వరితగతిన తిరిగి అప్పగించేలా చర్యలు చేపట్టాలని, సైబర్ క్రైమ్ విభాగంతో సమన్వయపరచుకొని బాధితులకు సంబంధించి ఎస్.హెచ్.ఓలు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని సర్కిల్ ఇన్స్పెక్టర్లు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్లు ప్రతిరోజూ తమ పరిధిలోని కేసుల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. ప్రజలు సుదీర్ఘకాలంగా కోర్టు కేసులతో ఇబ్బంది పడు తున్న ఇరు పక్షాల వారు ఈ లోక్ అదాలత్ ద్వారా ఉచితంగా, కోర్టు ఖర్చులు లేకుండా తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని జిల్లా పోలీస్ శాఖ తరఫున ఆయన విజ్ఞప్తి చేశారు.

కేజీబీవీ విద్యార్థిని నాగమణికి భరోసా

ఆస్పత్రిలో పరామర్శించిన జడ్పీటీసీ దొండా రాంబాబు

బుచ్చయ్యపేట జూలై 7, ప్రభాతవార్త

బుచ్చయ్యపేట మండలం వడ్డాది గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) లో ప్రమాదవశాత్తు గాయపడి, ప్రస్తుతం విశాఖ పట్నంలోని కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని కారేటి నాగమణిని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి, బుచ్చయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు మంగళవారం పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకున్న దొండా రాంబాబు విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెబుతూ, ఎలాంటి ఆందోళన చెందవద్దని, అవసరమైన సహాయ సహకారాలన్నీ అందిస్తానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ చైర్మన్ సీతంరాజు సుధాకర్లను కలిసి విద్యార్థినికి అత్యుత్తమ స్థాయి వైద్య సేవలు అందించాలని కోరారు. చికిత్సలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన అన్ని వైద్య సదుపాయాలను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బాధిత విద్యార్థిని పూర్తిగా కోలుకునే వరకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, అవసరమైతే ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని దొండా రాంబాబు తెలిపారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే స్పందించి నేరుగా ఆసుపత్రికి చేరుకుని వైద్యాధికారులతో మాట్లాడి చికిత్సపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం పట్ల స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు ఆయనను అభినందించారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతాయుతంగా వ్యవహరించిన తీరు ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు.

శంకర్ నారాయణ సి.ఐకి సత్కారం

మాధవధార, ప్రభాతవార్త



మాధవధార గ్రామ దేవతలు పండగలను అటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతం నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన ఎయిర్పోర్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణను పండగ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సత్కరించుకున్నారు. మంగళవారం కుంచుముంబ ఆలయం ఆవరణలో సి.ఐకు శాలువాతో సత్కారం చేసి మూమెంట్ను అందచేశారు. వెస్ట్ ఏసీపీ ప్రదీప్తి ఆదేశాలు మేరకు, సిబ్బంది, గ్రామ ప్రజలు సహకారంతో పాటు గ్రామదేవతల ఆశీస్సులతో పండగలు నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. అనంతరం కంచరపాలెం సి.ఐ. రామారావుకు సత్కారం చేశారు.

విశాఖలో పచ్చదనం పరిడవిల్లెలా కృషి చేయాలి

శంకర్ నాయక్, జెసిఇఇ, ఎపి పిసిబి

విశాఖపట్నం, జులై 7 ప్రభాతవార్త



విశాఖలో పచ్చదనం పరిడవిల్లెలా కృషి చేయాలి అని ఎపికాలుష్య నివారణ బోర్డ్ (పిసిబి) జెసిఇఇ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం ఎపి పిసిబి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నేతృత్వంలో నావికా దళానికి చెందిన నెవల్ ఆర్మమెంట్ విభాగం అధికారి విజయ్ కు 200 మొక్కలు అందజేశారు, అంతకుముందు నావికా దళానికి చెందిన వేరే శాఖకు 200 మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం, మన చుట్టూ ఉండే వాతావరణం ఆహ్లాదకరంగా ఉండే విధంగా కృషి చేయాలని కోరారు. తాము ఈ ఏడాది ఎన్విరాన్మెంట్ డే సందర్భంగా పలు మొక్కలు పంపిణీ చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ముకుంద మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చాలా కాలంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది అని వివరించారు. మొక్కలు పంపిణీ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పాల్గొని మాట్లాడారు. నేవల్ ఆర్మమెంట్ విభాగం నుంచి పలువురు పాల్గొన్నారు. మాధవధార గ్రామ దేవతలు పండగలను అటువంటి ఆటంకాలు లేకుండా విజయవంతం నిర్వహించడం లో కీలక పాత్ర పోషించిన ఎయిర్పోర్ట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ నారాయణ ను పండగ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సత్కరించుకున్నారు. మంగళవారం కుంచుముంబ ఆలయం ఆవరణలో సి. ఐ కు శాలువా తో సత్కారం చేసి మూమెంట్ ను అందచేశారు. వెస్ట్ ఏసీపీ ప్రదీప్తి ఆదేశాలు మేరకు, సిబ్బంది, గ్రామ ప్రజలు సహకారంతో పాటు గ్రామదేవతల ఆశీస్సులు తో పండగలు నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. అనంతరం కంచరపాలెం సి. ఐ. రామారావుకు సత్కారం చేశారు.

వైభవంగా బంగారమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఆరిలోవ, జులై 7, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు శ్రీ కృష్ణాపురం, దారపాలెం గ్రామాల ఆరాధ్య దైవం 100 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ శ్రీ బంగారమ్మ తల్లి పండగ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టిడిపి యువ నాయకులు వెలగపూడి ప్రతాపరుద్ర హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ప్రతాపరుద్రను దుస్సాలువతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. వేకువజాము నుండే అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి పొత్రకండ ధర్మారావు, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, ఉపాధ్యక్షులు మారిక జక్కన్న, మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, తెలుగు యువత ఉపాధ్యక్షులు కొండపల్లి పైడ్రాజు, బాయిశెట్టి యోగి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వినోదాల విందు

విశాఖపట్నం, జులై 7, ప్రభాతవార్త

ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ విశాఖ, హైదరాబాద్ ప్రతి నెల నిర్వహించే "వినోదాల విందు"లో భాగంగా స్థానిక పౌరగ్రంథాలయం ద్వారకానగర్లో కాశీ విశ్వనాథ్ 80వ జన్మదిన సంధర్భంగా కామెడీ షో నిర్వహించారు. ఇందులో ఎం వి సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, నక్షత్ర, సూర్య మగ్రాపు, పుష్యమి, బోను నరసింహారావు. కామెడీ స్కిట్స్ లు నిర్వహించారు.శ్రీ హరి హర నృత్య నీకేతన్ సీతమ్మధార గురువు అల్లు వెంకట రమణ శిష్యులు ఎషితా, హర్షిత, జాస్మిత, రిషిత, తన్ విత, నిశ్వని లు శాస్త్రియ, ఒడిసి నృత్యం చేసారు. అనంతరం ఆఫీస్ వాతావరణం, పెద్దాయనని పిలువు, టు లెట్, ప్రేమించా, పెళ్ళికి రాలేకపోయా, పానీ పూరి బండి, చావు సీన్, అత్తగారు పోయారు, వాషింగ్ మెషిన్, పెళ్ళాంతో పెట్టుకోకు, మనఫ్రిజ్, ఇంటికొలతలు, వర్క్ ఫ్రమ్ హోమ్ ఇంకా ఎన్నో స్కిట్స్ ప్రదర్శించి నవ్వులు పూయించారు. తర్వాత అధితులు శ్రీ తిలక్ పట్నాయక్, ఆడిటర్. కె మెహర్ డైరెక్టర్ ఎస్. జి. ఎస్.ఇండియా పీవీటి లిమిటెడ్, కొనా మహేష్, ఐ ఓ సి ల్.శైలజ చేతుల మీదుగా మెమెంటో, గిఫ్ట్ అందజేశారు. ఈ కార్యక్రమం నిర్వహణ ఎం వి సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డాన్స్ గురువు అల్లు వెంకటరమణ, కళాకారులను అందర్నీ అభినందించారు.

నవోదయలో సి.బి.ఎస్.ఈ ఆధ్వర్యంలో స్కిల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్

పీఎం పాలెం, జులై 7, ప్రభాతవార్త

కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయంలో సీ.బీ.ఎస్. ఈ పాఠశాలల ఉపాధ్యాయులకు స్కిల్ ఎడ్యుకేషన్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ఘనంగా జరిగింది. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా, కౌశల్ బోధ్ పేరుతో ఆరు నుండి ఎనిమిది తరగతుల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పాఠ్య పుస్తకాల పై ప్రత్యేక శిక్షణా తరగతులు ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ సి. బీ .ఎస్.ఈ పాఠశాలలకు చెందిన డెబ్భై మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీ. బీ.ఎస్.ఈ జాయింట్ డైరెక్టర్ డా.సతీష్ పాహల్ మాట్లాడుతూ, ప్రతీ విద్యాలయలో స్కిల్ లాబ్ తప్పనిసరిగా ఉండాలని, విద్యార్థులకు విద్య తో పాటు నైపుణ్యాలను అందించడం జాతీయ నూతన విద్యా విధానంలో ప్రధాన భాగమని అన్నారు. నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం నిర్వహించే అవకాశం దొరకడం సంతోషకరమైన విషయం అని, ఈ రోజే నూతనంగా ఆరంభించిన భవనంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. కేంద్రీయ విద్యాలయ మాజీ డిప్యూటీ డైరెక్టర్ పీ.వీ.సాయిరంగారావు సుమన్ రాథోడ్ ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖ వేలి స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, ఉపాధ్యాయులు, రమాదేవి, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

సెంచరీకి చేరిన నమోదు

పీఎం పాలెం, జులై 7, ప్రభాతవార్త

కొమ్మాది మోడల్ ప్రైమరీ స్కూల్ పిల్లలు నమోదు 100 కి చేరినట్టు ప్రధానోపాధ్యాయులు జిటివి సుదర్శన్ పట్నాయక్ తెలిపారు. ఏప్రిల్ 23వ తేదీ సరికి 61గా వున్న ఎన్రోల్మెంట్ కొత్తగా 43 మంది పిల్లలు చేరికతో 103గా నమోదు అయ్యిందని చెప్పారు. ఇందులో సుమారు 25 మంది పిల్లలు వివిధ కార్పొరేట్ పాఠశాలల నుండి మా పాఠశాలపై నమ్మకంతో చేరారాని వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం మండల విద్యా శాఖ అధికారి చింతాడ రవీంద్రబాబు పాఠశాలలో కొత్తగా చేరిన పిల్లలు ను ఉపాధ్యాయులు సుదర్శన్ పట్నాయక్ కె కృష్ణయ్య పల్లి పద్మజ ఇమ్మంది సత్యవాణి ముక్కలకోట లక్ష్మి ప్రియాను అభినందనలు తెలిపారు.

కృష్ణాపురం గోశాలలో 'సీత' ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభం

సింహాచలం, జూలై 7 ప్రభాతవార్త

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలోని కృష్ణాపురం గోశాలలో రాష్ట్ర దేవాదాయ శాఖ శిక్షణా సంస్థ సీత ఆధ్వర్యంలో మూడు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది.శిక్షణ కార్యక్రమాన్ని సీత డైరెక్టర్ ముక్తేశ్వరరావు, ఐఏఎస్, అసిస్టెంట్ డైరెక్టర్ విష్ణు ప్రసాద్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ప్రారంభించారు. అనంతరం గోశాలల శాస్త్రీయ నిర్వహణ, పశువుల ఆరోగ్య సంరక్షణ, సమతుల్య మేత తయారీ, పంచగవ్య ఉత్పత్తుల తయారీ, పరిశుభ్రత ప్రమాణాలు, గోసంరక్షణలో అనుసరించాల్సిన ఆధునిక విధానాలపై నిపుణులు శిక్షణ అందించారు.ఈ సందర్భంగా సీత డైరెక్టర్ ముక్తేశ్వరరావు, ఐఏఎస్ మాట్లాడుతూ, గోవు భారతీయ సంస్కృతి, సనాతన ధర్మానికి ప్రతీకగా నిలుస్తుందని, దేవాలయాల ఆధ్వర్యంలోని గోశాలలు కేవలం పశువుల సంరక్షణ కేంద్రాలుగా కాకుండా గోసేవ, గోసంరక్షణ, సాంప్రదాయ విలువల పరిరక్షణకు కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని అన్నారు. గోశాలల నిర్వహణలో శాస్త్రీయ విధానాలతో పాటు సేవాభావం కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు.

ఈ వారం రోజులు యుద్ధప్రాతిపదికన ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలి

విస్తృత ప్రచారంతో ఈఎఫ్ల సేకరణ వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, జూలై 7 ప్రభాతవార్త

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు మిగిలిన వారం రోజులు యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్వోలు), అదనపు ఈఆర్వోలు, సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్వోలు), స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో ఎం.విశ్వేశ్వరనాయుడు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, జూలై 11,12 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ఈఎఫ్ల పంపిణీ, సేకరణ చేపట్టాలని ఆదేశించారు. ఇంకా ఈఎఫ్లు అందని ప్రతి ఓటరికి ఫారాలు అందించి, పూర్తిచేయించి వెంటనే తిరిగి సేకరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా జిల్లా వ్యాప్తంగా హోర్డింగులు ఏర్పాటు చేయాలని, సినిమా థియేటర్లలో స్లైడ్లు ప్రదర్శించాలని, సోషల్ మీడియా, ప్రధాన మీడియా, ఆటో మైకుల ద్వారా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. జూలై 14 వరకు అవగాహన కార్యక్రమాలు, ఈఎఫ్ల సేకరణ ప్రక్రియ నిరంతరంగా కొనసాగాలని సూచించారు. అన్ని ఈఆర్వోలు తమ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీలు, ప్రముఖులు నివసించే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఈఎఫ్ల సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫోన్ నంబర్ల ఆధారంగా ఆచూకీ లభించని ఓటర్ల వివరాలను సేకరించి, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి స్పెషల్ ఆఫీసర్ ఈ వారం కనీసం మూడు పోలింగ్ కేంద్రాలను తప్పనిసరిగా సందర్శిం చాలని, ఈఆర్వోలు పోలింగ్ స్టేషన్ వారీగా పురోగతిని ప్రతిరోజూ సమీ క్షించాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్లో ప్రత్యేక హెల్ప్డెస్క్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు గేటెడ్ కమ్యూనిటీలు, ఇతర ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల్లో అదనపు హెల్ప్డెస్క్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నేడు కలెక్టరేట్, జీవీఎంసీలో ప్రత్యేక శిబిరాలు

బుధవారం కలెక్టరేట్, జీవీఎంసీ కార్యాలయాల్లో ప్రత్యేక ఎస్ఐఆర్ హెల్ప్డెస్క్లు, శిబిరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కోర్టు కాంప్లెక్స్, వీఎంఆర్డీఏ తదితర ప్రజా రద్దీ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ప్రచార శిబిరాలు నిర్వహించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి దశను పారదర్శకంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా ముగించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

వర్షాకాలానికి జీవీఎంసీ అప్రమత్తం

కాలువలు పొంగకుండా ముందస్తు చర్యలు.. నగర పారిశుద్ధ్యం, వీధి కుక్కల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

-అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు

విశాఖపట్నం, జూలై 7, ప్రభాతవార్త

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో గెడ్డలు, కాలువలు పొంగిపొర్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఆరోగ్య విభాగ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్, ప్రజా ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి కాలువలు, గెడ్డల్లో వర్షపు నీరు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరాన్ని పూర్తిస్థాయిలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (జీవీపీలు) రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, ప్రస్తుతం ఉన్న జీవీపీలను శాశ్వతంగా తొలగించి గ్రీన్ స్పాట్లుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. ఇంటింటి చెత్త సేకరణలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. వీధి కుక్కల నియంత్రణకు జోన్ల వారీగా సమగ్ర సర్వే నిర్వహించి కార్యాచరణ సిద్ధం చేయాలని, ఆటోల నుంచి రోడ్లపై చెత్త వేయకుండా ప్రతి ఆటోలో చిన్న డస్ట్బిన్ ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పారిశుధ్య కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పి. నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి. నరేష్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల క్లస్టర్లతో రైతులకు కొత్త ఊతం

50 శాతం వరకు రాయితీ.. ప్రాసెసింగ్, మార్కెటింగ్కు 40 శాతం ఆర్థిక సహాయం -విశాఖలో ఉద్యానశాఖ అవగాహన సదస్సు

విశాఖపట్నం, జులై 7, ప్రభాతవార్త

ఉద్యాన పంటల ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (సీడీపీ)పై మంగళవారం విశాఖపట్నంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్లో అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ అధిక విలువ కలిగిన ఉద్యాన పంటల క్లస్టర్లు, పట్టణ పరిసర ప్రాంతాల్లో కూరగాయల క్లస్టర్ల ఏర్పాటును మూడు దశల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. క్లస్టర్ రైతులకు పంటల సాగు నుంచి దిగుబడి వరకు అవసరమైన కార్యక్రమాలకు గరిష్టంగా 50 శాతం వరకు రాయితీ, అలాగే క్లస్టర్ నిర్వహణ సంస్థలకు మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్, మార్కెటింగ్, బ్రాం డింగ్, ఎగుమతులు, లాజిస్టిక్స్ తదితర అంశాలకు 40 శాతం వరకు ఆర్థిక సహా యం అందించనున్నట్లు వెల్లడించారు. క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్మెంట్ కార్యక్రమాల సమర్థ అమలుకు అనువైన క్లస్టర్లు, అమలు సంస్థలను గుర్తించేందుకు ఈ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఆసక్తి గల సంస్థలు నేషనల్ హార్టికల్చర్ బోర్డు వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు జిల్లా ఉద్యానశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఎగుమతిదారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రమోషన్లు, ఖాళీల భర్తీ, రిజర్వేషన్ల అమలుకు కృషి చేస్తాం: అసోసియేషన్ నేతలు

విశాఖపట్నం, జులై 7, ప్రభాతవార్త

రైల్వేలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ దక్షిణ కోస్తా జోన్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని దొండపర్తిలో జరిగిన మీడియా సమా వేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం అసోసియేషన్ నిరం తరం పోరాటం చేస్తుందని తెలిపారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో జోనల్ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్న నాయకులు, జోన్ జనరల్ మేనేజర్ను కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యో గుల ప్రమోషన్లు, ఖాళీ పోస్టుల భర్తీ, రిజర్వేషన్ల అమలు వంటి అంశాలపై ప్రత్యేకం గా కృషి చేస్తున్నామని వెల్లడించారు. గుంతకల్, గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖ రైల్వే డివిజన్లలో అసోసియేషన్ చురుకుగా పనిచేస్తోందని, ఉద్యోగుల హక్కుల విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం తో పాటు జోనల్ కార్యాలయానికి ప్రత్యేక స్థలం కేటాయించాలని కూడా అధికారుల ను కోరారు. మీడియా సమావేశానికి ముందు రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు, ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు తమ అసోసియేషన్ కట్టుబడి పనిచేస్తుందని నాయకులు పేర్కొన్నారు. జోనల్, డివిజనల్ స్థాయి అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS
CLASSIFIEDS

CHANGE OF NAME

I, SAHIB MUJEEB AALAM S/O SAHIB MOHAMMED ISMAIL previously called SAHIB VITU MUJEEB AALAM, R/O 1-49-35/B, MAIN ROAD, TAGARAPUVALASA, VISAKHAPATNAM, now changed my name from SAHIB VITU MUJEEB AALAM to SAHIB MUJEEB AALAM. Henceforth I will be called as SAHIB MUJEEB AALAM for all purposes.
(Ro.No.13764)

I, AMEENA BIBI W/O MOHAMMAD MOOSA previously called AMEENA BI R/O 31-48-45, FAKEER TAKIYA, GAJUWAKA, VISAKHAPATNAM, now changed my name from AMEENA BI to AMEENA BIBI. Henceforth I will be called as AMEENA BIBI for all purposes.
(Ro.No.13806)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

ఫారం నెం. 14 (రెగ్యులేషన్ 33(2) చూడవలెను)

రికవరీ ఆఫీసర్-I వారి కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
(ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము)
31-31-21, నారాయణ భవనం, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020

డిమాండ్ నోటీసు

రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్రప్సీ యాక్ట్, 1993లోని సెక్షన్లు 25 నుండి 28 మరియు ఆదాయపు పన్ను చట్టం, 1961లోని రెండవ షెడ్యూలులోని రూల్ 2 క్రింద ప్రకటన

RC/241/2024 23.03.2026

కెనరా బ్యాంక్, మిడ్ కార్పొరేట్ బ్రాంచ్, డాబాగార్డెన్స్, విశాఖపట్నం
వర్సెస్
M/s. ఇంటిగ్రిటీ మైనింగ్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ & ఇతరులు

(CD-1) M/s. ఇంటిగ్రిటీ మైనింగ్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్నవారు డైరెక్టర్లు: శ్రీమతి గరికపాటి శ్వేత & శ్రీ ఉదయ్ భాస్కర్ కొండవీటి, డోర్ నెం. 9-1-252/10, ఫ్లాట్ నెం.17, 5వ అంతస్తు, బాలాజీ టవర్స్, ఆశీల్మెట్ట జంక్షన్, రామ టాకీస్ రోడ్, విశాఖపట్నం-530 003.

(CD-7) శ్రీమతి పి.వి. పద్మ కుమారి, భర్త: లేటు పి. శేషగిరి రావు, ఫ్లాట్ నెం.2, గ్రౌండ్ ఫ్లోర్, సుందర్ ఎన్క్లేవ్, సైంటిఫిక్ నర్సరీ దగ్గర, 1వ ఎ మెయిన్ రోడ్, 14వ క్రాస్, డాలర్స్ కాలనీ, RMV ఎక్స్టెన్షన్ II స్టేజ్, బెంగళూరు, కర్ణాటక-560094.

(CD-9) శ్రీమతి పి. లక్ష్మి ప్రియాంక, తండ్రి: పి. శేషగిరి రావు, #3, గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నెం.1, సుందర్ ఎన్క్లేవ్, 1వ ఎ మెయిన్ రోడ్, 14వ క్రాస్, డాలర్స్ కాలనీ, RMV ఎక్స్టెన్షన్ II స్టేజ్, బెంగళూరు, కర్ణాటక-560094.

1. జారీ చేయబడిన రికవరీ సర్టిఫికేట్ దృష్ట్యా గౌరవనీయ ప్రెసిడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం ద్వారా OA/675/2022 ఆమోదించబడింది. మొత్తం రూ.11,88,17,783/- (అక్షరాల పదకొండు కోట్ల ఎనభై ఎనిమిది లక్షల పదిహేడు వేల ఏడు వందల ఎనభై మూడు రూపాయలు మాత్రమే) అనగా: (i) 1 నుండి 6 వరకు ప్రతివాదులు, దరఖాస్తుదారు బ్యాంకుకు రూ. 10,13,46,813/- ఋణాన్ని, అలాగే దావా కాలంలో మరియు భవిష్య వడ్డీ 14% చొప్పున నెలవారీగా చక్రవడ్డీతో కలిపి వడ్డీని చెల్లించడానికి సంయుక్తంగా మరియు విడివిడిగా బాధ్యులు; మరణించిన ఋణగ్రహీత శ్రీ పోతన శేషగిరి రావు యొక్క చట్టబద్ధ వారసులు (LRS) అయిన 7 నుండి 9 వరకు గల ప్రతివాదులు, తమ వద్ద ఉన్న సదరు మరణించిన వ్యక్తి ఆస్తుల పరిధి మేరకు చెల్లించడానికి బాధ్యులు. (ii) 1 నుండి 3 వరకు గల ప్రతివాదులు, దరఖాస్తుదారు బ్యాంకుకు రూ. 94,11,332/- ఋణాన్ని, అలాగే దావా కాలంలో మరియు భవిష్యత్తులో సంవత్సరానికి 14.40% చొప్పున నెలవారీగా చక్రవడ్డీతో కలిపి వడ్డీని చెల్లించడానికి సంయుక్తంగా బాధ్యులు. (iii) 1 నుండి 6 వరకు గల ప్రతివాదులు, దరఖాస్తుదారు బ్యాంకుకు రూ.80,59,638/- ఋణాన్ని, అలాగే భవిష్య వడ్డీ 14.40% చొప్పున నెలవారీగా చక్రవడ్డీతో కలిపి వడ్డీని చెల్లించడానికి సంయుక్తంగా మరియు విడివిడిగా బాధ్యులు; మరణించిన ఋణగ్రహీత శ్రీ పోతన శేషగిరి రావు యొక్క చట్టబద్ధ వారసులు (LRS) అయిన 7 నుండి 9 వరకు గల ప్రతివాదులు, తమ వద్ద ఉన్న సదరు మరణించిన వ్యక్తి ఆస్తుల పరిధి మేరకు చెల్లించడానికి బాధ్యులు తేది.01.08.2022 నుండి రియలైజ్ అయ్యే వరకు / చెల్లింపు తేదీ వరకు చెల్లించాల్సి ఉంటుంది. (ఉమ్మడిగా మరియు అనేకంగా / పూర్తిగా / పరిమితంగా).
2. ఈ నోటీసు స్వీకరణ నుండి 15 రోజులలోగా పైన తెలిపిన మొత్తాన్ని మీరు చెల్లించాలని మిమ్మల్ని ఇందుమూలంగా ఆదేశించడమైనది. లేనిచో రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ యాక్ట్, 1993 మరియు అందులోని నియమాలకు అనుగుణంగా రాబట్టుకోబడును.
3. మీ ఆస్తుల వివరాల అఫిడవిట్ను విచారణ తదుపరి తేదీన లేదా ఆలోగా వెల్లడించాలని మీకు ఆదేశించడమైనది.
4. పైన తెలిపిన మొత్తానికి అదనంగా మీరు చెల్లించవలసినవి:
   (ఎ) ఎగ్జిక్యూషన్ ప్రొసీడింగ్స్ యొక్క ఈ నోటీసు తరువాత వెంటనే ప్రారంభమయ్యే కాలానికి చెల్లించవలసిన వడ్డీ.
   (బి) ఈ నోటీసు అందించడానికి మరియు మొత్తం బకాయిని రాబట్టుకోవడానికి తీసుకున్న ఇతర ప్రక్రియలు మరియు అన్ని ఇతర ప్రొసీడింగ్స్కు సంబంధించి అయిన అన్ని వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులు.
5. దిగువ పునరుత్పత్తి చేయబడిన ఆదాయపు పన్ను చట్టం, 1961 లోని రెండవ షెడ్యూల్ నందు రూల్ 16 ని చూడండి.

16(1) రూల్ 2 ప్రకారం డిఫాల్టర్పై నోటీసు అందజేసినట్లయితే డిఫాల్టర్ లేదా అతని ప్రతినిధి వడ్డీకి తనఖా పెట్టడానికి, ఛార్జ్ చేయడానికి, లీజుకు లేదా రికవరీ అనుమతితో తప్ప అతనికి సంబంధించిన ఏదైనా ఆస్తితో వ్యవహరించడానికి సమర్థుడు కాదు. అధికారి లేదా ఏదైనా సివిల్ కోర్టు డబ్బు చెల్లింపు కోసం డిక్రీని అమలు చేయడంలో అటువంటి ఆస్తికి వ్యతిరేకంగా ఎటువంటి ప్రక్రియను జారీ చేయరాదు.

16(2) ఈ షెడ్యూల్ ప్రకారం అటాచ్మెంట్ చేయబడినప్పుడు అటాచ్ చేసిన ఆస్తి యొక్క ఏదైనా ప్రైవేట్ బదిలీ లేదా డెలివరీ లేదా అందులో ఏదైనా వడ్డీ మరియు అటువంటి అటాచ్మెంటు విరుద్ధంగా ఏదైనా ఋణం, డివిడెండ్ లేదా ఇతర డబ్బులను డిఫాల్టరు చెల్లించడం చెల్లదు. అటాచ్మెంట్ క్రింద అమలు చేయగల అన్ని క్లెయిమ్లకు వ్యతిరేకంగా ఉంటుంది.

(నా స్వహస్తములతో మరియు ఈ ట్రిబ్యునల్ యొక్క ముద్రతో తేది.23 మార్చి, 2026 న ఇవ్వబడినది)

(అవసరాల అనిల్) రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం

8-7Pg7exHMNWJQEBPGOL.qxdo/p:8-7Pg7exHMNWJQEBPGOL.qxd 1/1/02 8:15 AM Page 1

పోలీసు స్టేషన్ ముందే ఆత్మహత్యాయత్నం

• సిఐ వేధింపులే కారణమని బంధువుల ఆరోపణలు

• మహిళలతో దురుసుగా ప్రవర్తించారంటూ ఆగ్రహం

ఆస్పరి, జులై 7 ప్రభాతవార్త: కర్నూలు జిల్లా ఆస్పరి పోలీసు స్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకున్న ఘటన తీవ్ర కలకలం రేపింది. బిల్లేకల్లు గ్రామానికి చెందిన హనుమంతురెడ్డి అనే వ్యక్తి కేసు విచారణ పేరుతో సి.ఐ. శ్రీనివాస్ నాయక్ తనను తీవ్రంగా వేధిస్తున్నాడని ఆరోపిస్తూ పోలీసు స్టేషన్‌లోనే పురుగుల మందు త్రాగి అత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. భాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం నెల రోజుల క్రితం గ్రామంలో వాల్మీకి, ఈడిగ సామాజిక వర్గాలకు చెందిన రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ కేసులో హానుమంతరెడ్డి ప్రమేయం ఉందనే అనుమానంతో పోలీసులు పలుమార్లు విచారణకు పిలిపించారని తెలిపారు. ఆస్పరిలోని పోలీసు క్వార్టర్స్‌లో మూడు రోజుల పాటు నిర్భంధించి చిత్ర హింసలకు గురి చేయడంతో పాటుడబ్బులు కూడా డిమాండ్ చేశారని వారు ఆరోపించారు. ప్రస్తుతం ఆస్పరి సోసైటిలో జరిగిన అవినీతి అక్రమాలపై సింగిల్ విండో సీఈఓ నరసింహులు ఇచ్చిన కేసు విచారణ పేరుతో మూడు రోజుల క్రితం కూడా స్టేషన్‌కు రప్పించి తీవ్రంగా కొట్టారని వారు పేర్కొన్నారు. మంగళవారం మరోసారి స్టేషన్‌కు రావాలని సమాచారం అందడంతో మళ్ళీ వేధింపులకు గురిఅవుతాననే భయంతో తీవ్ర మనస్తాపానికి గురై హానుమంతురెడ్డి పోలీసు స్టేషన్‌లోనే పురుగుల మందు తాగినట్లు బంధువులు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతన్ని అతనిని స్తానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం 108 అంబులెన్స్‌లో ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. జరిగిన ఘటనపై ఆరా తీసేందుకు పోలీసు స్టేషన్‌కు వెళ్ళిన మహిళలతో సి.ఐ. దురుసుగా ప్రవర్తించాడని భాధితుడి సభ్యులు ఆరోపించారు. మహిళల చీరలను లాఠీతో లాగుతూ అసభ్య పదజాలంతో దూషించాడని వారు వాపోయారు. ఈ ఘటనతో భాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు స్తానిక పోలీసు స్టేషన్ ఎదుట ఆంధోళనకు దిగారు. విచారణ పేరుతో పోలీసుల వేధింపులే ఈ ఘటనకు కారణమరని ఆరోపిస్తు ఘటనపై న్యాయ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా బాధిత కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపై పోలీసుశాఖ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరిస్తున్నట్లు సమాచారం.

ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతులు

• 117 కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150 కోట్లు • వచ్చే వారం సిఎం చేతుల మీదుగా పనుల ప్రారంభం • జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 7 ప్రభాతవార్త: ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతులు,117 కొత్త గేట్ల ఏర్పాటుకు రూ.150 కోట్లతో పనులను ప్రారంభిస్తున్నా మని, వచ్చే వారం ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు జల వనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం ధవళేశ్వరం బ్యారేజ్‌పై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, రాష్ట్రానికి జలవనరుల శాఖ అత్యంత కీలకమని అన్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ రంగాన్ని నిరక్ష ్యం చేయడంతో రూ.18 వేల కోట్ల బిల్లులు బకాయిలుగా మిగిలాయని ఆరోపించారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించి ఇరిగేషన్ రంగాన్ని గాడిలో పెడుతోంద న్నారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల పరిస్థితిపై నిపుణులు హెచ్చరించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఫలితంగా 2024లో 19వ గేటు కొట్టుకుపోయి 105 టీఎంసీల నీరు వృథా అయిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వేగంగా స్పందించి గేటును పునర్నిర్మించి 80 టీఎంసీల నీటిని కాపాడిందని వివరించారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు రూ.250 కోట్లు కేటాయించి పనులు చేపట్టగా, గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల పనులను కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ గోదావరి జిల్లాల జీవనాడి అని, దీని ద్వారా తాగునీటితో పాటు సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. బ్యారేజీ గేట్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని నిపుణులు హెచ్చరించినా గత ప్రభుత్వం నిరక్ష ్యం చేసిందన్నారు. 2015లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో 175 గేట్లలో 58 గేట్లను రూ.32 కోట్లతో మార్చిన విషయాన్ని గుర్తుచేసిన మంత్రి, ఇప్పుడు మిగిలిన117 గేట్లను రూ.150 కోట్లతో పూర్తిగా పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే సాగు సీజన్ నాటికి ఈ పనులను పూర్తి చేయడమే లక్ష ్యమన్నారు.గోదావరి జిల్లాల రైతులకు భద్రత, భరోసా కల్పించే దుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి విడుదల చేసిన 36 ప్రాజెక్టుల ఇరిగేషన్ క్యాలెండర్‌లో గోదావరి డెల్టా ఆధునికీకరణ కూడా ఉందన్నారు. ఉమ్మడి ఐదు గోదావరి జిల్లాల్లో డ్రెయిన్లు, కాలువల వ్యవస్థను రూ.14 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన మెరుగుపరుస్తామని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో, ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 'జలధార–జలహారతి' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిపాదించి అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. నీటి వనరుల సమర్థ నిర్వహణ, సాగునీటి భద్రత, తాగునీటి లభ్యతను నిరంతరం మెరుగుపరచాలనే ప్రభుత్వ నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. మంత్రి వెంట ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గీత కార్మికుల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

• మద్యం దుకాణాలు, బార్లలో 10 శాతం రిజర్వేషన్ • లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ: మంత్రి కొల్లు రవీంద్ర

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 7 ప్రభాతవార్త: రాష్ట్రంలోని అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష ్యమని, ముఖ్యంగా గీత కార్మికులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం పలు కీలక నిర్ణయాలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భశాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఇతర కూటమి నాయకులతో కలిసి మంత్రి మాట్లాడారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ క్రమంలో గీత కులాలైన శెట్టిబలిజ, గౌడ, యాత, శ్రీశయన వర్గాల ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నూతన మద్యం విధానంలో మద్యం దుకాణాల కేటాయింపులో 10 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు. బార్ల కేటాయింపు లోనూ 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గీత కార్మికుల సామాజిక భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, చెట్లపై నుంచి పడి ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు కార్మిక శాఖ నుంచి రూ.5 లక్షలు, ఎక్సైజ్ శాఖ నుంచి రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 33 కేసులకు త్వరలోనే పరిహారం అందించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికులకు పెన్షన్ అందించడం తమ ప్రభుత్వ విశిష్ట కార్యక్రమ మని పేర్కొన్నారు. పోలవరం జిల్లాలోని పందిరిమామిడి ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించినట్లు మంత్రి తెలిపారు. అక్కడ సుమారు 200 రకాల తాటి జాతులపై పరిశోధనలు కొనసాగు తున్నాయని, నీరా పానీయం ఉత్పత్తి, నిల్వ, కోల్డ్‌చైన్ ఏర్పాటుతో పాటు బెల్లం, పౌడర్, స్పిరిట్, స్వీట్నర్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై పరిశోధనలు జరుగుతు న్నాయని చెప్పారు. వీటిని అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానం చేసి గీత కార్మికులకు మెరుగైన ఆదాయం అందేలా కార్యాచరణ రూపొందిస్తు న్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి గోవా, కేరళ తరహాలో విశాఖపట్నం, సూర్యలంక తీర ప్రాంతాల్లో బీచ్ షాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా స్టార్ హోటళ్లతో అనుసంధానించి, పర్యా టకాభివృద్ధికి తోడ్పడేలా ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. అలాగే రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధాన ప్రయోజ నాలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా ప్రజలకు చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను కోరారు.

ప్రతి ఆనకట్ట తనిఖీకి సర్కార్ నిర్ణయం

విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఎపిలోని ప్రతి ఆనకట్టను తనిఖీ చేయాలని జలవనరుల శాఖ నిర్ణయం తీసుకుంది. 151 ఆనకట్టల భద్రత మదింపుకు కమిటీ ఛైర్మన్లుగా జలవనరుల నిపుణులను నియమించింది. ఈ కమిటీ ఛైర్మన్లుగా అక్షయ్‌కుమార్ దాస్, పి.రామచంద్రరావు, ఎం.కె.శ్రీనివాస్, ఎ.కె.గంజు నియమించారు. కమిటీ ఛైర్మన్లుగా ఎ.కె.బజాజ్, అల్వాల్ పరమేశం, జె.చంద్రశేఖర్ అయ్యర్, ఎస్.కె.శ్రీవాత్సవ నియమితులయ్యారు.

9న బనగానపల్లెకు సిఎం చంద్రబాబు

'మీ భూమి మీ హక్కు' కార్యక్రమానికి హాజరు

విజయవాడ, జులై 7 ప్రభాతవార్త ప్రతినిధి: మీ భూమి మీహక్కు కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 9 తేదీన నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. రీ సర్వే ప్రక్రియ పూర్తైన గ్రామాల్లోని రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి బనగానపల్లె నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 9న రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసే పట్టాదారు పాస్ పుస్తకాలతో కలిపి ఇప్పటి వరకూ ప్రభుత్వం 29 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్టు అవుతుంది. ఇప్పటివరకు 6,887 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసి 29.04 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం ముద్రించి పంపిణీ చేసింది. ఈ నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 428 గ్రామాల్లో 2.48 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాల పరిశీలనను రెవెన్యూ శాఖ పూర్తి చేసింది. నంద్యాల జిల్లాలో 8,412 ఖాతా పుస్తకాలు, బనగానపల్లె నియోజకవర్గంలోని 1,125 పాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 9,929 గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇంకా 64.53 లక్షల రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. మీ భూమి మీ హక్కు సమావేశం అనంతరం బనగానపల్లె పార్టీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ఈ నెల 9 తేదీన ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బనగానపల్లెకు ముఖ్యమంత్రి బయల్దేరి వెళ్లనున్నారు. 11.20కి బనగానపల్లె చేరుకుని స్థానిక తహసిల్దారు కార్యాలయానికి వెళ్లనున్న ముఖ్యమంత్రి అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను నేరుగా పరిశీలించనున్నారు. అలాగే పలువురు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు మీ భూమి మీ హక్కు పేరిట పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.35 గంటలకు బనగానపల్లె నియోజకవర్గ టిడిపి కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటల తర్వాత ఆయన అమరావతికి బయల్దేరనున్నారు.

దుర్గమ్మ గుడిలో శాకంబరి ఉత్సవాలు

• 27 నుండి 29 వరకు వేడుకలు

ఇంద్రకీలాద్రి, జులై 7 ప్రభాతవార్త: దుర్గమ్మ శాకంబరి మాతగా ఈనెల 27 నుండి 29 వరకు మూడు రోజుల పాటు భక్తులను అనుగ్రహించనున్నారు. సకలలోకాలు క్షామంతో పీడితగ్రస్తమై బాధపడుతుండగా వారిని అనుగ్రహించడానికి శ్రీ అమ్మవారు శాకంబరిగా అవతరించి వారి క్షుద్భాధను తీర్చినందున భక్తులు శ్రీ అమ్మవారిని శాకంబరి మాతగా కొలుస్తుంటారు. శాకంబరి మాతను దర్శించుకుంటే కరువు కాటకాలు తొలగి, సుఖసంతోషాలు కలుగుతాయని వేదపురాణాల వచనం ప్రకారం ఈ ఉత్సవాలను దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్, పాలకమండలి, అధికారులు ఉత్సవ పత్రికను ఆవిష్కరించారు. అలాగే ఈనెల 15 నుండి ఆగస్టు 12 వరకు దుర్గమ్మ ఆలయంలో ఆషాఢమాస ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

పలు తీర్మానాల ఆమోదం: పాలక మండలి సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించినట్లు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. దుర్గమ్మ ఆలయంలో 2లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్‌ట్యాంక్ నిర్మాణం, పైపు లైన్ ఏర్పాటుకోసం తీర్మానం ఆమోదించారు. ఆలయంలో వినియోగిస్తున్న మారుతి అంబులెన్స్ వేలంలో హెచ్చుపాటపాడిన తాడేపల్లికి చెందిన గౌరిశంకర్ మోహన్‌రావుకు పాట ఆమోదించారు. దేవస్థానంలో పలు ఆదాయ వ్యయాల వివరాలను పాలకమండలి సమావేశంలో ఆమోదించారు. రు.3,25,000 అంచనాలతో పోరంకి వేదపాఠశాలలో బోరు వేయుటకు ఆమోదం తెలిపారు. దేవస్థానంకు కొత్త సెక్యూరిటీ ఏజెన్సీ టటెండరు పిలుచుటకు ఆమోదం తెలిపారు. రు.3,75,000ల అంచనాతో సింగ్‌నగర్‌లో వున్న 1.98సెంట్ల దేవస్థాన భూమిలో బోరు వేయుటకు ఆమోదం, సివిరెడ్డి గెస్ట్‌హౌస్, మాడపాటి గెస్ట్‌హౌస్‌లో సమగ్ర వర్షపునీటి సంరక్షణకు రు.40లక్షలతో వ్యవస్థ ఏఆర్పాటుకు ఆమోదం, కొత్త క్యూలైన్ల ఫ్రేమ్‌ల టెండర్ ఆమోదం, కేశఖండనశాల నిర్వహణకు టెండరు ఆమోదం, మహామండపం లిఫ్టులు, నిత్యాన్నదాన భవనం వద్ద ఆర్‌సిసి డ్రైన్ ఏర్పాటుకు టెండర్లు ఆమోదం, శ్రీ అమ్మవారికి భక్తులందించిన వడిబియ్యం, దసరా, భవానీ దీక్షలకు వచ్చు ఇరుముడి బియ్యం కొనుగోలుకు లైసెన్సు టెండర్ ఆమోదం, రు.40లక్షలతో కొండపై షామియానాలు, కార్పెట్లు సప్లయ్ చేయడానికి టెండర్ ఆమోదం తెలిపారు.

భక్తుల విరాళాలు: దుర్గమ్మ భక్తులు మంగళవారం మొత్తం నలుగురు విరాళాలు అందించారు. నిత్యాన్నదాన పథకానికి మంగళవారం విజయవాడకు చెందిన పోతిన బెసి కంటేశ్వరుడు, నిర్మలాదేవి దంపతులు మరియు కుమారులు పోతిన దుర్గ వెంకటేష్ పోతిన బాల వర్ధన్‌లు రు.1,00,016ల విరాళం చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. విజయవాడకు చెందిన జగదీశ్వరి, కూతురు ప్రత్యూష వారి అల్లుడు రవీంద్ర పేరున అమ్మవారి నిత్య అన్నదాన విభాగమునకు రూ.2లక్షల విరాళము అందించారు. శ్రీఅమ్మవారి ప్రతిరోజు ఉచిత ప్రసాదం విభాగమునకు గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన సానా శ్రీనివాసరావు రు.1లక్ష విరాళం అందించారు. నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన పి రవిచంద్ర, వారి కుటుంబ సభ్యులు రు.1లక్ష విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

జనసేన పార్టీలో చేరిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గుడిపాటి సీతారాం, భార్య, యువ గాయని శ్రీలలిత

విజయవాడ, జులై 7 ప్రభాతవార్తప్రతినిధి: విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు గుడిపాటి సీతారాం జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీతారాం భార్య, యువ గాయని శ్రీలలిత కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గుడిపాటి సీతారాం మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ ఖిదేశమే ప్రథమంఖి అనే దృక్పథంతో పనిచేస్తున్నారని, ఆయన నాయకత్వ స్ఫూర్తితోనే తాను జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు, పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. గుడిపాటి ఫౌండేషన్ ఛైర్మన్‌గా సీతారాం క్రీడలు, యువజన అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్లు నిర్వహిస్తూ క్రీడా రంగంలో తనదైన గుర్తింపు పొందారు. ఆయన చేరికతో కృష్ణా జిల్లాలో జనసేన పార్టీకి క్రీడా, వ్యాపార వర్గాల నుంచి మరింత మద్దతు లభిస్తుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సీతారాం పార్టీలో చేరడం పట్ల జనసేన శ్రేణులు, సోషల్ మీడియా వేదికగా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే రావణ్ అరెస్ట్ డ్రామా

నెల్లూరు(వైద్యం), జులై 7 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే రావణ్ అరెస్ట్ డ్రామా ఆడుతున్నారని, ఉపా చట్టం ప్రయోగంపై దేశవ్యాప్తంగా భారీ వ్యతిరేకతను చూపుస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం నెల్లూరులోని వైయస్సార్సీపీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు పరాకాష్ట రావణ్ అరెస్ట్ చేసారని శాంతిభద్రతల వైఫల్యాలు, కస్టోడియల్ డెత్స్ నుంచి డైవర్షన్ పాలిటిక్స్ కూటమి ప్రభుత్వం కొత్త డ్రామాలకు తెరలేపారన్నారు. రావణ్ వ్యాఖ్యలతో మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదు కానీ ఉపా చట్టం ప్రయోగించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయాయని, పోలీస్ స్టేషన్లలో లాకప్ డెత్‌లు, శవాల మాయం వంటి అరాచకాలు రాజ్యమేలుతున్నాయని గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

సాయికృష్ణ, క్రాంతి కుమార్ వంటి బాధితుల కస్టోడియల్ మరణాలపై తాము చట్టాన్ని, పోలీసు వ్యవస్థను ప్రశ్నిస్తుంటే, ఆ పరిపాలనా వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చంద్రబాబు నాయుడు అత్యంత చాకచక్యంగా డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని గోవర్ధన్ రెడ్డి మండిపడ్డారు.

తిరుపతిలో శరభయ్య విగ్రహం ప్రతిష్టిస్తాం

• టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్

తిరుపతి (హెల్త్), జులై 7 ప్రభాతవార్త: తిరుపతిలో సన్నిధి గొల్ల శరభయ్య యాదవ్ విగ్రహం తిరుమలలో ఏర్పాటు చేయాలనే నినాదంతో యాదవు లంతా మీటింగులు, ర్యాలీలు నిర్వహించడం జరిగిందని, యాదవులంతా ఒకతాటిపై రావడం గర్వకారణమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ వ్యాప్తంగా ఉన్న యాదవుల మనోభావాలకు సంబంధించి యాదవ కార్పొరేషన్ చైర్మన్ అయిన 17.4.2025 విజయవాడలో జరిగిన మొదటి సమావేశంలోనే తిరుమలలో శరభయ్య యాదవ్ విగ్రహం పెట్టాలని, శరభయ్య యాదవ్ పేరుపైన మఠం ఏర్పాటు చేయాలని, తిరుమలలో బోర్డు మీటింగ్ ఏర్పాటు చేసి తిరుమలలో ఒక్క వీధికి శరభయ్య యాదవ్ పేరు నామకరణం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. తిరుపతిలో నిర్మిస్తున్న యాదవ్ భవన్ నిర్మాణానికి యువతకు అందరూ సహాయ సహకారాలు అందించాలన్నారు. తిరుపతి ప్రశాంతతను దెబ్బ తీసే విధంగా వైసీపీ నాయకులు కుట్రలు చేస్తుందన్నారని ఆరోపించారు.

కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే వ్యక్తులను ప్రోత్సహిస్తారా జగన్

నెల్లూరు, జులై 7 ప్రభాతవార్త: హిందూ ధర్మానికి, దేవుళ్ళకు అవమానం జరిగితే స్పందించాల్సిన బాధ్యత సాటి భారతీయుడిగా తనకు ఉందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈరోజు హిందువులపై మాట్లాడాడు, రేపు క్రిస్టియన్, ముస్లింలపై మాట్లాడడని మీరు గ్యారెంటీ ఇస్తారా జగన్ రెడ్డి? హిందూ దేవుళ్లపై, సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులను మీరు ఎలా సమర్థిస్తారు? అని ప్రశ్నించారు. ప్రజా జీవితంలో జగన్ రెడ్డి కొనసాగాలంటే కోట్లాదిమంది భారతీయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాను ఎమ్మెల్యేగా కాకుండా ఓ సామాన్య భారతీయుడుగా మాట్లాడు తున్నా, తాను భారతీయుడిని, హిందువుని. పరామతా లతో కలిసి నడిచే ధర్మం హిందూ ధర్మం నేర్పింది. అన్ని కులాలు, మతాలను గౌరవించే వ్యక్తిని నేను. మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు మాట్లాడా. క్రిస్టియన్‌లకి అండగా ఉన్నా. హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తులకు జగన్ మద్దతు ఇస్తుంటే మాట్లాడాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. హిందూ మత విశ్వాసలపై మాటల దాడులు చేస్తున్న జోసఫ్ ప్రశ్న రావణ్‌ని ఎలా సమర్థిస్తారు జగన్ రెడ్డి అని నిలదీశారు. దేవుళ్ళని నమ్మడం, నమ్మకపోవడం వారి ఇష్టం. దేవుళ్ళని తిట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారు. జోసఫ్ ప్రశ్న రావణ్ మాట్లాడిన మాటలు విన్నారా. రాముడిని, రామా యణాన్ని, మహా భారతాన్ని జోసఫ్ రావన్ మాట్లాడిన మాటలు విని జగన్ రెడ్డి ఎలా సమర్థిస్తారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నిలదీశారు.

కొడుకును హత్య చేసి.. తండ్రి ఆత్మహత్య

కంభం (అర్ధవీడు), జులై 7 ప్రభాతవార్త: ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న కొడుకును మద్యం మత్తులో ఉన్న తండ్రి హత్య చేసి, అనంతరం తాను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మార్కాపురం జిల్లా అర్ధవీడు మండలం మిట్టమీదపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు మిట్టమీదిపల్లె గ్రామానికి చెందిన పఠాన్ శిలార్ (55)కు గ్రామంలో చిన్న, చిన్న పనులు చేసుకుంటూ మద్యానికి బానిస అయ్యాడు. పెద్ద కుమారుడు ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తూ చేస్తుండగా, తల్లి రోజు కూలికి వెళ్లి వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్న కుమారుడు పఠాన్ జావేద్ (25) ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నం చేసి వయస్సు మీరడంతో ఏ పని చేయక ఖాళీగా ఉంటుండగా ఈ విషయంలో తండ్రి, కొడుకుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. మూడు రోజుల క్రితం తండ్రీ, కొడుకుల మధ్య వివాదం జరిగినట్లు తెలిసింది. కాగా మంగళవారం పఠాన్ జావిద్ ఇంట్లో మంచంపై నిద్రిస్తుండగా మద్యం సేవించి ఇంటికి వచ్చిన తండ్రి పటాన్ శిలార్ కోపంతో ఇంట్లో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో కుమారుడు జావీద్ తలపై బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన జావేదును కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ విషయం తెలిసిన తండ్రి పఠాన్ శిలార్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ కుటుంబం తీవ్ర విషాదం లో మునిగింది. విషయం తెలుసుకున్న కంభం సీఐ మల్లికార్జున, అర్ధవీడు ఎస్ఐ నాంచారయ్యలు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ మా నాయకుడు.. అసత్య ప్రచారం నమ్మొద్దు: మాజీ ఎంపి మేకపాటి

నెల్లూరు(వైద్యం), జులై 7 ప్రభాతవార్త: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నామని, ఆయన వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితోనే మా పయనం.. ఎన్ని అపోహలు సృష్టించిన.. మా నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి అని మాజీ పార్లమెంట్ సభ్యుడు మేకపాటి రాజమోహన్ రెడ్డి పేర్కొన్నారు. తాను అనారోగ్యం కారణంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేకపోతున్న అంతే తప్ప ఎలాంటి అపోహలకు తావు లేదని ఆయన స్పష్టం చేశారు. తాము పార్టీ మారుతున్నామని వస్తున్న వార్తల్లో నిజం లేదని మంగళవారం రాజమోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి సత్యదూర ప్రచారాన్ని ప్రజలు, తమ అభిమానులు నమ్మవద్దని సూచించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పట్ల ప్రజల్లో సంపూర్ణ నమ్మకం, విశ్వాసం ఉందని, రాష్ట్ర భవిష్యత్తు ఆయనతోనేనని.. జగన్ వెంట నడవడం తాము అదృష్టంగా భావిస్తున్నామని.. త్వరలోనే ప్రజా పోరాటానికి శ్రీకారం చుడతామని రాజమోహన్ రెడ్డి వెల్లడించారు. తమను సంప్రదించకుండా నిరాధార ప్రచారం చేయడం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. మేకపాటి కుటుంబం ఇప్పటికీ ఎప్పటికీ.. జగన్ వెంటే నడుస్తుందని తెలిపారు.

8-7Pg8exHMNWJQE.qxd:8-7Pg8exHMNWJQE.qxd 1/1/02 8:17 AM Page 1

10 నుంచి దోస్త్ ఇంట్రా కాలేజ్ ఫేజ్

13 వరకు అవకాశం.. 14న సీట్ల కేటాయింపు

దోస్త్ కన్వీనర్ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త: డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)- 2026 ద్వారా ఇప్పటికే మూడో విడతల్లో సీట్ల కేటాయింపును పూర్తి చేశారు. సీట్లు పొందిన వారు కాలేజీల్లో చేరడానికి అవకాశం ఈ నెల 4తో ముగిసింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కాలేజీల్లో చేరిన విద్యార్థులకు అదే కాలేజీలో మరో కోర్సులో చేరేందుకు అవకాశం కల్పిస్తూ ఇంట్రా కాలేజ్ ఫేజ్‌కు అవకాశం కల్పించారు. ఈ నెల 10 నుంచి 13 వరకు ఇంట్రా కాలేజ్ ఫేజ్‌కి అవకాశం కల్పించినట్టు దోస్త్-2026 కన్వీనర్, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంట్రా కాలేజ్ ఫేజ్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 14న సీట్ల అలాట్‌మెంట్‌ను చేయనున్నారు. మెరిట్, రిజర్వేషన్ల అధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. దోస్త్-2026 మూడు విడత సీట్ల కేటాయింపు పూర్తయి.. విద్యార్థులు కాలేజీల్లో చేరడానికి గడువు ముగిసే నాటికి 1,17,658 మంది కాలేజీల్లో చేరారు. మూడో విడత కేటాయింపు సందర్భంగా కాలేజీల్లో చేరడానికి ఈ నెల 4(శనివారం) వరకు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం వరకు రాష్ట్రవ్యాప్తంగా దోస్త్ ద్వారా 1,17,658 మంది కాలేజీల్లో చేరినట్టు తెలిసింది. నాన్ దోస్త్ కాలేజీల్లో 21,034 మంది చేరారు. 2026-27 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో 1,38,692 మంది చేరారు.

విద్యార్థుల నిరసన ప్రదర్శనలో ప్రసంగిస్తున్న మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ తదితరులు

ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకంపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలి

14న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి:

మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్ (సైఫాబాద్), జులై 7, ప్రభాతవార్త:విద్యార్థుల ఫీజుల రీయింబర్స్‌మెంట్ పథకంపై నెలకొన్న గందరగోళానికి సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కళాశాలల యాజమాన్యాల కోర్టు కేసుల మధ్య నలిగిపోతున్న విద్యా ర్థుల భవిష్యత్తుతో చెలగాటమాడరాదని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర విద్యార్థి జెఎసి ఛైర్మన్ వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆనేక మంది విద్యార్థులు మంగళవారం నల్లబ్యాడ్జిలు ధరించి గన్‌పార్కు వద్ద భారీగా నిరసన ప్రదర్శన చేపట్టిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకం ప్రభుత్వ పథకమా? లేక ప్రైవేటు ఫైనాన్స్ పథకమా?, ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించేది ప్రభుత్వం ఇచ్చే బిక్షం కాదని ఇది వారి హక్కు అని స్పష్టం చేశారు. జివోల పేరిట, కమిషన్‌ల పేరిట ప్రభుత్వం కాలయాపన చేయరాదని, వారి జీవితాలతో చెలగాటమాడరాదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి కో-కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు నందగోపాల్, నరసింహా నాయక్, సానియా, నరేష్, సతీష్, ప్రవీణ్, హారీష్ తదితరులు పాల్గొన్నారు.

బోగస్ విద్యార్థి సంఘాలు వేధిస్తున్నాయి

రక్షణ కల్పించాలని డిజిపికి ఫిర్యాదు

ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్‌రెడ్డి

హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త: రాష్ట్రంలో గుర్తింపు పొందిన ప్రైవేటు స్కూల్స్‌లో కొందరు బోగస్ విద్యార్థి సంఘాల పేరుతో వేధిస్తున్నారని, ఆర్‌టీఐ యాక్ట్‌ను భూతంలా చూపుతూ వేధిస్తున్నారని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ మంగళవారం హైదరాబాద్‌లో జనరల్‌బాడీ సమావేశం నిర్వహించి అనంతరం మీడియాతో మాట్లాడారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కె అనిల్ కుమార్, ట్రెజరర్ కె శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ .. స్వచ్ఛందంగా మధ్యతరగతి విద్యార్థులకు విద్యా బోధన అందిస్తున్న ఎకనామికల్ విద్యాసంస్థల పట్ల బోకస్ విద్యార్థి సంఘాలు ఒక శాపంలా మారాయని, మెరుగైన విద్యాబోధన అందించాలా లేకపోతే బోకస్ సంఘాలను ఎదుర్కోవాలా అని ప్రశ్నించారు. గతంలో విద్యార్థి సంఘాల్లో పనిచేసిన వారు బోకస్ విద్యార్థి సంఘాలను పెట్టుకొని ఆర్‌టీఐ యాక్ట్‌ని భూతంలా చూపిస్తూ విద్యాసంస్థలలో ప్రమాణాలు లేవని పేర్కొంటూ అక్రమాలకు పాల్పడుతూ అదే వారి జీవన ఆధారంగా పెట్టుకుని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారే కాకుండా కుల సంఘాలా పేరు పెట్టుకుని కొని స్కూల్స్‌కి ఎలాంటి సంబంధం లేనప్పటికీ.. వారు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కొందరు స్థానిక ఎంఈవోలను బెదిరించి వారితో ప్రైవేటు స్కూల్స్‌కి లెటర్స్ సర్వ్ చేయించి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మండిపడానదరు. కొంతమంది జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) అవతారం ఎత్తి ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వారిని తట్టుకోలేక కొన్ని విద్యాసంస్థలు మూత పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి సమక్షంలో స్టేట్ నోడల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కె.విద్యాసాగర్.

సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన విద్యాసాగర్

హైదరాబాద్ (బేగంపేట) జులై 7, ప్రభాతవార్త: సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా కె.విద్యాసాగర్ మంగళవారం బాధ్యతలు స్వీకరిం చారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.జి.చిన్నారెడ్డి సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన దివ్యదేవరాజన్ పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌గా బదలీకావడంతో కొత్తగా పోస్టింగ్ అయిన విద్యాసాగర్ కు బాధ్యతలు స్వీకరించారు. ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో డా.జి. చిన్నారెడ్డి వారిద్దరికీ శుభాకాంక్షలు తెలియ జేసారు. దివ్యదేవరాజన్ ఇప్పటివరకు సిఎం ప్రజావాణికి అందించిన సేవలను చిన్నారెడ్డి కొనియాడారు. నూతన స్టేట్ నోడల్ అధికారి కె.విద్యా సాగర్ ఆధ్వర్యంలో సిఎం ప్రజావాణి కార్యక్రమం మరింత సజావుగా సాగుతుందని చిన్నారెడ్డి ఆశాభావం వ్యక్తం చేసారు.

బిసి స్టడీ సర్కిళ్ల పటిష్టానికి ప్రత్యేక కమిటీ

16 నుంచి కులవృత్తుల మేళా

స్కిల్ డెవలప్‌మెంట్‌తో బిసిలకు మరిన్ని ఉపాధి అవకాశాలు

ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై అధ్యయనం చేయాలి

బిసి సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త: రాష్ట్రంలోని బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 16 నుంచి కులవృత్తుల మేళాను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై అధ్యయనం చేయాలని, స్కిల్ డెవలప్‌మెంట్‌తో బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు దక్కేలా చూడాలన్నారు. బీసీ గురుకులాలు, హాస్టళ్ల ప్రారంభమై 20 రోజులు పూర్తయిన నేపథ్యంలో గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాలు, హాస్టళ్ల పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన క్లీన్ అండ్ గ్రీన్ వాతావరణంలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అన్ని గురుకులాలు, హాస్టళ్లలో తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారులు (డీబీసీవోలు) క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు తరచూ గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు. స్టడీ సర్కిల్స్‌లో మరింత నాణ్యత పెంపొందించేందుకు, సివిల్స్‌తోపాటు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న స్టడీ సర్కిల్స్ విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 16 నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కులవృత్తుల మేళాలో అన్ని కులాల సంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే కుట్టు మిషన్ పథకం అమలు కోసం సమగ్ర విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ఉపాధి అవకాశాలను పెంచాలన్నారు. ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేసి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులకు అందించే ల్యాప్‌టాప్‌ల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్, గురుకులాల కార్యదర్శి ఆకస్మికంగా గురుకులాలు, హాస్టళ్లను తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షి ంచాలన్నారు. కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ పూర్తి చేసుకొని కిట్లు అందని జిల్లాల్లో వెంటనే పంపిణీ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమాయదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రాముని ట్రస్ట్ పేరుతో కోట్లు కాజేశారు

భక్తుల వద్ద అయోధ్య ట్రస్టు అక్రమాలపై చర్చ జరుపుదాం: విహెచ్

హైదరాబాద్, జులై 7, ప్రభావార్త: రాముని ట్రస్ట్ పేరుతో కోట్ల రూపాయలు కాజేశారు బిజెపి కి హిందూ దేశం కావాలి అనే ఆలోచన మాత్రమే ఉంది రాముడిపై భక్తీ లేదని ప్రభుత్వ సలహా దారు వి.హనుమంత రావు విమర్శించారు. మంగళవారం గాంధీభవన్ వి.హనుమంతు రావు మాట్లాడుతూ రాముని గుడిలో ఇంత అన్యాయం జరిగితే బిజెపి నాయకులు ఎందుకు స్పందించడం లేదనీ ప్రశ్నించారు. రాముడు ఒక్క అయోధ్యలోనే ఉన్నాడు అనే ప్రచారం బిజెపి చేసిందే కానీ ఇంతపెద్ద స్కామ్ జరుగుతుంటే మోదీ విదేశాల్లో అవార్డు తీసుకుంటున్నారనీ నిందించారు. అమిత్ షా మోదీ దీనిపై నోరు మెదపడంలేదని అన్నారు. రాముడి విషయం లో కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు ఎందుకు వ్యవహరి స్తుందనీ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుళ్ళలో భక్తుల వద్ద అయోధ్యట్రస్టు అక్రమాలపై చర్చ జరుపుదాం మనీ ఆయన పిలుపునిచ్చారు. తిరుపతి దేవస్థానం లో లడ్డూ కల్తీకి సిబిఐ విచారణ జరిగిందనీ తెలిపారు. ఇన్ని వేల కోట్ల అవినీతి జరిగితే బిజెపి ఎందుకు మాట్లాడటం లేదు నా లాంటి భక్తులు అడుగుతున్నారనీ అన్నారు. భద్రాచలం కూడా వెళ్లి దీనిపై చర్చ చేస్తా అని ఆయన ఆగ్రహంతో అన్నారు. రాముని డబ్బుతో అందరూ బంగ్లాలు విల్లాలు కొంటున్నారనీ, బిజెపి మొన్నటి దాకా సీటు చోరీ , ఇప్పుడు పైసా చోరీ , బంగారం చోరీ చేస్తోందని ఆరోపించారు. విదేశాలకు పోవడానికి మోదీ కి టైం ఉంది , రాముని గుడికి పోవటానికి ఎందుకు టైం లేదనీ ప్రశ్నించారు ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ, బిజెపి పరిషత్ ఎంత దోచుకుందో రాముని పేరుతో తెలియాలన్నారు. సిబిఐ ఎంక్వరీ వెయ్యాలి లేదు అంటే దేశం మొత్తం రాముని గుళ్ళ లో ఈ చర్చ జరగాలని అన్నారు.

లేబర్ కోడ్‌పై కార్మికులు, యాజమాన్యం సూచనలతో

నిబంధనల రూపకల్పన

సమతుల్య విధానంతోనే పారిశ్రామిక ప్రగతి

కార్మికులు పరిశ్రమల ప్రయోజనాలు లేబర్ కోడ్ లక్ష్యం

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త: కార్మికుల సంక్షేమంతోపాటు పరిశ్రమల ప్రయోజనాలను పరిరక్షించేలా సమతుల్య విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని కార్మిక, ఉపాధి, శిక్షణ ఫ్యాక్టరీస్ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పరిశ్రమలు సజావుగా, లాభదాయకంగా కొనసాగితేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, కార్మికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్మిక చట్టాల పై హైదరాబాద్‌లోని ఎంసిహెచ్ ఆర్‌డి లో మంగళవారం నిర్వహించిన భాగస్వాముల సంప్రదింపుల సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొని మాట్లాడారు. కార్మిక న్యాయస్థానాలకు సంబంధించిన అంశాలు, రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలు, కేంద్ర ప్రభుత్వానికి చేయాల్సిన సిఫార్సులు, రూపొందించాల్సిన నిబంధనలపై విస్తృతంగా చర్చ జరగాలని సూచించారు. యాజమాన్యాలు, కార్మికులు పరస్పరం చర్చించుకొని సహేతుకమైన నిర్ణయాలకు వస్తే పరిశ్రమలకు సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. పరిశ్రమలు బాగా నడిస్తే కార్మికులు సంతోషంగా ఉంటారు. పరిశ్రమల విస్తరణతోపాటు కార్మికులకు మరిన్ని సౌకర్యాలు అందించవచ్చని మంత్రి పేర్కొన్నారు. లేబర్ కోడ్స్‌పై పారిశ్రామిక వర్గాలు, కార్మిక సంఘాలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు. అదే సమయంలో కార్మికుల ప్రయోజనాలను తప్పనిసరిగా దృష్టిలో ఉంచుకోవాలన్నారు.

కార్మికులు, పరిశ్రమలు ఇరువర్గాలకు మేలు చేసే సమతుల్య విధానమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా పరిశ్రమల అవసరాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను సిద్ధం చేసేందుకు పారిశ్రామిక సంఘాలతో నెలలుగా చర్చలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలకు ఏయే రంగాల్లో, ఎలాంటి నైపుణ్యాలు అవసరమో గుర్తించి యువతకు శిక్షణ ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. కనీస వేతనాల అంశంలోనూ ప్రభుత్వం ఇదే సంప్రదింపుల విధానాన్ని అనుసరించిందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. పారిశ్రామిక సంఘాలు, ఇతర భాగస్వాములతో విస్తృతంగా చర్చించిన తర్వాతే నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు.

గత పదేళ్లుగా కనీస వేతనాల్లో పెంపు లేకపోవడంతో కార్మికుల నుంచి అనేక డిమాండ్లు వచ్చాయని గుర్తుచేశారు. కార్మికుల అవసరాలు, పరిశ్రమల పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని సమతుల్య ప్రతిపాదనను రూపొందించామని తెలిపారు. ప్రభుత్వ ప్రతిపాదనకు సహకరించిన పారిశ్రామిక సంఘాలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. లేబర్ కోడ్స్‌ను హడావుడిగా అమలు చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదు. ప్రతి అంశంపై సమగ్రంగా చర్చ జరగాలి. అవసరమైతే నిర్దిష్ట అంశాలపై సూచనలను లిఖితపూర్వకంగా ఇవ్వండి. వాటిపై మరోసారి చర్చించి, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయానికి వస్తాం అని కార్మిక సంఘాల నేతలకు, పారిశ్రామిక వర్గాలకు మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించిన పారిశ్రామిక సంస్థల ప్రతినిధులకు, కార్మిక సంఘాల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఇంజనీరింగ్ బి-కేటగిరీ సీట్లను ఆన్‌లైన్‌లో భర్తీ చేయాలి

మేనేజ్‌మెంట్ కోటా పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి

హైదరాబాద్, జులై 7, ప్రభావార్త: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో బి కేటగిరీ సీట్లను పూర్తిగా ఆన్‌లైన్‌లో భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని, మేనేజ్‌మెంట్ కోటా పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు నేతృత్వంలో ఎస్ఎఫ్ఐ బృందం మంగళవారం ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో బికేటగిరీ (మేనేజ్‌మెంట్ కోటా) సీట్ల భర్తీని పూర్తిగా పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో బీబీఏ రెండో సెమిస్టర్ పరీక్షల టైమ్‌టేబుల్‌ను విద్యార్థులకు తగిన ప్రిపరేషన్ సమయం కల్పించేలా సవరించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయన్నారు. బి కేటగిరీ సీట్ల వివరాలు, సీట్ల సంఖ్య, దరఖాస్తుల ప్రక్రియ, ఎంపిక విధానం వంటి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచడం లేదన్నారు.

అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికీ, అనేక కళాశాలలు ఇప్పటికే బి కేటగిరీ సీట్లను విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కొన్ని కళాశాలలు పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నప్పటికీ దరఖాస్తు చేసుకునే లింకులను యాక్టివ్‌లో ఉంచడం లేదని, మరికొన్ని కళాశాలలు ఎలాంటి ప్రకటనలు కూడా ఇవ్వకుండా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

అర్హత కలిగిన అనేక మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కన్వీనర్ కోటాలో 70 శాతం సీట్లు ఈఏపీసెట్ ర్యాంకుల ఆధారంగా భర్తీ చేస్తుండగా, మిగిలిన 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా సీట్లను మెరిట్ ఆధారంగా భర్తీ చేయాల్సి ఉందని గుర్తు చేశారు. అయితే వాస్తవానికి మెరిట్‌కు బదులుగా భారీ మొత్తంలో ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చారని విమర్శించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు బి కేటగిరీ సీట్లలో ప్రవేశం కోసం కళాశాలలను సంప్రదిస్తే రూ.8 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఫీజులు, అదనంగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు డొనేషన్లు డిమాండ్ చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వర్సిటీలు, డిగ్రీ గెస్ట్‌లెక్చరర్ల వేతనం రూ.50 వేలకు పెంచాలి

ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ లేఖ

హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త: రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు, ఫ్యాకల్టీల వేతనం రూ.50వేలకు పెంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ఆయన మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో గెస్ట్‌లెక్చరర్లుగా, గెస్ట్ ఫ్యాకల్టీగా, పార్ట్ టైమ్‌గా సుమారు 1,240 మంది 20యేళ్లుగా ఎంతో అంకితభావంతో పని చేస్తున్నారని, వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సాధారణ సెలవులు లేవన్నారు. నెలకు రూ.28వేల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, వారు పొందుతున్న తక్కువ వేతనాలతో తమ కుటుంబాలను పోషించుకోలేక, ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లలను చదివించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. నెలకు రూ.50వేల వేతనం పెంచుతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, గెస్ట్ ఫ్యాకల్టీ మంత్రులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం నుండి స్పందన లేదన్నారు. తక్షణమే జోక్యం చేసుకొని వేతనం పెంచాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సిఎంకు రాసిన లేఖలో జాన్‌వెస్లీ కోరారు. గత ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ, గెస్ట్ లెక్చరర్ల వేతనాన్ని నెలకు రూ.50,000లకు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ ప్రభుత్వం ఏర్పడి 31 నెలలు దాటినా ఇంకా అమలు కాలేదన్నారు. ప్రస్తుతం అందుతున్న రూ.28వేల వేతనంతో పెరుగుతున్న ధరల వల్ల వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడం అసాధ్యంగా మారిందన్నారు.

ఎఐజి ఆస్పత్రి లోపలికి వెళ్తున్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తదితరులు

కెటిఆర్ కుమారుడు హిమాన్షురావుకు గాయం

ఎఐజి ఆస్పత్రిలో మనవడిని పరామర్శించిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్

హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 7, ప్రభాతవార్త: బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటి రామారావు కుమారుడు హిమాన్షురావు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసుపత్రికి చేరుకొని మనుమడిని పరామర్శిం చారు. కేటీఆర్ కుమారుడు హిమాన్షురావు సోమవారం రాత్రి జిమ్‌లో వర్కవుట్ చేస్తూ గాయపడ్డాడు. దీంతో హిమాన్షురావు ముక్కుకు గాయం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం హిమాన్షు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారని, చికిత్స అనంతరం కొన్నిరోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారని హిమాన్షురావు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. కాగా హిమాన్షుకు గాయం జరిగిన విషయం తెలుసుకున్న తండ్రి కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే, సీనియర్ నాయకుడు హారీష్‌రావులు ఆస్పత్రికి చేరుకొని పరామర్శించారు. మనుమడికి జరిగిన గాయం విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవెల్లి ఫాంహౌజ్ నుంచి నేరుగా మంగళవారం మధ్యాహ్నం ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మనుమడు హిమాన్షురావును పరామర్శించారు. హిమాన్షుకు జరిగిన గాయం తీ వ్రత, ఆరోగ్య పరిస్థితిని అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం హిమాన్షు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరంలేదని వైద్యులు సూచించారని కుటుంబసభ్యులు తెలిపారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

జయంతి సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ నివాళి

హైదరాబాద్, జులై 7, ప్రభావార్త: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు కేంద్రబిందువుగా ఉండాలని ఆచరణలో చూపించిన అరుదైన నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆయన సేవలు చిరస్మరణీయం అని వైఎస్ జయంతి సందర్భంగా నివాళి తెలుపుతూ టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజా ప్రస్థానం పాదయాత్ర ద్వారా2004వరకు సాగిన ప్రజాకంటక పాలనలో ప్రజలు అనుభవించిన కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటికి అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను రూపొం దించి అమలు చేయడం వైఎస్సార్ నాయకత్వ విశిష్టత అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108 అత్యవసర అంబులెన్స్ సేవలు, ఫీజు రీయిం బర్స్‌మెంట్, ఇందిరమ్మ గృహాలు, జలయజ్ఞం వంటి పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రజానేత వైఎస్సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కట్టుబడి పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అంబేద్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

ఫీజుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్ (సైఫాబాద్), జులై 7, ప్రభాతవార్త:లక్షలాది మంది నిరుపేద విద్యార్థులకు చెల్లించే ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తి వేయాలనే కుట్రను ప్రభుత్వం విరమించుకోవాలని, తక్షణమే 8వేల కోట్ల బకాయిలను చెల్లించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆనేక మంది విద్యా ర్థులు లిబర్టి చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ నిరుపేద కులాల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందువల్లనే ఫీజుల రీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నదని ఆరోపించారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి ఒక్క విద్యార్థికి ర్యాంకులతో సంబంధం లేకుండా ఫీజులు మంజూరు చేస్తున్న న్నదని, పైగా ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు స్కాలర్‌షిప్‌లు చెల్లిస్తున్నదని, కాని మన రాష్ట్రంలో ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయకుండా విద్యార్థులను రకరకాల వేధింపులకు గురి చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్‌పటేల్, నాయకులు శివకుమార్‌యాదవ్, నీల వెంకటేష్, సి.రాజేందర్ ముదిరాజ్ అనంతయ్య, బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

8skl13:8skl13.qxd 07-07-2026 22:43 Page 1

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రైవేట్ భాగస్వామ్యం వద్దు

ఆమదాలవలస, జూలై 7, (ప్రభాతవార్త)

రిజిస్ట్రేషన్ శాఖలో ప్రైవేట్ భాగస్వామ్యంపై జీవోఎంఎస్ 396ను ఉపసంహరించుకోవాలని కోరుతూ పాలపోలమ్మ తల్లి దస్తావేజులేఖర్లు, స్టాంప్ వెండర్ల సంక్షేమ సంఘం రెండవ రోజు మంగళవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మొదలవలస వేణుగోపాలరావు మాట్లాడుతూ స్టాంపుల శాఖను ప్రైవేటీక రణ చేపట్టాలని చేస్తున్న ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ విధివిధానాలను వ్యతిరేకిస్తున్నట్టు తెలియజేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఫ్రంట్ కార్యాలయాలను ఏర్పాటు చేసే సంస్థలకు అప్పగించాలని చూడడం వలన దస్తావేజులేఖరులు, వారి సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లకు జీవనోపాధి కోల్పోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధతలేని ప్రైవేటు సంస్థలపరం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరం అన్నారు. ఇలాంటి మార్పులవలన అవకతవకలు జరిగి, ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని తెలియజేశారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రైవేట్ భాగస్వామ్య విధానాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రాజు, బి.శ్రీనివాసరావు, సిహెచ్.లక్ష్మణరావు, ఎం. సురేష్, దస్తావేజు లేఖర్ల సభ్యులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారమే పౌష్టికాహారం అందజేయాలి

సీతంపేట, జూలై 7 ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న మెనూ ప్రకారమే పౌష్టికాహారం అందజేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ బి.కాంతారావు స్పష్టం చేశారు. మంగళవారం సీతంపేటలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాల, గురుకుల రెసిడెన్షియల్ బాలికల పాఠశాల జిసిసి డిఆర్ డిపో సివిల్ సప్లై గోడౌను ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యతతో కూడుకున్న పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందజేయాలనే దృక్పథంతో నాణ్యమైన సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా విద్యార్థులకు పౌష్టికాహారంలో ఎటువంటి నాణ్యతలేని సరుకులు అందజేసినట్లయితే చర్యలు ఉంటాయన్నారు. అదేవిధంగా తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత బియ్యాన్ని సక్రమంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. తూకాల్లో మోసాలకు పాల్పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీకన్య, డిప్యూటీ తహసిల్దార్ శ్రీవిద్య, తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మహత్యల వద్దు... జీవితమే ముద్దు' : లీగల్ అధికారి శ్రీధర్

వీరఘట్టం, జూలై 7, ప్రభాతవార్త:

మహిళల్లో ఆత్మహత్యల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ అధికారి పి.శ్రీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఆత్మహత్యల నివారణ, బాలల సంరక్షణ, హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, గృహ హింస, సామాజిక ఒత్తిళ్లు, మానసిక ఆందోళనలు కొన్నిసార్లు తీవ్రమైన నిరాశకు దారితీసి ఆత్మహత్యలకు పురికొల్పుతున్నాయన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహ నిరోధక చట్టం-2006, బాలల ఆరోగ్యం, విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికల్లో రక్తహీనత వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ డ్రగ్స్ వాడొద్దు - జీవితమే ముద్దు అని పిలుపు నిచ్చారు. విద్యార్థులకు మంచి స్పర్శ, చెడు స్పర్శ (గుడ్ టచ్, బ్యాడ్ టచ్) లపై స్పష్టతనిస్తూ, టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే అనర్థాలను, మహిళా, బాలల చట్టాలను వివరించారు. 'మిషన్ వాత్సల్య' పథకం, 'వన్ స్టాప' సేవల ప్రాధాన్యతను గుర్తుచేశారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన బాలల టోల్ ఫ్రీ నెంబర్ 1098, మహిళల సంరక్షణ నెంబర్ 181, మానసిక వైద్య సహాయం కోసం 14416 నెంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయికుమార్, డిసిపి యు కౌన్సిలర్ జి.తవిటి నాయుడు, ఆశ వర్కర్లు , హెల్త్ వర్కర్స్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలు విజయవంతం చేయండి

కోటబొమ్మాళి, జూలై 7, ప్రభాతవార్త:

దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను వైకాపా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు సంపతిరావు హేమసుందరరాజు పిలుపు నిచ్చారు. ఆయన మంగళవారం వైకాపా నాయకులతో కలిసి విలేకర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటలకు వైఎసఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించటం జరుగుతుందని కావున వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు, పార్టీ నాయకులు పేడాడ వెంకటరావు, బమ్మిడి గణపతిస్వామి, మురళీమోహన్, శివారెడ్డి , తదితరులు ఉన్నారు.

ఘనంగా కృష్ణదాస్ జన్మదిన వేడుకలు

కంచిలి, జూలై 7, ప్రభాతవార్త :

మాజీమంత్రి ధర్మాన కృష్ణదాస్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం స్థానిక రాధాకృష్ణ మందిరంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పెట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వజ్జ మృత్యుంజయం, మాజీ పిఎసఎస్ అధ్యక్షులు గుమ్మడి రామాదాస్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భావనపాడు సిఆర్‌జెడ్‌లో అక్రమ నిర్మాణాలు

సంతబొమ్మాళి, జులై 7, ప్రభాతవార్త:

సంతబొమ్మాళి మండలం భావనపాడు తీరంలో సిఆర్‌జెడ్ భూములపై అక్రమార్కుల కన్ను పడింది. ఏకంగా తీరంలో ప్రభుత్వం భూములలో చెట్లను తొలగించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన విషయం వెలుగులోకి వచ్చింది వివరాల్లోకి వెళితే మండలం భావనపాడు తీర ప్రాంతంలో సి ఆర్ జెడ్ భూములపై స్థానిక బడా బాబు కన్ను పడింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ భూమిలో ఉన్న సరుగుడు చెట్లను నరికి వేసి వాల్టా చట్టం ఉల్లంఘించాడు. అంతటితో ఆగకుండా ఆక్రమించిన స్థలాన్ని ఆదాయ వనరులుగా మార్చుకోవడానికి పూనుకున్నాడు. దీనిలో భాగంగా రెండు గదులు నిర్మాణానికి పునాదులను వేశారు.

అడ్డుకున్న మెరైన్ సీఐ

సి ఆర్ జెడ్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో భావనపాడు మెరైన్ సీఐ రాము అడ్డుకున్నారు. ఈ క్రమంలో మెరైన్ సిఐతో ఆక్రమణదారుడు వాగ్వావాదం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు మెరైన్ అధికారులు ఆక్రమణపై సంతబొమ్మాళి తహసిల్దారు హేమసుందరరావుకు మెరైన్ సీఐ సమాచారం అందజేశారు. తహసిల్దార్ ఆదేశాలతో ఆర్ఐ చంద్రమౌళి సోమవారం అక్రమ నిర్మాణాలను పరిశీలించి నిర్మాణాలను నిలుపుదల చేశారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని రెవిన్యూ అధికారులు తెలియజేశారు.

జేసీఐ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన

ఇచ్ఛాపురం, జూలై 7, ప్రభాతవార్త:

సమాజ ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్రాణాలను కాపాడే అత్యవసర నైపుణ్యాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో జేసీఐ ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో రెండు విద్యాసంస్థల్లో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీససిటేషన్) అవగాహన, ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో ప్రాజెక్ట్ చైర్మన్ జేసీ డా. డి.సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా, రెండో కార్యక్రమం ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రాజెక్ట్ చైర్మన్ జేసీ డా. యు.శేషు యాదవ్ నాయకత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నిపుణులైన వైద్యులు సీపీఆర్ యొక్క ప్రాముఖ్యతను, గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో సీపీఆర్ చేయడం ద్వారా ఒక వ్యక్తి ప్రాణాలను ఎలా కాపాడవచ్చో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. ప్రత్యక్ష ప్రదర్శనలు, వాస్తవ జీవిత ఉదాహరణలతో సీపీఆర్ ప్రక్రియను అత్యంత సరళంగా వివరించడంతో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని సులభంగా అవగాహన పొందారు. కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా సీపీఆర్ మానిక్విన్ల సహాయంతో నిర్వహించిన ప్రత్యక్ష ప్రాక్టికల్ శిక్షణ నిలిచింది. విద్యార్థులు స్వయంగా మానిక్విన్లపై సీపీఆర్ విధానాన్ని అభ్యసిస్తూ, చేతుల సరైన స్థానం, ఛాతిపై ఒత్తిడి చేసే లోతు, వేగం మరియు అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన చర్యలను నిపుణుల పర్యవేక్షణలో నేర్చుకున్నారు. ఈ ప్రాక్టికల్ శిక్షణ విద్యార్థుల్లో విశేష ఉత్సాహాన్ని నింపడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది.

మన్యం జిల్లాలో పుష్కలంగా ఎరువుల నిల్వలు

వీరఘట్టం, జూలై 7, ప్రభాతవార్త:

ప్రస్తుత ఖరీఫ్-2026 సీజన్‌కు గాను పార్వతీపురం మన్యం జిల్లాలోని రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్నిరకాల చర్యలు తీసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఖరీఫ్-25 సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 43,896 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగం కాగా, ఈ ఏడాది ప్రస్తుత అవసరాల కోసం 46,100 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరాకై వ్యవసాయ కమీషనర్‌కు ముందస్తు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. జిల్లాకు ఇప్పటివరకు 21,286 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా జరిగిందని జాయింట్ కలెక్టర్ వివరించారు. ఇందులో రైతులు ఇప్పటికే తమ అవసరాల కోసం 7,758 మెట్రిక్ టన్నులను వినియోగించుకోగా, జిల్లాలో ఇంకా 13,528 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువుల నిల్వలు రైతులకు అందుబాటులో సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. యూరియా 7,985 టన్నులు, డి.ఎ.పి 851 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 3,034 టన్నులు, పోటాష్ 356 టన్నులు, సూపర్ ఫాస్ఫేట్ 1,302 టన్నులు. ఎవరైనా డీలర్ నిబంధనలు ఉల్లంఘించి, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఇతర ఉత్పత్తులను లింక్ చేసి అమ్మజూపినా, నిల్వలను పక్కదారి పట్టించినా లేదా ఎం.ఆర్.పి ధరల కంటే ఎక్కువకు విక్రయించినా సహించేది లేదని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. అటువంటి వారిపై 'ఎరువుల నియంత్రణ చట్టం 1985' ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, వారి లైసెన్సులను తక్షణమే రద్దు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లాలోని రైతు సోదరులు ఎలాంటి ఆందోళన చెందకుండా, సమయానుకూలంగా అందుతున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు.

జిల్లాలో పారదర్శకంగా సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి వెల్లడి

వీరఘట్టం, జూలై 7, ప్రభాతవార్త :

జిల్లాలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎసఐఆర్) ప్రక్రియ పారదర్శకంగా, అత్యంత వేగంగా సాగుతోందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. గత నెల 15న ప్రారంభమైన ఈ గణన ప్రక్రియ ఈ నెల 14 వరకు కొనసాగనున్నట్లు చెప్పారు. మంగళవారం సాయంత్రం నాటికి అందిన తాజా నివేదిక ప్రకారం జిల్లావ్యాప్తంగా ఓటర్ల నమోదు ఫారాల ముద్రణ, పంపిణీ మరియు డిజిటలైజేషన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సేకరించిన ఫారాలను ఆన్‌లైన్‌లో డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ వేగంగా సాగుతోందన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 5,19,972 ఫారాల (65.77 శాతం) డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని, నియోజకవర్గాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పాలకొండ (ఎస్‌టి) నియోజకవర్గంకు 1,96,943 ఓటర్లకు గానూ 1,38,586 ఫారాల (70.37%) డిజిటలైజేషన్‌తో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇందులో సీతంపేట మండలం 75.04 శాతంతో ముందంజలో ఉందని చెప్పారు. కురుపాం (ఎస్‌టి) నియోజకవర్గం మొత్తం 1,95,916 ఓటర్లకు గానూ 1,36,138 ఫారాల (69.48%) డిజిటలైజేషన్ పూర్తయిందని, జి.ఎల్. పురం మండలం 74.09 శాతంతో మెరుగైన ప్రగతి కనబరిచినట్లు పేర్కొన్నారు. సాలూరు (ఎస్‌టి) నియోజకవర్గం 2,05,985 ఓటర్లకు గానూ 1,27,158 ఫారాల (61.73%) డిజిటలైజేషన్ పూర్తయిందని అన్నారు. పార్వతీపురం (ఎస్‌టి) నియోజకవర్గం మొత్తం 1,91,718 ఓటర్లకు గానూ 1,18,130 ఫారాల (61.61%) డిజిటలైజేషన్ పూర్తయిందని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్దేశిత గడువు (జూలై 14) లోగా మిగిలిన డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేసి, వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాల ఓటరు నమోదు అధికారులు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారుల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రత్యేక సవరణ ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు.

ఏళ్లనాటి భూ సమస్యలకు మోక్షం

కొత్తూరు, జూలై 7, ప్రభాతవార్త :

మండల పరిధిలోని ఓంద్రుజోల గ్రామపంచాయతీలో ఎన్నో ఏళ్లుగా స్థానిక ప్రజలను వేధిస్తున్న రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి ఎట్టకేలకు అడుగులు పడ్డాయి.ఆ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త, ఎంపీహెచ్ డెవలపర్స్ అధినేత, టీడీపీ యువ నాయకులు బామిడి రాజు ప్రత్యేక చొరవతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. గ్రామంలో దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్యల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, బామిడి రాజు స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవింద రావు దృష్టికి తీసుకువెళ్ళగా తక్షణమే స్పందించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ మేరకు ఆయన టెక్కలి ఆర్డీఓతో మాట్లాడి పంచాయతీలో ఉన్న భూ సమస్యలను కూలంకషంగా వివరించారు. గ్రామస్తుల ఇబ్బందులపై తక్షణమే స్పందించిన ఆర్డీఓ కొత్తూరు మండల తహసిల్దార్‌కు ఫోన్ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కొత్తూరు తాసిల్దార్ స్పందించి సర్వేకు ఏర్పాట్లు చేశారు. బుధవారం నాటి నుంచి ఓంద్రుజోల గ్రామపంచాయతీ పరిధిలో భూముల రీ-సర్వే కార్యక్రమం అధికారికంగా ప్రారంభం కానుంది. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలకు రీ-సర్వే ద్వారా ముగింపు పడనుండటంతో ఓంద్రుజోల గ్రామ పెద్దలు, ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి, అధికారులను కలిసి సర్వే మంజూరు చేయించిన యువనేత బామిడి రాజు కి, రెవెన్యూ అధికారులకు గ్రామ ప్రజలు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

లక్షలాది కుటుంబాల జీవనోపాధిని దెబ్బ తీయొద్దు

-జీవో 396ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని దస్తావేజు లేఖర్లు డిమాండ్

-రెండవ రోజు కొనసాగిన నిరసన కార్యక్రమం

రణస్థలం, జూలై 7, ప్రభాతవార్త :

396 జీవోను అమలు చేసి దస్తావేజు లేఖర్ల పొట్ట కొట్టొద్దని రణస్థలం దస్తావేజు లేఖర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం 396 జీవోను ఉపసంహరించుకోవాలని కోరుతూ రెండు రోజులు పెన్ డౌన్ నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కూడా మండల కేంద్రంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ల సేవలు ప్రైవేటీకరించడం ప్రజలకు, ప్రభుత్వానికి ప్రమాదకరమని, ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాలక్రమేణా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నమ్మకంగా రిజిస్ట్రేషన్ల సేవలను సక్రమంగా అందిస్తున్న మాపై ఇటువంటి జీవోలను ప్రయోగించడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 396ను వెంటనే రద్దు చేసి సంప్రదాయ దస్తావేజు వ్యవస్థను కాపాడాలని వారు కోరారు. దస్తావేజు లేఖర వృత్తిపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రైవేటీకరణ వల్ల పరోక్షంగా లక్షలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ దస్తావేజు లేఖర్లు మీసాల రామారావు, అరసాడ విజయసారథి, జల్లేపల్లి ప్రకాశరావు, రాజపాత్రుని మౌళీశ్వరరావు, సురావజ్ఝల శివకుమార్, పులగుర్త మల్లిబాబు, బలివాడ శ్రీనివాసరావు, బైరి రామారావు, పారుపూడి వెంకటేశ్వరరావు, పట్నాయకుని ధనుంజరావు, గుగ్గిలాపు స్వప్న, బొడ్డ మల్లిబాబు, యతిరాజుల గోపాలకృష్ణ, తరిగొప్పుల శ్రీనివాసరావు, దుక్క ప్రసాద్, మామిడి తారకేశ్వరరావు, కంప్యూటర్ ఆపరేటర్లు , తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి మార్కెట్లో ట్రాఫిక్ ఇబ్బందులు

సంతబొమ్మాళి, జులై 7, ప్రభాతవార్త:

మండల కేంద్రం సంతబొమ్మాళి మెయిన్ రహదారిలో మార్కెట్ నిర్వహిస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. బస్టాండ్, జగన్నాథస్వామి ఆలయం సమీపంలో సాయంత్రం పూట కూరగాయలు, చేపలు అమ్మేవారు రోడ్డు పైన పెట్టి అమ్మకాలు చేయడంతో రహదారి వెంబడి నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేకపోతుంది. ఈ రహదారి వెంబడి ఆటోలు, కార్ వెళ్లాల్సి వస్తే చాలా ఇబ్బంది కరంగా ఉంటుంది. ఈ అమ్మకాలు రోడ్డు పైన కాకుండా వారి వారి దుకాణాల్లో పెట్టి అమ్ముకుంటే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని పలువురు అంటున్నారు. బస్టాండ్‌కి కూతవేటు దూరంలో ఉన్నా పోలీసులు ఏ ఒక్క రోజు ఈ మార్కెట్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు పై దృష్టి పెట్టలేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్ ఎస్ఐ దీనిపై దృష్టిసారించాలని గ్రామస్తులు, యువకులు, మహిళలు కోరుతున్నారు. స్టేషన్ ఎస్ ఐ దీనిపై దృష్టిసారించాలని గ్రామస్తులు, యువకులు, మహిళలు కోరుతున్నారు..

ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

వీరఘట్టం, జూలై 7, ప్రభాతవార్త :

మండల కేంద్రంతో పాటు కంబర, గడగమ్మ, వండువ, తెట్టంగి తదితర గ్రామాల్లో మంగళవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు జాతీయ అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు మంగళవారం మండల కేంద్రంతో పాటు కంబర గడగమ్మ వండువ తట్టంగి తదితర గ్రామాల్లో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బాబు జగజ్జీవన్ రావ్ కాలనీలో కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్.కళ్యాణ్ ప్రసాద్, ఎన్.విజయభాస్కర్, ఎస్.శశిభూషణరావు, కెపి రాజు, వి.ప్రశాంత్ కుమార్, ఎన్.రాహుల్ కుమార్, వి.తిమోతి, కే.పృధ్వి, ఎస్.ప్రవీణ్ కుమార్, ఎన్.రిషి రోషన్, ఎన్.సుందర్‌రావు, వసంత్ కుమార్, విజయరామరాజు, కే.నవీన్, వనేష్, తదితర మాదిగ బిడ్డలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త

గర్భిణీలకు , తోడుగా వచ్చిన ఒకరికి భోజనం అందించాలి

టెక్కలి, జూలై 7, ప్రభాతవార్త

సుదూర ట్రైబల్ మరియు గ్రామీణ ప్రాంతాల నుండి డెలివరీ కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రికి వస్తున్న గర్భిణీ స్త్రీలకు కనీస సౌకర్యాలు కూడా అందడం లేదని కూటమి నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు సోమవారం బీజేపీ, జనసేన కూటమి నాయకులు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సూర్యారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతి గర్భిణీ స్త్రీకి అడ్మిట్ అయి నుండి మరియు డెలివరీ అయిన మొదటి రోజు నుండే పౌష్టికాహారం అందించాలి. అలాగే వారికి తోడుగా వచ్చిన ఒక కుటుంబ సభ్యులకి ఉచిత భోజనం ఏర్పాటు చేయాలి. పేదల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదు. పై సమస్యలపై వెంటనే పరిష్కారం చూపకపోతే పై స్థాయి నాయకులకు మరియు అధికారులకు తెలియజేస్తూ తీవ్రమైన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ జన్ని పరమేశ్వరావు, జిల్లా స్వచ్ఛభారత్ కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు, జనసేన జిల్లా కార్యదర్శి సలాన షణ్ముఖరావు, బిజెపి మండల ఉపాధ్యక్షులు నాగేంద్రబాబు, జనసేన మండల జనరల్ సెక్రెటరీ సోమేశ్వరరావు, బాలకృష్ణ, లంబ రాము, లంబ నాగరాజు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి గంటా రామకృష్ణ కవిత ఎంపిక

వీరఘట్టం, జూలై 7, ప్రభాతవార్త:

పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన కవి, రచయిత గంటా రామకృష్ణ రాసిన నిజమైన ప్రజా ప్రతినిధి కవిత తెలుగు వెలుగు జాతీయ వేదిక, ఎస్వీ ఫౌండేషన్, శేరి లింగంపల్లి రచయిత సంఘం ఆద్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కవితల పోటీ ఫలితాలు ప్రకటనలో అధికారికంగా ప్రచరణకు ఎంపికైంది. పోటీకి చాలా కవితలు వచ్చినప్పటికీ న్యాయ నిర్ణేతలు కీలపర్తి దాలినాయుడు, డా బిహెచ్ వి రమాదేవి, డా గౌరవ రాజు, సతీష్ కుమార్‌లు పూర్తి పరిశీలన చేసి ఎంపిక చేశారు. ప్రజా దేవుళ్ళు కవితా సంపుటికి సంపాదకులుగా ప్రముఖ కవి డా మోటూరి నారాయణరావు వ్యవహరించారు. త్వరలోనే జాతీయ స్థాయిలో సత్కారం మరియు జ్ఞాపిక, ప్రశంసపత్రంతో సన్మానించనున్నారు. జాతీయ స్థాయి కవిత పోటీలలో గంటా రామకృష్ణ కవిత ఎంపిక అవ్వడం పట్ల మన్యం జిల్లా తెలుగు భాషాభిమానులు కవులు, రచయితలు, నర్సిపురం గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు నర్సిపురం కి జాతీయ స్థాయిలో పేరు, ప్రతిష్టలు తీసుకు రావడం పట్ల, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

45 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై ఐటీడీపీ ట్రోల్స్ దురదృష్టకరం

తమ్మినేని సీతారాంపై వ్యక్తిత్వ హననాన్ని ముక్తకంఠంతో ఖండించిన వైసీపీ నేతలు

ఆముదాలవలస, జూలై 7, (ప్రభాతవార్త)

1982లో ప్రజా జీవితంలో అడుగుపెట్టి, ఆముదాలవలస షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్‌గా ప్రారంభమైన రాజకీయ ప్రయాణం నుంచి ప్రభుత్వ విప్‌గా, ఉమ్మడి రాష్ట్రంలో 17 శాఖలను నిర్వహించిన మంత్రిగా, అనంతరం శాసనసభాపతిగా దాదాపు నాలుగున్నర దశాబ్దాలపాటు ప్రజా జీవితంలో విశిష్ట సేవలు అందించిన మాజీ శాసనసభాపతి తమ్మినేని సీతారాంపై ఐటీడీపీ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హనన చర్యలను వైసీపీ శ్రేణులు ముక్తకంఠంతో ఖండించాయి. రాజకీయ విద్యార్థిత్వం పేరుతో ఒక సీనియర్ నాయకుడి వ్యాఖ్యలను వక్రీకరించి దుష్ప్రచారం చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం అప్పట్లో రాజకీయ వికేంద్రీకరణకు అనుకూలంగా వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఇప్పుడు వేరే కోణంలో చూపిస్తూ ట్రోల్స్ చేయడం బాధాకరమని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఆముదాలవలసల ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి దుంపల లక్ష్మణరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా చరిత్రలో జరిగిన అనేక అభివృద్ధి కార్యక్రమాల వెనుక అప్పటి జిల్లా మంత్రిగా తమ్మినేని సీతారాం చేసిన కృషి ఎంతో ఉందన్నారు. రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి బెండి గాంధీ, మాజీ డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కింజరాపు సురేష్, బాడన కృష్ణ, ముత్త విజయ్, గొంటి కృష్ణ, పైడి రాణా ప్రతాప్, కోట వెంకట రామారావు, ఎన్ని రామచంద్రరావు,బొడ్డేపల్లి హరి, జి.ప్రభాకర్ రావు, కుసుమంచి శ్యాం ప్రసాద్, శిల్లా మల్లికార్జునరావు, అనురాధ, తమ్మినేని మురళీకృష్ణ, బూర్జ ఎంపీపీ ప్రతినిధి కే.నాగేశ్వరరావు, గొంటి ఈశ్వరరావు, సనపల రాజు, సింగూరు సూర్యనారాయణ, పేడాడ అప్పలనాయుడు, సనపల తవిటయ్య,మెట్ట చక్రధరరావు, సంపదరావు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన కంచిలి జడ్పీటీసీ

కంచిలి, జూలై 7, ప్రభాతవార్త:

కంచిలి మండల జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ ఇప్పిలి లోలక్ష్మీ కృష్ణారావు మంగళవారం శ్రీకాకుళంలోని పలు ఆసుపత్రులను సందర్శించి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. బగ్గు సరోజినీ హాస్పిటల్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న త్రినాథ్ పట్నాయక్ (కొర్లాం గ్రామం), జేమ్స్ హాస్పిటల్‌లో ఇప్పిలి కమలమ్మ (కేసరిపడ), సంగారు గోవిందరావు (వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సోంపేట), మామిడి తులసయ్య (సుంకిడి) లను పరామర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులు త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ, వారికి మనోధైర్యాన్ని నింపారు. ప్రజల పట్ల తనకున్న సేవాభావాన్ని మరోసారి చాటుతూ ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఇప్పిలి లోలక్ష్మీకృష్ణారావు భరోసా ఇచ్చారు.

పీఆర్సీ కమిషన్‌ను వెంటనే అమలు చేయాలి : ఏపీటీఎఫ్

కవిటి, జూలై 7, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు వేతన సవరణ (పీఆర్సీ)ను తక్షణమే అమలు చేసి, పీఆర్సీ కమిషన్‌ను వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి భానుమూర్తి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలరావు మాట్లాడుతూ పీఆర్సీ అమలు వరకు మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో పీఎన్‌హెచఎం పోస్టులను ఎస్జీటీలకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. అదేవిధంగా 40 మందికి పైగా విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలకు మూడో ఎసీటీ పోస్టు మంజూరు చేయాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కల్పించాలని లేదా ప్రత్యేక టెట్ నిర్వహించాలని, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ-విద్యార్థుల ఇంకా నిష్పత్తిని 1:40గా నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు, టెక్కలి మండల బాధ్యులు రామారావు, సీనియర్ నాయకులు బల్లెడ లక్ష్మణ్ మూర్తి, జిల్లా కార్యదర్శి చాణిక్య, కవిటి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుడియా వంశీకృష్ణ, రాంబాబు, గౌరవ అధ్యక్షులు కృష్ణారావు, గిడిజాల భాస్కరరావు, తిరుపతిరావు వేణుగోపాల్, దుర్యోధన, మురళీధర్, శ్రీనివాస్, లింగరాజ్, ప్రకాష్, అరుణ్, గణేష్ మహా పాత్ర హరిబాబు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త ఎల్‌నినో ప్రభావం.. ఆందోళన వద్దు

శ్రీకాకుళం/కోటబొమ్మాళి, జూలై 7, ప్రభాతవార్త :

దేశవ్యాప్తంగా నెలకొన్న ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా వర్షాలు తక్కువగా కురుస్తున్నాయని, దీనివల్ల వంశధార క్యాచ్‌మెంట్ ఏరియాలో నీరు పూర్తిస్థాయిలో లేనప్పటికీ జిల్లా రైతాంగానికి ఇబ్బంది లేకుండా సాగునీరు విడుదల చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లా రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున జిల్లా రైతాంగం అంతా ప్రస్తుత పరిస్థితులను గమనించి ప్రభుత్వానికి, అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అందానికి ఇంటి చికిత్స

అందానికి ఇంటి చికిత్సలూ ఒకటి. ఎన్ని రకాల క్రీములున్నా.. సహజమైనవి చేసే మేలే ఎక్కువ మరి. మీరూ ఆ ప్రయోజనం పొందాలి అనుకుంటున్నారా? అయితే వీటిని ప్రయత్నించేయండి.

బేకింగ్ సోడా–యాపిల్ సిడార్ వెనిగర్.. చర్మంపై పేరుకుపోయిన మృతకణాలను తొలగించడంలో వంట సోడా బాగా పని చేస్తుంది. చెంచా వంటసోడాలో రెండు చెంచాల యాపిల్ సిడార్ వెనిగర్ చేర్చి, పేస్టులా చేసుకోవాలి. ముఖాన్ని కడిగి, తడి లేకుండా తుడిచాక ఈ మిశ్రమాన్ని పట్టించాలి. పది నిమిషాల తర్వాత గాఢత తక్కువ ఉండే ఫేస్‌వాష్‌తో కడిగేస్తే సరి. మెరిసే చర్మం మీ సొంతం.

నిమ్మ.. చర్మాన్ని మెరిపించడంలో నిమ్మదీ ప్రత్యేక పాత్రే. దీనిలోని విటమిన్ సి సహజ అందం కోసం పని చేస్తుంది. ఒక నిమ్మచెక్కను సన్నటి చక్కెరలో ముంచి ముఖంపై మృదువుగా మర్దనా చేస్తే చాలు. అయిదు నిమిషాలయ్యాక గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే సరి. చర్మరంధ్రాలను లోతుగా శుభ్రం చేసి, చర్మాన్ని మెరిసేలా చేస్తుంది.

దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుఅలర్జీలు, యాక్నే రాకుండానూ చూస్తుంది.

నారింజ తొక్కలతో.. చెంచా నారింజ తొక్కల పొడికి, చెంచా తేనె, చిటికెడు పసుపు కలిపి మెత్తని చూర్ణంలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసి, మాయిశ్చరైజర్‌ను రాస్తే సరి. దీనిలో ఉండే సి విటమిన్ ముఖంపై ముడతలు, గీతలను తగ్గించ కలదు.

అరటి-తేనె.. బాగా పండిన అరటి పండులో చిన్న ముక్క తీసుకొని గుజ్జులా చేయాలి. దానికి చెంచా తేనె, నాలుగైదు చుక్కలు నిమ్మరసం కలిపి, మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. దీన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి, పావుగంటసేపు వదిలేయాలి. ఆపై గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి. అరటిలోపుష్కలంగా ఉండే ఎ,బి,ఇ విటమిన్లు చర్మాన్ని మృదువుగా మార్చడమే కాదు.. నల్ల మచ్చలనీ తగ్గిస్తాయి. తేనెలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని తేమగా ఉంచుతాయి. ★

చిట్కా

- బెండ కాయ కూర కరకరలాడు తుండా లంటే ముందు రోజు రాత్రి బెండకాయలను తరిగివుంచుకొని మర్నాడు కూర చేయండి.
- పప్పుధాన్యాలు నిలువవుంచిన పాత్రలక్రింద తాజా వేపాకులు వేస్తే పురుగులు రావు.

హేమమాలిని 'డ్రీమ్ గాళ్'గా మారిన వేళ !

భారతీయ సినీ చరిత్రలో హేమమాలినిని 'డ్రీమ్ గాళ్' పేరు చిరస్థాయిగా నిల బెట్టింది. బాలీవుడ్ ఎవర్ గ్రీన్ బ్యూటీ, ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు హేమమాలినిని అభి మానులు 'డ్రీమ్ గాళ్'గా ఆరాధిస్తుంటారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు కనీసం 4 దశాబ్దలకు పై ఆమెకా బిరుదు సార్థకత సాధించి పెట్టింది. ఈ బిరుదు వెనుక ఉన్న ఆసక్తికరమైన కథను ఆమె 'ది కపిల్ శర్మ షో'లో పంచుకున్నారు. 'డ్రీమ్ గాళ్' సినిమాలో నటించకముందే ఆమెకా పేరు వచ్చేసింది. అదీ కాకతాళీ యంగా తనకే తెలియకుండా తెరంగ్రేటం నాడే డ్రీమ్ గరల్‌గా పరిచయం చేయబడింది. హేమమాలిని హిందీలో అడుగుపెట్టిన తొలి చిత్రం 'సప్నో కా సౌదాగర్' (1968). ఈ సినిమా నిర్మాత బి. అనంతస్వామి ఓ అద్భుతమైన ప్రచార వ్యూహంలో భాగంగా సినిమా విడుదల కాక ముందు, హీరోయిన్ ఎవరో చెప్పకుండా "డ్రీమ్ గాళ్ వస్తోంది' అంటూ ముంబై అంతటా పోస్టర్లు వేయించారు. ఇది అప్పట్లో పెద్ద సంచలనం .. ఉత్కంఠ రేపాకనే ప్రేక్షకుల ముందుకు వస్తున్న 'డ్రీమ్ గాళ్' హేమామాలిని అని ప్రేక్షకుల చెవికి వినబడడంతో నాడు కేరింతలు కొట్టారు. ఆనాటి నుంచి ఈ నాటి వరకు 'డ్రీమ్ గాళ్' పేరు వినిపిస్తే చాలు అక్కడ హైమామాలిని ఉన్నట్లే యువత స్మృతి పథంలో ఆమె నాలట్యం చేస్తునేట్లే ఉంటుంది. హైమామాలిని అంటూ యువత ఎగిరి గంతేసే వారు. ఇప్పడికి అంతే. ఈ విషయంపై హేమమాలిని మాట్లాడుతూ.. 'నా తొలి సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. కానీ, పోస్టర్ల మీద ఎక్కడా తన పేరు కాకుండా 'డ్రీమ్ గాళ్, డ్రీమ్‌గాళ్ అనే కనిపిస్తోంది. ప్రేక్షకుల నుంచి ఒకటే స్పందన ఎవరేం చేస్తున్నారో అర్థం కాక నేను కాస్త ఆందోళన చెందాను. అప్పుడు నిర్మాత అనంతస్వామి నాతో, నీ పేరును మేం ఇలాగే పరిచయం చేయబోతున్నాం. ఆ డ్రీమ్ గాళ్ ఎవరో కాదు, నువ్వే! నన్నారు తామే ప్రకటిస్తాం అంత వరకూ సస్పెన్సే! అలా అనంతస్వామి ఆలోచన అద్భుతంగా ఫలించింది. ఆ పేరు నాకు శాశ్వతంగా నిలిచిపోయింది అని వివరించారు. మహేశ్ కౌల్ దర్శకత్వం వహించిన 'సప్నో కా సౌదాగర్' చిత్రంలో రాజ్ కపూర్, హేమ మాలిని, తనూజ, నదీరా ప్రధాన పాత్రలు పోషించారు. 'డ్రీమ్‌గాళ్'గా సినీప్రేక్షకుల హృదయాల్లో బందీ అయిన దాదాపు దశాబ్దం తర్వాత, 1977లో హేమమాలి నటించిన 'డ్రీమ్ గాళ్' పేరుతో వచ్చిన మరో సినిమాలో ప్రధాన పాత్రలో నటించారు. ప్రమోద్ చక్రవర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అశోక్ కుమార్, ధర్మేంద్ర, ప్రేమ్ చోప్రా వంటి అగ్ర తారలు ఉన్నారు. ఈ సినిమాలో హేమమాలిని అనాథ పిల్లల ఆశ్రమాన్ని నడపడం కోసం డబ్బు సంపాదించ డానికి సప్న, పద్మ, చంపాబాయి, డ్రీమ్ గాళ్, రాజ్ కుమారి అనే ఐదు విభిన్న పాత్రలలో కనిపిస్తారు. లక్ష్మీ మకాంత్‌ప్యారేలాల్ స్వరపరిచిన ఈ చిత్రంలోని "డ్రీమ్ గాళ్" టైటిల్ సాంగ్ ఎవర్ గ్రీన్ హిట్ నేపథ్య గాయకులు కిశోర్ కుమార్ ఆలపించారు. ★

పాపలకు తాజా పాలు

పిల్లల పోషణ.. పాలతో పరిపూర్ణ మవుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తాజా పాలు దొరకడం కొంచెం కష్టమే. దాంతో చాలామంది..ముఖ్యంగా పట్టణాలూ, నగరాల్లోని వాళ్ల ప్యాకెట్ పాలను వాడటానికే మొగ్గు చూపుతుంటారు. అయితే వీటి ఎంపికలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అనారోగ్యాలు తప్పవు. . పేపర్‌బోర్డు లేదా టెట్రా ప్యాకింగుతో తయారైన పాల డబ్బాల్లో బ్యాక్టీరియా శాతం అధికంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కారణాలను అన్వేషిస్తే.. పాలను శుద్ధిచేసిన తరవాత వాటిని డబ్బాల్లో నింపడానికి వినియోగించే మెషిన్లే ఇందుకు కారణమని తేల్చారు. ఇందులో భాగంగా మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్లలో పాల శాంపిళ్లను తీసుకుని పరీక్షించారు. వారం తరవాత వాటిల్లోని పాలు 30 శాతం పాడైతే, రెండు వారాలకల్లా 41 శాతం పాడైనట్లు గుర్తించారు. అంతే కాదు రుచిలోనూ తేడాను గమనించారట. మరో విష యం ఏంటంటే.. పెద్ద కంటైనర్లలోని పాలకంటే చిన్న కంటైనర్లలోని పాలు త్వరగా పాడవుతు న్నాయనీ చెబుతున్నారు. యంత్రాల వాడకం పెరగడం, వాటిని శుభ్రం చేయడం క్లిష్టతరంగా ఉండటమే ఈ పరిస్థితికి దారితీస్తోంది. ఈ మెషిన్లను మరింత శ్రద్ధతో శుభ్రం చేయాలనీ, అవసరమైతే వాటి డిజైన్‌లోనూ మార్పులు చేయాలని ఆయా సంస్థకు సూచిస్తున్నారు పరిశోధ కులు. వినియోగదారులు ఈ టెట్రా ప్యాకెట్లనూ, పేపర్‌బోర్డు కంటైనర్లనూ వినియోగించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటు న్నారు. ముఖ్యంగా గర్భిణులూ, పిల్లలూ వీటిని వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలట. ★

శరగోపం..

దేవాలయాల్లో దైవ దర్శనం అనంతరం పూజారి భక్తుల తలపై ఉంచే లోహ కిరీటం వంటి పరికరాన్ని శఠగోపం లేదా శఠారి అంటారు. దీనిపై భగవంతుడి పాద ముద్రలు ఉంటాయి. ఆధ్యాత్మికంగా శఠారిని తలపై ఉంచుకోవడం అంటే దైవ పాదాలను మన శిరస్సుపై ధరించడమే. మనలోని అహంకారాన్ని (శఠం) పోగొట్టి, వినయాన్ని ప్రసాదించేది కాబట్టి దీనికి 'శఠారి' అనే పేరు వచ్చింది. దీనిని స్వీకరించే సమయంలో భక్తులు వంటి నమస్కరించడం ద్వారా తమ సర్వస్వాన్ని దైవానికి సమర్పించుకున్నట్టు అవుతుంది. శఠగోపాన్ని రాగి లేదా వెండి వంటి లోహాలతో తయారుచేస్తారు. గర్భాలయంలోని విగ్రహం సమీపంలో ఉండటం వల్ల ఈ లోహపు శఠారి దైవశక్తిని, మంత్రోచ్ఛారణల వల్ల కలిగే ప్రకంపనలను నిక్షిప్తం చేసుకుంది. దీనిని తలపై ఉంచినప్పుడు, ఆ దివ్యశక్తి భక్తుల శిరస్సులోని 'సహస్రార చక్రం' ద్వారా శరీర మంతటా ప్రసరించి మనసును ప్రశాంతంగా మారుస్తుంది. అని వేదపండితులు తెలియ జేశారు. శఠగోపం వల్ల మానసిక ఆందోళనలు తొలగి, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఆలయ దర్శనంలో శఠారి ఆశీర్వచనం అత్యంత పవిత్రమైన ఘట్టం. ★

నోరూరే

నల్లగా నిగనిగలాడే నేరేడు పండును చూస్తేనే నోరూరిపోతుంది. కండ తక్కువ, గింజ పెద్దది కనుక ఎన్ని తిన్నా తిన్నట్టే ఉండదు. ఇవి రుచిలోనే కాదు, ఆరోగ్యం అందించడంలోనూ ముందుంటాయి. వీటితో ఎన్ని లాభాలున్నాయంటే. నేరేడుపండ్లు తినటం వల్ల శరీరానికి అవసరమైన క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం, భాస్వరం, పొటాషియం, సోడియం, సల్ఫర్, థియామిన్, రిబోఫ్లేవిన్, ఫోలిక్ యాసిడ్, ఎ,బి1, బి2, బి3, బి5, బి6, సి-విటమిన్లు అందుతాయి. రక్తపోటును తగ్గిస్తాయి, కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తాయి. గుండెకు మేలు చేస్తాయి. బరువు తగ్గటంలో తోడ్పడతాయి. కీళ్లనొప్పులను నివారిస్తాయి. కంటిచూపును మెరుగుపరుస్తాయి. గొంతులో వచ్చే సమస్యలను నివారిస్తాయి. జుట్టు రాలదు. కుదుళ్లు దృఢంగా ఉంటాయి. శరీరంలో చేరిన మలినాలను హరింప చేస్తాయి. కాలేయాన్ని సంరక్షిస్తాయి. మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం కాంతితో మెరిసేలా చేస్తాయి. మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. జీర్ణ ప్రక్రియ సాఫీగా ఉంటుంది. రక్త హీనతతో బాధపడుతున్న వారు వీటిని తీసుకోవటం వల్ల సత్వర ప్రయోజనం ఉంటుంది. రక్తహీనతతో బాధపడుతున్న వారు వీటిని తీసుకోవటం వల్ల సత్వరప్రయోజనం ఉంటుంది. ★

చెలి సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు,ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం.
ఈ మెయిల్: Cheli@vaartha.com

తెర

VenkyAnil5 (NkrAR2)- షూటింగ్‌లో వెంకటేష్



విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న VenkyAnil5 (NkrAR2)- చిత్రం కోసం జతకట్టారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కల్యాణ్ రామ్ పుట్టినరోజున విడుదలైన ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. కల్యాణ్ రామ్, ఇతర నటీనటులపై చిత్రీకరించిన ఒక పాట షూటింగ్‌ను చిత్ర బృందం ఇటీవల పూర్తి చేసింది. ఈ సినిమా మొదటి షెడ్యూల్‌లో కీర్తి సురేష్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు. తాజాగా విక్టరీ వెంకటేష్ షూటింగ్ సెట్‌లో చేరారు. ప్రస్తుతం ప్రధాన తారాగణంతో కూడిన కీలక సన్నివేశాలను భారీ సెట్‌లో చిత్రీకరి స్తున్నారు. వెంకటేష్, కీర్తి సురేష్, కృతి శెట్టిలతో కలిసి కల్యాణ్ రామ్ కూడా ఈ సన్నివేశాల్లో పాల్గొంటున్నారు. వెంకటేష్, కల్యాణ్ రామ్ మధ్య వచ్చే సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వీరిద్దరి ఆకట్టుకునే ఆన్‌స్క్రీన్ అనుబంధం, అనిల్ రావిపూడి మార్కు వినోదానికి చక్కగా సరిపోతుంది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన కీర్తి సురేష్ కథా నాయికగా నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటిస్తోంది. ఈ చిత్రానికి బలమైన సాంకేతిక బృందం పని చేస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరి స్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. VenkyAnil5 (NkrAR2)- అనిల్ రావిపూడి మార్క్ వినోదం, కుటుంబ భావోద్వేగాలు, ఫెస్టివల్ ట్రేడ్‌మార్క్ ఎంటర్టైనర్. ఈ చిత్రం 2027 సంక్రాంతికి అత్యంత ఎదురుచూస్తున్న చిత్రంగా నిలుస్తోంది.

'రాజా ది రాజా' : ట్రైలర్ లాంచ్

ఈవెంట్‌లో నిర్మాత రవిశంకర్ రుత్విక్, విశాఖ ధిమాన్ 'రాజా ది రాజా' అద్భుతమైన థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన 'రాజా ది రాజా' చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ప్రేమ, వినోదం, యూత్‌కు సంబంధించిన భావోద్వేగాల కలయికతో ఆకట్టుకోనుంది. తొలి సినిమానే అయినప్పటికీ రుత్విక్ రెండు భిన్నమైన పాత్రల్లో ఎంతో మెచ్యూర్డ్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ.. 'రాజా ది రాజా' ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు. ఈ సినిమా హీరో రుత్విక్‌తో పాటు నిర్మాత నిహారిక కూడా చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత. ఇందులో పాటలు చూస్తుంటే అద్భుతంగా ఉన్నాయి. హీరో రుత్విక్ మాట్లాడుతూ.. 'రాజా ది రాజా' సినిమా ద్వారా నేను నటుడిగా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నాను. ఈ జర్నీ చాలా ఎమోషనల్. అనిల్‌తో కలిసి సినిమా చేయడం చాలా అద్భుతమైన అనుభూతి. ప్రేక్షకులను అలరించేలా ప్రతి సన్నివేశాన్ని తెరకెక్కించడానికి మేమంతా చాలా కష్టపడ్డాం. నిర్మాత నిహారిక దాసరి మాట్లాడుతూ.. రవికి, నవీన్‌కి హృదయ పూర్వక ధన్యవాదాలు. వారు ఈ సినిమా రిలీజ్ చేయడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ.. టీజర్ వచ్చినప్పటి నుంచి సినిమాకి చాలా మంచి పేరు వస్తోంది. పాటలకు కూడా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రేక్షకుల స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మా చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రిలీజ్ చేస్తున్నందుకు రవికి, నవీన్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు.

#ChiruBobby2 / #Chiru158 యాక్షన్ షెడ్యూల్



'వాల్తేరు వీరయ్య' భారీ విజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్‌బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి మళ్లీ కలిసి పనిచేస్తున్న చిత్రం #ChiruBobby2 / #Chiru158 KVN ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో విస్తృతంగా జరుగుతోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్‌లక్ష్మణ్ మాస్టర్స్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్న భారీ యాక్షన్ సన్నివేశం ఈ చిత్రంలో మేజర్ హైలెట్స్‌లో ఒకటి. భారీ సంఖ్యలో ఫైటర్లతో అత్యంత భారీ స్థాయిలో రూపొందు తున్న ఈ సన్నివేశం, మెగాస్టార్ చిరంజీవిని పవర్ ఫుల్ , డైనమిక్ అవతార్‌లో ప్రజెంట్ చేయనుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించేలా రూపొందు తున్న ఈ యాక్షన్ ఘట్టంలో, మెగాస్టార్ స్వయంగా పాల్గొంటూ చాలా సాహసోపేతమైన స్టంట్స్ చేస్తున్నారు. అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రానికి సంబం ధించిన టైటిల్ టీజర్‌ను విడుదల చేయడానికి చిత్ర బృందం సన్నద్ధమవుతోంది. ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక బృందం పని చేస్తోంది. థమన్ ఎస్ సంగీతం సమకూరుస్తుండగా, ప్రఖ్యాత సినిమా టోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ అద్భుతమైన విజువల్స్ అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అవినాష్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్ ఆంటోనీ రూబెన్. కోన వెంకట్, కె.చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పోట్లూరి అడిషనల్ స్క్రీన్‌ప్లేను సమకూర్చారు. స్టార్ రచయితల ద్వయం భానునందు సంభాషణలు రాస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న చిత్రాలలో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది.

'రోమాంచకం' గ్లింప్స్ రిలీజ్

సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న మూవీ భద్రకాళీ పిక్చర్స్, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో భారీ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్స్ వచ్చాయి. ఈ కాంబోలో ఒక యంగ్ టీమ్ తో ఫ్రెష్ లవ్ స్టోరీ మూవీ వస్తోం దంటే ప్రేక్షకులు కొత్తదనం ఆశిస్తారు, స్ట్రాంగ్ కంటెంట్ ఎక్స్ పెక్ట్ చేస్తారు. ప్రేక్షకులు కోరుకునే అలాంటి కొత్తదనంతో యూనిక్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది 'రోమాంచకం' సినిమా. సుమంత్ ప్రభాస్, అనంతిక సనీల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా సమర్పి స్తుండగా, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొంది స్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన 'రోమాంచకం' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఆడియెన్స్‌ను అట్రాక్ట్ చేసి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు "రోమాంచకం" సినిమా గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ డీవోపీ పవన్ పప్పుల అందించిన పెయింటింగ్ లాంటి బ్యూటిఫుల్ విజువల్స్ తో , వాసుకి వైభవ్ కంపోజ్ చేసిన స్వీట్ మెలోడియస్ ట్యూన్ తో సాగుతూ హీరోయిన్స్ మధ్య ఉన్న ప్రేమను, వారి మధ్య ఏర్పడిన దూరాన్ని చూపిస్తూ సాగింది. ఖిఅణువు అణువును ఉగ్రూతలూపే ప్రణయ కల్లోలమే రోమాంచకం, ఊహకే అందని ఉవ్వెత్తునెగిసే ఉత్తుంగ తరంగమే రోమాంచకం.. అంటూ గ్లింప్స్ లో వచ్చిన లిరిక్స్ ఈ మూవీ ఎంత వైబ్రేటింగ్ గా ఉండబోతుందో తెలియజేస్తోంది. "రోమాంచకం" సినిమా ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపి ప్రేక్షకుల్ని ఉగ్రూతలూగించేందుకు వస్తోంది. సుమంత్ ప్రభాస్, అనంతిక జంట కెమిస్ట్రీ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తోంది.

'లవ్ ఓ లవ్' ప్రీరిలీజ్ వేడుకలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్

లవ్ ఓ లవ్ ప్రీరిలీజ్ వేడుక నేడు హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. చిత్ర బృందం, సినీ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, అభిమానుల సమక్షంలో నిర్వహించిన ఈ వేడుక ఎంతో సందడిగా సాగింది. పావిష్ నారాయ ణన్, నాగ దుర్గా జంటగా నటించిన ఈ చిత్రానికి మాగేశ్ రాజేంద్రన్ దర్శకత్వం వహించారు. రొమాన్స్, కామెడీ, భావోద్వేగాల సమ్మేళనంగా రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మాస్ కా దాస్ విశ్వక్ సేన్ చిత్ర బృందానికి తన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ నిర్మాతలు సి. కళ్యాణ్, దామోదర్ ప్రసాద్, జి. నాగేశ్వర రెడ్డి కూడా హాజరై చిత్ర బృందానికి తమ శుభాకాం క్షలు తెలియజేశారు. లవ్ ఓ లవ్ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షి స్తూ, చిత్ర యూనిట్‌కు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. అనంతరం ప్రీ రిలీజ్ ఈవెంట్ వేడుకలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. ఈరోజు ఇక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. పవిష్ ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి రావాలని నన్ను ఆహ్వానించాడు. నేను ప్రస్తుతం ఏ నగరానికి ఏమైంది 2 సినిమా షూటింగ్‌లో ఉన్నాను. ఈరోజు పవిష్ సినిమా ఈవెంట్‌కు వెళ్లాల్సి ఉందని తరుణ్ భాస్కర్‌కు చెప్పగా, ఆయన కూడా రెండు గంటల ముందే షూటింగ్ నుంచి వెళ్లమని ప్రోత్సహించారు. నిర్మాత జి. ధనంజేయన్ మాట్లాడుతూ.. విశ్వక్ సర్‌కు నేను పెద్ద అభిమా నిని. మా ఆహ్వానాన్ని స్వీక రించి ఈ కార్యక్రమానికి విచ్చేసిన విశ్వక్‌కి నా హృదయ పూర్వకధన్యవాదాలు

'లెనిన్' వాయిస్ ఓవర్ ఇచ్చిన ఎన్టీఆర్

'లెనిన్' చిత్రానికి పవర్ ఫుల్ వాయిస్ ఓవర్ ఇచ్చిన మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్.. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూలై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన కంటెంట్ ఆడియెన్స్‌లో అంచనాల్ని పెంచేసింది. ఇక ట్రైలర్‌కి నాగార్జున ఇచ్చిన వాయిస్ ఓవర్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. తాజాగా చిత్రయూనిట్ మరో సర్ ప్రైజ్‌తో అభిమానుల్లో అంచనాల్ని మరింతగా పెంచింది. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ 'లెనిన్' కోసం వాయిస్ ఓవర్ ఇచ్చారు. సినిమా కథను, నేపథ్యాన్ని, శ్రీరామపురం గురించి ఎన్టీఆర్ తన గంభీరమైన గాత్రంతో ప్రేక్షకులకు పరిచయం చేయనున్నారు. ఇక థియేటర్లో ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌కి, ఆయన ఇచ్చే ఎలివేషన్స్‌కి బాక్సులు బద్దలయ్యేలా ఉంది. ఎన్టీఆర్ ఇచ్చే ఈ వాయిస్ ఓవర్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఎన్టీఆర్‌కి నాగార్జునతో, అక్కినేని కుటుంబంతో ఎంతో అనుబంధం ఉంది. అందుకే అఖిల్ కోసం ఎన్టీఆర్ ఇలా వాయిస్ ఓవర్ ఇచ్చి 'లెనిన్'కి తన వంతుగా సపోర్ట్ చేశారు. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, పాటలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. అఖిల్ రగ్డ్ రా అండ్ రస్టిక్ లుక్ ఇప్పటికే అభిమానుల్ని ఆకట్టుకుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం, నేపథ్య సంగీతం, లియోన్ బ్రిట్టో కెమెరావర్క్ హైలెట్‌గా నిలుస్తుందని అంతా భావిస్తున్నారు. ఈ మూవీకి నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం 2026 జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

8vzm15:8vzm15.qxd 07-07-2026 22:05 Page 1

25 మంది గిరిజనులకు చెక్కుల పంపిణీ

బొబ్బిలి, జూలై 7, ప్రభాతవార్త:

బొబ్బిలి నియోజకవర్గం రామభద్రపురం మండలం కొట్టక్కి పంచాయితీలో గల కాకర్లవలస గ్రామంలో నివసిస్తూ ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటూ కొందరు గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. వారికి గత ప్రభుత్వం హయాములో పట్టాలు కూడా ఇవ్వడం జరిగింది.. అయితే, పట్టాలు ఇచ్చిన భూమిలో కాకుండా కోసం గతంలో రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిలో వారు సాగుచేసుకుం టున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో మీమీజు పార్కులను ఏర్పాటు చేసి, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు భూమిని సేకరిస్తున్న తరుణంలో ఈ గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీన పరుచుకోగా, అభ్యంతరం తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు కూడా గిరిజనులకు అండగా నిలిచి వారికి న్యాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు లిఆర్.వీ.ఎస్.కె.కె. రంగారావు (బేబీ నాయన) ప్రజాసంఘాల నాయకులను, గిరిజనులను పిలిపించి వారితో మాట్లాడి, ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. మన జిల్లా మంత్రివర్యులు లికొండపల్లి శ్రీనివాస్తో ఈ విషయమై ఎమ్మెల్యే బేబీనాయన చర్చించి, గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని కోరగా, సానుకూలంగా స్పందించిన జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు విశేష కృషితో ఈ గిరిజనులకు అపరాధ రుసుము అందజేయడం జరిగింది. ఆయన కృషి అంటూ లేకపోతే ఎంత ఆందోళన చేసిన అపరాధ రుసుము వచ్చేది కాదని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వారికి నష్ట పరిహారం ఇచ్చేలా కృషి చేశారు. అలానే, గిరిజనుల జీవనం కోసం వారు వేరేచోట వ్యవసాయం చేసుకునేందుకు కొంత భూమిని కూడా కేటాయించడం జరిగింది.. ఈరోజు బొబ్బిలి ఆర్డీవో కార్యాలయంలో 25 మంది గిరిపుత్రులకు శాసనసభ్యులు బేబీనాయన చేతులమీదుగా చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో రామభద్రపురం మండల టీడీపీ నాయకులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

తెర్లాం, జూలై 7, ప్రభాతవార్త:

బొబ్బిలి నియోజకవర్గం తెర్లాం మండలం పణుకువలస గ్రామంలో బాడంగి మండల కార్యాలయంలో శాసన సభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) బుడా చైర్మన్ మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు కలిసి రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూముల రీసర్వే పూర్తి చేసి, కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ–హక్కులను శాశ్వతంగా పరిరక్షిస్తూ, భూ–రికార్డుల్లో పూర్తి పారదర్శకత తీసుకురావాలనే లక్ష్యంతో రీ–సర్వే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఖచ్చితమైన కొలతల ఆధారంగా నిర్వహించిన రీ–సర్వే వల్ల భూముల సరిహద్దులపై ఉన్న వివాదాలు, సందిగ్ధతలు తొలగిపోవడంతో పాటు రైతులకు స్పష్టమైన యాజమాన్య హక్కులు లభిస్తాయని తెలిపారు. అందులో భాగంగా పణుకువలస, బాడంగి గ్రామ రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేయడం జరిగిందని తెలియజేశారు. ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు బీజేపీ విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి వేమకోటి గిరిబాబు ఆర్డీవోజే.వీ.ఎస్.ఎస్.రామ్మోహనరావు, తెర్లాం మండలం టీడీపీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకటేష్, బాడంగి మండలం టీడీపీ అధ్యక్షులు తెంటు రవి, తెర్లాం మండలం జనసేన నాయకులు మండాన రవి, రెండు మండలాల ఎమ్మార్వోలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ఆశా కార్యకర్తలు సేవలందించాలి

గరివిడి ,జూలై 7, ప్రభాతవార్త:

ప్రజారోగ్య పరిరక్షణ కు ఆశా కార్యకర్తలు అలుపెరుగని సేవలందించాలి జిల్లా లెప్రసి అధికారి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి పేర్కొన్నారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. మండలం లోని కోనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తలు, ఏ ఎన్ ఎం, ఎం ఎల్ హెచ్ పి ,ఇతర వైద్య సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరాలు,డయేరియా, వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో శానిటేషన్,వాటర్ క్లోరినేషన్ పై దృష్టిపెట్టాలన్నారు. లెప్రసి,క్షయ వ్యాధుల పై ముందుగా గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. లెప్రసి,టిబి పై పల్లె వాసుల్లో నెలకొన్న అపోహలను తొలగిస్తూ వారిని చైతన్య చకితులను చేయడంలో వైద్య సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు. వైద్యపరమైన అంశాలపై సిబ్బందికి ఆమె దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అచ్చాదేవి, కోనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పి.విష్ణు బాలాజీ, పిహెచ్ సిఈఓ లెంక అప్పలనాయుడు, సూపర్వైజర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

దన్నానపేట భూముల వేలం పాట వాయిదా

నెల్లిమర్ల, జూలై 7, ప్రభాతవార్త:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానానికి సంబంధించి దన్నానపేటలో ఉన్న భూములకు వేలం పాటను మంగళవారం దేవస్థానం వద్ద నిర్వహించారు.ఈ వేలం పాటకు దేవదాయ ధర్మాదాయ శాఖ తరఫున చీపురుపల్లి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. నానాజీ పర్యవేక్షణలో రామతీర్థం దేవస్థానం ఈవో వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భూములు వేలం పాట నిర్వహించారు. ధన్నానపేట గ్రామంలో ఉన్న దేవస్థానం భూములో 410.41 ఎకరాల వ్యవసాయ భూమివేలం పాటలో గ్రామం లో రైతులు ఎవ్వరు ధరావత్తు కట్టలేదు. ఎవరు వేలం పాటలో పాల్గొన్నలేదు. అందువలన భూములు వేలం పాట వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వేలంలో రైతులు, నెల్లిమర్ల పోలీస్ సిబ్బంది, రామతీర్థం దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఘన వ్యర్థ నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జున రావు

గరివిడి, జూలై 7,ప్రభాత వార్త:

ఘన వ్యర్థ నిర్వహణలో ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వి. మల్లిఖార్జునరావు కొండపాలెం (గరివిడి) మేజర్ పంచాయితీ,అధికారులు, సిబ్బందికి సూచించారు. ఓపెన్ డంపింగ్, ఘన వ్యర్థాలు దహనం చేయకుండా చూడాల్సి బాధ్యత సిబ్బంది దే నని ఆయన స్పష్టం చేశారు.స్థానిక సంస్థల బాధ్యతలపై పంచాయతీ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ స్థానిక సంస్థల తమ పరిధిలో పర్యావరణ నాణ్యత ను మెరుగు పరిచేందుకు నిబంధనల ప్రకారం ఘన వ్యర్థాలు నిర్వహణ బాధ్యత గా చేపట్టాలన్నారు.అలాగే చెత్త సేకరణ,రవాణా,నిల్వ ప్రాసెసింగ్,రీ సైక్లింగ్ పై పలు అంశాలను ఆయన వివరించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, వర్మీ కంపోస్టు తయారీ చేసే విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును ఆయన పరిశీలించారు. తడి చెత్త,పొడి చెత్త వేరు చేసి పంచాయతీ ప్రజా రోగ్య వాహనానికి అందివ్వాలని ఆయన స్థానిక వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో కొండ పాలెం(గరివిడి)మేజర్ పంచాయతీ ప్రత్యేక అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంవిబి సుబ్రహ్మణ్యం, డెప్యూటీ ఎంపిడిఓ(పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి)ఎల్. పుష్పాంజలి, కొండ పాలెం మేజర్ పంచాయతీ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి

రామభద్రపురం, జులై 7, ప్రభాతవార్త :

రామభద్రపురం మండలం గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో ఎం. రత్నం సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధంచేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీలో ఉన్న వనరులనుబట్టి ఆదాయం పెంచుకునే మార్గాలు చేయాలన్నారు. అలాగే గ్రామంలో మౌళిక వసతులైన తాగునీరు, పరిశుభ్రత మెరుగుపరిచేందుకు ఈ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అలాగే గ్రామాల్లోని పంచాయతీ ఇళ్ల పన్నులు వసూళ్లపై దృష్టిసారించాలని కోరారు. గ్రామాల్లో ఎక్కువగా మొక్కలు నాటించడం, అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయడంలో నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు. మండలంలో ఉన్న 22 గ్రామ పం చాయతీలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ డీఈఈ ధిల్లీశ్వరరావు, ఏవో సన్యాసిరావు, డిప్యూటీ ఎం పీడీవో నాగ తులసి, ఆర్ డబ్ల్యు ఎస్ జేఈ పవన్కుమార్, వెలుగు ఏపిఎం సూరెడ్డి సత్యవతి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని మార్చండి

వేపాడ, జూలై 7, ప్రభాతవార్త:

నీలకంఠరాజపురం గ్రామంలో విద్యుత్ స్తంభాన్ని మార్చి బడి బస్సు రాకపోకలకు సహకరించాలని ఐదు గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. వేపాడ మండలం నీలకంఠరాజపురం గ్రామంలో సోంపురం – ఆనందపురం ఆర్ అండ్ బి రహదారి నుండి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు విద్యార్థులు వెళ్లి రావడానికి ప్రభుత్వం బడి బస్సును ఏర్పాటు చేసింది. ఈ బస్సులో ఏం సింగవరం, బాణాది, బల్లంకి, భత్తువానిపాలెం, పెదగుడిపాల గ్రామాలకు చెందిన విద్యార్థులంతా ఈ ఉన్నత పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. అయితే నీలకంఠరాజపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మలుపు వద్ద విద్యుత్ స్తంభం ఉండడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని డ్రైవర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. కొంతమంది డ్రైవర్లు ఉన్నత పాఠశాలకు బస్సు నడపకుండా సోంపురం ఆనందపురం ఆర్ అండ్ బి రహదారిపై విద్యార్థులను దించేయడంతో రెండు కిలోమీటర్ల దూరం నడిచి పాఠశాలకు వెళ్లలేక విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రభుత్వం బడి బస్సు సదుపాయం కల్పించినప్పటికీ నీలకంఠరాజపురం ప్రాంతంలో విద్యార్థులకు ఆ సౌకర్యం అందడంలేదని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని మార్చి, మలుపు వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బడి బస్సు వెళ్లే విధంగా సహకరించాలని ఐదు గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులంతా కోరుతున్నారు.

ఉన్నత విద్య కమిషనర్ను కలిసిన ఎమ్మెల్యే బోనెల

పార్వతీపురం, జూలై 7, ప్రభుతవార్త:

స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగ భద్రతకు సంబంధించిన సమస్యలను స్థానిక శాసనసభ్యులు బోనెల విజయచంద్ర ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా ని కలిసి వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల ప్రక్రియలో కళాశాలలోని పోస్టులను వెబ్ ఆప్షన్లలో ఖాళీలుగా చూపించడం వల్ల అక్కడ పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగ భద్రతకు భంగం కలిగే అవకాశం ఉందని తెలిపారు.ఈ అంశాన్ని పరిశీలించి, విలీన సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా సిబ్బంది ఉద్యోగ భద్రతకు భరోసా కల్పించడంతో పాటు, వారి న్యాయమైన ఆందోళనలను పరిష్కరించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కమిషనర్ను కోరారు. దీనిపై స్పందించిన ఉన్నత విద్య కమిషనర్ ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలించి, సంబంధిత నిబంధనలు మరియు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని ఎమ్మెల్యే కి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగ భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రణాళికలతో పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలి

దత్తిరాజేరు, జులై 7, ప్రభాతవార్త :

గ్రామపంచాయతీలు అభివృద్ధి జరగాలంటే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇన్చార్జి ఎంపీడీవో ఎస్ తాత అన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులకు డిజిటల్ అసిస్టెంట్లకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు జి పి డి పి పై మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆర్థిక అభివృద్ధి సామాజిక న్యాయం కోసం ఆయా పంచాయతీలు స్థానిక అవసరాలకు అనుగుణంగా రూపొందించుకొని సమగ్ర ప్రణాళిక రాజ్యాంగంలోని 11వ షెడ్యూల్ ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అనుసంధానిస్తూ స్థానికంగా లభించే వనరులతో ప్రతి ఏటా గ్రామ సభల ద్వారా తయారు పరుచుకోవాలని సూచించారు. పారిశుద్యం, ప్రజారోగ్యం మురుగునీటి కాలువలను శుభ్రంగా ఉంచడం త్రాగునీటి సంబరాను పర్య వేక్షించడం, అంటువ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవడం మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం గ్రామీణ రోడ్ల నిర్మాణం మరమ్మత్తులు వీధి దీపాలు ఏర్పాటు చేయడం, పాఠశాల భవనాలు సమాజ భవనాలు వంటి వాటిని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏ.ఓ శివాజీ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ట్రైనింగ్ శిక్షకులు శివరామకృష్ణ మహేష్ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి అపరాధ రుసుం

కొమరాడ, జూలై 7, ప్రభాతవార్త:

కొమరాడ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన ఏడుగురికి మంగళవారం పార్వతీపురం కోర్టులో ఒక్కొక్కరికి 10000 చొప్పున ఏడుగురి కి 70000 జరిమానా విధించినట్లు కొమరాడ ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 9 మందికి ఒక్కొక్కరికి 300 చొప్పున మొత్తం 2,700 జరిమానా విధించడం జరిగినదన్నారు.

కలెక్టర్ కుమారుడితో పీఎస్పై చర్చించిన ఎంఈఓ

సాలూరు, జూలై 7, ప్రభాతవార్త :

పార్వతీపురంలో జరిగిన ఒక సమావే శానికి ఎంఈఓ కె.వి.సత్యనారాయణ (మాస్టర్) మంగళవారం హాజరయ్యారు.ఈ సందర్భంగా భోజన విరామ సమయంలో తన 30ఏళ్ళ అనుభవంతో ఫిజికల్ సైన్స్ లో వైజ్ఞానిక వైఖరులు పెంచేవిధంగా కొన్ని ఆశక్తి విషయాలు కలక్టర్ కుమారుడు క్రిష్ తో చర్చించారు. అలాగే భవిష్యత్తులో ఒక మంచి పరిశోధకుడిగా ఉండాలని ఐఐటి ఇంకా నీట్లు సాధించా లంటే రోజులో 16 గంటల సమయం ప్రణాళికా బద్ధంగా చదవాలని విషయ పరిజ్ఞానం అవగాహనతో పాటు ఏ విధంగా అనువర్తించాలో కొన్ని ఉదాహరణలు చెప్పారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ కుమారుడు క్రిష్ ను జాయిన్ చేయడం వలన మన అందరి పై మరింత గురుతర బాధ్యత పెరిగిందని అలాగే విద్యార్థులు అందరికీ సైన్స్ పై ఆశక్తి పెరిగే విధంగా గైడ్ చేయడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ ప్రభాకర రెడ్డికి అవకాశం ఇచ్చిన ప్రధాన ఉపాధ్యాయులు శ్రీధర్ ప్రత్యేక ధన్యవాదాలు ఎంఈఓ(మాస్టర్) తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి

లక్కవరపుకోట, జూలై 7, (ప్రభాత వార్త):

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని ఇంచార్జి ఎంపీడీవో దొర సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ఇతర మండల అధికారులతో ఎంపీటీసీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై ఒక్క రోజు శిక్షణ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇంచార్జి ఎం పీడీఓ మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధంచేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీలో ఉన్న వనరులనుబట్టి పేద వర్గం ప్రజలు ఆదాయం పెంచుకునే మార్గాలు ఎంపిక చేయాలన్నారు. అలాగే గ్రామంలో మౌళిక వసతులైన తాగునీరు, పరిశుభ్రత మెరుగుపరిచేందుకు ఈ ప్రణాళికలు ఉపయోగకరంగా ఉండేలా చూడాలి అన్నారు. అలాగే గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గ్రామాల్లోని పంచాయతీ ఇళ్ల పన్నులు వసూళ్లపై దృష్టిసారిం చాలని కోరారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం లో భాగంగా ఎక్కువగా మొక్కలు నాటించడం, అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేయడం కోసం నివేదికలు సిద్ధం చేయాలని తెలిపారు. మండలంలో ఉన్న 31 గ్రామ పం చాయతీలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రంగా రాయపురం పంచాయతీ కార్యదర్శి జగన్ శిక్షణా బాధ్యత తీసుకుని అన్ని విషయాలు సభ్యులకు వివరించారు. శిక్షణలో డిప్యూటీ ఎంపీడీఓలు మహా లక్ష్మి కుమార్ ఎంఈఓ కుర్మారావు ఇరిగేషన్ ఏ ఈ ఐ సి డి ఎస్ సూపర్ వైసర్ ఎంపీటీసీలు రేగ గణేష్ లచ్చిం పేట స్వామి నాయుడు జగ్గన్న దొర తదితరులు పాల్గొన్నారు.

డొంకాడ సింహాద్రి మాస్టారు ఘన సన్మానం

బలిజిపేట, జులై 7, ప్రభాతవార్త :

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం డొంకాడ సింహాద్రి మాస్టర్కు పదవీ విరమణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి మండల విద్యాశాఖ అధికారి బలిజిపేట సర్పంచు రాగలత సత్యసాయి ట్రస్ట్ కన్వీనర్ వెలిది సుబ్బారావు ప్రముఖ డాక్టర్లు వివిధ పాఠశాల నుండి హాజరైన ప్రధానోపాధ్యాయులు మరియు తోటి ఉపాధ్యాయులు కలిసి ఈ కార్యక్రమాన్ని చిరు సత్కారంతో ఘన ఘనంగా పదవీ విరమణ వేడుకలు నిర్వహించారు. మాస్టారు యొక్క సేవలను కొనియాడారు. ఎందరో విద్యార్థులను ఉన్నత స్థితిలో ఉంచిన ఉపాధ్యాయుడు సింహాద్రి మాస్టారు అని కొనియాడారు. అదేరంగంతో కాకుండా దైవభక్తితో ఒక సొంత నిధులతో క్రైస్తవ దైవ మందిరాన్ని కూడా నిర్మించి అతను ప్రాధాన్యతను చాటి చెప్పుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వంగపండు వెంకట్ నాయుడు సాలువతో దంపతులకు చిరు సత్కారంతో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి డొంకాడ సింహాద్రి మాస్టర్ యొక్క బాల్యమిత్రులు, కుటుంబ సభ్యులు తోటి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజయనగరం 25
పార్వతీపురం మన్యం
వార్త

ఎంఈఓలకు జాబ్చార్ట్ ప్రకారం విధులు కేటాయించాలి

పార్వతిపురం, జూలై 7, ప్రభాతవార్త:

పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన జీవో నెంబర్ 89 ఉత్తర్వుల ప్రకారం ఎంఈఓ 1 ఒ2లకు విధులను కేటాయించాలని కోరుతూ మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి పి బ్రహ్మాజీరావుకు మంగళవారం వినతి పత్రం అందజేసినట్లు ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. విద్యా శాఖలో పనిచేస్తున్న ఎంఈఓ 1లకు పాఠశాలల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించడం, ఉపాధ్యాయుల సర్వీస్ వ్యవహారాలతో పాటు విద్యాశాఖకు సంబంధించిన అకడమిక్ అంశాలు, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసే దిశగా ప్రధాన విధులు నిర్వహించవలసి ఉందన్నారు. అయితే ఇటీవల కాలంలో ఎంఈఓ1 ల పై పనిఒత్తిడి పెరిగిందని, జాబ్ చార్ట్ కు సంబంధం లేకుండా అనేక అంశాలపై ఎంఈఓ1లు పని చేయాల్సిన పరిస్థితి నెలకొందని సామల ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి ఎంఈఓ 1ఒ2 లకు వారి జాబ్ చార్ట్ ప్రకారంగా విధులను కేటాయించి నట్లయితే ఫలితాలు కూడా మెరుగ్గా ఉంటాయని సామల అన్నారు. ఇదే విషయమై డీఈఓ గారికి తమ సంఘం పక్షాన వినతిపత్రం అందజేసినట్లు సామల తెలిపారు. తమ వినతిపై డిఇఓ సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

వేపాడ రోడ్డును అభివృద్ధి చేయండి

వేపాడ ,జూలై 7 ,ప్రభాత వార్త:

మండలంలో అసంపూర్తిగా ఆగిపోయిన సోంపురం– ఆనందపురం ఆర్ అండ్ బి రహదారిని తక్షణమే అభివృద్ధి చేయాలని వేపాడ గ్రామస్తులు మంగళవారం మండల స్థాయి అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. మండల కేంద్రమైన వేపాడలో డ్రైన్స్ లేక ,రహదారి నిలువెత్తు గోతులతో నిండిపోయి ఉన్నందున రాకపోకలు సాగించడానికి అనేక ఇబ్బందులు పడుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి అభివృద్ధికి ఏడేళ్ల క్రితం నిధులు మంజూరు కావడం రోడ్డు విస్తరణ పేరుతో వేపాడలో ఇరువైపులా ఇండ్లను తొలగించి డ్రైన్స్ నిర్మించకుండా అసంపూర్తిగా వదిలేశారని, దీంతో మండల ప్రజలకు అవస్థలు తప్పడం లేదని స్థానిక ఎంపీడీవో సిహెచ్ సూర్యనారాయణ, తాసిల్దార్ జె రాములమ్మలకు వినతిపత్రం అందించి ఆవేదన వ్యక్తం చేశారు. ఏ మాత్రం వర్షం పడిన ప్రధాన రహదారి జలమయం కావడంతో స్థానికులు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని తక్షణమే అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు, గ్రామస్తులు కోరారు.

పాడిరైతులు పశుదాణా బస్తాలు వినియోగించుకోవాలి

దత్తిరాజేరు, జులై 7, ప్రభాతవార్త :

50 శాతం రాయితీ ద్వారా పాడి రైతులు పశువుల దాన బస్తాలు వినియోగించుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ అవినాష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం మైన పశు వైద్య చికిత్సాలయంలో టిడిపి నాయకులు చేతులమీదుగా పాడి రైతులకు పసు దాన బస్తాలను మంగళవారం పంపిణీ చేశారు. ఆరు సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాల పాడి రైతులకు 135 యూనిట్లు పాడి రైతులకు అందజేయడం జరిగిందన్నారు. ముందుగా ఎవరైతే డబ్బులు కట్టి ఉన్నారోవారికే ఇచ్చామన్నారు. 1100 రూపాయలు ఖరీదు చేసే దానబస్తా 50% రాయితీతో 550 రూపాయలకురైతులకు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ కోఆర్డినేటర్ మిత్తిరెడ్డి ఈశ్వరరావు బండి కృష్ణ సాలాపు లక్ష్మణరావు మన్యాల ఎంకి నాయుడు పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ సిహెచ్డబ్ల్యుల కనీస వేతనం పెంచాలి : సిఐటియు

పాచిపెంట, జూలై 7, ప్రభాతవార్త:

ఆశ సిహెచ్డబ్ల్యూలు జీతాలు పెంచాలని సిఐటియు నాయకులు డిమాండ్ కూడిన వినత పత్రాన్ని పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని టు శ్రీ హర్షిత కు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అలాగేఆశ వర్కర్స్ గురువు నాయుడుపేట పీహెచ్సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ శివకుమార్ డాక్టర్ సురేష్ చంద్రదేవ్కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పి నాగవేణి పి నిర్మల మంజుల శ్రామిక మహిళ నేత సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొత్తకోట పార్వతీదేవి సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఒక్క ఎరువు బస్తా కోసం రైతులు పడికాపులు కాయాలా?

మక్కువ, జులై 7, ప్రభాత వార్త:

మక్కువ మండలం తూరుమామిడి గ్రామ సచివాలయం పరిధిలో మంగళ వారం వ్యవసాయశాఖ వారు రైతులు కు యూరియా, డి ఏ పి పంపిణీ చేశారు. ఈ పంపిణీ ని కోసం సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఒక్క బస్తా ఎరువు కోసం ఒక రోజంతా పడిగా పులుపు కాయవలసి వస్తుందని రైతులు ఆవేద ఆవేదన చెందుతున్నారన్నారు. తూరుమామిడి సచివాలయం పరిధిలో తూరుమామిడి, కొయ్యనపేట ,కంచెదువలస మూడు గ్రామాలు ఉండగా మంగళ వారం మూడు గ్రామాల రైతులకు వ్యవసాయ సిబ్బంది ఒకేసారి ఎరువులు కి రమ్మందంతో రైతులంతా ఆశగా ఎరువుల కోసం వందల మంది వస్తే ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉంటే కొంతమందికి ఒక్క బస్తా కూడా అందలేదని అన్నారు. ప్రభుత్వం ఆన్లైన్లో యాప్ ద్వారా ఎరువులు ఇవ్వడం వలన ఈ ఒకమైన పరిస్థితూలు ఎదురవుతున్నాయని, సిబ్బంది కూడా రైతులను ఇబ్బంది పెట్టే పరిస్థితుల్లో ఎరువులు ఇవ్వడం సరైన పద్ధతి కాదని, ఇలా అయితే రైతులు వ్యవసాయం చేయకుండా సచివాలయాల చుట్టూ తిరగాలని వ్యవసాయ శాఖా వారు ఇచ్చిన ఎరువులు ను రైతులు ను ఇబ్బంది పెట్టకుండా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం, ఉన్నతాధికారులు రైతులకు యాప్ ద్వారా కాకుండా సరిపడా ఎరువులు ఆఫ్ లైన్ లో ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఫినాయిల్ తాగి సచివాలయ ఉద్యోగి మృతి

కురుపాం, జూలై 7, ప్రభాతవార్త:

గుజ్జువాయి పంచాయతీ గుజ్జు వాయ్ గ్రామానికి చెందిన కొండ గౌరి శైలజ (36) ఫినాయిల్ త్రాగి మంగళవారం మృతి చెందింది . శైలజ గ్రామ సచివాలయం లో వెల్ఫేర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తుంది. తన ఇంట్లో ఫినాయిల్ తాగినట్లు కుటుంబ సభ్యులు గుర్తించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. ఈ సంఘటన సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఐదు నెలల పాప ఉంది. దీంతో స్థానికులకు ఈ సంఘటన కలిచివేసింది గ్రామంలో విషాదఛాయలు కులుముకున్నాయి.

మామిడిపల్లి బస్టాండ్ రోడ్లో అదుపులోకి వచ్చిన ట్రాఫిక్

వార్త ప్రభావం

సాలూరు, జూలై 7, ప్రభాతవార్త :

సాలూరు పట్టణంలో మామిడిపల్లి బస్ స్టాప్ రోడ్ లో ట్రాఫిక్ కంట్రోల్ లేకపోవడంతో ప్రతిరోజు వాహనదారులు,పాదాచారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఈమధ్య “ఎంక్కి పోయి వచ్చారా – ఇంక్కి పోతారా” అనే వార్త పత్రికలో వచ్చిన కధనానికి టౌన్ పోలీస్ వారు స్పందించి అక్కడ కానిస్టేబుల్ తో ట్రాఫిక్ కంట్రోల్ చేయడం మంగళవారం కనిపించింది. అలాగే గత పాలకులు చేసిన తప్పునే ఇప్పుడున్న ప్రజా ప్రతినిధులు చేస్తున్నారని పబ్లిక్ టాక్ నడుస్తుంది.అలాగే కొందరి కోసం అందరూ ఇబ్బంది పడుతున్న ఈ ట్రాఫిక్ సమస్య మెయిన్ రోడ్ లోనే కాకుండా మామిడి పల్లి బస్టాండ్ రోడ్ కూడా విస్తరణ జరిగితే ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రజా ప్రతినిధులుగా చరిత్రలో నిలిచిపోతారని చిన్న లాజిక్ పాలకులు ఇక్కడ మిస్ అవుతున్నారు.

రొనాల్డో కల చెదిరె.. పోర్చుగల్ కథ ముగిసె

అమెరికా ఖేల్ ఖతమ్ * క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్, బెల్జియం

ఆట

పోర్చుగల్ జీరో క్రిస్టియానో రొనాల్డో

డల్లాస్, జులై 7: సాకర్ ప్రపంచకప్‌లో మరో సంచలనం నమోదైంది. యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ ఏకైక గోల్‌తో హాట్ ఫేవరెట్ పోర్చుగల్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది.చివరి నిమిషాల్లో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మికేల్ మెరినో అద్భుత గోల్‌తో పోర్చుగల్ కథ ముగిసింది. దీంతో కప్పు కల నెరవేరకుండా ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రోనాల్డో ప్రపంచకప్ వీడాడు.తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్‌కు కన్నీటితో వీడ్కోలు పలికాడు. ఆరు ప్రపంచకప్ ఎడిషన్ల పాటు సాగిన రొనాల్డో సుదీర్ఘ ప్రస్థానానికి తెరపడింది.

మ్యాచ్ ఆరంభం నుంచే పోర్చుగల్, స్పెయిన్ మధ్య మైండ్ గేమ్ ప్రారంభమైంది.4వ నిమిషంలోనే స్పెయిన్ ఫార్వర్డ్ ఆమికేల్ ఓయర్జబాల్ గోల్ ప్రయత్నాన్ని పోర్చుగల్ గోల్ కీపర్ డియోగో కోస్టా అడ్డుకున్నాడు. కాసేపటికే పెడ్రో నెటో రైట్ వింగ్ నుంచి ఇచ్చిన అద్భుతమైన క్రాస్‌ను ఫెలిక్స్ అడ్డుకుని రొనాల్డో వైపు మళ్లించాడు. రొనాల్డో గాల్లోనే బంతిని హుక్ చేస్తూ గోల్ వైపు కొట్టగా స్పెయిన్ గోల్ కీపర్ అద్భుతంగా అడ్డుకున్నాడు. తొలి అర్ధభాగం ముగిసేసరికి ఇరు జట్లు 0-0తో సమంగా నిలిచాయి.

పోర్చుగల్ బ్యాడ్‌లక్

రెండో అర్ధభాగంలో స్పెయిన్ ఆటగాడు దాని ఓల్మో ఫౌల్ చేయడంతో పోర్చుగల్‌కు ఫ్రీకిక్ లభించింది.అయితే బ్రూనో ఫెర్నాండెజ్ కొట్టిన షాట్ నేరుగా కీపర్ సిమోన్ చేతుల్లోకి వెళ్ళింది.59వ నిమిషంలో రొనాల్డోకు మరో సువర్ణావకాశం లభించింది. జోవా ఫెలిక్స్ డిఫెండర్లను దాటుకుంటూ బంతిని బ్యాక్ పోస్ట్ వైపు చిప్ చేశాడు. రొనాల్డో అక్కడ షాట్ కొట్టడానికి ప్రయత్నించాడు, కానీ బంతి అతని కాలికి సరిగ్గా కనెక్ట్ కాకపోవడంతో వైడ్‌గా వెళ్లింది.

ఇంజ్యూరీ టైమ్‌లో సబ్‌స్టిట్యూట్ల మ్యాజిక్

ఇక ఇంజ్యూరీ టైమ్ ప్రారంభమైన కొన్ని సెకన్లలోనే స్పెయిన్ మేనేజర్ వ్యూహాత్మకంగా మైదానంలోకి పంపిన సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు అద్భుతం చేశారు. స్పెయిన్ ఆటగాడు ఫాబియన్ రూయిజ్ బంతిని సబ్‌స్టిట్యూట్ ఆటగాడు ఫెర్రాన్ టోరెస్ వైపు పంపాడు. టోరెస్ చాలా తెలివిగా బంతిని బాక్స్‌లో ఉన్న మరో సబ్‌స్టిట్యూట్ మికేల్ మెరినోకు పాస్ చేశాడు. మెరినో ఎలాంటి పొరపాటు చేయకుండా, బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. ఈ గోల్‌తో స్పెయిన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లడమే కాకుండా పోర్చుగల్ ఆశలపై నీళ్లు చల్లింది..

ముగిసిన ఆతిథ్యదేశాల ఆట

ఫిఫా ప్రపంచకప్‌కు అతిథ్యమిస్తున్న దేశాల ఆట ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన కెనడా, మెక్సికో ఇప్పటికే ఓటములతో నిష్క్రమించగా, తాజాగా అమెరికా కూడా అదే దారి పట్టింది. సహ అతిథ్య దేశం అమెరికాపై బెల్జియం 4-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరింది.

ఆరంభం నుంచే బెల్జియం ఆధిక్యం

మ్యాచ్ ప్రారంభం నుంచే బెల్జియం ఆధిపత్యం చెలాయించింది. 9వ నిమిషంలో చార్లెస్ డి కెటెలారే గోల్ చేసి బెల్జియంకు తొలి ఆధిక్యం అందించాడు. 31వ నిమిషంలో మాలిక్ టిల్‌మన్ ఫ్రీ కిక్ ద్వారా అద్భుత గోల్ చేసి అమెరికాను 1-1తో సమవుజ్జీగా నిలిపాడు. అయితే అమెరికా ఆనందం ఎంతో సేపు నిలవలేదు. కేవలం రెండు నిమిషాలకే బెల్జియం మరో గోల్ చేసి మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లింది.

కొనసాగిన అమెరికా తప్పిదాలు

రెండో అర్ధభాగంలో కూడా అమెరికా తప్పిదాలు కొనసాగాయి. 57వ నిమిషంలో గోల్‌కీపర్ మ్యాట్ ఫ్రీస్ పెనాల్టీ ప్రాంతం బయటకు వచ్చి లాంగ్ బాల్‌ను అందుకునే ప్రయత్నంలో బంతిని కోల్పోవడంతో హాన్స్ వానాకెన్ ఖాళీ గోల్‌లోకి సులభంగా బంతిని పంపించాడు. అదనపు సమయంలో లుకాకు మరో గోల్ చేయడంతో బెల్జియం 4-1తో మ్యాచ్‌ను ముగించింది. ప్రపంచకప్‌లో ముందంజ వేసింది. క్వార్టర్‌ఫైనల్లో స్పెయిన్‌తో తలపడనుంది.

స్పెయిన్ హీరో మికెల్ మెరినో

వింబుల్డన్ సెమీస్‌లో సినర్, కోకో గాఫ్

లండన్, జులై 7: వింబుల్డన్ పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ జానిక్ సినర్, మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్ సెమీఫైనల్స్ ప్రవేశించారు. జపాన్ డాల్ నయోమి ఒసాకా క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. క్వార్టర్ ఫైనల్లో సినర్...జాన్‌లెన్నార్డ్ స్ట్రఫ్ యొక్క అద్భుతమైన ప్రయాణానికి ముగింపు పలికాడు. మూడు సెట్ల పోరులో 7-5, 7-6, 6-3తో గెలుపొందాడు. నాలుగుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ సినర్ శక్తివంతమైన సర్వ్‌లతో విరుచుకుపడి స్ట్రఫ్‌ను కట్టడి చేశాడు. దీంతో అతను తన 10వ గ్రాండ్ స్లామ్ సెమీఫైనల్‌కు, వింబుల్డన్‌లో మూడో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. మహిళల సింగిల్స్‌లో కోకో గాఫ్ 4-6, 6-3, 6-3తో తోటి అమెరికన్ జెస్సికా పెగులాపై గెలిచి మొదటిసారి వింబుల్డన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. సెంటర్ కోర్టులో జరిగిన ఈ ఆల్‌అమెరికన్ పోరులో తొలి సెట్ ఓడినా ఆ తర్వాత పుంజుకుని వరుసగా రెండు సెట్లను కైవసం చేసుకుంది.

క్వార్టర్ ఫైనల్లో అలెగ్జాండర్ జ్వెరెవ్

రెండు రోజుల పాటు సాగిన పురుషుల నాలుగో రౌండ్‌లో రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-4. 7-5, 3-6, 7-6తో 14వ సీడ్ జిరి లెహెకాపై నెగ్గి తొలిసారిగా వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. జ్వెరెవ్ 6-4, 7-5, 3-3తో ఆధిక్యంలో ఉన్నపుడు చీకటి కారణంగా ఆటను నిలిపివేశారు. మంగళవారం తిరిగి ప్రారంభమైనప్పుడు లెహెకా పుంజుకున్నప్పటికీ, జ్వెరెవ్ దూకుడు చూపి నెగ్గాడు.



మెస్సీ మ్యాజిక్: క్వార్టర్స్‌లో అర్జెంటీనా

న్యూయార్క్, జులై 7: డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వరుసగా రెండో కప్ అందుకునే దిశగా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈజిప్ట్‌తో జరిగిన ప్రి క్వార్టర్ ఫైనల్లో మెస్సీ మ్యాజిక్ చేశాడు. ఓటమి ఖాయమనుకున్న దశ నుంచి అర్జెంటీనాను గెలుపు తీరాలపై నిలిపాడు. 3-2 గోల్స్ తేడాతో విజయాన్ని అందించాడు. మ్యాచ్ ఆరంభంలోనే ఈజిప్ట్ ఆధిక్యం చాటి ఝలక్ ఇచ్చింది. 15వ నిమిషంలో యాసర్ ఇబ్రహీం హెడర్‌తో గోల్ సాధించాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సరికి ఈజిప్ట్ 1-0 ఆధిక్యంతో నిలిచింది. రెండో అర్ధభాగంలో మరో గోల్ చేసింది. 67వ నిమిషంలో ముస్తాఫా జికో గోల్ చేసి ఈజిప్ట్ ఆధిక్యాన్ని 2-0కు చేర్చాడు. ఇక మ్యాచ్ చివరి దశకు చేరుకుంటున్న దశలో మెస్సీ మ్యాజిక్ చేశాడు. నాలుగు నిమిషాల్లో రెండు గోల్స్ సాధించడంలో కీ రోల్ పోషించాడు. 79వ నిమిషంలో మెస్సీ అందించిన పాస్‌ను రొమెరో గోల్‌గా మలచగా, 83వ నిమిషంలో స్వయంగా మెస్సీ గోల్ సాధించాడు. ఈ ప్రపంచకప్‌లో మెస్సీకి ఇది ఎనిమిదో గోల్. కాగా ఇంజ్యూరీ టైమ్ ఆరంభంలో ఎంజో ఫెర్నాండెజ్ చేసి గోల్‌తో అర్జెంటీనా విజయం ఖాయమైంది. తొలిసారి క్వార్టర్ ఫైనల్ చేరాలన్న ఈజిప్ట్ ఆశలపై నీళ్లు చల్లింది.

కోహ్లితో క్రికెట్ ఆడాలనుంది: జొకోవిచ్

లండన్, జులై 7: మిస్టర్ ఛేజర్ విరాట్ కోహ్లీపై సెర్బియా టెన్నిస్ దిగ్గజం నోవాక్ జొకోవిచ్ అభిమానాన్ని చాటుకున్నాడు. ప్రస్తుతం వింబుల్డన్ ఆడుతున్న జొకోవిచ్... గొప్ప బ్యాటింగ్ యోధుడు విరాట్ కోహ్లీతో కలిసి క్రికెట్, టెన్నిస్ ఆడాలని ఉందని జియో స్టార్‌తో మాట్లాడుతూ చెప్పాడు. త్వరలో భారత్‌ను సందర్శించేందుకు ప్లాన్ చేస్తున్నానని, ఇప్పటికే కోహ్లీతో మాట్లాడినట్లు చెప్పుకొచ్చాడు. విరాట్ ఓ గ్లోబల్ స్లార్, అతను భారత్‌లో అద్భుతమైన ఆటగాడు. కోహ్లీ తనకు అతిథ్యమిచ్చి, దేశమంతా తిప్పి చూపిస్తే బాగుంటుంది. అతనిపైనా, భారత్ క్రికెట్‌పైనా తనకు చాలా గౌరవం ఉందని జొకోవిచ్ పేర్కొన్నాడు. సెర్బియాలో క్రికెట్‌కు అంత ప్రాధాన్యం లేదని, అయితే ఇంగ్లాండ్ టెన్నిస్ ప్లేయర్ల నుంచి క్రికెట్ గురించి తెలుసుకున్నట్లు చెప్పాడు. గత వింబుల్డన్‌లో తన భార్య బాలీవుడ్ నటి అనుష్కశర్మతో కలిసి కోహ్లీ... జొకోవిచ్ మ్యాచ్‌ను వీక్షించాడు. ఎంత అద్భుతమైన మ్యాచ్. గ్లాడియేటర్ జొకోవిచ్‌కు ఇది మామూలు విషయమేనని కోహ్లీ పోస్ట్ చేశాడు.

పసిడి తాకట్టు రుణాలు 3.29లక్షల కోట్లు

న్యూఢిల్లీ,జులై 7: ప్రైవేటు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థల్లో బంగారు ఆభరణాల తాకట్టుపై మంజూరు చేసిన రుణాలు ఈ ఏడాది మే నెలలో దాదాపు 70శాతం పెరిగి అన్ని రుణ విభాగాల్లోనే అత్యంత భారీ వృద్ధిని నమోదు చేసినట్లు రిజర్వు బ్యాంకు మంగళవారం విడుదల చేసిన నివేదికలో ప్రస్తావించింది.

2026మే నెలాఖరు నాటికి బంగారు ఆభరణాల తాకట్టుపై ఎన్‌బీఎఫ్‌సీలు ఇచ్చిన రుణాలు రూ.3.29 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే సమయంలో ఇవి రూ.1.94 లక్షల కోట్లుగా ఉండగా, ఏడాది వ్యవధిలో 69.9 శాతం వృద్ధి నమోదైంది.రిటైల్ రుణాల విభాగంలో గృహ రుణాలు, వాహన రుణాలు, బంగారం తాకట్టు రుణాలు గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయి. దీంతో మొత్తం రిటైల్ రుణాల వృద్ధి 2026 మేలో వార్షిక ప్రాతిపదికన 19.5 శాతానికి చేరుకుంది.గత ఏడాది ఇదే నెలలో ఈవృద్ధి 14.9 శాతంగా నమోదైంది. బంగారం రుణాల తర్వాత వాణిజ్య రంగానికి ఎన్‌బీఎఫ్‌సీలు అందించిన రుణాల బకాయిలు రెండో స్థానంలో నిలిచాయి. గత ఏడాది మేలో రూ.85,317 కోట్లుగా ఉండగా, 2026 మే నాటికి రూ.1.19 లక్షల కోట్లకు పెరిగి 40.2శాతం వార్షిక వృద్ధిని నమోదు చేశాయి.వ్యవసాయం, అనుబంధ రంగాలకు అందించిన రుణాల వృద్ధి కూడా బలంగానే కొనసాగింది. ఈ విభాగంలో రుణాలు 2026 మేలో వార్షిక ప్రాతిపదికన 17.9 శాతం పెరిగాయి.గత ఏడాది ఇదే నెలలో నమోదైన 5 శాతం వృద్ధితో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. పారిశ్రామిక రంగానికి రుణాల వృద్ధి కొంత మందగించింది. 2025 మేలో 10 శాతంగా ఉన్న పారిశ్రామిక రుణాల వృద్ధి 2026 మేలో 7.3 శాతానికి తగ్గింది. ముఖ్యంగా మౌలిక వనరుల రంగానికి రుణాల వృద్ధి మందగించడం ఇందుకు ప్రధాన కారణమని ఆర్‌బీఐ తెలిపింది.

2025 మేలో 23.9 శాతంగా నమోదైన సేవల రంగ రుణాల వృద్ధి, 2026 మేలో 16.7 శాతానికి పరిమితమైంది.

లాభాల స్వీకరణతో వరుస నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబయి,జులై 7: దేశీయ ఈక్విటీ మార్కెట్లలో వరుసగా 4 రోజులుగా కొనసాగిన ర్యాలీకి మంగళవారం బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు రావడంతో పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు.విస్తృత స్థాయిలో అమ్మకాల ఒత్తిడి నెలకొని నిఫ్టీ 24,400 స్థాయి దిగువన ముగిసింది. మెటల్, రియాల్టీ రంగ షేర్లు భారీగా నష్టపోగా, ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలకు చెందిన షేర్లు లాభాల్లో నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 104.35 పాయింట్లు తగ్గి 78,180.72 వద్ద ముగిసింది.నిఫ్టీ50 సూచీ 31.65 పాయింటు క్షీణించి 24,398.70వద్ద స్థిరపడింది.నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.34 శాతం, నిఫ్టీ 2.35 శాతం చొప్పున లాభపడిన విషయం గమనార్హం. నిఫ్టీపై అత్యధిక ఒత్తిడి తీసుకొచ్చిన షేర్లలో ట్రెంట్ 12.64శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్1.23శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.04 శాతం చొప్పున క్షీణించాయి.

విస్తృత మార్కెట్ కూడా ప్రధాన సూచీల కంటే బలహీనంగా ప్రదర్శించింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.18 శాతం తగ్గగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.76శాతం పడిపోయింది. ఎన్ఎస్ఈలో మార్కెట్ వెడల్పు ప్రతికూలంగా నమోదైంది.మొత్తం 1,191 షేర్లు లాభపడగా, 2,084 షేర్లు నష్టపోయాయి. మరో 109 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. సమీప కాలంలో మార్కెట్ అస్థిరతను సూచించే ఇండియా వీఐఎక్స్ సూచీ 1.43 శాతం తగ్గి 11.65 వద్దకు చేరింది. విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది.రూపాయి విలువ94.95 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.43గా నమోదైంది.



ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన ఎంసీఎక్స్ బంగారం ఫ్యూచర్స్ ధర 1.02 శాతం తగ్గి రూ.1,45,414కు చేరింది. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 81 సెంట్లు (1.13 శాతం) పెరిగి 72.80 డాలర్లకు చేరింది.అంతర్జాతీయ మార్కెట్లుఅమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజా ద్రవ్య విధాన సమావేశ మినిట్స్‌తో పాటు కీలక ఆర్థిక గణాంకాల విడుదలకు ముందు జాగ్రత్త ధోరణి కొనసాగడంతో యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి.ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశ మినిట్స్ కోసం వేచి చూసిన ఆసియా మార్కెట్లు మాత్రం నష్టాల్లో ముగిశాయి. ప్రధాన కార్పొరేట్ పరిణామాలుతొలి త్రైమాసిక ఆదాయ వృద్ధి మార్కెట్ అంచనాలకు తగ్గడంతో ట్రెంట్ షేరు 12.64 శాతం క్షీణించింది. టైటాన్ కంపెనీ తొలి త్రైమాసికంలో వినియోగదారుల వ్యాపారం 41 శాతం వృద్ధి నమోదు చేయడంతో షేరు 2.38 శాతం పెరిగింది. దేశీయ యాజమాన్యం 50 శాతాన్ని దాటినట్లు ప్రకటించడంతో స్విగ్గీ షేరు 7.17 శాతం ఎగిసింది.

తొలి త్రైమాసిక బిల్లింగ్స్ రూ.737 కోట్లకు చేరి 14.4 శాతం వృద్ధి నమోదు చేయడంతో ఇన్ఫో ఎడ్జ్ ఇండియా షేరు 12.95 శాతం లాభపడింది.ప్రీమియం హౌసింగ్ ప్రాజెక్టులకు బలమైన డిమాండ్ కారణంగా టీఏఆర్సీ షేరు 1.74 శాతం పెరిగింది. జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ షేరు 3.98 శాతం లాభపడింది. వరుణ్ బేవరేజెస్ షేరు 2.19 శాతం తగ్గింది. టెక్స్‌మాకో రైల్ అండ్ ఇంజినీరింగ్ షేరు 2.02 శాతం క్షీణించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి రూ.166.82 కోట్ల బొగ్గు గ్యాస్ ఉత్పత్తి సేవల ఆర్డర్ పొందడంతో సౌత్ వెస్ట్ పిన్నాకిల్ ఎక్స్‌ప్లోరేషన్ షేరు 2.45 శాతం పెరిగింది. తొలి త్రైమాసికంలో ఆదాయం 41 శాతం పెరిగినప్పటికీ పి ఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్ షేరు 2.20 శాతం తగ్గింది. రిటైల్ ఆదాయం 56 శాతం పెరిగి మొత్తం ఆదాయంలో 78 శాతం వాటాను అందుకుంది. ఫ్రాక్టల్ అనలిటిక్స్ షేరు 2.97 శాతం క్షీణించింది.వివిధ విభాగాల్లో కలిపి రూ.239.61 కోట్ల విలువైన కొత్త ఆర్డర్లు పొందినట్లు కేపీ గ్రీన్ ఇంజినీరింగ్ ప్రకటించింది. సోలార్ ప్రాజెక్టులు, క్రాష్ బ్యారియర్లు, ఆర్ఎస్‌జే పోల్స్, ప్రీఇంజినీర్డ్ భవనాలు, ట్రాన్స్‌మిషన్ టవర్లు ప్రాజెక్టులు పొందినా షేరు 2.12 శాతం తగ్గింది.

ఐదేళ్లలో 1 లక్ష కోట్ల ఆదాయం

10వేల కోట్ల లాభం టార్గెట్: టాటా పవర్

ముంబయి,జులై 7: విద్యుత్ రంగంలోని ప్రముఖ సంస్థ టాటా పవర్ వచ్చే ఐదేళ్లలో లక్ష కోట్ల ఆదాయం, రూ.10వేల కోట్ల నికర లాభాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంగళవారం ప్రకటించింది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, పునరుత్పాదక ఇంధనాలు, తయారీ విభాగాల్లో విస్తరణ ద్వారా ఈ లక్ష్యాలను చేరుకోవాలని సంస్థ భావిస్తోంది.కంపెనీ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో ప్రశ్నోత్తరాల సందర్భంగా టాటా పవర్ ఛైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ఐదేళ్లలో రూ.10,000 కోట్ల లాభం, రూ.1 లక్ష కోట్ల ఆదాయాన్ని సాధించాలన్నది సంస్థ లక్ష్యమని, నివాస, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారులు పరిశుభ్రమైన,హరిత ఇంధన పరిష్కారాలకు మారేలా ఎనర్జీ యాజ్ ఎ సర్వీస్ విధానాన్ని టాటా పవర్ ముందుండి అమలు చేస్తుందని తెలిపారు. సౌర పరికరాల తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా ఒడిశాలో కొత్తగా 10 గిగావాట్ల సామర్థ్యంతో సౌర తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు కూడా చంద్రశేఖరన్ వెల్లడించారు.

ప్రస్తుతం తమిళనాడులోని తిరునెల్వేలిలో టాటా పవర్‌కు 4.3 గిగావాట్ల సౌర సెల్స్, మాడ్యూల్ తయారీ సామర్థ్యం ఉంది. బెంగళూరు యూనిట్‌తో కలిపి సంస్థ మొత్తం తయారీ సామర్థ్యం 4.9 గిగావాట్లకు చేరుకుంది.సౌర తయారీతో పాటు ఇంగాట్లు, వేఫర్లు ఉత్పత్తి సామర్థ్యాన్ని కూడా ఒడిశాలోని కొత్త 10 గిగావాట్ల ప్రాజెక్టు ద్వారా పెంచాలని కంపెనీ ప్రణాళిక రూపొందించింది. విద్యుత్ పంపిణీ రంగంలో ప్రైవేటీకరణ చేపట్టే రాష్ట్రాల్లో అవకాశాలు లభిస్తే తమ పంపిణీ కార్యకలాపాలను కూడా విస్తరించేందుకు టాటా పవర్ సిద్ధంగా ఉందని చంద్రశేఖరన్ తెలిపారు.ఇప్పటివరకు కంపెనీ 2.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ప్రారంభించినట్లు వెల్లడించారు.

గ్లోబల్ మార్కెట్లలో స్థిరంగా ముడిచమురు ధరలు

న్యూఢిల్లీ,జులై 7:అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు మంగళవారం స్థిరంగా కొనసాగాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 72 డాలర్లకు పైగా నిలిస్తే అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 69డాలర్ల సమీపంలో ట్రేడైంది. యుద్ధ ప్రభావం పూర్తిగా తగ్గిన చమురుధరలు అమెరికా,ఇరాన్ మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందం కుదరడంతో మధ్యప్రాచ్య చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్న భయాలు తగ్గాయి.దీంతో రెండో త్రైమాసికంలో అంతర్జాతీయ ముడి చమురు ధరలు సుమారు 30 శాతం మేర పడిపోయాయి. యుద్ధ భయాల కారణంగా చమురు ధరల్లో ఏర్పడిన అదనపు పెరుగుదల దాదాపు పూర్తిగా కరిగిపోయిందని మార్కెట్ నిపుణుల అంచనా. రాబోయే నెలల్లో ప్రపంచ మార్కెట్లో ముడి చమురు అధిక సరఫరా పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని గోల్డ్‌మన్ సాక్స్, మోర్గాన్ స్టాన్లీ వంటి ప్రముఖ అంతర్జాతీయ పెట్టుబడి బ్యాంకులు హెచ్చరిస్తున్నాయి. ఈ ఆందోళనలకు మరింత బలం చేకూరుస్తూ సౌదీ అరాంకో ఆసియా కొనుగోలుదారుల కోసం ప్రధాన అరబ్‌లైట్ క్రూడ్ ధరను వచ్చే నెలకు బ్యారెల్‌కు 11 డాలర్లు తగ్గించింది. ప్రాంతీయ బెంచ్‌మార్క్‌తో పోలిస్తే బ్యారెల్‌కు 1.5డాలర్ల డిస్కౌంట్‌పై విక్రయించనున్నట్లు ప్రకటించింది.గతంలో 2020, 2015లో జరిగిన అంతర్జాతీయ చమురు ధరల యుద్ధాల సమయంలో మాత్రమే ఈ గ్రేడ్‌ను డిస్కౌంట్‌పై విక్రయించారు. సౌదీ అరే బియాతో పాటు ఒపెక్ ప్లస్ సభ్యదేశాలు వచ్చే నెలనుంచి ఉత్పత్తి కోటాలను పెంచాలని నిర్ణయించాయి.అదనపు ఉత్పత్తి వెంటనే మార్కెట్‌లోకి రాకపోయినా, పరిస్థితులు సాధారణ స్థితికి చేరుతున్న నేపథ్యంలో సరఫరాను పెంచే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఈ నిర్ణయం సూచిస్తోంది.ఇదిలా ఉంటే అమెరికా ఇంధన మార్కెట్ సమాచార సంస్థ డేటా ప్రకారం 2027 నాటికి అమెరికా ముడి చమురు ఉత్పత్తి అంచనాను రోజుకు అదనంగా 2.20 లక్షల బ్యారెళ్ల మేర పెంచి 1.383 కోట్ల బ్యారెళ్లకు సవరించింది.



ఆరు నెలల్లోనే ఐటి కంపెనీల్లో 1.19 లక్షల మందికి లేఆఫ్



న్యూఢిల్లీ, జులై 7:ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో ఉద్యోగాల కోతలుఏమాత్రం తగ్గడం లేదు.తమ వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా టెక్ కంపెనీలు ఉద్యోగులను తొలగించడాన్ని తీవ్రం చేశాయి. తాజా గణాంకాల ప్రకారం 2026 సంవత్సరపు మొదటి ఆరు నెలల కాలంలోనే వివిధ టెక్ కంపెనీలలో దాదాపు 1.19లక్షలమందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారు.ఈ లేఆఫ్స్ పర్వం ఐటీ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న ఉద్యోగాల తొలగింపు ప్రక్రియతో పోలిస్తే, 2026 మొదటి అర్ధభాగంలో ఈ సంఖ్య మరింత పెరిగినట్లు మార్కెట్ డేటా స్పష్టం చేస్తోంది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే లేఆఫ్స్ తీవ్రత ఈ ఏడాది గణనీయంగా పెరిగింది.పెద్ద పెద్ద టెక్ దిగ్గజాల నుండి చిన్న స్థాయి స్టార్టప్‌ల వరకు అనేక కంపెనీలు తమ వ్యాపార పునర్వ్యవస్థీకరణ, వ్యయాలను తగ్గించుకోవడం, మారుతున్న మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా మారే ప్రక్రియలో భాగంగా ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నాయి.

కల్ట్.ఫిట్ ఐపీఓకు సెబీకి దరఖాస్తు

నాలుగు వేల కోట్ల సమీకరణ లక్ష్యం

ముంబయి,జులై 7: ఫిట్‌నెస్ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఫిట్‌నెస్, వెల్‌నెస్ సంస్థ కల్ట్ ఫిట్ ఐపిఒకోసం సెబీకి డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఐపీఓ ద్వారా కంపెనీ ఈక్విటీ షేర్ల జారీచేసి సుమారు రూ.950 కోట్ల వరకు నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆఫర్ ఫర్ సేల్‌తో కలిపి మొత్తం ఐపీఓ పరిమాణం రూ.4,000 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణుల అంచనా. ఐపీఓలో ప్రస్తుత పెట్టుబడిదారులైన టీమ్‌సెక్, ఫిట్‌నెస్ ఫస్ట్ లక్సెంబర్గ్, చిరాటే వెంచర్స్, టాటా డిజిటల్, యాక్సెల్ ఇండియా, కలారి క్యాపిటల్, ప్రోడర్స్ క్యాపిటల్ తదితర సంస్థలు కలిపి 17.86 కోట్ల షేర్ల వరకు విక్రయించనున్నాయి.

ఒక్కో ఈక్విటీ షేరు ముఖ విలువ రూ.1గా నిర్ణయించారు కంపెనీ సహ వ్యవస్థాపకుడు ముకేష్ బన్సాల్, ఏంజెల్ ఇన్వెస్టర్ బ్రూనో రాఫ్లే, ప్రముఖ సినీ నటుడు హృతిక్ రోషన్‌లు తమ వాటాలోని కొంత భాగాన్ని ఈ ఐపీఓలో విక్రయించనున్నారు.షేర్లు విక్రయించే ఇతర వాటాదారుల్లో ఏషియన్ పెయింట్స్ ప్రమోటర్ డోలీ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్, సన్ ఎన్ సాండ్ హోటల్స్, ఎండియా పార్ట్‌నర్స్ వ్యవస్థాపకుడు సతీష్ ఆంధ్రా, మాజీ మింత్రా సీఈఓ అనంత్ నారాయణన్ కుటుంబ ట్రస్ట్, హృతిక్ రోషన్ పెట్టుబడి సంస్థ ఎక్స్‌ట్రీమ్ బ్రాండ్స్ ఉన్నాయి.కల్ట్.ఫిట్‌లో మాక్‌రిచీ ఇన్వెస్ట్‌మెంట్స్ అత్యధికంగా 20.3 శాతం వాటాను కలిగి ఉంది. తర్వాత యాక్సెల్‌కు 13.5 శాతం, సహ వ్యవస్థాపకుడు ముకేష్ బన్సాల్‌కు 8.4శాతం,కలారి క్యాపిటల్‌కు 7.8, ఎటర్నల్ వద్ద 4.9, టాటా డిజిటల్ వద్ద 3.6 శాతం వాటాలున్నాయి. ఐపీఓ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ రుణాల చెల్లింపు, కల్ట్ ఎలైట్, కల్ట్ నియో ఫిట్‌నెస్ సెంటర్ల విస్తరణ, కొత్త కల్ట్‌స్పోర్ట్ రిటైల్ స్టోర్ల ఏర్పాటు, లీజ్ చెల్లింపులు, మార్కెటింగ్ కార్యక్రమాల కోసం వినియోగించనుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.